పారిజాతం



వల్లభనేని అశ్వినికుమార్

పారిజాతం



వల్లభనేని అశ్వినికుమార్



Vallabhaneni Aswinikumar

Author :

01. Amaaha (Short Stories in Telugu)
02. Doora Theeraalalo (Travelogue)
03. Antharveekshanam (Essays)
04. Paarijaatam (Short Stories)
05. Naalo Nenu (Poetry)
06. Anantharangam (Poetry)
07. Siddhartha (Herman Hesse - In Telugu)
08. Agaadham (De Profundis - Oscar Wilde)
09. O Khaidi Veeragaadha (Ballad - Oscar Wilde)
10. Misimi Essays
11. Charlie Chaplin (Autobiography in Telugu)
12. Ariel (Shelley's Romance in Telugu)
13. D.D. Interviews
14. Prometheus Unbound (Shelley's Drama)
15. Adinois (Telugu - An Elegy by Shelley)
16. Byron Biography (Telugu)
17. Keats Biography (Telugu)

పారిజాతం

కథల మాలిక



వల్లభనేని అశ్వినీకుమార్

PAARIJAATHAM

© V. ASWINI KUMAR

Second Edition : **Sri Durmukhinaama Vijaya Dashami**

Cover Design : **V.A.K.**
Technical Help : **Zee Shan**

Copies : **2,000**

Price : ₹ **249/-**

ISBN
9 788187 353447

AK PublicationS

Cell : 939-343-6969

For Copies :
Misimi Monthly Office
at Kala Jyothi Process Private Limited,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
HYDERABAD-500020.
Ph : 040 - 27645536, 994 951 6567.

Printed at :
Kala Jyothi Process Private Limited,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad,
HYDERABAD-500020.
Ph : 040 - 27611426.

ఒక చిన్నమాట


కథలన్నీ పూర్తిగా కల్పనలు కాదు కదా! అందుకే వాటిలోని పాత్రలెన్నో మనకు తరచూ తారసపడేవే.

'వింటే' అన్నీ వినపడతాయి. 'కంటే' ఎన్నో కనపడతాయి.


అలా కనీ వినీ ఎరిగినవే ఈ కథలన్నీ.

విభిన్న పరిస్థితులలో మనకు ఎంతో కాలంగా 'తెలిసి'నవారే ఎలా స్పందిస్తారు? ఎలా ప్రవర్తిస్తారు? అందుకు సంఘశక్తులు ఎంతవరకు కారణం? పరస్పర సంబంధాలపై, దూర – కాలాలు, ప్రకృతి – ప్రదేశాలు ఎంత ప్రభావం చూపుతాయి?

మనిషి ఆరాటాన్ని ఒక చట్రంలో బిగించలేమని, మానవతా విలువలకు మనిషి భావావేశాలకు ఎల్లలు లేవని, జాతి – మతాలకు అతీతమని, నేను తెలుసుకున్న సత్యాన్ని, ఆ స్థితిలో నా అనుభవాలను మీతో పంచుకోవాలనే నా తాపత్రయం – ఈ చిన్న ప్రయత్నం!



కథలన్నిటినీ పరిశీలించిన శ్రీ వెలగపూడి కృష్ణారావుగారిని,
శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావుగారిని,
ముఖపత్రాన్ని తీర్చిదిద్దిన షాన్ గారిని,
ఈ పని పూర్తిచెయ్యనిచ్చిన నా బద్ధకాన్ని,
"ఏమిటి అర్ధరాత్రి పిచ్చిరాతలు..." అని నా ఆరోగ్యాన్ని కాపాడుకున్న
అర్ధాంగి జయంతినీ,
"ఏదయినా కథ చెప్పు కుమార్ తాతా..." అని అడిగే చిరంజీవి అంకిత్‌నూ,
తెలుగు అంతగా రాని మా అబ్బాయి కళ్యాణ్‌నూ,
ఈ కథలు అంతగా వంటబట్టని మా అమ్మాయి కవితనూ,
"బాబాయ్, చాలా రొమాంటిక్‌గా రాస్తావే..." అంటూ విస్తుపోయిన కాంతినీ,
ఎంతో కష్టపడి నా రాతకు కాపీ రాసిపెట్టిన పద్మావతినీ,
ఇంకా, నా జీవితంలోకి తొంగిచూసి, నా దారికి వెలుగు చూపిన
కాంతిమూర్తులు – ఈ కథలలోని పాత్రలనూ...
పొరపడి మరిచిపోయిన మిత్రులనూ...
ఈ సందర్భంగా గుర్తుచేసుకోవటం నా బాధ్యత.
ఇందులోని కథలను *నడుస్తున్న చరిత్ర, ఆంధ్రజ్యోతి, నవ్య, వార్త, తెలుగు వెలుగు,* ***మిసిమి,*** *చినుకు, పాలపిట్ట, ఆంధ్రభూమి* పత్రికలలో
ప్రచురించినందులకు వారికి కృతజ్ఞతలు.



ఈ పుస్తకం......

పురాణపండ రంగనాథ్ గారు నన్ను కథ రాయమని ప్రోత్సహించి, దారి చూపకపోయినా,

అలా రాసిన కథలను "నడుస్తున్న చరిత్ర" సంపాదకులు సామల రమేష్‌బాబు గారు ప్రచురించకపోయినా,

తర్వాత ధర్మారావుగారు, మేడసాని మోహన్‌గారు సభాముఖంగానే నాలుగు మంచి మాటలు చెప్పకపోయినా,

అప్పటి *ఆంధ్రజ్యోతి* ఆదివారం బాధ్యతలో ఉన్న ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు గారు ప్రచురించి ముందుకు నడపకపోయినా,

డా. చంద్రశేఖరరావుగారు తరచూ ప్రోత్సహించకపోయినా,

ప్రతి అక్షరం – వాక్యం నిశితంగా చదివి, సెబాస్ అని ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు గారు అనకపోయినా,

ఓలేటి పార్వతీశంగారి విమర్శాత్మకమైన ప్రశంస లేకపోయినా,

తన విలువైన సమయాన్ని, నా కథల విశ్లేషణకు, వేగుంట మోహన్ ప్రసాద్‌గారు వెచ్చించకపోయినా,

ఆదివారం *వార్త* సారథి గుడిపాటి చదివి, ఇష్టపడి అచ్చువేయకపోయినా,

అది చదివి "తమ్ముడూ చక్కని కథ..." అంటూ ఒంగోలు నుంచి – నాగభైరవ కోటేశ్వరరావుగారు ఫోన్ చెయ్యకపోయినా,

రాంప్రసాద్ *తెలుగుకథ.కామ్* లో వేసి ప్రపంచానికి అందించకపోయినా,

ఈ మధ్యనే 'పులికంటి'లో పడి, వెలగకపోయినా,

రాజగోపాల చక్రవర్తి అండ లేకపోయినా,

వాసిరెడ్డి నవీన్ ఎక్కడ నుంచో ఫోన్ చేసి "మీ కథ.. చదివించింది" అని అనకపోయినా, తరువాత వారి 'కథ' సంకలనంలో వేయకపోయినా,

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారు "మీ కథల ఓపెన్ ఎండింగ్స్ ఆలోచింపజేస్తాయి" అని కాంప్లిమెంట్ చేయకపోయినా,


రెండు రోజుల క్రితం జూకంటి జగన్నాథంగారు మీ పారిజాతం కథ చదివాను - చిన్నత్తను ఎలా సృష్టించారు? అని అభినందించకపోయినా - వంశీ *పారిజాతాన్ని* తన కథాసంకలనంలో ఇష్టంగా వేసుకోకపోయినా

కోమల గారు "అమెరికా జీవితాన్ని అద్దంపట్టారే" అని అనకపోయినా,

ప్రమోద్‌కుమార్ గారు *పారిజాతం* చదివి - చదివి పరవశించి లేఖ రాయకపోయినా-

అశ్వత్థనారాయణ గారు చివరి పరిచయం తప్పులు దిద్ది, చేయకపోయినా-

ఈ పుస్తకం వెలుగు చూసేదికాదేమో.......!





మాలిక



హాంగ్‌కాంగ్ రేవు

అమూహ



కాతే పసిఫిక్ ట్రైస్టార్ విమానం ముప్పయివేల అడుగుల ఎత్తు నుండి మెలమెల్లగా దిగటం మొదలుపెట్టింది. అప్పటివరకూ మబ్బుల్లో తేలుతూ విమానం ఎగురుతుంటే – అంతో ఇంతో మధువు మత్తులో తూలుతూ బిజినెస్ క్లాస్‌లో ఉన్న ప్రయాణికులు బెల్టుతో సరిచేసుకున్నారు.

అప్పటివరకూ అందరికీ నవ్వుతూ సేవలందించిన విమాన సిబ్బంది ల్యాండింగ్‌కి సిద్ధమవుతున్నారు.

జె.కె.కి విమాన ప్రయాణం, టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లు కొత్త కాకపోయినా, అతనికి గాలిలో ప్రయాణం ఎప్పుడూ థ్రిల్లింగ్‌గానే ఉంటుంది. మరో పావుగంటలో హాంగ్‌కాంగ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో ఆ ట్రైస్టార్ దిగబోతున్నది. అతనికి కంపెనీ పనిమీద హఠాత్తుగా బయలుదేరడానికి కారణాలు అన్నీ మనసులో మెదిలాయి. తానయితే ఒక వారం రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నా – తప్పక విమానం ఎక్కాల్సి వచ్చింది. ఒంట్లో నల్లగా ఉన్నా అంతగా ఆలోచించలేదు. “చూద్దాం అనుకోని ప్రయాణాలు కొన్ని ఎంతో ఆనందంగా గడిచిపోతాయి!” అనుకొని చిన్నగా నవ్వుకున్నాడు.

హాంగ్‌కాంగ్ విమానాశ్రయం రద్దీ నుంచి బైటకు వచ్చేసరికి గంట పట్టింది. స్వాగతం చెప్పే ప్రదేశంలో అతని పేరుతో ఒక ప్లేకార్డ్‌తో కంపెనీ రిప్ నిలబడి ఉన్నాడు నవ్వుతూ. కుశల ప్రశ్నల తర్వాత లెక్సస్‌లో బేటన్నెల్లోంచి ప్రయాణించి,

హాంగ్‌కాంగ్ హార్బర్ ప్రక్కనే ఉన్న ఫ్యూరమా హోటల్‌లో జె.కె.ని దింపి మర్నాడు కార్యక్రమం, ఆ మర్నాడు సమావేశం వివరాలు ఇచ్చి, కంపెనీ వ్యక్తి వెళ్ళిపోయాడు.

హోటల్ స్వీట్‌లో నుంచి 'బే' చూస్తుంటే ఎంత సమయం అయినా గడిచిపోతుంది. కౌలూన్‌కి వెళ్ళే ఫెర్రీలు తిరుగుతూనే ఉంటాయి. జనం ఎప్పుడూ పరుగులు పెడుతూనే ఉంటారు. చీకటి పడగానే ఒక్కసారిగా వెలుగు ముద్దలా అయిపోతుంది, 'బే'కి రెండు ప్రక్కలా. హార్బర్ జలాలు కోటి దీపాలతో మిలమిలా మెరిసిపోతుంటాయి. ఆకాశానికి, సముద్రానికి తేడా చెరిగిపోయింది. బడలికతో ఏమీ తినకుండానే నిద్రపోయాడు జె.కె.

తర్వాతి రెండు రోజులూ క్షణం తీరిక లేకుండా వ్యాపార వ్యవహారాలు, సమావేశాలతో తలమునకలుగా ఉండి, ఇతర విషయాలపై మనసు పెట్టలేదు. ఈ రెండు రోజులూ పెద్దగా ఆహారం తీసుకోలేదు కూడా – అలసినట్లయింది.

* * *

మూడోరోజు మధ్యాహ్నం గాని పనిలో నుంచి బైటపడలేకపోయాడు. ఆ సాయంత్రం హోటల్ హెల్త్ క్లబ్‌లో స్టీమ్‌బాత్ చేసి, కాఫీ షాప్‌లో కూర్చున్నాడు. తాను ఇదివరకు హాంగ్‌కాంగ్ వచ్చినప్పటికీ ఇప్పటికి ఎంతో తేడా కనబడుతోంది. తేడా ఎక్కడుంది మరి? ఇదే హార్బరు, ఇవే దీపాలు, ఇవే ఆకాశ హర్మ్యాలు – మరి ఎక్కడుంది? ఈ ప్రజల్లో – ఈ హాంగ్‌కాంగ్ పౌరుల ఆలోచనలు – నడవడిలో మార్పు స్పష్టంగా కనపడుతోంది – ఎందుకు. ఇంకో ఆరునెలల్లో వీరు కమ్యూనిస్టు చైనాలో కలవబోతున్నారు. వీరిని ఏదో తెలియని భయం ఆవహిస్తోంది. జె.కె.కి స్పష్టంగా తెలుస్తోంది. అతనికి కూడా ముందుముందు తన వ్యాపార వ్యవహారాలు ఎలా నడుస్తాయోనని భయం కూడా ఉంది. "గుడ్ ఈవెనింగ్ సర్" అని సన్నని గొంతు వినిపించింది. ఆలోచనల పొరల్లో నుంచి లీ నవ్వుముఖం కనపడింది. ఆ ఉదయం లీకి ఫోను చేసిన విషయమే మర్చిపోయాడు. గ్రీట్ చేసి, కూర్చోబెట్టాడు. కాఫీ ఆర్డర్ ఇచ్చి కుశల ప్రశ్నలు వేశాడు. పోయినసారి తాను హాంగ్‌కాంగ్ వచ్చినప్పుడు గైడ్ – ఎస్కార్ట్ కావాలంటే తన కంపెనీవాళ్ళు లీ ని పంపారు. చూడవలసినవన్నీ ఎంతో ఓర్పుగా వివరంగా తెలియజెప్పి ఒక్క రోజు మాత్రమే తనకి సమయం ఉంది – వెళ్ళేప్పుడు తన బిజినెస్ కార్డ్ ఇచ్చి బై చెప్పి వెళ్ళిపోయింది. ఇంకా హాంగ్‌కాంగ్‌లో చూడవలసింది

ఎంతో ఉంది. అందుకే ఈ రోజు ఉదయం లీ కి ఫోన్ చేసి సాయంత్రం కలవమని చెప్పాడు –

'చెప్పండి సార్' హార్బర్ టూర్ వెళ్దామా? ఒక గంట సమయం పడుతుంది. తర్వాత చైనా జానపద నృత్యాలు చూపించే రెస్టారెంట్ ఉన్నది. అక్కడ డిన్నర్ చెయ్యవచ్చు – తర్వాత డిస్కోతెక్ వెళ్ళవచ్చు' అని అంటున్నది.

సరే, ముందు హార్బర్ టూర్ అనుకున్నారు. అప్పర్‌డెక్‌లో కూర్చుని సముద్ర వాయువు పీలుస్తూ – అలల తాకిడికి అంత పెద్ద పడవ ఊగుతుంటే కడుపులో దేవినట్లయింది. అరగంటకి కౌలూన్ రేవులో ఆగింది. జె.కె. అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చాడు – "లీ, ఇక్కడ దిగిపోదాం" అని క్రిందికి దిగి, ముందుకు సాగాడు. చెక్కమెట్లు జాగ్రత్తగా దాటి, నాథన్ రోడ్డు మీదకు వచ్చారు.

"సర్ ఏమయింది?" అని ఆశ్చర్యంగా తన చిన్ని కళ్ళతో అడుగుతోంది.

"లీ, నీ గురించి చెప్పు – నువ్వు ఎక్కడ ఉంటావు?" అని అడిగాడు. ఆమె ఒక్కసారిగా ఆగిపోయింది.

తర్వాత మెల్లగా "ఇక్కడికి ముప్పైమైళ్ళు. చూవాంగ్ చావ్ దీవిలో ఉంటాము. అమ్మ, నేను" అంది.

అతని ఆలోచనలు ఇక్కడ లేవు. తను చూసేది హాంగ్‌కాంగ్ కాదు – ఇదంతా స్టీలు – గ్లాసు, కాంక్రీటు పొరల నిర్మాణం. ఈ పొరల వెనక ఏదో జీవితం ఉంది. వీలైతే అది చూడాలి అని.

"లీ, నన్ను మీ దీవికి తీసుకువెళ్ళు. మీ వాళ్ళను చూస్తాను" అన్నాడు.

ఆమె, వెంటనే అంగీకరించలేదు. కానీ, అతనితో ఉన్న పాత పరిచయం, అతని సంస్కారం, అతని అభ్యర్థన, ఇవన్నీ ఆమెను అంగీకరింపచేసాయి. అప్పటికి ఆరుగంటలవుతుంది. సూర్యుడు చైనా సముద్రంలో దిగిపోయాడు. అయినా, ఇక్కడ ఇంకా చీకటి పడలేదు. ఆమె త్వరగానే లెక్కవేసింది. దగ్గర్లోనే యం.టి.ఆర్. ఉన్నది. అది ఎక్కితే ఒక గంటలో తన స్టేషన్‌కి వెళ్లవచ్చు. అక్కడ సైకిల్ తీసుకుంటే పావుగంటలో ఇంటికి చేరవచ్చు.

జె.కె.కి తన ఇంటి చుట్టుప్రక్కల చూపించి, భోజనం పెట్టి, కనీసం రాత్రి

10 గంటలకి యం.టి.ఆర్. ఎక్కించవచ్చు అనుకొని ఆ విషయం అతనితో అన్నది.

"సరే" అని యం.టి.ఆర్. స్టేషన్‌లో దిగారు.

"ఎక్కడా ఇంత మచ్చ కూడా లేదే, ఇది రైలుస్టేషనా?" అతను తేరుకునేలోపుగానే వేగంగా వచ్చి, ఆగింది రైలు. తర్వాత కొంత భూమార్గంలో కొంత పైమార్గంలో ప్రయాణం చేసి, కౌలూన్ దాటి, క్రొత్త ప్రాంతాలు దాటి, చూవాంగ్ చావ్ దీవిలో తేలింది. అప్పటికే అతనికి తలనొప్పి మొదలైంది.

ఇద్దరూ స్టేషన్ బైటకు వచ్చారు. లీ సైకిల్ తేవటానికి పార్కింగ్‌కి వెళ్ళింది. జె.కె. ఒక్కసారి కలియచూశాడు. రెండు చిన్న కొండలు కనపడుతున్నాయి. పచ్చగా చెట్లతో కప్పబడి ఉన్నాయి. చుట్టూ సముద్రం నురగలతో నేలను స్నానం చేయిస్తోంది. చిన్నిచిన్ని పడవలు తిరుగుతున్నాయి.

ఇక్కడ ఇళ్ళెక్కడ ఉన్నాయి? అంతలో రెండు సైకిళ్ళు తీసుకుని లీ వచ్చింది. అతనికి నవ్వు వచ్చింది. సైకిలెక్కి, ఎన్నాళ్ళయింది! లీ చెప్తోంది సైకిలు తొక్కుతూ – ఈ దీవిలో కారులు, మోటార్‌సైకిళ్ళు, స్కూటర్లు రానివ్వరు. చివరికి మోటారు బోట్లు కూడా దూరంగా ఆగాలి అని వంకరటింకర దార్లవెంట, బాతులు దాటి, గేదెలు తప్పుకుని, ఒకటి రెండు గాడిదలు కూడా కనపడిన గుర్తు జె.కె.కి. పావుగంటలో ఒక కొండప్రక్క లోయలో ఇళ్ళ దగ్గరకు చేరారు. ఒక ఇంటి దగ్గర ఆగింది లీ.

చిన్న చెక్క ఇల్లు, చుట్టూ ప్రహరీ కూడా చెక్కలతో కట్టిందే. ఎక్కడా కరెంటు ఉన్న సూచనలు లేవు. సాయంత్రం అవటం మూలంగా అందరూ ఇళ్ళకి చేరుతున్నారు. కావళ్ళు మోస్తూ, బాతులు తోలుకుంటూ, మాండరిన్‌లో మాట్లాడుతూ, ఒకరిద్దరు లీని పలకిరించిపోయారు కూడా.

జె.కె.ని లోపలికి తీసుకెళ్ళింది. అప్పటికే అతని తల తిరుగుతోంది. లీ అమ్మకు పరిచయం చేసింది. ఆమె వంగి, స్వాగతం చెప్పింది. అక్కడ ఒక చెక్క మంచం ఉంది. అక్కడ కూర్చోమని చూపించింది. జె.కె. కూలబడ్డాడు. లీ ఇప్పుడే వస్తానని బయటకు వెళ్ళింది. తర్వాత –

❖ ❖ ❖

అతనికి పెద్ద వాంతి అయిన గుర్తు అంతే.... మళ్ళీ స్పృహ వచ్చేసరికి ఒళ్ళంతా పచ్చి పుండులాగా, జ్వరంతో కాలిపోతూ చలితో వణుకుతున్నాడు. ప్రక్కన లీ – ఆ ప్రక్కన లీ అమ్మ ఆందోళనతో చూస్తున్నారు. అతను నీరసంగా నవ్వి, మళ్ళీ నిద్రో అపస్మారకమో తెలియని స్థితిలోనికి జారిపోయాడు.

మర్నాడు సూర్యోదయంతోపాటు అతనికి మెలకువ వచ్చింది. లీ తన మంచం ప్రక్కనే కుర్చీలో నిద్రపోతున్నది. అమ్మ చుట్టుప్రక్కల ఉన్నట్లు లేదు. జె.కె. తన స్థితి చూసుకున్నాడు. ఆ పొట్టి చెక్క మంచంమీద – తన కాళ్ళు సగం బైటకు వ్రేలాడుతున్నాయి. అతనికి అంత నీరసంలోనూ నవ్వు వచ్చింది. తన ఒంటినిండా ఏవేవో కప్పి ఉన్నాయి. ఇప్పుడు అంత చలిగా లేదు.

ఇంతలో లీ అమ్మ టీ తెచ్చింది. చిన్న గుంట గిన్నెలో – పొగలు వస్తున్నాయి.

అందులో పాలు లేవు. సగం కూర్చుని, సగం పడుకుని ఆ టీ తాగాడు. అంతలో లీ కళ్ళు తెరిచింది. అతన్ని చూసి కొద్దిగా సిగ్గుపడింది. అతనికి రాత్రంతా కాపలా ఉంది. జ్వరం పెరగకుండా నుదుటిమీద చన్నీళ్ళ గుడ్డలు మార్చింది. ఎంతో ఆందోళన చెందింది. అపస్మారక స్థితిలో అతని అమాయకత్వం ఆమెలో చెరగని ముద్ర వేసింది. హృదయం ఆర్ద్రమయింది.

మర్నాడు మంచం దిగే ఓపిక లేక, ఆమె సేవలను కాదనలేకపోయాడు. అక్కడి వైద్యుడు ఏదో పసరు ఇచ్చి, పొగబెట్టి వెళ్ళాడు. మూడోరోజుకి నిలబడి, బయటకు వచ్చాడు. ఇరుగుపొరుగువాళ్ళు వచ్చి ఏదో అడుగుతున్నారు. అతనికి అర్థం కావటంలేదు. అప్పటికి ఆ ఇంటి సంగతులు అతనికి అవగాహన అయింది. లీ కి ఆరేళ్ళ క్రితం పెళ్ళి అయింది. చైనాలో షాంగై దగ్గర. ఆమె భర్త చైనా సైన్యంలో ఉన్నాడు. పెళ్లయిన తర్వాత తల్లిని తీసుకుని హాంగ్‌కాంగ్ పారిపోదామని అనుకున్నారు. లీ ని, అమ్మని బోటు ఎక్కించే ఏర్పాటు చేశాడు. కాని అతను రాలేకపోయాడు. చైనా ఇనుప తెరలు అంత సులభంగా దాటగలరా? ఎలాగైతే చువాంగ్ చావ్ దీవి చేరారు. లీ అప్పటికే గర్భవతి. తర్వాత పాప పుట్టింది. ఇప్పుడు అయిదేళ్ళు అమ్మాయికి... ఒకరోజు పాపతో ఆ దీవి అంతా సైకిల్‌మీద తిరిగాడు. ఆ సంద్రపుటంచులలో ఆ ఎగిరే పక్షులను చూస్తూ ఆ పాప చెప్పే అర్థంకాని కబుర్లు వింటూ తానెక్కడున్నాడో మరిచిపోయాడు.

తర్వాత లీ చేయిపట్టుకుని అక్కడి విశేషాలన్నీ చూశాడు. 'పాక్‌టాయి' అంటే సముద్ర దేవుడు – వసంతకాలంలో ఉత్సవం చేస్తారు. ఈ నీటి దేవుడికి పూజలు చేస్తూ. ప్రక్కనే లాంటావూ దీవికి వెళ్ళారు చిన్ని పడవలో. అక్కడ ఆసియాలోకెల్లా పెద్ద బుద్ధవిగ్రహాన్ని దర్శించారు.

ఎక్కడి బుద్ధుడు! ఇక్కడికి ఎవరు తెచ్చారు? మనిషికి విశ్రాంతి లేదా? మనసుకు పరిధి లేదా? మమతకు అవధి లేదా? తాను వచ్చి ఎన్ని రోజులయింది – కాలం ఆగిపోయిందా, కాలంతో పనిలేదా?

ఆ రోజు లీ అతనిని దగ్గర్లో ఒక దీవికి తీసుకువెళ్ళింది. అక్కడ "అమాహ" రాయిని చూపింది. "అమాహ" అంటే "ప్రోషిత భర్తృక" – తన భర్త కోసం ఎప్పుడూ ఎదురు చూసే భార్య – అని వివరించింది. అతని హృదయం ఆర్ద్రమయిపోయింది. ఆ అమాహ శిలామూర్తిని చూస్తూ నిలబడిపోయాడు. అతని కళ్ళముందు ఒక స్త్రీమూర్తి, స్నేహార్ద్ర హృదయ సాక్షాత్కరించింది.

అతని కోసం ఎదురు చూసే భార్య, లీలగా కళ్ళముందు కదిలింది!

"జులై 30 కి చైనా సైన్యాలు హాంగ్‌కాంగ్‌లో ప్రవేశిస్తాయి. అదృష్టం బాగుంటే చుంగ్‌వా కూడా రావచ్చు" అని లీ అన్నప్పుడు ఆ చిన్ని కన్నుల్లో మెరుపు తారల్ని చూశాడు.





థాయ్ వైభవం

మాలి



ఆ సాయంత్రం డాన్ మువాంగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బస్‌లో బ్యాంక్‌కాక్ సిటీకి తిరిగి వస్తూ తాను ఎంత పొరపాటు చేశానో అని ఆలోచిస్తున్నాడు సన్యాల్. ఇంతకు ముందే కాలిఫోర్నియా వెళ్ళే థాయి విమానం ఎక్కేందుకు హిమాలికి వీడ్కోలు ఇచ్చాడు – కౌగిలింతలు కన్నీళ్ళ మధ్య.

ఆమె మాస్టర్స్‌కి కాలిఫోర్నియా యూనివర్శిటీకి వెళ్తానంటే రెండేళ్ళు కదా ఎంతలో తిరిగి వస్తాయి అనుకున్నాడు. ఇప్పుడు ఆమె దగ్గర్లో లేని వెలితిని అతను ఒక్కసారిగా గుర్తించి, ఎంత పొరపాటు చేశాను అని ఎన్నోసార్లు అనుకున్నాడు. తను గట్టిగా వద్దు అంటే తప్పనిసరిగా ఆగిపోయేది. ఒక సంవత్సరంలో పెళ్ళి కూడా చేసుకునేవారు. కాని, మాలికి అంతగా చదువు మీద ఉత్సాహం ఉన్నప్పుడు అడ్డుపడటానికి తానెవరు? అది స్వార్థమే అవుతుంది కదా? కాలేజీ రోజులు ఎంత సరదాగా గడిచిపోయినాయి! ఆర్థిక శాస్త్రం చదువుతున్న హిమాలి రెండో సంవత్సరంలో తనకు పరిచయమైంది. తను అగ్రికల్చర్ డిగ్రీలో ఉన్నాడు. ఇంగ్లీషు కామన్ క్లాసుల్లో కలిసేవారు. ఒకరికొకరు దగ్గరవ్వటానికి ఎంతో కాలం పట్టలేదు. ఉత్సాహంతో వెలిగిపోయే ఆమె కళ్ళు, ఆరోగ్యంతో మిసమిసలాడే ఆమె ఒళ్ళు – ముఖ్యంగా నల్ల మబ్బులాంటి ఆమె కురులు – చందమామలాంటి గుండ్రని ఆమె మోము – గులాబిరంగు పెదవులు – అతనికి మత్తెక్కించేవి – నిర్మలమైన ఆమె మనసు అతనికి అతన్నే పరిచయం చేసింది. ప్రియురాలి సాంగత్యం – బాదరబందీ లేని విద్యార్థి బ్రతుకు. అతనికి

ప్రపంచం అంతా ప్రేమమయంగా, ఆనంద హేలగా కనిపించింది. ఇప్పుడు మాలి – తన మాలి – దూరంగా వెళ్ళిపోయింది. ఆ రాత్రి తర్వాత ఎన్నో రాత్రులు అతను నిద్రపోలేకపోయాడు.

రాత్రిళ్ళు – గదిలో అడుగుపెడుతుంటే, మాలి లేని తన ఖాళీ మనసులోకి తానే అడుగిడుతున్నట్లు తోచేది! హోటల్ ఓరియంటల్‌లో ఉద్యోగం దొరికిన తర్వాత రాత్రి కాలేజీలో ఫిలాసఫీ చెయ్యటానికి చేరాడు. సమయం ఖాళీగా ఉంటే హృదయం మాలివైపు పరుగెత్తేది. అందుకనే క్షణం కూడా తీరిక లేకుండా కాలం గడిపేవాడు.

పగలంతా హోటల్ గెస్ట్‌ల సందడితో ఎన్నో దేశాల అతిథులు – అక్కడ తిరుగాడుతుంటే అతనికి ఎంతో రిలీఫ్‌గా ఉండేది. ఎక్కువగా అమెరికన్ టూరిస్ట్‌లు వస్తుండేవారు. ఎంతో కలివిడిగా తెలిసినవాళ్ళవలెనే ప్రవర్తిస్తారు. వాళ్ళు జీవితం అనుభవించటానికే అన్నట్లు రోజుల్ని గడుపుతారు.

రాత్రులు తప్పనిసరిగా ఫిలాసఫీ క్లాసుకు వెళ్ళేవాడు త్వరలోనే అతనికి ప్రొఫెసర్ దాస దగ్గరయ్యాడు. ప్రొ. దాస సన్యాల్‌కి ఎన్నో పుస్తకాలు ఇచ్చారు. ఈ దినచర్యతో సన్యాల్ – 'మాలి' వెలితిని తట్టుకోగలిగాడు.

✤ ✤ ✤

ఆరు నెలలు గడిచాయి. మాలి ఉత్తరాల్లో అమెరికా జీవితం, స్వేచ్ఛా జీవితం, యూనివర్శిటీ విద్యార్థుల భావప్రకటనలు వివరంగా రాసింది, ఒక ఉత్తరంలో మైక్ గురించి రాసింది. రానురాను ఆమె ఉత్తరాలు తగ్గిపోసాగాయి. డిసెంబర్ నెలలో అక్కడి సందడి, క్రిస్మస్ వేడుకల గురించి ఎంతో ఉత్సాహంగా రాసింది. అందులోనే మైక్‌తో ఎఫైర్ నడుస్తున్నట్లు చెప్పింది. ఆ తర్వాత ఉత్తరంలో మైక్ తనను వివాహమాడతానని అడిగినట్లు తాను ఒప్పుకున్నట్లు రాసి "సారీ సన్యాల్" అని ఉత్తరం ముగించింది.

ఆ ఉత్తరం సన్యాల్‌కి పిడుగుపాటే అయింది. ఆమె తనది అనుకుని, ఎక్కడున్నా ఇన్నాళ్ళూ భరించగలిగాడు. ఇప్పుడు పరాయిదయిపోతున్నదనే నిజం తనకు ఏమీ కాదన్న భావనే భరించరానిదిగా తోచింది. అతనికి దిక్కుతోచలేదు. జీవితం అంతా చీకటిగా అనిపించింది. ఈ దిగులుతో ఎక్కువగా తన గదిలో

చీకటిలోనే ఉండిపోతున్నాడు. ఉద్యోగానికి కూడా సరిగా వెళ్ళలేకపోతున్నాడు. అది ఊడిపోవటానికి కూడా ఎక్కువ రోజులు పట్టలేదు. సహజంగానే చదువు కూడా సాగలేదు. రాత్రులు సుఖుంవిత్ రోడ్‌లో బార్‌కు వెళ్ళడం సాగించాడు. బీర్‌తో మొదలయిన త్రాగుడు విస్కీ వ్యసనంగా మారటానికి ఎక్కువ కాలం పట్టలేదు. అయినా అతని మనసు మండిపోతోంది. ఆ మత్తులో ఉన్నప్పుడు తనకి మనశ్శాంతి దొరుకుతున్నది అన్న భావన, మనోవేదన మరిచిపోతున్నట్లు భ్రమలో మునిగిపోయాడు.

కొద్దిరోజుల్లో బార్ తలుపులు మూసేవరకూ బార్‌లో గడిపే స్థితికి వచ్చాడు. రెండు మూడు సార్లు బలవంతాన బయటికి పంపారు. ఒకటి రెండు ప్రమాదాలకు గురి అయ్యాడు. అతను అప్పుల పాలవటానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఒకసారి ఓ చీకటి వీధిలో ఇతని అధోగతిని చూసిన ప్రొ. దాస – జాలిపడి ఇంటికి తీసుకువచ్చాడు. మర్నాడు మత్తు దిగిన తర్వాత తాను చెప్పవలసింది చెప్పాడు. ఇంకా నచ్చచెప్పి కొన్నాళ్ళు ఉండమని, వాట్ అరుణ్ ('ఒక బౌద్ధారామం, బ్యాంగ్‌కాక్ సిటీకి 50 కి.మీ. దక్షిణంగా ఉన్న షోన్‌బురి పట్టణానికి సమీపంలో ఉంది)లో చేర్పించాడు! 'వాట్!' జీవితం అతనికి మొదట్లో దుర్భరంగా ఉంది. మొదటి రోజుల్లో అతనికి మళ్ళీ హిమాలి జ్ఞాపకాలు తాము గడిపిన మధుర క్షణాలు గుర్తుకు రావటం మొదలయింది. మత్తులో లేని మనసు, భరించలేని బాధకు గురైంది. పగలు దిక్కుతోచక, రాత్రిళ్ళు నిద్రపట్టక తల్లడిల్లిపోయాడు. మున్ముందుగా బాధ భరించలేనిదిగా అనిపించింది. తనకు దూరమైన ప్రియురాలిని ఏమయినా మళ్ళీ పొందాలని తపించిపోయాడు. ఆమె పట్ల తనకున్న బలీయమైన ఆకర్షణను ప్రేమగా తలపోసి, తలక్రిందులయ్యాడు. ఈ కోరికల వలయంలో నుంచి బయటపడటానికి ఈ ఆరామ జీవితం, ధ్యానం, ప్రార్థనలు ఎంతో ఉపయుక్తమైనాయి. అతని మనోవేదనను రూపుమాపి మనసుకు ఉపశాంతి, ఊరట కలిగించాయి. మెలమెల్లగా పాము కుబుసం విడిచినట్లు తన వ్యసన జీవితాన్ని వదిలి, పాత గాయాల్ని – జ్ఞాపకాలను గతంలోనికి తరలించాడు.

తథాగతుని బోధనలు అతనికి జీవితం పట్ల అవగాహన – కోరికల పట్ల ఆలోచన కలిగించాయి. సామాన్యంగా హాయిగా ఏ విధంగా జీవనం సాగించవచ్చో అతనికి నేర్పాయి. ఆరామ దినచర్య, ప్రార్థన, ధ్యానం, భిక్షాటన ఇవన్నీ అతని ఆలోచనాసరళిని, జీవన గమనాన్ని మార్చివేశాయి. ప్రకృతిపట్ల గౌరవం, పరులపట్ల

సహనం, జీవితం పట్ల తాత్త్విక చింతన అలవడినాయి. ఇప్పుడు అతనికి ఎవరిపైనా కోపం రావటం లేదు. చిరాకులు – చీకూ చింతలు అతని దరిదాపుల్లో లేవు. ప్రతి ఉదయం క్రొత్తగా, ప్రతి రోజూ ఎంతో ఆసక్తికరంగా అతనికి గోచరిస్తున్నాయి.

పూర్తిగా ఆరోగ్యవంతమైన శరీరంతో, సంపూర్తిగా క్షాళనమైన హృదయంతో ఎంతో ప్రశాంత జీవితం సాగిస్తున్నాడు. ఇప్పుడు అతనికి అంతా వెలుగే కనపడుతోంది. ఎంతో ఉత్సాహంతో – ముదురు కాషాయరంగు వస్త్రాలు ధరించి, జోలితో, దేశాటనకు బయలుదేరాడు.

❖ ❖ ❖

థాయి దేశం నిలువునా ఉన్న ఎన్నో బౌద్ధ ఆలయాలు, ఆరామాలు, పగోడాలు ఎన్నో దర్శించాడు. చావోఫియా నదికి ఇరువైపులా ఉన్న గ్రామాలు, పట్టణాలు, దీవులు – అన్నీ పర్యటించాడు. ఎందరో గురువుల బోధనలు ఆలకించాడు.

ఒకరోజు 'వాట్ ప్రాబాత్' గుడిలో ధ్యానానంతరం డాక్టర్ ప్రవాసి ప్రసంగం విని చలించిపోయాడు. ఎంతోమంది అభాగ్యులు అనారోగ్యంతో క్రుంగిపోవటం, అందులో ఎక్కువ భాగం ఎయిడ్స్ రోగంతో మృత్యుముఖంలో ఉండటం, వీరిని అంటురోగ భయంతో అయినవాళ్ళు, స్నేహితులు వెలివేయడం, ఇవన్నీ అతనికి అవగాహన అయ్యాయి. ఈ పర్యటన పర్యవసానం – మున్ముందు అతని కార్యక్రమం విపులంగా గోచరించింది.

ఒక ఆసుపత్రికి వెళ్ళి అక్కడి ఎయిడ్స్ రోగుల్ని పరామర్శించాడు. అందులో ఎక్కువ భాగం మృత్యుగహ్వారంలో ఉన్నవారే; వీరిని బంధువులు, స్నేహితులు, చివరికి ఆసుపత్రి సిబ్బంది కూడా పట్టించుకోని, పలకరింపుకు నోచుకోని స్థితికి వచ్చారు! సన్యాల్ దగ్గరగా రావటం గమనించి, ఒక బక్కచిక్కిన రోగి, చేతులు దగ్గరకు తెచ్చి 'వాయి' చెయ్యడానికి ప్రయత్నించాడు. కాని ఓపిక ఏది? సన్యాల్ అతనికి దగ్గర్లో మోకాళ్ళ మీద కూర్చొని, అతని రెండు చేతులు దగ్గరకు తెచ్చాడు. ఆ రోగి కళ్ళు ఒక్కసారి వెలిగి ఆరిపోయాయి. ఈ సంఘటన సన్యాల్‌ను తన భవిష్యత్ కార్యక్రమానికి మరింత దగ్గర చేసింది.

ముందుగా కొన్నాళ్ళు రోగుల దగ్గరకు వచ్చి పలకరించి వెళ్ళేవాడు. తర్వాత తర్వాత తడి గుడ్డతో వారి శరీరాలు తుడిచి బట్టలు మార్చేవాడు. సాంత్వన

వాక్యాలు చెప్పి, మనశ్శాంతి కలిగించేవాడు. అతను ఎప్పుడైనా రాలేకపోతే ఆ రోగులు అతని కోసం ఎదురు చూసేవాళ్ళు. మళ్ళీ అతను కనిపించిన రోజున – ఓపిక ఉన్న రోగులు నేలమీద దేక్కుంటూ వచ్చి అతని కాళ్ళకు చుట్టుకునేవాళ్ళు. అతని హృదయం ద్రవించిపోయేది. తాను రాని ఈ మూడు రోజుల్లో ఇద్దరు చనిపోయారు. ఇద్దరూ అతన్ని చివరి వరకూ అడుగుతూనే ఉన్నారని మిగతావారు చెప్పడం అతన్ని కదిలించింది.

ఈ రోగులకు కావలసింది ఏముంది! ఇంత దయ, ఇంత ప్రేమ, చనిపోయే ముందు ఎవరైనా చెయ్యి పట్టుకుని "నీకు నేనున్నానని" ధైర్యం చెప్పటం, గౌరవంగా ఈ లౌకిక ప్రపంచం నుంచి నిష్క్రమించటం! ఇవన్నీ తాను చెయ్యగలడు. రోజురోజుకూ తన బాధ్యత పెరిగిపోవటం అతను గమనించాడు. అందుకనే ఒక నిర్ణయానికి వచ్చాడు.

❖ ❖ ❖

షోన్‌బురి దగ్గర్లో సన్యాల్ తరచూ దర్శించే "వాట్ అరుణ్" ఉంది. ఈ బౌద్ధారామంలోనే అతనికి పునర్జన్మ లభించింది. ఒకరోజు ఇద్దరు ఎయిడ్స్ రోగుల్ని తనతోబాటు ఆరామానికి తీసుకువచ్చాడు. ఇది గమనించి, తోటి భిక్షువులు నొసలు చిట్లించారు. "ఎయిడ్స్ రోగుల్ని సాకటం మన బాధ్యత కాదు. సన్యాసులు సంఘ సేవకులు కాదు. సంస్కర్తలు, గురువులు మాత్రమే" అని అతన్ని వారించటానికి ప్రయత్నించారు. సన్యాల్‌కి ఆగ్రహం కలగలేదు. తోటివారి భయం అతను అర్థం చేసుకోగలడు. ఎయిడ్స్ మహమ్మారి చికిత్స లేని ప్రాణాంతక రోగం. చూస్తూ చూస్తూ ఎవరు మృత్యువును కౌగిలించుకోరు కదా!

"మీరు భయపడాల్సిన పని లేదు. మనం సంఘానికి ఆదర్శం కావాలి. దారి చూపాలి. వీరు రోగులే కాని దిక్కులేనివారు కారు. మనం కొద్దిగా జాగ్రత్త వహిస్తే ఈ రోగం మనల్ని అంటుకోదు" అని నచ్చచెప్ప ప్రయత్నించాడు. కాని తోటి సన్యాసులు అతన్ని ఒంటరిగా వదిలి వెళ్ళిపోయారు. సన్యాల్ మొక్కవోని ధైర్యంతో రోగులకు సేవచేశాడు. అప్పుడే ముగ్గురు రోగులు చేరారు. వారి అరచేతులకు, అరికాళ్ళకు నూనె రాసి మర్దన చేశాడు. ఓపిక ఉన్నవాళ్ళతో ధ్యానం చేయించాడు. వాళ్ళు నిద్రపోయేవరకు జాతక కథలు చెప్పేవాడు. వారికి తానే వైద్యుడై, వంటవాడై, సేవకుడై, ఆత్మీయుడై శారీరకంగా, మానసికంగా

వారిని సేదతీర్చాడు. రానురాను అతనికి నిద్రే కరవైపోయింది. రోజులు గడుస్తున్న కొలది రోగులు పెరుగుతున్నారు. చుట్టుపక్కల ఊరి జనం వీరికి దూరంగానే ఉంటున్నారు. ఊళ్ళోవాళ్ళు సన్యాల్‌కి ముందు ఆహారం కూడా ఇవ్వటానికి వెనుకాడారు. దినసరి సరుకులు అమ్మటానికి అతన్ని తమ దరిదాపుల్లోనికి రానివ్వటానికి ఇష్టపడలేదు. అతను ఎంతో దూరం వెళ్ళవలసి వచ్చేది.

బస్ డ్రైవర్లు అతన్ని బస్ కూడా ఎక్కనివ్వలేదు. ఆ మూటలు వీపున పెట్టుకొని ఆ ధీమంతుడు నడిచే ఆరామం చేరేవాడు. అతనికి ఎవ్వరిపైనా కోపం లేదు. ఈ రోజు కాకపోతే రేపు – ఈ నెల కాకపోతే వచ్చే నెల – లేదా పై సంవత్సరానికైనా వారే అర్థం చేసుకుంటారు అని ఆశించాడు. తన ఒంటరి పోరాటం సాగించాడు. నెలరోజుల తర్వాత ఆ ఊరిలో ఒకరిద్దరు – ఆ ఆరామంలో ఏమి జరుగుతుందో – ఈ బౌద్ధ సన్యాసి బ్రతికి ఉన్నాడో లేదో అని ఉత్సుకతతో అటుగా వచ్చి తొంగి చూశారు. “ఆచాన్ బ్రతికే ఉన్నారే...” అని ఆశ్చర్యపోయారు (ఆచాన్ అంటే ఆచార్యుడు అని అర్థం).

ఆ నోట ఈ నోట సన్యాల్ గురువు చేసే సేవ అందరికీ తెలియసాగింది.

శుభాంగి ఇరవై ఏళ్ళుగా నర్స్‌గా పనిచేస్తోంది. “ఈ రోగుల కోసం ఆచాన్ ఇంత త్యాగం చేస్తుంటే – నేను తప్పక సాయం చెయ్యాలి” అని ఉద్యోగం వదిలి ‘వాట్ అరుణ్’ ఆరామానికి వచ్చింది. అక్కడ ఉన్న పరిస్థితి చూసి భయకంపితురాలయింది. తన ఇరవై ఏళ్ళ ఆసుపత్రి జీవితంలో ఇంత భయానక, దయనీయ పరిస్థితి ఎప్పుడైనా చూసిందా అని నిర్ఘాంతపోయింది. ఆచాన్ ఎలా ఉంటున్నాడా – అని ఆశ్చర్యపోయింది. అతనికి అండగా ఉండాలని నిశ్చయించుకుంది. ఆ తర్వాత ఆమె చెల్లెలు మాయి కూడా వచ్చి వారికి తోడుగా నిలబడింది. కాని తెలియని భయంతో ఇక్కడ ఎన్నాళ్ళు ఉండగలను అనుకుంటూనే రోజులు గడపసాగింది.

✤ ✤ ✤

రోజులు వారాలయినాయి. వారాలు నెలలుగా మారాయి. రోగులు పెరిగిపోతున్నారు. ఒకరిద్దరు స్వచ్ఛంద సేవకులు వచ్చి సన్యాల్‌కి, శుభాంగికి, మాయికి సహాయంగా నిలబడ్డారు. ఇదంతా మొదలయి ఎన్నాళ్ళయింది? అప్పుడే రెండు వందల పైచిలుకు రోగులు ఆరామంలో తలదాచుకుంటున్నారు – ఆడవారు,

మగవారు, పసివారు ఇలా ఎంతోమంది వచ్చి, తమ చివరి రోజులు ఇక్కడే ప్రశాంతంగా గడుపుతున్నారు. కరుణామయుల మధ్య గౌరవంగా తరలిపోతున్నారు.

మెల్లగా బౌద్ధభిక్షువులు తిరిగి వచ్చారు. ఆచాన్‌కి అండగా అందుబాటులో ఉంటూ – ప్రార్థన, ధ్యానం నిర్వహిస్తున్నారు. సన్యాల్‌కి ఇప్పుడు ప్రభుత్వ పరంగా కూడా మందులకు సహాయం అందుతోంది. ఒకరిద్దరు రిటైరైన వైద్యులు కూడా సేవలందిస్తున్నారు.

ఇప్పుడు సన్యాల్ తీరిక దొరికినప్పుడు, ఎన్నోచోట్ల ఎయిడ్స్ రోగం గురించి, ఉపన్యాసాలు ఇస్తున్నాడు. ఎయిడ్స్ రోగుల్ని వెలివేయవద్దని అర్థిస్తున్నాడు.

ఆరామంలో సేవలు, ప్రయాణాలు, ఉపన్యాసాలు వీటితో అయిదు సంవత్సరాలు దొర్లిపోయినాయి.

❖ ❖ ❖

ఒకరోజు ఫాన్‌బురి (అక్కడికి 30 కి.మీ. దూరంలో చిన్న ఊరు) నుంచి తిరిగి వచ్చాడు. అలసిపోయినా, విశ్రాంతి దొరకని అతని దినచర్యలో భాగంగా, ఆ రోజు చేరిన రోగుల పేర్లు చూస్తున్నాడు. ఎవరిదీ పేరు? ఎక్కడిదీ పేరు? ఎప్పుడు విన్నాడు? హిమాలి! మాలి! అతను తన కళ్ళను నమ్మలేక మళ్ళీ చూశాడు! అవును, హిమాలి! ఆ పేరు చూడగానే అతని గుండె గుడిలో ఎన్నో గంటలు మోగాయి ఎక్కడో దూరంగా... అంతలోనే ప్రక్కనే పిడుగు పడినట్లు గుండె దడదడలాడింది. ఈమె తన హిమాలియేనా?!

ఆందోళనతో, మెల్లగా ఆ రోజు చేరిన రోగుల వరసకు వచ్చాడు. అందులో ఒక్కరే స్త్రీ. ఆ చాలీ చాలని వెలుతురులో చావుకు, బ్రతుక్కు నడుమ రేఖలా బక్కచిక్కిన ఆమెను పోల్చుకోవటానికి ఎంతో సమయం పట్టలేదు! ఆ తెల్లని పరుపు మీద మరకలా, ముడుచుకుని ఎండుటాకులా ఉన్న ఆమె ఆకృతిని చూసి అతని దయార్ద్ర హృదయం దీనంగా రోదించింది! హృదయాంతరాళంలో ఎక్కడో మరుగున పడిన మధుర స్మృతులు ఒక్కసారిగా మేల్కొని, అతన్ని ముంచెత్తాయి. గుండె లోయల్లో నుంచి భావావేశం ఉప్పొంగి, కన్నీరై కరిగింది. అతని కళ్ళు వర్షించాయి.

మర్నాడు... ఆమె ఒళ్ళు శుభ్రం చేయించి, బట్టలు మార్పించి, సేదతీర్చి, ఊదారంగు ఆర్చిడ్ పూల నీడలో కూర్చోబెట్టి హిమాలిని పరీక్షగా పరిశీలించాడు.

తాను మనసారా మరులుగొని కోరుకున్న ఈ శరీరం, పండులాంటి ఛాయ, ఎండి కావి రంగులో తనను వెక్కిరిస్తోంది! తను ముద్దులాడినప్పుడు తన ముఖాన్ని కప్పిన కారుమబ్బుల్లాంటి ఆమె కురులు, ఇప్పుడు నార పీచులాగా తనను చూసి నవ్వుతున్నాయి. తనకు వెన్నెల్లు వెదజల్లిన చందమామలాంటి ఆమె మోము - ఇప్పుడు ఆనమాలు కూడా లేదు. ఎన్నో కలలతో వెలిగిపోయిన ఆ కన్నుల్లో ఇప్పుడు వెలుతురేది? ఒకప్పుడు తనకు అమృతం అందించిన ఆమె అధరాలు - ఇప్పుడు ఎండి పగిలిన శిథిలాలు!

కాలమెంత కర్కశమైనది?!

"మాలీ" అన్న పిలుపుతో ఆమె కళ్ళు తెరిచింది. "తనను మాలీ అని ఎవరు పిలుస్తారు! తన చెవుల్లో ఈ సంగీతం నింపింది సన్యాల్ కాదుకదా!" ఆమె మెల్లిగా తేరుకున్నది. మెల్లమెల్లగా అతన్ని గుర్తుపట్టింది. గుర్తుపట్టిన మరుక్షణం ఆమె దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఎండిపోయిన కళ్ళల్లో నీరెక్కడుంది?

తన మసక కళ్ళతో మబ్బుల్లో చంద్రునిలా ఉన్న అతని ముఖంలో వెలుగును సరిగా చూడలేకపోయింది. అతని కళ్ళల్లోని మెరుపు, అతని నవ్వులోని తెలుపు తనని మరింత చీకటిలో ఉన్నట్లు చేశాయి. కొద్దిగా ఓపిక తెచ్చుకొని మెల్లమెల్లగా తన కథ చెప్పసాగింది. "ఈ స్వరం మాలిదేనా... అందులోని మాధుర్యాన్ని ఏ కాలం కాటేసింది...." అతను మౌనంగా వినసాగాడు....

మైక్‌ని పెళ్ళి చేసుకుని సంవత్సరం కాపురం చేసింది. అతనికి చిన్న కారు ప్రమాదం జరిగి, హాస్పిటల్‌లో చేరాడు. అప్పుడే అతనికి హెచ్.ఐ.వి. పాజిటివ్ అని తెలిసింది. ఆ దిగులుతోనే మరి సంవత్సరానికి అతను మరణించాడు. ఈ సంవత్సరం ఆమె పడిన మానసిక వేదన, శారీరిక శ్రమ ఆమెను ఎంతగానో కృంగదీశాయి. ఆశ నిరాశల మధ్య ఆమె జీవితం ఊగిసలాడి, చదువు చెడి, చివరికి ఒంట్లో ఎయిడ్స్ దాచుకుని అమెరికా ఆశల సౌధాలను, తీరాలను వదిలింది. బ్యాంగ్‌కాక్ చేరిన తర్వాత తల్లిదండ్రులతో దాదాపు ఒక సంవత్సరం ఉండగలిగింది. కాని ఇంట్లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో ఆసుపత్రి

పాలయ్యింది. ఆ తర్వాత ఆమెకు కాలంతో పనిలేకుండాపోయింది. రోగం ముదరడంతో ఆసుపత్రి సిబ్బంది ఈ వాట్ అరుణ్‌లో చేర్పించాడు.

✤ ✤ ✤

సన్యాల్ ఆమెకు ఎంతో ధైర్యం చెప్పాడు. ఎన్నో సేవలు చేశాడు. కాని ఆమెలో ఎనలేని న్యూనతా భావం పొంగుతోంది. అతని మంచితనం, అతని సేవ ఆమెకు తలకు మించిన భారంగా ఆవేశపడుతోంది. పరదేశం పరుగులుతీసి, పరాయి సంస్కృతిని కౌగిలించుకుని తను సాధించిందేమిటి? వయసు వేడిలో తాను బావుకున్నదేమిటి? ప్రేమకు తను చేసిన ద్రోహం ఎవరు క్షమిస్తారు? తన తుది క్షణాలే తనకు సమాధానాలా? సన్యాల్‌ని ఎంతో ఆరాధనా భావంతో చూసింది. వెలుగు ముందు పురుగులాగా తనను తాను ఊహించుకుంది. ఆ వెలుగులో ఎంత త్వరగా కలిసిపోతే అంత బాగుండును అని ఊహించుకుంది. ఆ వెలుగులో ఎంత త్వరగా కలిసిపోతే అంత బాగుండును అని ఆరాటపడింది.

"మాలి! రేపు నీ పుట్టినరోజు!" అని సన్యాల్ అంటుంటే – ఆమెకు గతమంతా కళ్ళముందు కదిలింది. అతని సన్నిధిలో, లుంబిని (బ్యాంగ్‌కాక్ సిటీలో పెద్ద పార్క్)లో వెన్నెల రాత్రులు, ఛావో ఫియానదిలో నెమ్మదిగా సాగే పడవలో, ప్రియుని ఒడిలో ఒదిగిన విలువైన క్షణాలు, ఒకేలాంగ్ కోటులో దాగి దగ్గరగా నడిచి, ఒకటిగా తిరిగిన చలిరాత్రులు – ఎన్నో ఎన్నో కృశించిపోయిన ఆమె జ్ఞాపకాలలో మెదిలాయి, కదిలాయి.


ఎయిడ్స్ రోగి

చల్లని గాలికి, ఆరిపోతున్న దీపంలా అతని ముందు ఆమె రెపరెపలాడింది. పుట్టిన రోజునే అతని చేతుల్లోనే తన ఆఖరి శ్వాస విడిచింది.

✤ ✤ ✤

మన జీవితాలను ఆశలు ఆవేశపెడతాయి.

ఆశయాలు ఆలోచింపజేస్తాయి.

ఆదర్శాలు దారి చూపుతాయి.

మన విశ్వాసాలు తరతరాల సంస్కృతీవాసనలతో ఆలరారుతుంటాయి.

మన జీవనం వర్తమాన పరిస్థితుల ప్రభావంతో పరుగులిడుతుంటుంది.

ఈ సంస్కృతుల వైవిధ్యంలో – జీవితాల సంగమంలో ఎవరి అనుభవాలు వారివి – ఎవరి గమ్యం వారిది!

ఒక మాలికి జేజేలు పలకండి – ఒక మాలికి జాలి కన్నీళ్ళు విడవండి!



హిమాలి



తేలుతున్న వంతెన

లేమి



మబ్బుల్లో మాయ



క్రుకాడ్ వీధి

రవి ఈస్ట్‌కోస్ట్ నుంచి ఫోన్‌కాల్ చేశాడు. "వచ్చి నెలయింది. వీలయితే నిన్ను చూడటానికి వస్తాను. నీకు ఎప్పుడు అవకాశం ఉంటుంది" అని. నేనయితే వెంటనే రమ్మన్నానను. అతను "వీకెండ్‌కు వస్తాను. ఫ్లైటు నంబరు తర్వాత చెప్తాను" అని కాల్ ముగించాడు.

ఎప్పటి రవి! ఎక్కడి రవి! ఇన్ని వేల మైళ్ళు వచ్చాడు. తనని చూడాలంటే ఇంకా మూడువేల మైళ్ళు రావాలి. వీకెండ్ ఇంకా మూడురోజులుంది. ఈ మూడురోజులు రొటీన్‌గా జరుగుతున్నా మనసులో అవే మెదులుతున్నాయి.

రోజూ ఉదయాన్నే ఏడుగంటలకే కారులో బార్ట్ (భూగర్భ రైలు) స్టేషన్‌కి వెళ్ళి, అక్కడ నిస్సాన్ కారును పార్క్ చేసి, బార్ట్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో 'బే' కింద నుంచి డౌన్ టౌన్‌కి వెళ్ళి, అక్కడ నుండి ఆఫీసు బిల్డింగ్ వరకు నడచి, 20 అంతస్తులు ఎలివేటర్‌లో వెళ్ళి క్యాబిన్‌లో అయిదు గంటలు కూర్చుని మళ్ళీ ఇంటికి అదే దారిలో చేరి, కారు పార్క్ చేసి, ఒంటరిగా ఇంటిలో అడుగు పెడుతూనే అలసి, నిద్రపోయి లేచేసరికి సాయంత్రం అవుతుంది. డిన్నర్‌కి ముందు శంకర్ ఇంటికి చేరతాడు. 'డార్లింగ్ ఈ రోజు విశేషాలు ఏమిటి' అంటూ స్నానం చేసి వస్తాడు. డిన్నర్ చేసి రెడ్‌వైన్ సిప్ చేస్తూ సి.డి. వింటూ ఎప్పుడో నిద్రపోతాడు. తను – తన ఆలోచనలు – ఎప్పుడు కునుకుపడుతుందో మళ్ళీ మెలకువ రాగానే పరుగులు – ఇదీ రొటీన్.

నిశ్చలంగా ఉన్న చెరువులో చిన్న రాయి వేసినట్లయింది, రవి కాల్! రవిని రిసీవ్ చేసుకోవటానికి తనే ఎయిర్‌పోర్టుకు వెళ్ళింది. కాంటినెంటల్ బాగేజి క్లెయిమ్ దగ్గర నిలబడి చూస్తున్నది. అడుగో – రవి! అదే నవ్వు! అతనిలో పెద్ద మార్పు లేదు. ఆకుపచ్చని ఎయిర్ బాగ్ భుజాన వేసుకుని సరాసరి నా దగ్గరకు వచ్చాడు.

"విమలా – చాలా నాజూకుగా ఉన్నావు" అని అతను అన్నప్పుడు అతని నిజాయితీని ఎలా శంకించను?

నేను బాగేజి కోసం చూస్తుంటే, ఏమీ లేదు – వెళ్దాం... ట్రావెల్ లైట్!" అని నవ్వాడు. ఎయిర్‌పోర్ట్ ఎక్సిట్ నుంచి 'బే' బ్రిడ్జి దాటి ఓక్‌లాండ్ వైపు వెళ్తున్నాం. ఇంకా చీకటి పడలేదు. ఎటు చూసినా కార్లు వరుసల్లో పరుగెడుతున్నాయి.

"కారు మీ జీవితంలో భాగమైపోయింది. ఇక్కడ కొందరికయితే కారే జీవితం అయిపోయింది. ట్రెయిలర్ ఇళ్ళు చాలా చూశాను" అని అన్నాడు. అవును. రోజూ కనీసం మూడు నాలుగు గంటలు కారులోనే గడపాలి. కారు లేకపోతే కాళ్ళు లేనట్లే – కదలిక లేనట్లే! ఇంటికి చేరేలోపు – తాను విజిట్ చేసిన నగరాలు, చూసిన విశేషాలు చెప్పాడు. మధ్యలో నా గురించి, శంకర్ గురించి, అడుగుతూనే ఉన్నాడు. ఇంతలో ఇల్లు చేరాం.

చిన్ని గట్టు మీద పెద్ద ఇంటిని చూసి "ఓ..... గ్రేట్" అన్నాడు.

నిస్సాన్ పార్క్ చేసి, ఇంట్లోకి అడుగుపెట్టాం.

అప్పటికే చీకటి పడింది. లైట్లన్నీ వేశాను. ఎక్కడో నిద్రపోతున్న సియామీస్ పిల్లి, తోక నిలువునా పెట్టి వచ్చి నా చుట్టూ తిరిగి, కొత్త మనిషిని పరీక్షగా చూసి వెళ్ళిపోయింది.

ఇల్లంతా చూపించాను. అతని గది తలుపుతీసి "స్నానం చేసి క్రిందకు వచ్చేయి. డిన్నర్ రెడీ చేస్తాను" అని నేనన్నప్పుడు "విమలా; యూ ఆర్ రియల్లీ రిచ్" అని నవ్వి, లోపలికి వెళ్ళాడు.

✣ ✣ ✣

అవును! రిచ్! ఈ దేశం వచ్చి ఎన్నేళ్ళయింది! పాతికేళ్ల కాపురం! ఇరవయ్యేళ్ళ ఉద్యోగం! తన భర్త అలాస్కాలో ఎన్నేళ్ళు పైప్ లైన్ ఇంజనీర్‌గా చేశాడు, అలాస్కా మంచులో! పగలుకు రాత్రికి తేడా తెలియని తెల్లని మంచు! రోమాల్లోంచి, చర్మంలో నుంచి, రక్తంలో నుంచి చొచ్చుకొనిపోయి ఎముకలు కొరికే మంచు – చలి. ఇది చలా? ఏమరుపాటున ఉంటే చావే! వాన్‌లో స్టీరింగ్ ముందు కూర్చొని, నిద్రపడితే ఉలిక్కిపడి లేచేవాడు. కళ్ళు తెరిచి చూస్తే అంతా మంచు! అంతా తెలుపు! ఏది దారి? అసలు దారే లేదు! అన్ని రంగులు కలిసిపోయి – అంతటా పరుచుకున్న మంచు! ఈ మంచులో అస్తమించని సూర్యుడు – చల్లని సూర్యుడు! ఇరవయినాలుగ్గంటలూ – మూడువందల అరవై రోజులు పనిచేసి, డాలర్లు సంపాదించాడు. ఓక్‌లాండ్‌లో ఎస్టేటు కొని, అప్పటినుంచీ గోల్ఫ్ ఆడుకుంటున్నాడు.

తను ఇరవయ్యేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తూనే ఉన్నది. డాలర్ల కంటే – కాలక్షేపానికి ముఖ్యంగా. ఇంత సంపద! ఇన్ని సుఖాలు!! అయినా, ఈ డాలర్లకు విలువేమిటి? తను సంతోషంగా ఉందా? తన జీవితంలో ఏదో వెలితి. ఎక్కడో గుండె లోతుల్లో దాగిన దిగులు...

డిన్నర్ సమయానికి శంకర్ వచ్చాడు. అప్పటికే రవి లివింగ్ రూంలో కూర్చున్నాడు. డైనింగ్ టేబుల్ సెట్ చేసి ఇద్దర్నీ పిలిచాను. "విమలా! మీ గడ్డపాయన్ని నేను పోల్చుకోనేలేదు! ఇంట్లో కాబట్టి సరిపోయింది. బైటయితే చూసినా పలకరించేవాణ్ణి కాదు" అని "తలమీద జుట్టు, గడ్డానికి అంటించాడు!" అనేసరికి నాకు నవ్వాగలేదు!

"అలాస్కా వెళ్ళినప్పుడు జుట్టు వత్తుగానే ఉంది. తిరిగి వచ్చేసరికి 'ఇంటర్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ వే'లా అయిపోయింది! అందుకే గడ్డం పెంచాను. కాంపెన్సేట్ చెయ్యటానికి" అని శంకర్ అన్నాడు నవ్వుల్లోనే.

డిన్నర్ తర్వాత, స్టెమ్‌గ్లాసులో రెడ్‌వైన్ ఇస్తుంటే – నువ్వు సాకీవా? అని ఎంతో అమాయకంగా అడిగాడు! ఆ తర్వాత ఎంతోసేపు అతని ప్రయాణ విషయాలు, ప్రదేశాల వివరాలు, చూసిన వింతలు చెప్పాడు. ఎంత తిరిగాడు! అదేమోగాని అతడు అవిశ్రాంతంగా ప్రయాణిస్తూనే ఉన్నాడు – ఇన్నేళ్ళనుంచి! దేనికోసం తిరుగుతున్నాడు? ఎవరికోసం ఇతని అన్వేషణ! ఇంత సంతోషంగా

ఎలా ఉండగలుగుతున్నాడు? జీవితంలో ఇతను వదిలివేసింది – తాను పట్టుకు వ్రేలాడేది ఏమిటి? ఆలోచనలతో ఎప్పుడో నిద్రపోయాను. మర్నాడు శనివారం; బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రవిని శాన్‌ఫ్రాన్సిస్కో డౌన్‌టౌన్ తీసుకువెళ్ళాను. ఎక్కువగా నడిచే తిరిగాం. రోడ్ మధ్యలో వెళ్ళే కేబుల్ కారులో ఎక్కాం. క్రుకెడ్ స్ట్రీట్ చూపించాను. 'గే' స్ట్రీట్ చూపిస్తే పగలబడి నవ్వాడు. "ఫర్వాలేదు. నువ్వు ఆడ, నేను మగ కదా. మనల్ని 'గేస్' అనుకోరు" అని! హైయట్ రీజన్సీ ఫాయిర్‌లోకి అడుగుపెట్టాం. ఎంత అద్భుతమైన హోటల్ ఇది. ఎంత మాగ్నిఫిసెంట్‌గా ఉంది ఈ ఫాయిర్! అని – "ఇదంతా మనుషులకోసమా?" అని ఆశ్చర్యపోయాడు! బెర్కిలీ వెళ్ళి కాలిఫోర్నియా యూనివర్శిటీ దగ్గర డాలర్ పార్కింగ్‌లో కారు పెట్టి అంతా తిరిగాం. వేలమంది విద్యార్థుల చైతన్యంతో కాంపస్ వెలిగిపోతోంది! "ఏదైనా క్లాస్‌కి వెళ్దామా" అన్నాడు. ఒక కొరియా అమ్మాయిని పట్టుకుని కామన్ క్లాస్‌కి వెళ్ళాము. దాదాపు వెయ్యిమంది ఉన్నారు. "ఏమిటి? ఇది క్లాసే?" అని వింతగా చూశాడు.

స్టూడెంట్స్ క్వార్టర్ దగ్గర్లో ఉన్న ఎథినిక్ రెస్టారెంట్ దగ్గరకు వెళ్ళాం. ఆ షర్టులు, టోపీలు, స్టికర్లు, స్టూడెంట్స్ కొనే అన్ని వస్తువులూ సైడ్‌వాక్ మీద పెట్టి అమ్ముతున్నారు. "రవీ, లంచ్ ఏం తింటావు?" అని అడిగితే "మెక్సికన్ రెస్టారెంట్లో తిందాం. కాస్త కారంగా ఉంటుంది" అన్నాడు.

ఒక రెస్టారెంట్లోకి వెళ్ళి 'నాచోలు ఆర్డరిచ్చాం. మ్యూజిక్ సిస్టంలో మెక్సికన్ పాట వస్తోంది. "విను, విను, ఆ ఫిమేల్ వాయిస్‌లో ఎంత విషాదం ఉందో! ఎంత టింబర్ ఉందో!" అన్నాడు. తర్వాత అక్కడి మ్యూజిక్ షాపులు చూశాం. కొన్ని మెక్సికన్ క్యాసెట్‌లు కొన్నాడు. నేను ఎప్పుడైనా ఈ సంగీతం విన్నానా? ఈ షాపులు తిరిగానా? అక్కడ నుంచి 'మాన్‌మేడ్' ఫారెస్టుకు వెళ్ళాం.

మహావృక్షాలతోపాటు, మ్యూజియంలు, మ్యూజిక్ గాలరీలు చెట్లమధ్య నిర్మించి ఉన్న మహావనం ఇది! దగ్గర్లోనే పసిఫిక్ సముద్రం! అలా రోడ్డు దాటి, ఇసుక దాటి, పసిఫిక్ జలాల్లో – అలాస్కా మంచు కరిగి, చల్లబడిన చల్లని నీళ్ళలో కాళ్ళుపెట్టి పులకించిపోయాడు! దూరంగా రాతిమీద సేదతీరుతున్న సీల్ జంటను నాకు చూపించి కేరింతలు కొట్టాడు! ఒడ్డున వాలిన సీగల్స్ గుంపులు, పరుగుపరుగున వెళ్ళి లేపాడు. అవి ఎగురుతుంటే చిన్న పిల్లవాడిలా గంతులు

వేశాడు! అట్నుంచి గోల్డెన్ గేట్ పార్క్‌కి వచ్చి ఆ బ్రిడ్జి కట్టిన ఇంజనీర్ విగ్రహాన్ని అంత పెద్ద బ్రిడ్జికి వేలాడదీస్తున్న స్టీల్ కేబుల్ క్రాస్ సెక్షన్, ప్రక్కన నిలబడి ఫోటోలు తీయించుకున్నాడు. నేను పాప్‌కార్న్ కొనేలోపు అతను మాయమయ్యాడు. ఎటు చూసినా కనపడలేదు. నేను కంగారు పడటం, అటూ ఇటూ పిలవటం అక్కడ ఎవరో చూసి ఏమిటి అని అడిగారు. ఏమని చెప్పను?

అంతలో 'విమలా... ఇక్కడ' అని వినపడింది. ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాను.

దూరంగా బ్రిడ్జి క్రింద ఒక చప్టా ఉంది. అక్కడ ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కొద్దిసేపట్లో అక్కడికి చేరాను.

యాభైఏళ్ళ నల్లాయన గేలంతో చేపలు పడుతున్నాడు. రవి ప్రక్కన కూర్చుని అతన్ని 'ఇంటర్వ్యూ' చేస్తున్నాడు. ప్రక్కన 'గేమ్ బాగ్'లో స్టోన్‌ఫిష్ ఉంది.

పైన గోల్డెన్ గేట్ బ్రిడ్జి మీద ప్రపంచం పరుగులు పెడుతోంది! క్రింద – తమకు ఈ ప్రపంచంతో పనిలేనట్లు వీళ్ళిద్దరూ నవ్వుకుంటూ, ఈ మహాసముద్రంలో చిన్నచిన్న చేపలు పట్టుకుంటున్నారు.

అలల తుంపర్లు ముఖంమీద పడుతుంటే, సూర్యుడు లేని వెలుతురు అతని ముఖాన్ని వెలిగిస్తుంటే అతని అంతరంగంలోని సంతోషం అతని నవ్వుల్లో పెల్లుబికి వస్తుంటే ఆనందంగా జీవించడం ఎంత తేలికో నాకు తెలియవచ్చింది ఆ క్షణంలో!

తిరిగి వచ్చే ముందు బర్కిలీ కొండమీదకు వెళ్ళాం. అక్కడ నుండి పసిఫిక్‌లో ఆ సూర్యాస్తమయం చూస్తూ ఎంత తన్మయం చెందాడు! ఇన్నేళ్ళ నుంచీ నేను ఒక్కసారీ చూడలేదే! ఆ తెల్లని మబ్బుల్లోంచి, పొడుచుకు వచ్చిన గోల్డెన్ గేట్ బ్రిడ్జి టవర్స్ అతను చూసేవరకూ నాకు కనపడలేదే! "అవి స్వర్గానికి నిచ్చెనలా" అని అడిగాడు. ఆ ప్రక్కనే ఉన్న ట్విన్ పీక్స్ మేఘాల మీద నిలబడ్డాయా అని అతను ఆశ్చర్యపోతే, నేను మొదటిసారిగా చూశాను. ఆ దగ్గర్లో ఆగిన తెల్లని హోండా స్పోర్ట్స్ కారు ప్రక్కన నిలబడి తనని ఫోటో తీయమని ఎంత సరదాగా అడిగాడు! తను వేసుకున్న పూలగౌను చూస్తూ "నువ్వీ గౌనులో ఎంత బాగున్నావు" అని అన్నప్పుడు తాను ఎంత సిగ్గుపడింది! సిగ్గుకు వయసుతో పనిలేదా?

విమలా "జీవితమే చదువు. ప్రకృతే గురువు" అతని మాటలు చెవుల్లో

వినపడుతూనే ఉన్నాయి ఆ రాత్రి. ఆ రోజు రాత్రి హిందూ టెంపుల్‌లో ఏదో ఫంక్షన్ ఉంటే ముగ్గురం వెళ్ళాం. ఎంతోమంది ఇండియన్స్ వచ్చారు. రవి ఏదో జోక్‌లు చెప్తున్నాడు. "రష్యన్సు వట్టి తెలివి తక్కువవాళ్ళు. అమెరికన్లను ఓడించటం సులభం" అన్నాడు. 'ఎలాగో చెప్పండీ' అన్నారు ఎవరో! అందరూ ఎంతో శ్రద్ధగా వింటున్నారు.

"ఏముంది చైనావాళ్ళకి ఒక్క రాత్రి కూలి ఇచ్చి – మీ రోడ్లమీద ఉన్న "ఎగ్జిట్స్" అన్నీ తీయించి వేస్తాను. ఆ తర్వాత, టాయిలెట్ పేపర్ తయారయ్యే ఫ్యాక్టరీస్ అన్నీ పెట్రోలు పోసి తగలపెడతాం! అంతే, ఇంట్లో నుంచి అమెరికాలో ఎవరూ బైటకు రాలేరు. వచ్చినా ఎటు పోతున్నారో తెలియక అయోమయంలో పడిపోతారు. అంతటితో ఫినిష్" అన్నాడు. అంతే – అందరూ పగలబడి నవ్వారు! హిందీ పాటలు, తెలుగు పాటలు పాడుతున్నారు. స్టేజిమీద, అంతా సందడిగా ఉంది. అక్కడే బఫే చేసి ఆలస్యంగా ఇల్లు చేరాం.

మూడోరోజు ఆదివారం :

ముందురోజు మా ఎస్టేటులో పనిచేసే కార్లోస్ భార్య బిడ్డను కని చనిపోయింది. ఎంత ముద్దుగా ఉంది పాప! తన తల్లి ఇక లేదని ఆ పాపకు ఎప్పటికి తెలుస్తుంది! ఎంత దురదృష్టం! కార్లోస్ దుఃఖంలో మునిగిపోయాడు. ఆదివారం ఫ్యూనరెల్ ఉంది.

రవి 'నేనూ వస్తా'నని మాతో బయలుదేరాడు. రెడ్‌వుడ్ సిటీ చర్చిలో ముందు ప్రార్థన జరుగుతుంది. అయినవాళ్ళు, స్నేహితులతో చర్చి నిండిపోయింది.

స్పానిష్ అందమంతా మారియాలో నిద్రపోతోంది. నల్లని జుత్తు మధ్యలో ఆమె అందమైన మోమును మృత్యువు సోకినట్లే లేదు. అందరూ విషాదంలో నిశ్శబ్దంగా ఉన్నారు. నాకు ఏడుపు ఆగలేదు. చర్చిలో గట్టిగా ఏడవకూడదు! నా మనస్సంతా మారియా పాపతో నిండిపోయింది. ఏమిటి; అందరికీ అన్నీ ఉండవా? కార్లోస్‌కి భార్య లేదు. పాపకు అమ్మ లేదు. తనకు లేనిదేమిటి? తన పేదరికానికి ఎవరిని నిందించాలి? తన భర్తనా? తన కన్నవాళ్ళనా? లేక ప్రకృతినా? ఏమని నిందించాలి? తన సంపద ముందు తన లేమి, మరింత భరించలేనిదిగా కనిపిస్తోంది! "విమలా! లేనిదానికంటే, లేదనే భావన మనల్ని మరింత బాధపెడుతుంది" అన్నాడు రవి!

ఆ రాత్రి డిన్నర్ తర్వాత, హార్త్ ముందు అందరం కూర్చున్నాం. పొగ రాని బొగ్గు మండుతోంది. మా నీడలు, గోడల మీద ఊగుతున్నాయి. నులివెచ్చని చలి గదిలో ఆవరించింది. సియామీస్ పిల్లి శంకర్ ఒడిలో కూర్చొని కునుకుపాట్లు పడుతోంది. 'రెడ్‌వైన్' సిప్ చేస్తూ పిల్లి తలని నిమురుతున్నాడు.

రవి – తను తెచ్చిన ఫ్లూట్ తీసి, శంకర్‌కి ఇచ్చాడు. నేను ఎప్పుడో చెప్పిన గుర్తు మా ఆయనకి ఫ్లూట్ అంటే చాలా ఇష్టమని. కాని ఆయన ఊదితే గొట్టంతో పొయ్యి ఊదినట్లే! ఎలా గుర్తు పెట్టుకున్నాడు! శంకర్ అడిగాడు అతన్ని ఏమయినా వాయించమని! 'నేనా' అని నావంక చూశాడు. ఆ తర్వాత అతని ఊపిరి పాట ఆ వేణువు గుండెల్లోంచి ఉబికి వచ్చి ఆ గది అంతా నిండిపోయింది. ఆ మసక వెలుతురులో మృదువైన – శబ్దం తన కళ్ళముందు సన్నని అగరొత్తుల పొగలాగా, సాంబ్రాణి ధూపంలాగా సాక్షాత్కరించింది. ఏదో తెలియని సువాసనలతో తనని ఆవహించింది. తన జ్ఞానేంద్రియాలన్ని, తన హృదయాన్ని తట్టి లేపి, ఏవో జ్ఞాపకాల లోకాల్లోకి తీసుకుపోయింది.

తను పెరిగిన ఊరు, తను ఆడిన ఆటలు, వచ్చీ రాని చదువులు, చిన్ననాటి స్నేహితులు, పండగలూ పట్టుపావడాలూ, పిండివంటలూ తన చుట్టూ తన వాళ్ళు అన్నీ అందరూ మానస నేత్రం ముందు కదలిపోతున్నాయి. తను ఎంత దూరం వచ్చింది.

మనిషి ప్రకృతిని వదిలి, ఎంత దూరం వచ్చాడో అంతకంటే ఎక్కువ దూరం!

మళ్ళీ వెనక్కి వెళ్ళలేనంత దూరం. మనసు మౌనంగా రోదిస్తోంది. ఇతనిది ఎప్పటి స్నేహం! ఆ స్నేహబంధంతోనే ఇంత దూరం రాగలిగాడా? తనకు ఇవన్నీ తెలియచెప్పటానికే వచ్చాడా?

సోమవారం : ఇంకా రెండు రోజులు ఉండమని ఇద్దరం అడిగాం. నవ్వి ఊరుకున్నాడు. అన్నిటికీ నవ్వుతాడే? అసలు ఎప్పుడైనా ఎందుకైనా కంట నీరు పెట్టాడా? ఏమో? కాని అతను అనుకున్న రోజుకే బయలుదేరాడు. కాంటినెంటల్ ఫ్లైటు ఉదయం ఏడుగంటలకే. ముప్పావుగంట డ్రైవ్ పడుతుంది. అయిదు గంటలకే బ్యాగ్ తగిలించుకున్నాడు. శంకర్ నిద్ర లేవలేదు. "ఎందుకులే డిస్టర్బ్ చెయ్యకు" అన్నాడు. కాఫీ త్రాగి, డోర్ లాక్ చేసి నిస్సాన్‌లో బయలుదేరాం. అంతా

పొగమంచు. సోడియం వేపర్ దీపాలు. ఎండిపోయిన బంతి పూలవలె వ్రేలాడుతున్నాయి. ఫాగ్ లాంప్స్ వేసి కారు పోనిస్తున్నాను. రవి అద్దాల్లోంచి బైటకు చూస్తున్నాడు. "మీ ఊరు చాలా అందంగా ఉంది. ఈ పసిఫిక్, ఈ కొండలు, ఈ లోయలు, ఈ వాతావరణం ఎంతో బాగుంది. నీవు సంతోషంగా ఉన్నావు. నాకానందంగా ఉంది" అని అంటున్నాడు. నాకు నవ్వు వచ్చింది. నేనానందంగా ఉన్నానా? అప్పుడే తొలి వెలుగు రేఖలు తూరుపున కనపడుతున్నాయి. అయినా మబ్బులు విడిపోలేదు. రాత్రి – వెలుగు మధ్య, చీకటి పగలు మధ్య, ఆనందానికి, దుఃఖానికి నడుమ రేఖలా, నీటిని, నేలని విడదీస్తున్న రోడ్‌మీద కారు దూసుకుపోతున్నది.

శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టు – కాంటినెంటల్ డిపార్చర్ టర్మినల్‌కి చేరుకున్నాం. "రవి, మళ్ళీ ఎప్పుడొస్తావు" అని అడిగాను. కాసేపు మౌనంగా ఉండి "మళ్ళీ అంటూ ఉంటే.. అప్పుడు!" అన్నాడు. కెర్బ్ ప్రక్కన కారు ఆపి, బ్లింకర్స్ వేసి దిగాము. బూట్‌లో ఏమీ లేదు తీయటానికి. స్కైబాగ్‌తో దిగాడు. కారు ముందు నుంచి అతనికి దగ్గరకు వెళ్ళాను. బాగ్ కిందపెట్టి అతను దగ్గరగా వచ్చి, నా కుడి చెక్కిలి మీద తన పెదాలు అద్దాడు. అతని స్నేహభావన నులివెచ్చని నీడలా నన్ను కప్పివేసింది. నేను గిఫ్ట్‌గా ఇచ్చిన 'ఒన్ మాన్ షో' పెర్ఫ్యూమ్ సువాసన వీస్తోంది. "గుడ్ బై విమ్మీ" అన్నాడు నా కళ్ళల్లోకి చూస్తూ – 'ఎప్పటి పిలుపు? పల్చని నీటిపొరల్లో నుంచి అతని ముఖం సరిగా కనపడటంలేదు. బాగ్ నుంచి ఏదో తీస్తున్నాడు. నేను అలా అచేతనంగా నిలబడి ఉన్నాను. ఒక చిన్న పాప బొమ్మ – మెత్తని గులాబిరంగు బొమ్మ నాకిచ్చాడు. 'థాంక్స్ రవి' అని కూడా అనలేకపోయాను.

నా లేమిని నా చేతుల్లో ఉంచి, నా దుఃఖాన్ని నా కళ్ళల్లో నింపి, అతను వెళ్ళిపోతున్నాడు. కనీసం చెయ్యి కూడా ఊపలేకపోయాను. స్లైడోర్స్‌లో నుంచి లోపలికి వెళ్ళి జనంలో కలిసిపోయాడు. మెల్లగా కారులో ఎక్కి ఎయిర్‌పోర్ట్ ఎక్సిట్ నుంచి బైటపడ్డాను. తూరుపున బాగా వెలుతురు వచ్చింది. కాంటినెంటల్ ఫ్లైట్ రవిని తీసుకుని ఆ తూర్పుకే వెళ్తోంది. ఎగిరే పక్షిలా – ఆ స్వేచ్ఛా జీవి, వెళ్ళిపోతున్నాడు...



అట్లాంటా

పంజరం



కోల్‌మన్ డ్రైవ్‌లో, సాగర్ ఇంటి వరండాలో, అతని కోసం ఎదురు చూస్తున్నా – ఎదురుగా ఉన్న గట్టుమీద నుంచి జారి, ఒక లెఫ్ట్ టర్న్‌తో మా డ్రైవ్ వేలో ఆగింది. హోండా ఎకార్డ్! మెటాలిక్ రెడ్ కలర్‌తో, సాయంత్రపుటెండలో తళతళ మెరుస్తోంది. సరికొత్త మోడల్! చెక్క మెట్లు దిగి, కారు కుడి ప్రక్క డోరు తీసి ముందు సీటులో ఎక్కాను.

ఫోనులో మాట్లాడుకున్నా – కలవటం మొదటిసారి.

"ఆర్ యు ఎంజాయింగ్ యువర్ హాలిడే?" అని పలకరింపుగా అడిగి, హోండా స్టార్ట్ చేశాడు.

కారు క్రొత్త వాసన వస్తోంది. లోపల ఎంతో కంఫర్ట్‌గా, హాయిగా ఉంది. ఆ మాట ఆయనతో "ఎకార్డ్ చాలా బాగుంది! ఎంతయింది రెడ్డిగారు..." అడిగాను.

"థర్టీ గ్రాండ్... ఫుల్లీ లోడెడ్..." అని కారుకి ఉన్న లక్షణాలు – విశేషాలు చెప్పారు. అంతలో ఫోను మోగింది కారులో! ఫోను మ్రోగినప్పుడు రేడియో ఆగిపోయింది ఆటోమేటిక్‌గా!

"మిస్టర్ రెడీ! యు ఆస్క్ అజ్ టు యాక్టివేట్ ది ఫోన్. ఈజ్ దట్ రైట్..." అని ఫోన్ కంపెనీ అమ్మాయి ఎంతో వినయంగా అడిగింది. "యా – ఐ డిడ్" అని థ్యాంక్యూతో ముగించాడు.

ఇక ఇరువయి నిమిషాలకు ఆయన ఇంటికి చేరాము. ఇంకా ఈ దారులు నాకు అంతగా అవగాహన కాలేదు. క్రిందికి దిగాను. ఆయన వెంటనే దిగలేదు. కారు ముందు నుంచి స్టీరింగ్ వైపు వెళ్ళాను. అప్పుడు తెలిసింది ఆయన ఒక రకమైన చక్రాల సీటులో ఉన్న సంగతి!

లివింగ్ రూమ్‌లోకి చేరాం. అక్కడ ఉన్న రిమోట్‌తో లైట్లన్నీ 'ఆన్' చేశాడు! టి.వి. కూడా! ఇంట్లో ఎవరూ ఉన్న అలికిడి లేదు. కార్డ్‌లెస్ ఫోన్ తీసుకుని ఎక్కడికో ఫోన్ చేసి చికెన్ వింగ్స్, పీజా ఆర్డర్ చేశాడు.

"కమాన్.... రిలాక్స్ ఇన్ దట్ సోఫా..." నాతో అని ఫ్రిజ్ నుంచి టిన్‌బీర్ తీశాడు. ఒకటి నాకిచ్చి, ఒకటి తను ఓపెన్ చేశాడు. "చీర్స్" ఇది నాన్ ఆల్కహాల్ బీర్! అంటూ!

అదొకటి ఉంటుందా!

అతను – "నాకు వెన్నెముక ఆపరేషన్ జరిగినప్పటి నుంచి ఆల్కహాల్ వద్దన్నారు డాక్టర్లు. కేవలం టేస్టు కోసం ఈ బీర్ తాగుతున్నా!" అని ఒక చీకటి నవ్వు నవ్వాడు! అప్పుడే ఆయన్ని పరిశీలనగా చూశాను! ముప్పై అయిదేళ్ళుంటాయి. చామనచాయ, జుట్టు కూడా వెనక్కు వెళ్తోంది. అతని కళ్ళ నిండా చీకటి, గొంతులో ఒక రకమైన చలి! అతని చుట్టూ ఉన్న వెలుగులో ఏదో విషాదం! అతనే చెప్పాడు.

సంవత్సరం క్రిందట టి.బి. అన్నారు, అదీ వెన్నెముకలో. ఆ తర్వాత అతని జీవితం డాక్టర్ల చేతుల్లోకి వెళ్ళిపోయింది. అతని కాలం హాస్పిటల్ గదిలో బందీగా మారింది.

ఎన్ని టెస్టులు! ఎన్ని ఆపరేషన్లు – ఎన్నిసార్లు మత్తులో ముంచారు! చివరికి నడుముకి ఒక ఇనుప చట్రం చేసి చక్రాల కుర్చీలో కొన్నాళ్ళు గడపమన్నారు. బ్రతికినందుకు సంతోషించమన్నారు డాక్టర్లు. స్నేహితులు సానుభూతి చూపించారు.

కంపెనీవాళ్ళు ఉద్యోగం నుంచి ఉద్వాసన పలికారు!

ఇన్సూరెన్స్ కంపెనీ, హాస్పిటల్ డాక్టర్లు కలిసి డబ్బు పంచుకున్నారు.

ఇప్పుడు అతనికి ఆదాయం లేదు! సోషల్ సెక్యూరిటీ పెన్షన్ తప్ప.

అంతలో తలుపు తీసిన చప్పుడు!

"షి ఈజ్ మై వైఫ్... ప్రమోద" అని పరిచయం చేశాడు. నమస్తే చెప్పి ఆమె లోపలికి వెళ్ళిపోయింది. "వరల్డ్ మార్కెట్‌లో కాషియర్‌గా చేస్తోంది. ఈ జాబ్ లేకపోతే ఇన్సూరెన్స్ లేదు" స్వగతంలా చెప్పాడు. హారిస్ మార్కెట్‌లో కామేష్ ఈమెను నాకు పరిచయం చేశాడు. ఇప్పుడు ఈ విషయం చెప్పాలా?

"షి ఈజ్ నాట్ క్వాలిఫైడ్ – ఇప్పుడు ఉద్యోగం తప్పనిసరి" అంతలో మెట్లు దిగి, లివింగ్ రూంలోకి వచ్చింది. కొద్దిసేపు మా దగ్గర కూర్చొని, బైటకు వెళ్ళిపోయింది. రెస్టారెంటు నుంచి ఆర్డర్ వచ్చింది. తీసుకుని డైనింగ్ టైబుల్‌పై పెట్టాను. అతనిలో అసహనం, చిరాకు మొదలైంది! ఇంకో బీర్ – ఒకటి ఆల్కహాలిక్ ఇంకోటి నాన్ ఆల్కహాల్ – ముగించాం. పదినిమిషాల్లో ప్రమోద వచ్చింది బాబుతో.

"హి ఈజ్ సన్నీ... మై సన్" అన్నాడు శ్యామ్‌రెడ్డి. "హాయ్ అంకుల్" అని తొర్రిపళ్ళు బైటపెట్టాడు. వచ్చి నా ఒళ్ళో కూర్చున్నాడు.

ఓ అరగంట తర్వాత "ప్రమో! గెస్ట్‌కి మన ఇల్లు చూపించవా?" అని కేకవేశాడు.

అప్పటికే రోజ్ శాటిన్ నైటీలోకి మారి, జుట్టు వదులుగా వదిలేసింది. వర్క్ డ్రెస్‌లో కనపడని అందం, ఇప్పుడు బైటపడుతోంది.

బాత్‌సోప్ డోవ్ పరిమళం, ఉడుకులాన్ మత్తు ఆమె ఒళ్ళంతా ఆవహించి ఉంది. ఒత్తు పొట్టి జుట్టు వదులుగా ఆమె చెవులను దాచి, చెంపలను ముద్దాడుతోంది. తేనె కళ్ళు, ఆరిపోయిన మస్కరాతో అలసటతో అరమోడ్పుగా, ఆహ్వానిస్తున్నట్లున్నాయి!

"రండి" అని దారితీసింది. సన్ని చేయి పట్టుకుని ఆమె వెంట నడిచాను. సన్ని గది నిండా రకరకాల బొమ్మలు!

వాడు అక్కడే ఆగిపోయాడు!

ఆ తర్వాత ఆమె గది. అది సర్ది కొన్ని రోజులయినట్లుంది. అక్కడ అంతగా వెలుతురు లేదు.

"మనం కలిసిన సంగతి చెప్పారా?"

"అవసరం రాలేదు."

"థాంక్స్"

ఒక్కసారి ఆ కళ్లల్లోకి చూశాను.

ఎక్కడో గుండె లోతుల్లోని దుఃఖం కళ్ళల్లో నీటిపొరలుగా మారుతోంది.

ఆ గదిలోని చీకటి వెలుగుల సంధిలో ఆమె పరువం అడివిగాచిన వెన్నెలగా, బూడిదలో పోసిన పన్నీరుగా తెలవారుతోంది.

ఈ విషయం గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. బీరు మత్తులో ఆ తర్వాత ఆమె చూపిన ఆ ఇంటి గదులు గుర్తులేవు కాని ఆమె మనసు మూలల మసిబారిన వెలుగులు, ఆమె కనురెప్పల మాటున చెలరేగే విషాదపు వరదలు నేనెలా మర్చిపోగలను! ఈ కథ ఇక్కడితో ఆగిపోతే బాగుండేది.

ఇప్పుడు ఇంతగా బాధపడేవాడిని కాను. సరిగ్గా అప్పుడే...

ఫ్రంట్ డోర్ లాక్ తీసుకొని కామేష్ వచ్చాడు లివింగ్ రూంలోకి. ప్రమోద, నేను మెట్లు దిగి లివింగ్ రూంలో జాయిన్ అయ్యాం.

కామేష్ నన్ను చూసి నవ్వాడు.

డిన్నర్ తర్వాత నేనూ, కామేష్ అతని కార్లో కోల్‌మన్ డ్రైవ్‌కి వెళ్ళిపోయాం! శ్యామ్‌కి గుడ్‌నైట్ చెప్పి.

✤ ✤ ✤

అట్లాంటాలో నేనున్న రెండు నెలల్లో శ్యామ్‌రెడ్డిని తర్వాత రెండు మూడు సార్లు కలిశాను.

ఎంతో స్నేహపాత్రుడు. చక్కని హోస్ట్. చదువుకున్నవాడు. బీర్‌తో కూర్చుంటే ఎన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్ళం.

అతనికి ప్రపంచం అంటే అవగాహన ఉంది. అమెరికా ఒక బంగారు పంజరం అంటాడు. కన్న తల్లిని మించిన ప్రేమ, మాతృభూమిని మించిన నేల లేదంటాడు. ఆ విషయం అమెరికా వచ్చిన తర్వాతే తెలిసిందంటాడు. అప్పటికే చాలా ఆలస్యం అయిందని వాపోతాడు.

తర్వాత నెలలో శ్యాంరెడ్డి నాన్నగారు పోయారని ఇండియా నుంచి వార్త వచ్చింది. అతన్ని ఓదార్చటానికి వెళ్ళాను. ఎంతో కృంగిపోయి ఉన్నాడు.

అతని కళ్ళు గతంలోకి, అతని మనసు జ్ఞాపకాలలోకి చూస్తున్నాయి. తండ్రి తాలూకు తలపులతో, తన ముప్పై ఏళ్ళ అనుబంధంలోని స్మృతులతో సతమతమవుతున్నాడు.

"చూడండి. నాన్నగారు పోతే వెళ్లలేకపోతున్నా. ఎట్లా ఇరుక్కునిపోయానో ఈ దేశంలో; పితౄణం కూడా తీర్చలేని నిస్సహాయుణ్ణి" అని ఎంతో ఆవేదన చెందాడు. ఒక సాయంత్రం కామేష్ నన్ను శ్యాం దగ్గర దింపి మళ్ళీ వస్తానని వెళ్ళాడు.

సాయంత్రం రాత్రయింది. రాత్రి బీరు డబ్బాలతో బరువెక్కుతోంది. మాటల్లో చెప్పాడు ఎకార్డ్ అమ్మేశానని. ఇప్పుడు చక్రాల కుర్చీకే పరిమితమైపోయాడు. సమయం గడిచినకొలదీ శ్యాంలో అసహనం ఎక్కువైపోతోంది. అతని చిరాకును నాకు ఇబ్బంది కలగకుండానే అణుచుకుంటున్నాడు.

పదిన్నరకు ప్రమోద వచ్చింది.

ఆమెను చూస్తూనే శ్యాం మండిపడ్డాడు!

ప్రమోద లెక్కచేయకుండా మెట్లెక్కి వెళ్ళిపోయింది. శ్యాం కోపం పెరిగి కేకలు వేశాడు.

"యు! బిచ్... వేర్ డిడ్ యు గో" అని అతని అసహనాన్ని అసమర్థతని, అవిటితనాన్ని కలగలిపి ఫ్లేర్ అప్ అయ్యాడు! ప్రమోద మెట్లమీదికి వచ్చి–

"యూ.... నేను బిచ్‌నే; నువ్వు అనుమానం పక్షివి, రేపటి నుంచి వర్క్‌కి వెళ్ళను.. డూ వాటెవర్ యు లైక్..." అని ఆమె అరిచింది. అక్కడ నేనున్న సంగతే మర్చిపోయి పోట్లాడుకుంటున్నారు. ఏడుస్తూ పై గదిలోకి వెళ్ళింది.

"సీ! అయామ్ హెల్ప్‌లెస్; అది జాబ్ మానేస్తే నా గతి ఏమిటి? మీరు చెప్పండి ప్లీజ్..." అతను ప్రాధేయపడుతున్నాడు.

అయినా నేను కదల్లేదు.

అతని కోపం కన్నీరుగా మారింది. ఒక రకమైన షాక్‌తో ఉన్నట్లు అలాగే చూస్తున్నా!

"ఐ థింక్ యు ఆర్ మై ఫ్రెండ్... నాకు హెల్ప్ చేయండి... ప్లీజ్..." అస్పష్టమైన ఆవేదన, అంటు రోగం లాంటి అనుమానం, అసహాయమైన అవిటితనం, భవిష్యత్తంటే తెలియని భయం!

అతని మనస్సు ఒక కత్తుల బోను!

అతని జీవితం ఒక పెనుతుఫాను!

ఏమి చెయ్యాలో తెలియకనే – లేచి పై గదిలోకి వెళ్ళాను.

ఆమె గది చిందరవందరంగానే ఉంది. ఆ కింగ్ సైజ్ బెడ్ మీద బోర్లా పడుకుని ఏడుస్తోంది. నాకు ఏమి చెప్పాలో, ఎలా మొదలుపెట్టాలో పాలుపోలేదు.

"ప్రమోద!... ప్లీజ్" అన్నాను.

అప్పుడే నా ఉనికిని గమనించింది. దగ్గరగా వెళ్ళాను. బీరులోని కొద్ది ఆల్కహాలు నా రక్తాన్ని పరుగులెత్తిస్తోంది.

ఆమె ప్రక్కనే కూర్చున్నాను. "ఏమిటిది... అన్నీ తెలిసి..." అంతే నా ఒడిలోపడి భోరుభోరున ఏడ్చింది. చల్లగాలి తగిలిన నీటి మబ్బులా!

ఆమె దుఃఖాన్ని ఆపలేకపోయాను సరికదా ఆమె చేరువలోని వెచ్చదనం, ఇంకా స్నానం చేయని ఆమె శరీరపు ఆరిపోయిన చిరుచెమట, ప్రొద్దున్నే స్ప్రే చేసిన ఛానెల్ పెర్ఫ్యూమ్ రెండూ కలిపిన ఒక రకమైన వింత వాసన నాపై ఎఫ్రొడిజియాక్‌లా పనిచెయ్యటం మొదలుపెట్టింది.

మృదువుగా, వెచ్చగా తగిలే ఆమె వక్షం, నన్ను మరీ రెచ్చగొట్టింది.

అలా ఎంతసేపు ఆమె ఏడ్చింది. ఆమెను నేను పొదివిపట్టుకున్నానా – ఆమె కరిగిపోయిందా, అనేది ఇక్కడ అంత ముఖ్యమైన విషయం కాదు. ఆమె వచ్చిన అరగంట పైగా కామేష్ వచ్చాడు. అప్పటికే శ్యాం తేరుకుని "చూడు, ప్రమోద జాబ్ మానేస్తానంటోంది. మన ఫ్రెండ్‌ని నచ్చచెప్పమన్నాను..." అంటున్నాడు.

నేను మెట్లు దిగి, సోఫాలోకి చేరాను. కామేష్ ఫ్రిజ్ నుంచి చెరొక బీర్ తెచ్చాడు. అతను అంతగా రియాక్ట్ అయినట్లు లేదు. ఏదో తిని బైటపడి, కార్మిలో, లూప్ 280 ఎక్కాం. ఈ లూప్ తీసుకుంటేగాని ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి త్వరగా వెళ్ళటానికి వీలుండదు. ఇంటికి డ్రైవ్ 20 నిమిషాలు పడుతుంది. కామేష్, రాత్రి పల్చని ట్రాఫిక్‌లో 60 మైళ్ళు పోతున్నాడు. బక్కెట్ సీటులో రిలాక్స్ అయి "వాటీజ్ దిస్..." అన్నాను. కామేష్ నిశ్శబ్దంగా నవ్వి, ఎక్సిలేటర్ నొక్కాడు.

ఎనిమిది లేన్ల ఫ్రీవే మీద కుడి ప్రక్కగా కారు దూసుకుపోతుంది. దూరంగా సి.ఎన్.ఎన్. బిల్డింగ్ లైట్లలో వెలిగిపోతోంది. కేబుల్ టి.వి. మొదలుపెట్టి కోట్లు గడించిన సి.ఎన్.ఎన్. హెడ్‌క్వార్టర్స్ ఇదే!

అట్లాంటా నగరం ఎంతో విశాలమైంది. దట్టంగా పైన్ చెట్లు పెరిగి ఉంటాయి. వాతావరణం సమశీతోష్ణంగా ఉంటుంది. సంవత్సరానికి ఒకటి రెండు రోజులు ఫ్రీజింగ్ దినాలు! డిసెంబరులో ఆ రెండు రోజులు సెలవు ప్రకటిస్తారు. దట్టంగా మంచుపడే న్యూయార్కు, షికాగో నగరాలలో ఎప్పుడూ సెలవు ఇవ్వరు. ఇక్కడెందుకు ఫ్రీజింగ్ హాలిడే అని అడిగితే ఈ పల్చటి మంచు తీసివేయటానికి కార్పొరేషన్ మిలియన్ డాలర్లు పైగా ఖర్చుపెట్టాలి. అందుకే సెలవు అన్నారు.

ప్రపంచానికి మంచినీళ్ళు దొరకకుండా చేస్తున్న కోకాకోలా కూడా ఇక్కడే పుట్టింది. ఈ ప్లాంట్ చూడటం ఒక అద్భుతమైన అనుభవం.

కార్మీ హీటర్ వెచ్చదనానికి ఇంటికి వచ్చేలోపు కునుకుపట్టింది.

రేపు ప్రొద్దున్నే నార్త్ పాయింట్ మాల్‌కి వెళ్దాం అని చెప్పి నిద్రపోయాను. అది శనివారం రాత్రి!

✤ ✤ ✤

ఆ ఆదివారం ఉదయం ఒక అరలీటర్ కాఫీతో నార్త్‌పాయింట్ మాల్‌కి బయలుదేరాం. తర్వాత రోజు ఇండియా వచ్చేస్తున్నాను. కారులోకి స్టీరియో కొనాలని ఆ రోజు ప్రోగ్రాం. మాల్‌లో ఎలక్ట్రానిక్స్ షాప్స్ తిరుగుతుండగా ప్రమోద కనిపించింది. నన్ను చూసి కొద్దిగా సిగ్గుపడింది.

రాత్రంతా నిద్రపోయినట్లు లేదు.

అలసినా అందంగానే ఉంది.

నలిగినా నాజూకుగానే ఉంది.

పలకరించి ముందుకు సాగాను.

కారు స్టీరియోలు చూస్తూ లోపలికి వెళ్ళాను. కాస్సేపటికి గాని కామేష్ నాతో రాలేదు అని గమనించాను.

ప్రమోదతో మాట్లాడుతూ ఉండిపోయాడు. అరగంట తర్వాత నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. సోనీ స్టీరియో, పయనీర్ స్పీకర్లు కొని, మాల్‌లోనే ఇంకో గంట తిరిగి అప్పటికి ఇంటికి చేరాం. అప్పుడు చెప్పాడు – రాత్రికి ప్రమోద ఇంటికి వస్తుంది సన్నీతో. మనం, శ్యాం, తాజ్‌కి వెళ్దాం అని. తాజ్ అంటే అడల్ట్ ఎంటర్‌టైన్‌మెంట్.

నాతో శ్యాం రెండు మూడుసార్లు అన్నాడు తాజ్‌కి వెళ్దాం అని. ఆరు గంటలకు – ముగ్గురూ వచ్చారు. శ్యాం, ప్రమోద, సన్నీ.

ఒక అరగంట కబుర్లు చెప్పుకుని నేను, శ్యాం, కామేష్, సాగర్, తాజ్‌కి వెళ్ళాం, సాగర్ వ్యాన్‌లో. శ్యాంకి జాగ్రత్తగా చైర్ అరేంజ్ చేసి రౌండ్ టేబుల్ దగ్గర సెటిల్ అయ్యాం. అక్కడ డిన్నర్ ఫ్రీ, బీర్ కొనుక్కోవాలి.

పెద్ద పందిని కాల్చి, ఇంకా పెద్ద పళ్ళెంలో పెట్టారు. పరీక్షగా చూశాను.

తల అలాగే ఉంది. కళ్ళతో చూస్తోంది. చెవులు నిక్కి ఉన్నాయి. ముక్కు రంధ్రాలు ఉబ్బి ఉన్నాయి. పొట్టమీద బోర్లా ఉంది. పైన వైన్ పోసి ఫైర్ చేసినట్లున్నారు.

కావలసినవాళ్ళు ప్లేటుతో వచ్చి అక్కడ ఉన్న పదునైన కత్తితో ఒక ప్రక్క నుంచి ముక్కలు కోసుకుని తీసుకుపోతున్నారు.

ఇది మన వల్ల కాదులే అనుకున్నాను. టేబుల్ దగ్గరకు అమ్మాయిలు వచ్చి అర్థనగ్నంగా ఆడతారు. పది డాలర్లు ఇస్తే చాలు... ముద్దులు కూడా పెడతారు. మీ బీరు కూడా ఇంత త్రాగి ఎంగిలి చేస్తారు.

శ్యాంరెడ్డి ఎంతో ఉత్సాహంతో "ఫ్రండ్! ఎవరు కావాలి చెప్పు డాన్స్ చేయిస్తా..." అని నన్ను ఎంకరేజ్ చేశాడు. నేను చూపిన అమ్మాయితో టేబుల్ దగ్గర డాన్స్ చేయించాడు. "మై ఫ్రెండ్ ఫ్రం ఇండియా... టేక్ కేర్..." అని చెప్పేవాడు అమ్మాయితో!

అతని ఉత్సాహం మాటున ఉన్న నిరాశ, అతని కళ్ళల్లోని వెలుగు వెనుక చీకటి, అతని గొంతు గాంభీర్యం చాటున వణుకు, అతని దుబారా ఖర్చు ముసుగులో దివాళాకోరుతనం – నేను గమనిస్తూనే ఉన్నాను.

రెండు గంటలపైగా అక్కడ అన్ని రకాల మనుషుల మాయాజాలంతో పాటు మనసుల మర్మాలను చూసి ఉత్సాహంతో అలసి, మత్తులో సొమ్మసిల్లి ఎలాగో ఇంటికి చేరాం.

దారిలో శ్యాం మాట్లాడుతూనే ఉన్నాడు. నాకు అతనిలో ఏదో మార్పు వచ్చినట్లు అనిపించింది. ఎక్కువగా నవ్వుతూ తుళ్ళుతూ ఉన్నాడు.

కోల్‌మన్ డ్రైవ్‌కి వచ్చాం. అక్కడి నుంచి రెండు కార్లలో కామేష్, శ్యాంరెడ్డి, ప్రమోద, సన్నీ బయలుదేరి శ్యాం ఇంటికి వెళ్ళారు. నేను వాళ్ళు బయలుదేరక ముందే నిద్రలోకి జారుకున్నాను.

✤ ✤ ✤

మర్నాడు ఆలస్యంగా లేచేసరికి ఆ వార్త నాకు చేరింది.

రాత్రి శ్యాంరెడ్డి చనిపోయాడని!

నేను నమ్మలేదుకాని కామేశం సోదరి శీతల్‌ని అడిగాను, తీసుకెళ్ళమని. సాగర్, కామేష్‌లు అప్పటికే వర్క్‌కి వెళ్ళిపోయారు.

శ్యాంరెడ్డి ఇంటి దగ్గర అంత హడావుడి లేదు. లోపలికి వెళ్ళాం. అతను మామూలుగా కూర్చునే చక్రాల కుర్చీలోనే... ముందు బల్లమీద తల ఉంది. అతను రోజూ వాడే అల్ట్రాసోనిక్, ఇన్‌ఫ్రారెడ్ రిమోట్‌లన్నీ ఆ బల్లమీదే ఉన్నాయి. అతని ఎడమ కణతలో నుంచి చిన్న గుండు అతని మెదడులో చేరింది. పెద్దగా రక్తం కారినట్లు లేదు. చిన్న ఫ్రెంచి పిస్తోలు అతని ప్రక్కనే పడి ఉంది.

ఒక్కసారి నా కళ్ళముందు రాత్రి పళ్ళెంలోని పంది కదిలింది.

ఇతని శారీరకమైన రోగాలు, రొష్టులూ ఈ శరీరంతోనే అంతరిస్తున్నాయి. మరి దైహికం కాని బాధలు, బంధాలు కూడా ఈ దేహంతోనే అంతరించిపోతాయా? లేక 'అతని'తోపాటు మరే లోకాలకైనా మోసుకుపోతున్నాడా?

మధ్యలో తెగిన ఇతని జీవితం – నాకు ఒక ప్రశ్నగానే మిగిలిపోతోంది.

ప్రమోద, సన్నీ – ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. ఎవరూ ఏడవవలసిన అవసరం ఉన్నట్లు లేదు. ప్రమోదను చూడలేకపోయాను.

శీతల్, కామేష్‌కి ఫోన్ చేసి రమ్మంటోంది. తర్వాత 911 కి కాల్ చేసింది.

నేను త్వరగా బయలుదేరాలి. న్యూయార్క్ చేరి ఆ రాత్రి ఎయిర్ ఇండియాలో ఇండియా రావాలి.

శ్యాంరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడా? కామేష్ కాల్చి చంపాడా? ప్రమోదకు ఎంతవరకు దీనిలో భాగముంది? ఈ కుట్ర నార్త్‌మాల్‌లో, నిన్న ఉదయమే జరిగిందా?

ప్రమోదకు కామేశానికి సంబంధం ఉందా? ఉంటే ఎన్నాళ్ళ నుంచీ? అది ఎప్పటి నుంచి శ్యాంరెడ్డికి తెలుసు?

ఇవన్నీ ఆలోచిస్తూ అట్లాంటాలో ఆగిపోతే నేను ఎయిర్ ఇండియా ఫ్లైట్ మిస్సవుతాను. ఇండియా రావాలి కదా!

అందుకే, టాక్సీలో అట్లాంటా హార్ట్స్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాను బ్యాగేజీతో...



గోడ



ఎప్పటి నుంచో ఈ గోడ ఇక్కడే ఉంది!

రోజూ ఈ గోడను చూస్తూనే ఉన్నాడు!

కాని ఈ రోజు, అవతల కదులుతున్న హరిణిని చూసినప్పుడే, ఈ గోడను గమనించాడు!

సాదా సీదాగా, ఆ ఇంటికి, ఈ ఇంటికి మొక్కుబడి హద్దుగా కట్టింది. ఇన్నాళ్ళు దాని సంగతే పట్టించుకోలేదు. ఏనాడు అది తనకు అడ్డుగా అనిపించనూ లేదు!

సుజని ప్రతి పండగకూ పాయసం ఈ గోడమీద నుంచే అందించేది! సంక్రాంతి రోజుల్లో పంచదార అరిసెలు ఈ గోడ దాటే వచ్చేవి! తను లోపల ఉంటే 'అన్నయ్యా' అని గట్టిగా పిలిచి, తనకే అందించేది! అప్పుడెప్పుడూ ఈ గోడ ఉన్నట్టు తను అనుకోలేదు.

మరి హరిణి వచ్చి ఈ గోడను అడ్డుగా నిలబెట్టిందా? "హరిణి, మా వసంత కూతురు. ఇక్కడే సిద్ధార్థలో అదేదో క్రొత్త కోర్సు బి.సి.ఎ.లో చేరింది. హాస్టలు వద్దు – ఇక్కడే ఉండమన్నాను" అంటూ సుజని హరిణిని తన ముందు నిలబెట్టింది.

"హాయ్, అంకుల్..." అంటూ మెరిసే కళ్ళతో నవ్వింది!

"అంకులూ – పెంకులూ ఏమిటే, మామయ్యా అను" అంటూ సుజని సలహా ఇస్తుంటే తనకు నవ్వాగలేదు!

హరిణికి, వోణీల నుంచి పంజాబీలకు, గాగ్రాలకు – ఆదివారాల్లో 'జీన్స్'కూ మారటానికి ఒక విద్యాసంవత్సరం కూడా పట్టలేదు!

పులిపాక నుంచి వచ్చినప్పుడున్న 'జడ' కూడా తరువాత ఎన్నో రూపాంతరాలు చెందింది. చెవుల మీదికి రింగులుగా, నుదుటి మీద ముంగురులుగా, 'ఫ్రెంచి ప్లెయిట్స్'గా, ఇంకా ఎన్నో స్టైల్స్‌లో...! ఇవన్నీ రూపాంతరాలే. వీటికితోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు ఈ తొమ్మిది నెలల్లోనే శారీరకంగా, మానసికంగా 'అమ్మాయి' నుంచి 'ఆడది'గా పరిణతి చెందింది! అందుకు చాలావరకు క్వాలిటీ ఐస్‌క్రీం, కాలేజీ వాతావరణం, టి.వి. ఛానల్సు దోహదం చేసి ఉంటాయా?

'ఈ పుస్తకాలన్నీ చదివారా?' కొంత ఆశ్చర్యం, కొంత అనుమానంతో తనను అడిగినప్పుడు ఏం సమాధానం చెప్పాలి? ఈ కాసెట్లన్నీ వింటారా? ఈ సి.డి.లన్నీ చూస్తారా? ఎందుకింత ఉత్సుకత? ఎంత ఉత్సాహం!

ఈ తొమ్మిది నెలల్లో హరిణి సంగీత జ్ఞానం వింత పోకడలే పోయింది. "మొదట గిచ్చుళ్ళు నిన్నే గిచ్చా..." మొదలు; మెరియా కేరీ సోలోలు 'బాక్‌స్ట్రీట్ బాయిజ్' సాఫ్ట్ రాక్; "క్విట్ ప్లేయింగ్ గేమ్స్ విత్ మై హార్ట్" వరకు వచ్చింది.

ఒకరోజు తనతోపాటు యూనివర్శిటీకి వస్తానని కార్లో బయల్దేరింది. "క్లోజ్ యువర్ ఐస్.. మేక్ ఎ విష్...'! పాటని స్టీరియోలో వింటుంటే "ఓ అంకుల్ – మీకు బాగా నచ్చిందా..."

"ఐ లవ్ దిస్ సాంగ్". తర్వాత కూడా ఈ పాటను హమ్ చేస్తూ "వాట్ ఈజ్ యువర్ విష్?" అంటూ హరిణి తనను వెన్నాడుతూనే ఉంది.

తన నాలుగు పదుల జీవితంలో తొమ్మిది పది నెలలు, చాలా తక్కువ కాలమే అయినా, హరిణి మనసు, తనువు, పరిణామక్రమం, తనకు దగ్గరైన వైనం ఆ కాలానికే ఎంతో ప్రాముఖ్యత సంతరించి పెట్టింది.

తన ఒంటరి బ్రతుకు, ఎడతెగని ఏకాంతపుటుదయాలూ, ఎంతకూ కదలని సాయంకాలాలూ, ఇవన్నీ తనను హరిణికి మరింత చేరువ చేశాయి.

"మీకంటే ఆంటీయే బాగుంటుంది!" ఫోటో ముందు నిలబడి కామెంటు చేసేది!

"అవును, ఆంటీ చీరలన్నీ ఏం చేశారు?" అన్నపుడు, తన కంటి చివరల్లో తడి చూసి, 'సారీ బాయ్' అంది.

ఓ రోజు – సెలవు రోజు కష్టపడి చీర కట్టింది.

తలంటుకుని, వదులుగా కుడి భుజం మీదుగా ముందుకు వదిలేసింది. షాంపూ యాడ్‌లా!

తన దగ్గరగా వచ్చి "ఎలా ఉన్నాను, ఈ చీరలో?" అంటూ వెనక్కు తిరిగింది మోడల్లా!

ఆమె మెడకు క్రిందుగా, కుడి భుజానికి పైగా ఒక పుట్టుమచ్చ! తన ఎడం చెయ్యి ఆమె మెడ చుట్టూ వేసి దగ్గరగా లాగి, ఒకరకమైన మైకంలో అక్కడే ముద్దుపెట్టాడు!

''థ్యాంక్యూ ఫర్ యువర్ కాంప్లిమెంట్'' అని పరిగెత్తింది, చీర సవరించుకుంటూ."

ఎన్నిసార్లు అనుకున్నాడు!

తను కోరింది ఏమిటి? తన మనసుకు ఇష్టమైన రీతిలో బ్రతకాలనే కదా?

మరి?

అదే ఇంత కష్టమైపోతుందేమిటి? అని...

ఎన్నోసార్లు; అతనికి సమాధానమే దొరకలేదు!

మనసుకు సరిహద్దులేవి?

మనిషికి ఈ హద్దులేమిటి?

ఎంతకాలం, అతని మనసు, ఓ ప్రియమైన పలకరింపుకోసం, అతని తనువు, ఓ గోరువెచ్చని స్పర్శ కోసం తపించిపోతున్నాయి?

✤ ✤ ✤

సంక్రాంతి సెలవలకే, పులిపాక వెళ్దాం అని మరీమరీ అడిగింది.

సుజని కూడా "రండి అన్నయ్యా – ఇక్కడ ఒక్కరే ఉంటారు కదా..." అంటూ ప్రయాణం కట్టింది. వదిన్ని తలుచుకుని కంటతడి పెట్టింది..

ఫియట్‌కారులోనే ముందు సీటులో కూర్చుని, తనతోపాటు స్టీరింగ్ పట్టుకొని కోడ్రైవింగ్ చేసింది హరిణి.

నులివెచ్చని ఊపిరులు.....

సుతిమెత్తని రాపిడులు – (తట్టుకోవటం అతనికి కష్టమైన పనే!)

ఎనమలకుదురు లాకులు దాటి, సన్నని గతుకుల రోడ్డులో కాలవ గట్టు మీదుగా కారు పోతుంది.

కరువు కాలవ అంచులకు తన్ని ఉంది. ఎదురుగా బండి వస్తే తప్పుకోవటమే కష్టం.

ఒక ప్రక్క కాలవ నిండుగా ప్రవహిస్తోంది. రెండో ప్రక్క పొలాలు ఎంతో దిగువన ఉన్నాయి. ఈ కాలవగట్టు రోడ్‌మీద డ్రైవింగ్ గారడీ వాడి తాటి మీద నడిచినట్లుంది.....

"అంకుల్ – కారు కాలువలో పడిపోతే?" అంటూ ఓ పిచ్చి ప్రశ్న వేసింది. వెనుక సుజని, "ఏంటా పిచ్చి వాగుడు – అని కేకవేసింది. అవును పడిపోతే? – ఎలా ఉంటుంది – తన మనసు ప్రమాదంలో థ్రిల్ ఎలా ఉంటుందో ఊహిస్తోంది.

ఊరు దగ్గరవుతున్నకొద్దీ ఎదురుగా వచ్చే ఎడ్లబండ్లతో ప్రయాణం సాగడంలేదు. గణగణ గంటలమోతలతో, రంగురంగుల తాళ్ళతో తెల్లటి ఎడ్లు, ప్రమాదం అంటే తమకు తెలియనట్లు పరుగులు పెడుతున్నాయి. మేకలు గుంపులుగా అడ్డువచ్చాయి.

కారు ఆపగానే గుంపు చీలి రెండు ప్రక్కలా వెళ్ళిపోయాయి. ఒక్కసారిగా గొంగళ్ళ వాసన.

రోడ్ మీద నుంచి, మట్టిగట్టు ఏటవాలుగా ఊళ్ళోకి దారి తీసింది.

సుజని ఇంటి ముందు కారు ఆపాడు –

హరిణి కారు దిగి, తన ఉనికినే మర్చిపోయి 'అమ్మా' అంటూ ప్రక్కింట్లోకి పరుగుపెట్టింది.

సుజని సామాను దింపే ప్రయత్నంలోనే, తనను 'దిగన్నయ్యా' అంది.

"రండి బావగారూ"... అంటూ లక్ష్మయ్య నవ్వుతూ వచ్చాడు. లక్ష్మయ్య – జీవితమే వ్యవసాయం... వరి – చెఱుకు – గొడ్లు – పాలు –

నెలకో, రెండు నెలలకోసారి విజయవాడ వచ్చి రెండు రోజులు నిద్రపోతాడు. లెక్కలు – డొక్కలు సుజనికి చెప్పి ఓ సినిమా చూసి మళ్ళీ పులిపాక వచ్చేస్తాడు!

పెద్ద దొడ్డి – ఓ ప్రక్క ఎడ్లు – ఓ ప్రక్క గేదెలు – కోళ్ళు – ఒక గిన్నె కోడి కూడా! పెంకుటిల్లు – ఒక్క గదే – అందులో భోషాణం! పచ్చగడ్డి వాసన – వెచ్చని ఆవిరి! మట్టి – పేడ! గోబర్ గాస్ ప్లాంటు! మట్టికి ఎంత దగ్గరగా ఉంది జీవితం!

పెరట్లో కొబ్బరి చెట్లు – వేపచెట్లు – ఉసిరి, బొప్పాయి చెట్లు, పెద్ద గడ్డివామి. మధ్యాహ్నం – భోజనాల సందడి – హరిణి అల్లరి.... తర్వాత విశ్రాంతి.

నిజానికి తనకు, వాళ్ళకూ ఏ బంధుత్వం లేదు!

ఇరుగు పొరుగు బంధం, మనిషికీ – మంచికీ ఉండే సంబంధం తప్ప!

తమ హృదయాలకు – గృహాలకు ఏ హద్దులూ పెట్టుకోనవసరం రాలేదు!

తన పిల్లలూ – వాళ్ళ పిల్లలూ ఎవరి దారిన వాళ్ళు రెక్కలు వచ్చి వెళ్ళిపోయారు.

ఇన్నేళ్ళుగా తనని వాళ్ళెప్పుడూ పరాయివాడిగా చూడలేదు. ఆలోచిస్తూ నిద్రపోయాడు.

లేచేసరికి సాయంత్రం అయిపోయింది.

✤ ✤ ✤

తన కాలం ఒక్కసారిగా ఆగిపోయినట్లు పరుగులకు దూరంగా, బరువుల నుంచి వేరే తీరంలో, బాధ్యతల ఒత్తిడి నుంచి స్వేచ్ఛగా.. అనిపించింది.

ఇక్కడ గాలి తేలికగా ఉంది. వాతావరణం ఉల్లాసంగా ఉంది.

"అంకుల్ – కాలవ దాటదాం. అవతల కృష్ణ ఉంది..." అంటూ లాక్కుపోయింది. తన సమాధానంతో పనిలేదు!... కాలవగట్టు – నల్లటిరేగడి – నడిస్తే జారిపోతుంది.

బొటనవేళ్ళు గుచ్చి అడుగులో అడుగు వేస్తూ బల్లకట్టు ఎక్కారు. క్రింద నీళ్ళు వేగంగా పరిగెడుతున్నాయి.

తమతోపాటు రెండు మేకలు, పచ్చగడ్డి మోపులు కాలవ దాటాయి.

గట్టు ఎక్కి చెరకు పొలాల్లోకి దిగారు.

హరిణి చెంగుచెంగున పరుగెడుతోంది. కృష్ణ ఒడ్డుకు చేరారు.

ఒక్కసారిగా అంతా ఖాళీగా కనిపించింది. ఎక్కడ కృష్ణ?

క్రిందకు ఏడెనిమిది అడుగుల లోతున ఇసక పొరలున్నాయి....

ఎక్కడో మధ్యలో నడక దారిలా నీరు ప్రవహిస్తోంది.....

మెల్లగా ఏటవాలు దారిలో క్రిందకు దిగారు.

ఇసకలో నడిచి నీటి దగ్గరకు వచ్చారు. నదీగర్భంలో నిలబడి, తాము ఎంతో క్రిందుగా చుట్టూ ప్రపంచం ఎంతో ఎత్తులో ఉన్న అనుమానం వచ్చింది – వింత అనుభూతి కలిగింది!

దూరదూరంగా పొగల పొరల్లో నుంచి వారధి – రైలు వంతెనలు కనపడుతున్నాయి.

పక్షులు ఇళ్ళకు పోతున్నాయి. కబోధి పక్షులు నదికి వస్తున్నాయి.

బరాజ్ వెనుకనే ఎర్రటి సూరీడు పెద్ద కాషాయం బొట్టులా! ఏమి రంగు!

ఎవరా చిత్రకారుడు–

అతనికి ఒక వింత ఆలోచన వచ్చింది!

"హరిణీ – ఒక్కసారిగా ఇప్పుడు కృష్ణ వరదలా వస్తే – ఏం చేస్తావు?" అన్నాడు.

అర క్షణం – ఆ కళ్ళల్లో అనుకోని బెదురు! అంతలోనే – "నాకేం భయం! నిన్ను వాటేసుకుంటా..." అంటూ తనని గట్టిగా పట్టుకుంది. వరద వచ్చినట్టే! ఆమె తల అతని గడ్డం క్రిందనే ఉంది.

జుట్టు సాంబ్రాణి ధూపం వాసన వేస్తోంది.

ఆమె భుజాలు చుట్టూ చేయివేసి, గుండెలకు హత్తుకుని 'ఐ లవ్ యు బేబి' అని గొణిగాడు. అవును, ఇప్పుడు నిజంగా ఈ లోయ అంతా నీటితో నిండిపోతే... ఏదో తెలియని థ్రిల్ – ఆ ఆలోచనే! ఆమె కనురెప్పలు ఎత్తి అతన్ని చూసింది.

తిరిగి వచ్చేటప్పుడు – అడిగాడు "హరిణీ – నీకు ఎప్పుడైనా కలలు వస్తాయా?"

"ఓ... ఎన్నో... కాని ఒక్కటి బాగా జ్ఞాపకం. నేను ఏదో ఎడారిలో ఒంటరిగా నడుస్తున్నట్లు. ఎక్కడా ఎవ్వరూ లేనట్లు. అయినా ఎందుకో నాకు భయం కలగలేదు. ఇంతలో వెనుక నుంచి తెల్లని రోబ్‌లో అతను, బ్లాక్ స్టాలియన్ మీద వచ్చి, బలమైన చేత్తో నా నడుం పట్టుకుని, ఎత్తి అతని ముందు కూర్చోపెట్టుకుని తీసుకుపోయినట్లు! తల తిప్పి అతన్ని చూసేలోపు గాలికి కళ్ళల్లో ఇసుక పడి నలుపుకుంటే మెలకువ వచ్చేస్తుంది...." స్వగతంలా చెప్పింది...

'అతను నాలాగా ఉంటాడా?' అడిగాను.

నవ్వి "నీకు గుర్రపు స్వారీ వచ్చా? ఈ సారి పరీక్షగా చూస్తాను" అంది కొంటెగా....

చీకట్లు ముసురుతుండగా ఇంటికి చేరారు! ఆలస్యంగా వచ్చిన వెన్నెల–

కొబ్బరి ఆకుల సందుల్లోంచి జారిపడుతోంది.

మల్లె పందిరిలో పూలపైన చింది పడుతోంది.

బావి దగ్గర నీటి తొట్లోకి తొంగిచూస్తోంది.

హరిణి వక్షం మీద తెల్లటి వోణీకి తగిలి ఎగిసిపడుతోంది... అక్కడ ఉన్న రెండు రోజులు ఏదో కలగా – కలలో కథలా గడిచిపోయింది.

అక్కడ హరిణి పల్లెటూరి పిల్లలాగానే ఉంది.

కొంచెం సిగ్గు – కొంచెం పొగరు. రెండు జడలు వేసింది.

ఎంతో అభిమానం చూపింది. అతని అవసరాలన్నీ దగ్గరుండి చూసింది! పరిమళాలు వెదజల్లే సంపెంగ పూవు ఇచ్చింది!

అతనికి అర్థం కాని అలజడి – అంతరాంతరాల్లో చెలరేగి సుడులు తిరిగింది!

ఏమిటి, ఈ మనసుకు వయసు మీరదే?

తనువుతో పాటు ఎందుకు మారదు! అనుకున్నాడు –

ఈ పసిడి మొగ్గను – ఈ పసరు సిగ్గును తనేం చేసుకోవాలి?

✤ ✤ ✤

మళ్ళీ తన ఇంటికి – ఒంటరి గూటికి తిరిగి వచ్చాడు. తనకు, హరిణి మధ్య మళ్ళీ గోడ నిలబడింది!

ఈ గోడ – సుజని పాయసం ఇచ్చినప్పుడు మూడడుగులే ఉంది.

అరిసెలు అందుకున్నప్పుడు నాలుగడుగులకు మించి లేదు – హరిణి వచ్చిన తర్వాత అయిదు అడుగులకు పెరిగింది! ఇప్పుడు నదీ గర్భంలో నుంచి తిరిగి వచ్చిన తర్వాత – చైనా గోడలా కనపడుతోంది!

తన ఆవేదన ఘనీభవించినట్లు –

ఒక్కసారిగా – తన ఆశలకు అడ్డుగోడలా ఎదిగిపోయింది! అంతరంగాల్లోని అలజడి సుడులై, సుడిగుండాలై, అతన్ని నిలబడనీయటం లేదు!

త్వరగానే పడుకున్నాడు – ఎంతకూ నిద్రరాక, కలత నిద్రో – కలల నిద్రో తెలియని స్థితిలోనికి జారుకున్నాడు...

✤ ✤ ✤

ఆ రాత్రి చివరి ఘడియల్లో అతను నిద్రలేచాడు!

జెర్సీ ట్రాక్ సూటు వేసుకుని రిబాక్ జాగింగ్ బూట్ల తాళ్ళు బిగించాడు.

తలపై బేస్‌బాల్ కాప్ పెట్టాడు!

హాలు తలుపు తీసి వరండాలోకి వచ్చాడు!

వీధి దీపాలు, మంచు తెరలు క్రమ్మి, చీకట్లను విడదీయలేక వెలవెలబోతున్నాయి!

పోర్టికోలో కారు, గుర్రంలా నిలబడి నిద్రపోతోంది. ఆ వెనకనే నల్ల గేటు చిక్కుముడి వేసుకుని కాపలా కాస్తోంది.

ముందుకు వచ్చి కుడి ప్రక్కగా చూశాడు!

అక్కడే ఉంది – మంచులో తడుస్తూ –

తలపగిలి రక్తం కారుతున్నట్లు – నీళ్ళోడుతూ – పెద్ద అనకొండలా, పొడవుగా నిలబడి ఉంది – గోడ! ఆ అయిదడుగుల గోడ, అక్కడే తన కోరికలకు అడ్డుగా, మనసు తపనలకు హద్దుగా తనను వెక్కిరిస్తోంది!

ఆవలివైపు–

హరిణి గదిలోని నీలం వెలుగు తుంపరలు తనను పిలుస్తున్నాయి. ఆమె దుప్పటిలోని కుంపటులు అతనిలో సెగలు లేపుతున్నాయి!

ఒక్కసారిగా, హరిణి చిలిపి చూపుల్లోని పిలుపు,

అమాయకపు కవ్వింపులు–

తొలి వయసు వింత వాసనలు, తెలిసో తెలియకో తనను రెచ్చగొట్టే వింత రాపిడులు–

అతనిలో ఆవేశపు సుడులు లేచాయి–

ఒక నిర్ణయానికి వచ్చి, గోడవైపు నడిచాడు!

దగ్గరగా నిలబడి అవతలి తీరం; ఎంత దూరం అనుకున్నాడు!

గోడ అంచును చేతులతో పట్టుకున్నాడు. తన బరువును – తన చేతులతో లేపాలని ప్రయత్నం!

అందుకు సాయంగా క్రింద బూట్లతో నున్నని గోడను తన్నటం మొదలుపెట్టాడు! ఒకటి రెండు అడుగులు పైకి...

అరె క్రింద పట్టు దొరకదే?

తన చేతులు, తనని పైకి చేర్చలేకపోతున్నాయే?

అవకాశాలకంటే ఆశల బరువే ఎక్కువా?

ఒక్కసారి – రెండుసార్లు ప్రయత్నించాడు. గుండె వేగం ఎక్కువై దడదడ కొట్టుకుంటోంది!

మూడవసారి మూడడుగులు ఎగబాకినా, వైకుంఠపాళి పాము నోట్లో పడినట్లు క్రిందికి జారిపోయాడు!

తన ఆవేశం,

తన అశక్తతను వెక్కిరిస్తోంది!

తన మనసు – తన వయసును తరుముతోంది! ఈసారి – ఈ సరిహద్దులపై తిరుగుబాటు పూర్తి చెయ్యాలి – అనుకున్నాడు!

ఎక్కడలేని శక్తిని కూడదీసుకుని, చేతులలోని బలాన్ని కాళ్ళలోని ఒడుపుని అనుసంధానం చేసి ఏదో పూనినట్లు ఒక్కసారిగా శరీరాన్ని గోడపైకి చేర్చగలిగాడు!

ఆ అరక్షణంలో అతని ఆరిపోయిన పెదాలపై సన్నని నవ్వు వెలసింది!

అతని నుదుట చిరుచెమటలు మెరిశాయి!

అంతలోనే ఆ ఊపుకి తన తౌల్యాన్ని కోల్పోయి తడబడ్డాడు. గోడపై నుంచి క్రింద సిమెంటు నేలమీదకు పడ్డాడు. ఏ వైపు పడ్డాడో తెలుసుకునే లోపే అతనికి మైకం క్రమ్మింది!

✤ ✤ ✤

అతనికి మెలుకువ వచ్చేసరికి తలదిమ్ముగా ఉంది! మెల్లగా లేచి చల్లని నీళ్ళతో ముఖం కడిగాడు. రెండు నిమిషాల్లో సిద్ధమయ్యాడు.

హాలు తలుపు తీసి వరండాలోకి వచ్చాడు.

బైట ఉదయపు కాంతి చీకటిని కరిగించింది. పోర్టికోలో కారు ఒంటికి వెలుగు పూసుకుంది!

నల్ల గేటు గడి తీసి రోడ్ మీదకు వచ్చాడు. గేటు ప్రక్కన ఉన్న పాలరాయి ఫలకం వేపు చూశాడు.

డాక్టర్ రమానంద్

దమయంతి

పేర్లు బంగారు రంగులో ఉన్నాయి!

జేబులో నుంచి రుమాలు తీసి, ఫలకం మీది – తడి ధూళిని తుడిచాడు!

కొద్దిగా ముందుకు నడిచి గోడను చూశాడు – ఇప్పుడు నిలువునా – ఒక గీతలా మాత్రమే – కనబడుతోంది!

ప్రక్కింటి గేటు దగ్గరకు వచ్చేసరికి "హాయ్! మావయ్య! ఇవ్వాళ నుంచీ నేనూ జాగింగ్‌కి...!"

హరిణి నవ్వుతోంది!







ఊరి పొలిమేరలు

బలుకులు



ఆ రోజు రవీంద్ర ఇంటి దగ్గర బయలుదేరినప్పుడే మబ్బులుపట్టి ఆకాశం కాంతిహీనంగా ఉంది. రెండు గంటల ప్రయాణం సాగిందో లేదో వర్షం మొదలైంది. కారు అద్దాలు లేపి డ్రైవర్‌కి వర్షంలో జాగ్రత్తలు చెప్పి మెల్లగా కళ్ళు మూసుకున్నాడు. ఎంతసేపు కునుకు పట్టిందో కారు ఒక్కసారిగా ఆగడంతో మెలకువ వచ్చింది. ఏదో గేదె అడ్డువస్తే ఆపినట్లున్నాడు డ్రైవరు.

రవీంద్ర చుట్టూ కలియ చూశాడు. సన్నగా చినుకులు పడుతూనే ఉన్నాయి. ముందుకు నల్లని తారు రోడ్డు తడిసి, చచ్చిన పాములా మెరుస్తోంది. ఇంతలో కారు మెల్లగా సాగింది. కనుచూపు మేరలో ఏదో ఊరు ఉన్నట్లుంది. చేరటానికి ఇంకా పదినిమిషాలు పట్టవచ్చు. ఎదురుగా ఒక గుర్రబ్బండి దూరంగా కనపడింది. కారు రోడ్డు ప్రక్కన ఉన్న స్మశానం దాటింది. వర్షం పూర్తిగా వెలియటంతో కొద్ది దూరంలో చెట్టుదగ్గర కారు ఆపి, డ్రైవర్ దిగి, రోడ్డు ప్రక్కకు వెళ్ళాడు. రవీంద్ర కారు దిగి, సిగరెట్టు పెట్టి తీశాడు. పొడవాటి సిగరెట్టు వెలిగించాడు. ఆజానుబాహు, తెల్లని బట్టలు వేసుకున్నాడు. నలభై ఏళ్ల వాడయినా ఇంకా తక్కువ వయస్సులో ఉన్నట్లు కనపడతాడు ఆరోగ్యంగా. ఇంతలో ఆ గుర్రబ్బండి కారు ప్రక్కగా నడకలాంటి పరుగుతో వెళ్ళింది. అతను మామూలుగానే చూశాడు. కాని ఏదో వింతగా అనిపించింది. అసహజంగా తోచింది. ఓ నడివయస్సు సాయిబు బండి తోలుతున్నాడు. బక్కచిక్కిన గుర్రం పరుగెత్తలేక నడుస్తోంది. బండిలో, ఒక స్త్రీ

సగం ముసుగులో ఉంది. ఆమె ప్రక్కన ఎవరో పడుకుని నిండా కప్పుకుని ఉన్నారు. ఎక్కడి వెళ్తున్నారు ఈ వర్షంలో – ఈ వేళలో? ఇంతలో డ్రైవర్ వచ్చాడు. రవీంద్ర సిగరెట్టు కాలుస్తుండటం చూసి కారు బయటే నిలబడ్డాడు.

రవీంద్ర కళ్ళు బండినే వెంటాడాయి. అతని అనుమానం నిజమే అయింది. ఆ బండి తాము దాటి వచ్చిన స్మశానం దగ్గర ప్రక్కగా ఆగింది. బండి సాయిబు బండిలో నుంచి దూకాడు. మెల్లగా ముసుగులో ఉన్న స్త్రీ కూడా దిగింది. అతను ఏదో చెప్తున్నాడు... రోడ్డు మీద వర్షం మూలంగా జన సంచారం లేదు. ఇంకో గంటలో ఈ కాస్త వెలుతురు కూడా పోయి చీకటి పరుచుకుంటుంది.

రవీంద్ర డ్రైవర్ని కారు త్రిప్పమన్నాడు.... మెల్లగా బండికి కొంచెం దూరంలో కారు ఆగింది.

బండి సాయిబు కాస్త బెదురుగానే కారు దగ్గరకు వచ్చాడు. ఆ స్త్రీ ముసుగు పూర్తిగా వేసుకుంది.

మెల్లగా బండి సాయిబు చెప్పాడు. "పాడు ఊరు బాబు, పాడు లోకం బాబూ – పాపం ఆ తల్లి మారుమతం మనువాడిందని ఎలేశారు – సక్కగా బతుకుతున్నారని సూడలేక సైతాను కన్నేశాడు. మాయదారి రోగమొచ్చి పొద్దుగాల పోయాడు,. సిన్నయ్య. ఒలుకులకు ఒక్కడూ రానన్నాడు. సివరికి నేనే బండి కట్టానయ్యా" అని ఏకరువు పెట్టాడు.

రవీంద్ర బరువుగా నిట్టూర్చాడు. చదువు చెప్పిన సంస్కృతి, బ్రతుకు నేర్పిన సమదృష్టి, ఆ బాధ్యతను అతని భుజాలపై వేశాయి. కారు రోడ్డు ప్రక్కగా పెట్టించాడు. స్మశానంలో సాయిబుతోపాటు దిగి, ఎక్కడ జాగా ఉందో చూసి, గొయ్యి తవ్వించాడు సాయిబుతో, డ్రైవర్ కూడా సాయం చేశాడు. అంతా బురద, ఎర్రమట్టి రొచ్చు. రవీంద్రకు చీలమండల వరకు ఎర్రమట్టి అంటుకుంది. అయితే పైన మాత్రమే తడిమట్టి – కాస్త త్రవ్వితే పొడిగా వెచ్చగా ఉంది నేల. ఎలాగైతే గొయ్యి తీయటం పూర్తయింది.

బండిలో నుంచి శవాన్ని బండి సాయిబు, డ్రైవర్ సాయంతో, రవీంద్ర పట్టుకుని దింపాడు. కష్టంతో రోడ్డు ప్రక్క పల్లం దాటి బురదలో నుంచి గొయ్యి దగ్గరకు చేర్చారు. తాను ఈ బరువు ఎందుకు మోస్తున్నాడు? ఈ బాధ్యత ఎందుకు

తనమీద పడింది? ఏమో ఇది ఎప్పటి రుణమో! శవాన్ని మెల్లగా గోతిలో దింపారు. అప్పుడు చూశాడు అతని ముఖాన్ని. ముప్పైఏళ్ళుంటాయి. విధివంచితుడు. అతని పేరు? ఇప్పుడెవరికి కావాలి? మెల్లగా మట్టిపోయటం మొదలుపెట్టారు. మట్టిలో నుంచి పుట్టింది. మట్టిలో కలిసిపోతున్నది. ఏమిటి ఈ జీవితం? బ్రతుకు శవమైతే మట్టిపాలేనా? మరి ప్రాణాలు ఎటుపోతాయి? పోయిన వాళ్ళ ప్రాణాలతోనేనా ఈ గాలి నిండి ఉంది? ఉన్న వాళ్ళకి పోయినవాళ్లకీ ఇంకా ఈ బంధమేమిటి? మనిషి పోయినా మతం వదలదా? మట్టి పోయటం పూర్తయింది. చీకటి మెల్లగా క్రమ్ముకుంటోంది. ముగ్గురూ బురదకాళ్ళతో రోడ్డెక్కారు. ఇంతవరకు ఆ స్త్రీ సంగతి మరిచిపోయారు అందరూ. ఏడ్చిఏడ్చి కళ్లల్లో నీరింకిపోయిందేమో అలాగే తల వంచుకుని నిలబడి ఉంది.

రవీంద్ర బండివాడికి వందరూపాయలిచ్చాడు – వద్దు బాబూ అంటున్నా. ఎవరు మాట్లాడటానికి ఏమీ లేదు – ఏముంటుంది? చావుబ్రతుకుల నడుమ? రవీంద్ర డ్రైవర్‌తో కారు త్రిప్పమని చెప్పాడు.

బండి సాయిబు గుర్రాన్ని కళ్ళెం పట్టుకుని వెనక్కు మళ్ళిస్తున్నాడు.

అప్పుడు... ఆ స్త్రీ రవీంద్ర దగ్గరకు వచ్చింది. ఆజానుబాహుణ్ణి తేరిపారా చూసింది. తలమీద ముసుగు కొద్దిగా తొలగించి, వంగి అతని బురద కాళ్లని స్పృశించి, "ఆ దేవుడే పంపాడు మిమ్మల్ని..." అని మెల్లగా అంది. తల పైకెత్తి మరొక్కసారి అతన్ని చూసింది. అప్పుడు రవీంద్ర, తను నమ్మినవాని కోసం ఊరును ఎదిరించి, నిలిచిన ఒక ధీశాలిని, తన ధర్మం కోసం ఒంటరిగా బ్రతుకు పొలిమేరలకు వచ్చిన ఒక ధార్మికురాలిని, తనకు అండగా నిలిచిన ఒక పాంథుని పాదాలకు మ్రొక్కటానికి వెనుకాడని ఒక సంస్కారిని... చూశాడు.

ఎవరీమె?

మెల్లగా ఎవరి దారిన వాళ్ళు కదిలిపోయారు – ఎవరికి ఎవరు ఈ పొలిమేరల్లో! రవీంద్ర ఎన్నిసార్లు అటుగా ప్రయాణం చేశాడు తర్వాత? అతని కళ్ళు ఇప్పటికీ ఆ ముసుగులో నుంచి తనని చూసిన అభాగ్యురాలి మోము ఎక్కడైనా కనపడుతుందేమోనని వెతుకుతూనే ఉన్నాయి.

నీరెండిన ఆమె కళ్ళు అతన్ని వెంటాడుతూనే ఉన్నాయి....





లిబర్టి – ట్విన్ టవర్స్

సంకెళ్ళు



ఆ రోజు జరిగిన పెళ్ళిచూపులు నాకు అవాస్తవంగా అధివాస్తవికంగానే అనిపించాయి. ఎందుకంటే పెళ్ళికూతురు ఈ పెళ్లికి ఒప్పుకోవటానికి పెళ్ళి కొడుకు వంశం కాని, అతని చదువు కాని, అతని అందచందాలు కాని కాదు. కేవలం అతను అమెరికాలో ఉండటమే.

అలాగే పెళ్ళికొడుకు, ఈ పెళ్ళిచూపుల తంతుకు వచ్చింది, ఈ అమ్మాయి – 'అమ్మా నాన్న'ల స్టేటస్ చూసుకొని, ఆమె వెనక ఉన్న ఆస్తిపాస్తులు కోరి కాని కాదు. కేవలం అమ్మాయి చదువు, అమెరికాలో ఉద్యోగం చెయ్యటానికి 'పని'కి వస్తుందని!

సరే, పెళ్ళిచూపులు జరిగిపోయాయి. అతిథి మర్యాదలు – ఇచ్చి పుచ్చుకోవటాలు, పెట్టి పెట్టించుకోవటాలు, ఈ విషయాలన్నిటికీ మధ్యవర్తిని కాబట్టి ఇవన్నీ కూడా నిజానికి నీడలాగా, అబద్ధానికి ఆసరాగా జరిగిపోయాయి.

ఓ ముహుర్తానికి అందరి దీవెనలతోపాటు సూత్రధారణ – అమ్మలక్కలు – కాకి ముక్కుకు దొండపండులా లాంటి గుసగుసలు ముసిముసి నవ్వులు కురిశాయి. పక్కనే పచ్చికబయలులో బఫే భోజనాలు, ఐస్‌క్రీంలు, ఫ్రూట్‌సలాడ్‌ల ఖాళీ ప్లేట్లు, ఎక్కడ నుంచో వచ్చిన పిల్లలు – కుక్కలు, మెల్లగా ఆరిపోతున్న దీపాలు, ఎడాపెడా పడి ఉన్న కుర్చీలు, వాడిపోతున్న పూలదండలు వీటిక్కూడా నేనే ప్రత్యక్ష సాక్షిని కదా!

హనీమూన్ ప్రస్తావన వచ్చింది కాని ఎందుకో చివరి నిమిషంలో మానుకున్నారు. ఒక వారం రోజుల్లోనే కొత్త పెళ్ళికొడుకు అమెరికా ఎగిరిపోయాడు. హైదరాబాద్ విమానాశ్రయం కోలాహలంతో ఒకణ్ణి పంపడానికి వందమంది వెళ్ళాం. ఎవరి గొడవలో వాళ్ళున్నారు. ఫోటోలు, ఫ్లాష్‌లు, జోక్‌లు ఇంత గందరగోళంలో నరేష్ నా దగ్గరకొచ్చి "ఒక నెలరోజుల్లో పేపర్లు పంపుతాను. వీసాకి గైడ్ చెయ్యండి. ఉషకి వీసా రాగానే వెంటనే పంపే ఏర్పాటు చేయండి. మీరే మద్రాసు తీసుకెళ్ళాలి. మా వాళ్ళు పట్టించుకోరు. తను రాగానే 60 కె జాబ్ రెడీగా ఉంటుంది." అని అమెరికా ఎగిరిపోయాడు!

❖ ❖ ❖

ఇంకా పేపర్లు రాలేదే? అబ్బాయికి ఉద్యోగం ఏమిటి? అసలు లీగల్ వీసా ఉందా? ఈ అనుమానాలతో బాహాటంగానే ఉష పెంపుడు తల్లిగారు అవకాశం దొరికినప్పుడు నా కాలర్ పట్టుకుంటూనే ఉంది....

ఇక్కడే మీకు ఉష ఫ్లాష్‌బాక్ కొంత చెప్పాలి. తను పసికందుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు వింత పరిస్థితుల్లో చనిపోయారు. వాళ్ళు ఏదో ప్రమాదంలో చనిపోయారని కాదు, ఆత్మహత్య చేసుకున్నారని చేదు నిజాలు, తీపి అబద్ధాలు ప్రచారంలో ఉన్నాయి. ఉష తల్లికి అక్క, సీతమ్మ తన ముగ్గురు ఆడపిల్లలతోపాటు ఉషను కూడా పెంచింది. కాని ఎక్కువ శ్రద్ధ తీసుకుని చదివించింది, పెద్దనాన్న సూర్యారావుగారే. తన స్వంత కూతుళ్ళ కంటే కూడా ఎక్కువ కేర్ తీసుకుని ఫార్మసీ చదివించాడు.

ఉషకంటే చిన్నవాళ్ళయిన తన చెల్లెళ్ళు అందరికీ పెళ్ళిళ్ళు జరిగిపోయినా ఉష ఏదో మిషతో ఆ విషయాన్ని వాయిదా వేస్తూ వస్తోంది. తన స్థితి తనకు అవగతం అయినకొద్దీ ఎక్కువగా ఇంట్రోవర్ట్‌గా అయిపోయి ఒకరకమైన నిరాసక్తత – డిప్రెషన్ మూడ్‌లో ఉంటుండేది. "పాపం, తల్లిదండ్రులు లేరు" అని సింపతీ, కనీసం స్నేహితులు కూడా లేరే అని నాకు ఆశ్చర్యం!

ఏదైనా మాట్లాడితే పొంతనలేని అసందర్భమైన ప్రశ్నలతో ఒక్కసారిగా బెదరకొడుతుంది. ఇది గమనించి వీలైనప్పుడు నేను కొంత చనువుగా ఆమె మానసిక స్థితిని అంచనా వేసే సాహసం చేశాను.

రూపం – వెన్నెల, బంగారం పోతపోసినట్లు. చిన్న ముక్కుపుడక తళుక్కున మెరుస్తుంది. ఎఱ్ఱని పెదవులు. వెలుగు లేని నవ్వు! కబుర్లు చెప్పని చీకటి కనులు. కుంచించుకుపోయిన నుదురు. నిండైన వక్షం. పొడవైన జడ. ఆడ లక్షణాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. కానీ మనుషులకు, పరిస్థితులకు దూరంగా ఎందుకు జరిగిపోతుంటుంది?

❖ ❖ ❖

మామూలుగానే వీసా పేపర్లు రావటానికి మూడు నెలలు గడిచిపోయాయి. ఈ మూడు నెలలు నరేష్ అమ్మ సుచిత్రాదేవి గారు కోడలిని ఇంట్లో పెట్టుకుని అప్పటివరకూ అమ్మాయి చేస్తున్న ఉద్యోగం మానిపించి, తన కొడుకు అవసరాలకు అనువుగా ఆమెను తీర్చిదిద్దటానికి, మార్చటానికి శతవిధాలా ప్రయత్నించి, చివరకు మూర్ఛపోయింది.

సుచిత్రాదేవిగారికి తనకు ఇష్టంలేని పనిగాని, నిర్ణయంగాని, ఆ ఇంట్లో జరగటాన్ని హర్షించగల విశాల హృదయం లేదు. ఇంతటి అభిజాత్యం ఉన్నామె ఉష నిరాసక్తతను మెత్తటి షిఫాన్ చుడిదారుల్లో, సిల్కు చీరలతో బ్యూటీపార్లర్ల ఫేషియల్స్‌తో మార్చాలని శతవిధాలా ప్రయత్నించి అలసిపోయింది.

'అత్తమ్మా – ఆడవాళ్ళకు ఇవన్నీ అవసరమా? ఇవన్నీ మొగవాణ్ణి ఆకర్షించటానికేనా' అని ఉష అడిగితే, ఆమె నోరు తెరచి బుట్ట జాకెట్లు తడుముకోవలసి వచ్చింది.

'మీనాబజార్లో' నగలు, రకరకాల గాజులు కొని "ఎన్నారై భార్య స్టైలుగా ఉండాలి" అని బోధిస్తుంటే "ఈ నగలు నాకు బరువు – ఈ స్టైలు నాకు బోరు" అని గొణిగేది. రాత్రి వేసిన నైటీ మర్నాడు మధ్యాహ్నం వరకు వదిలేది కాదు. స్నానం చేస్తే మంచి బట్టలు వేసుకోవాల్సి వస్తుందని!

ఇక తిండి విషయం. రోజూ కోళ్ళూ కుక్కలూ నడిచే ఆ ఇంట్లో పాలకూర, బెండకాయలు తప్ప తినని ఈ వింత కోడలు సుచిత్రగారికి ఒక సమస్యగానే తయారైంది. ఈ అమ్మాయి తన కొడుకుని సుఖపెడుతుందా? తినడానికి ఇంత వండి పెడుతుందా? కనీసం పక్కలోనైనా పడుకుంటుందా? ఇలాంటి ప్రశ్నలతో ఆమె తల దిమ్మెత్తిపోయేది.

నేను చుట్టంచూపుగా వెళ్ళినప్పుడు "ఎంత పనిచేశావు" అని కొంత బాధ, కొంత నిష్ఠూరంగా అన్ని విషయాలూ దాపరికం లేకుండా కక్కేది.

ఎప్పుడైనా అలా సాయంత్రం వాకింగ్‌కి తీసుకువెళ్ళి "ఏమిటి నీ సమస్య" అని ఉషని అడిగితే "ఏ సమస్య" అని అమాయకత్వమో, గడుసుతనమో తెలియని ముసుగులో ఉండిపోయింది.

"నీకు అసలు స్నేహితులు లేరా?" అని అడిగితే "మీరు స్నేహితులు కారా?" ఎదురు ప్రశ్న!

"నీ క్లాస్‌మేట్స్?"

"ఆఁ షబానా అని చాలా దగ్గర. ఇప్పటికీ ఉత్తరాలు రాస్తుంటుంది. పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి అవసరమా?"

"నీకు దేనిమీద ఆసక్తి?"

"సన్నజాజిపూలు – చిన్నచిన్న కుందేళ్ళు..... అమ్మానాన్న... చిన్ని అక్వేరియంలో గోల్డ్‌ఫిష్."

ఎప్పటిదో పాతికేళ్ళనాటి అవసాన దశలో ఉన్న అమ్మానాన్న ఫోటో తీసి చూపించింది.

"వీళ్ళని నువ్వు చూడలేదుకదా? నీకెందుకు వీళ్ళమీద ప్రేమ? కనీసం నిన్ను వాళ్ళు పెంచను కూడా లేదే? వాళ్ళు నీ తల్లిదండ్రులని ఎవరో చెపితే నువ్వు నమ్మి, అభిమానిస్తున్నావు. నిన్ను చిన్నప్పటినుంచీ పెంచి, నీ బాగోగులు చూసిన నీ చుట్టూ ఉన్నవాళ్ళు నీకు పట్టరు.... నీవు గతంలో బతకాలనుకుంటున్నావా?" అని కాస్త గట్టిగానే అడిగాను.

"నాకు గతానికి ఇప్పటి బతుక్కు తేడా లేదు. చీకటికీ వెలుతురికీ మధ్యలో తెరలేమీ లేవు" అంటూ వేదాంతిలా వెళ్ళిపోయింది.

✤ ✤ ✤

నాలుగో నెల మొదట్లో పేపర్లు వచ్చినట్లు, సుచిత్ర గారు ఆగలేక కోడల్ని తీసుకుని మద్రాసు వెళ్ళి అట్టహాసంగా వీసాకి ఉషను లోపలికి పంపినట్లు; ఏదో

కొరికతో వీసా ఇవ్వనట్లు! వీరంతా సపరివారంగా రాజధానికి వచ్చి నాకు ఫోనులో అన్ని వివరాలు చెప్పారు. దీనికి కూడా మీదే బాధ్యత అన్నట్లు ధ్వని కూడా ఉందో లేక నాకే అలా అనిపించిందో!

ఆ తర్వాత నరేష్ చివాట్లు పెట్టేసరికి కోడల్తోపాటు ఫైల్ మొత్తం నా దగ్గరకు చేరాయి.

కావలసిన డాక్యుమెంట్లన్నీ ఇచ్చి ఇంకా కొన్ని అమెరికా నుంచి తెప్పించి ఒక ఏకాదశి రోజున ఉషాదేవికి అమెరికా 'వీసా పవర్' ఇచ్చి అట్టహాసంగా హైదరాబాద్ నుంచి న్యూయార్క్ పంపాము. ఆ ఒక్కరోజే ఉషను సంతోషంగా చూశాననుకున్నాను.

❖ ❖ ❖

రోజులు, వారాలు, నెలల వరుసలో ఉష విషయం మరుగున పడిపోయిందనుకున్నాను. అంతా సవ్యంగా జరిగిపోతుందనుకున్నాను. ఈ భ్రమలో నేనుండగా ఏదో ఒకటి, రెండు నీలి వార్తలు నా వరకూ వచ్చినా గిట్టనివాళ్ళు కల్పించినవనుకున్నాను. ఒకసారి రాజధాని నుంచి–

"ఒకసారి మీరు వస్తే బాగుంటుంది...." అని డిప్లొమాటిక్ కాల్ వచ్చింది!

వెళ్ళక తప్పుదుకదా! అయితే, అప్పటికే విషయం ముదిరి పాకానపడింది.

"ఈ పిచ్చిదాన్ని మావాడికి ఎందుకు కట్టబెట్టారు? నా కొడుకుని నానా హింసా పెడుతుంది. వాడు రోజూ "అమ్మా, నాకీ పెళ్ళి ఎందుకు చేశావు?" అని ఏడుస్తున్నాడు. కక్కవలసింది అంతా అయిన తర్వాత నాకు తలంటు కూడా అయింది.

ఆ సాయంత్రం ఫ్యామిలీ మీటింగ్ పెట్టి, అసలు విషయం రాబట్టడానికి ప్రయత్నించి విఫలుణ్ణయ్యాను. వీళ్ళెవరూ నిజం చెప్పరు అన్న విషయం మాత్రం నిజమని తేలింది!

తర్వాత సంఘటనలన్నీ త్వరగానే జరిగిపోయాయి. ఆ తర్వాత నెలలో నేను అమెరికా వెళ్ళవలసి వచ్చింది. అది సెప్టెంబరు మాసం......

న్యూయార్కులో దిగి, బాగేజి క్లెయిమ్ దగ్గర నరేష్ ఉండటం గమనించాను.

"ప్రయాణం బాగా జరిగిందా?" పలకరింపుగా అన్నాడు! 24 గంటల ప్రయాణం తర్వాత జెట్‌లాగ్‌తో తెరిచిన కళ్లతో నిద్రపోతూ మాంట్‌విల్లీలో నరేష్ బాబాయ్, నా స్నేహితుడు రాజారాం ఇంటికి చేరాం. రాజా భార్య గీత డిన్నర్ సర్వ్ చేసింది. మర్నాడు నేను లేచేసరికి అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మేడమీద రూంలో నుంచి బైటకు చూశాను. ఒక లావుపాటి కాకి అరుస్తోంది. పక్కనే స్విమ్మింగ్ పూల్ ఎండిపోయింది. చుట్టూ పూలచెట్లు చల్లని ఎండలో ఊగుతున్నాయి. సెప్టెంబర్‌లో ఆకులన్నీ పసుపు పచ్చగా మారిపోతున్నాయి. పెద్దపెద్ద ఉడతలు చెట్లపై పరుగులు పెడుతున్నాయి. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించి ఉంది.

అంతలో, ఆ తోటలో చెట్లకు నీళ్ళుపోస్తూ ఉష కనిపించింది. ఎన్నాళ్ళైంది చూసి! అమెరికా ఆహారం, కొద్దిగా లావైంది. ఇంకా తెల్లగా మెరుస్తోంది. జుట్టు కత్తిరించింది, జీన్‌పాంట్ టీషర్ట్‌లో వింతగా ఉంది.

నేను మెల్లగా దిగి వచ్చి స్విమ్మింగ్ పూల్ గట్టు మీద ఈజీచైర్‌లో కూర్చొని చూస్తున్నా.

రంగురంగుల సీతాకోకచిలుకలు ఎగురుతూ పూలమీద వాలుతున్నాయి. కింద పచ్చని గ్రాస్. మెత్తగా కాలికి తగులుతోంది.

ఉడెన్ కాంపౌండ్ పార్టిషన్ పక్కనే ఉన్న క్రోటన్ను వయోలెట్ పూలచెట్లు, కొన్ని గులాబి పూలచెట్లు, వీటి మధ్య ఉష ఎంతో సహజంగా ఉన్నట్లుంది.

మరి ఏమిటి సమస్య? ఎందుకు సమస్య? నా ఉనికి గమనించి "హి!..." అని దగ్గరకు వచ్చింది.

ఉండండి, కాఫీ తెస్తాను అని లోపలికి వెళ్ళి మగ్ నిండా కాఫీ తెచ్చి పక్కనే కూర్చుంది. పరీక్షగా చూశాను. దాదాపు సంవత్సరం అయింది. బుగ్గలు నిగనిగలాడుతున్నాయి. పెదాలు ఎర్రబడ్డాయి. టీషర్టు పిటపిటలాడుతోంది. జీన్సు – స్కిన్‌టైట్ తొడలకు అతుక్కుని ఉంది. ఉషాదేవేనా? అనుమానం వచ్చింది.

"ఓకే, ఎలా ఉన్నావు... కబుర్లు చెప్పు" అని మెల్లగా అడిగాను. "అంతా బాగనే ఉంది. పోయిన నెలలో ఎగ్జామ్ రాశాను. అంతకు ముందు సరిగ్గా చదవలేదు. ఇవ్వాళో రేపో రిజల్ట్స్ రావాలి."

"దేనికి ఎగ్జామ్?"

"ఫార్మసీ లైసెన్స్ కోసం. పాసైతే ఉద్యోగం వస్తుంది."

"అలాగా – నరేష్ ఎలా ఉన్నాడు?" ఎక్కడ జాబ్?

"ఇక్కడ దగ్గర్లోనే గాస్ స్టేషన్‌లో" ఇంక సంభాషణ పొడిగించలేదు. స్నానంచేసి బ్రేక్‌ఫాస్ట్, లంచ్ కలిపి తినేసి మళ్ళీ నిద్రపోయాను.

✤ ✤ ✤

వారం పదిరోజుల్లో విషయాలు చాలా విడిపోసాగాయి. నరేష్‌కి, ఉషకి పొసగటంలేదు. కారణాలు అంత బలమైనవి కూడా కనపడటంలేదు.

స్థూలంగా, ఉష అతనికంటే ఎక్కువ చదువుకుంది. ఇద్దరికీ కంపాటబిలిటీ లేదు.

అతని గ్యాస్‌స్టేషన్ జాబ్ కూడా లేబర్ జాబ్ అయిపోయింది.

నరేష్ సంగతి – అతను రోజుకు రెండు షిఫ్టులు పనిచేస్తున్నాడు. మూడో షిఫ్టు సెల్లార్లో మందుకొడుతూ సినిమాలు చూస్తున్నాడు. ఎప్పుడూ అక్కడే నిద్రపోతూ తెల్లవారకముందే గ్యాస్ స్టేషన్‌కు వెళ్ళిపోతాడు. ఉదయం 7 1/2 గంటలకు రాజారాం, గీత చెరొక దారిన – వాడు న్యూయార్కు, ఈమె మాంట్‌విల్లి కౌంటీకి వెళ్ళిపోతారు.

ఉష పగలంతా ఇంట్లో ఎక్వేరియం చేపల్తో, టివి బొమ్మల్తో, స్విమ్మింగ్‌పూల్ చుట్టూ పూలచెట్లతో ఎప్పుడైనా పుస్తకాలతో కాలం గడుపుతోంది.

నరాలు తెగిపోయే ఒంటరితనం, భయంకరమైన నిశ్శబ్దం – అది చీల్చుకుంటూ ఫోను మోగినా భయం!

ఆమెలోని నిరాసక్తత నిరాశగా రూపుచెంది ఆమెను నీడలా వెన్నాడుతోంది!

"నాకు పిచ్చెక్కుతోంది. అతను శాడిస్ట్ – కారక్టర్‌లెస్ బ్రూట్... ప్లీజ్ బిలీవ్‌మి" అంటూ స్వగతంలా మాట్లాడింది.

ఆ సాయంత్రం –

"పద, గాస్‌స్టేషన్‌కి వెళ్దాం" అని బయలుదేరదీశాను. దగ్గరే, నడచి వెళ్లవచ్చు. బయట చలి సంగతి తెలియక మామూలుగా బయలుదేరాను.

"ఏయ్, యూ విల్ ఫ్రీజ్. ఈ జెర్కిన్ వేసుకోండి..." అని ఎంతో శ్రద్ధగా జర్కిన్ ఇచ్చి మెడచుట్టూ కాలర్‌వేసి, జిప్‌పెట్టింది. ఆడది సేవచేస్తే మనసుకు ఎంత హాయిగా ఉంటుంది!

అప్పటికి కాస్త ఎండ ఉంది. బ్రిటన్ రోడ్‌లో నుంచి మాంట్‌విల్లీ రోడ్ తిరిగాం. ఓ కిలోమీటర్ సైడ్‌వాక్ మీద నడుస్తున్నాం. అక్కడ కూడా ఖాళీపొలాలు కనపడుతున్నాయి.

ఒకటి రెండు పాడుపడిన ఇళ్ళు దాటాం. చిన్న షాపింగ్ సెంటర్. తర్వాత గాస్‌స్టేషన్! మా రాక చూసి నరేష్ కొంచెం సిగ్గుపడ్డాడు! సహజంగానే.

ఇండియాలో ఎంతో స్టేటస్ మైంటైన్ చేసిన ఫామిలీ ఇక్కడ గాస్ స్టేషన్ (మన భాషలో పెట్రోల్‌బంక్) ఉద్యోగం. ఎంత అమెరికాలో ఉన్నా తెలిసినవాళ్ళ దగ్గర చిన్నతనంగానే ఉంటుంది. కాబిన్‌లోనికి వెళ్లాం! స్టేషన్ ఓనర్ ఉన్నాడు.

"హి – ఇయామ్ జాన్"

"హౌ డుయుడు"

"షి ఈజ్ ఉష. శామ్స్ వైఫ్" అన్నా.

"వాట్? షి ఈజ్ శామ్స్ (నరేష్) వైఫ్? హి నెవర్ టోల్డ్‌మి? ఎనీవే యూ ఆర్ బ్యూటిఫుల్ బేబీ. వాట్ ఆర్ యు డూయింగ్ విత్ దిస్ బీస్ట్.." అని పెద్దగా నవ్వాడు. అంతలోనే "ఐయామ్ జస్ట్ జోకింగ్! హి ఈజ్ ఎ హార్డ్ వర్కింగ్ గై! హావ్ ఎ నైస్ డే..." అని వెళ్ళిపోయాడు. మేము గాస్ స్టేషన్‌కి రావటం, సంవత్సరం నుంచి ఉష రాని చోటికి, ఓనర్ కామెంట్స్ – ఇవన్నీ నరేష్‌ని మరీ చిన్నబుచ్చుకునేట్లు చేశాయి.

మళ్ళీ మేమిద్దరం నడిచి ఏడుగంటలకు ఇంటికి చేరాం. అప్పుడే రాజారాం – గీత చేరొక కారులో ఇంటికి చేరారు.

మర్నాడు మెయిల్‌లో ఉష రిజల్ట్స్ వచ్చాయి!

❖ ❖ ❖

అన్ని సబ్జెక్టుల్లోను క్వాలిఫైయింగ్ గ్రేడ్ కంటే తక్కువే వచ్చినాయి. 75 శాతం కన్నా తక్కువ వస్తే మళ్ళీ పరీక్షలు రాయాలి. ఈ మార్క్స్‌తోపాటు రాబోయే పరీక్షలకు అప్లికేషన్ కూడా పంపారు.

ఆ రాత్రి లివింగ్ హాల్లో టివి రంగు నీడల్లో అందరి ముఖాలు సీరియస్‌గా ఉన్నాయి.

నరేష్ నిప్పులు కక్కుతున్నాడు. అన్నిటికీ తామరాకు మీద నీటిబొట్టులా ఉండే రాజారాం సోఫాలో ఇబ్బందిగా కదులుతున్నాడు.

పూర్తిగా అమెరికన్ లైఫ్‌స్టైల్‌ని ప్రేమిస్తూ భారతనారిలా జీవిస్తున్న గీత – పరిస్థితుల్ని అంచనా వేస్తూ..

“ఉషా! రోజూ చెప్పేదాన్నికదా! కష్టపడి చదివి, పాస్ అవమని. ఇప్పుడు చూడు, మళ్ళీ పదినెలల తర్వాత గాని ఎగ్జామ్ రాయలేవు! నీవు కూడా జాబ్‌లో చేరితే మీ ఇద్దర్నీ ఎపార్ట్‌మెంట్‌లో పెడదామనుకున్నాను. ఇప్పుడు వీడి సంపాదన తిండికే చాలదు కదా. ఇంటి అద్దె ఎలా కడతారు? అఫ్‌కోర్స్ మీరు ఇక్కడుంటే మాకేమీ ఇబ్బంది లేదనుకో! వచ్చేనెలలో రాజు, గోపి వస్తున్నారు కదా! అప్పుడు మీకైనా ఫ్రీడం ఉండదు కదా!”

రాజారాం “యా..... యా.....” అంటున్నాడు మధ్యలో.

నరేష్ అయితే బుసలుకొడుతున్నాడు.

ఈ అవాస్తవిక పరిస్థితుల్లో ఇక్కడ సంపద – కాళ్ళకింద కార్పెట్లతో చెక్కగోడల మీది వాల్‌పేపర్లలో – లివింగ్ రూం సోఫాసెట్లలో, డైనింగ్ రూం ఓవల్ టేబుల్, హైబాక్ కుర్చీల్లో, తలపై సీలింగ్‌కు వేళ్ళాడే షాండిలీర్లలో – ఇంకాస్త బైటకు వెళ్తే పోర్టికోలో పార్క్‌చేసి ఉన్న ఫోర్డ్ – టయోటా కార్లలోనే ఉండిపోతోంది. వ్యక్తుల మధ్య సంబంధాలు, భార్యాభర్తల అనుబంధాలు అన్నీ డాలర్లతో ముడిపడి

ఉన్నాయి. ఇక్కడ పనిచేయలేని వ్యక్తి పనికిరాని మనిషి. ప్రాణంపోయిన మనిషిలా తనకు తానే ఓ భారం. నిన్ను మోయటానికి ఎవరికీ ఓపికా తీరికా ఉండవు. నీ భర్త అయినా, నీ భార్య అయినా దూరాలన్నీ ఒకటే!

అన్నిటికి కార్పెట్టు మీద కూర్చొని మూగగా రంగులు మారుతున్న టీవి వెలుగులో తన ముఖానికి హరివిల్లులాంటి మాస్క్ వేసుకున్నట్లు తన పెద్దపెద్ద కనుల్లో కదులుతున్న వెలుగు నీడల్ని రెప్పలు వాల్చి దాస్తున్నట్లు. నవరసాల్ని మనకందించే టీవి సెట్టు తనకేమీ పట్టనట్టు, తనకేమీ ఆలోచనలు లేనట్లుగా నిర్వికారంగా ఉండిపోయింది ఉషాదేవి!

✣ ✣ ✣

మర్నాడు గాస్ స్టేషన్‌కు వెళ్ళాను. ఉదయం పదకొండు గంటలకు – శ్రీకాంత్ న్యూయార్క్ నుంచి వచ్చి నన్ను పికప్ చేసుకుంటాను అక్కడ ఉండమని ఫోన్ చేశాడు. ఒక్క అరగంట నరేష్ దగ్గర కూర్చున్నాడు. ఆ సమయంలో బిజినెస్ డల్‌గా ఉంటుంది!

"ఇక నా వల్లకాదు. ఈ గొడ్డు చాకిరీ నేను చెయ్యలేను. ఇప్పటివరకూ ఓపిక పట్టాను. రెండేళ్ళనుండీ రోజుకు 20 గంటలు ఎండలో – వానలో – మంచులో ఈ కూలి చేస్తున్నాను. ఇక్కడ వచ్చే రెండు వేల డాలర్లు – టిప్పులతో సహా! ఇండియా తీసుకెళితే ఎనభైవేలు. కాని, ఇక్కడ రెండువేలే! ఉషని చేసుకున్నది తను జాబ్ చేస్తుందని. నెలకు అయిదారువేల డాలర్లు వస్తాయని. కాని ఈ వాలకం చూస్తే ఆ లక్షణాలు, లక్ష్యం ఏమీ ఉన్నట్లు లేదు. ఇంకా నన్ను ఇంతవరకు తన భర్తగా కూడా దగ్గరకు చేరనివ్వలేదు. ఈ దెయ్యాన్ని నాకెందుకు అంటగట్టారు?" అని వాపోయాడు.

ఇప్పుడతనికి తన మనిషిలేదు. పనిచేసి సంపాదించే మిషనూ లేదు. అతని బాధ నేనర్థం చేసుకోగలను. కాని సమస్యను ఎలా పరిష్కరించాలి?

ఇంతలో రాకెట్టులాంటి వాన్‌లో శ్రీకాంత్ వచ్చాడు. నరేష్‌కి బైచెప్పి, వాన్ ఎక్కాను. మాంటివెల్లీలోనే రెండు మూడు షాపింగ్ సెంటర్లు తిప్పాడు. ఇతనికి నరేష్‌కి ఇచ్చిపుచ్చుకోవటాలు ఉన్నాయి. ఒక ఇండియా స్టోర్‌లో వాసవి – అసలు పేరు వాసవదత్త – గుజరాతీ అమ్మాయిని పరిచయం చేశాడు. గుండ్రటి ముఖం

పొట్టిగా ఉంది. అందుకే గుజరాతీలను ఇక్కడ గుజ్జులుంటాయి. బైటకి వస్తుంటే చెప్పాడు – నవ్వుతూ "ఎలా ఉంది నరేష్ గర్ల్‌ఫ్రెండ్? ఈ విషయం మీ ఉషకి తెలుసు" అన్నాడు. ఈ సమస్య రోజురోజుకి జటిలమైపోతున్నట్లుంది నాకు. నన్ను గిరగిర తిప్పి మాక్‌గ్రెయిన్ "ఫ్రెంచ్ కిస్" సినిమా చూపించి ఒక బక్కెట్టు పాప్‌కార్న్, లీటర్ కోకాకోలా తాగించి, రాత్రి ఇంటి దగ్గర పడవేసిపోయాడు శ్రీకాంత్. అతను చెప్పిన విషయాలలో గాసిప్‌కంటే వాస్తవాలే ఎక్కువ ఉన్నట్లు తర్వాత తెలిసింది.

ఎక్కువ రోజులు ఏదో ఒకచోటికి తిరుగుతూనే ఉన్నా అప్పుడప్పుడు ఉషతో ఒంటరిగా లేక జంటగా ఉండే అవకాశం చిక్కేది. ఉదయం అందరూ వెళ్ళిపోయిన తర్వాత తీరిగ్గా బ్రేక్‌ఫాస్ట్ చేసి, స్విమ్మింగ్‌పూల్ సైడ్ హాల్లో తెరలన్నీతీసి, కార్పెటుమీద పడుకుని నీలం – ఊదారంగుల్లో కనీసం పక్షులు కూడా ఎగరని ఆకాశాన్ని చూస్తుంటే రకరకాల ఆలోచనలు ముసిరేవి.

ఉష కొంత ఇంటిపని – కొంత తోటపని చేసి, ఎప్పుడో నా దగ్గరకు వచ్చి కూర్చునేది. గొప్ప చెప్పకూడదుకాని నాకు వైన్ రుచి, వాసన ఎంత బాగా తెలుసో ఓ స్త్రీ నా ప్రక్కన ఉంటే ఆ వింత వాసన వెంటనే తెలిసిపోతుంది. ఆల్‌పచినో 'సెంట్ ఆఫ్ వుమన్' అందుకే నాకు బాగా నచ్చింది. అలాంటి నాకు నా చెంత రుచి, వాసనలేని ఓ గాజు బొమ్మ కూర్చున్నట్లుండేది! సృష్టిలో కొన్ని పూలకు వాసన ఎందుకుండదు? అయినా నాకు తెలుస్తున్న సంగతులతో నా మనసులోని గొలుసులు ఒక్కొక్కటి తెగిపోతున్నట్లు అనిపించి – తెలియని స్వేచ్ఛను ఫీలయ్యేవాడిని.

"మీకు తెలుసా? గీతా ఆంటీకి అమెరికన్ బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడు?" అని లాండ్‌మైన్ పేల్చింది.

నాకున్న సంకెళ్ళలో మరొకటి తెగిపోయింది.

"అవును. మీరు రోజూ న్యూయార్క్ వెళ్తారు. ఉదయం వెళ్ళి రాత్రి వస్తారు అంతసేపు ఎక్కడ తిరుగుతారు? ఏం చూస్తారు?"

"ఓ! న్యూయార్క్ చూడాలంటే ఎన్ని రోజులైనా చాలవు. లేడీ లిబర్టీ – ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ – వరల్డ్ ట్రేడ్ సెంటర్! జాక్సన్ హైట్స్ – రేడియో సిటీ –

యుఎన్ఓ, సెంట్రల్ లైబ్రరీ ఒకటేమిటి? మనహాటన్ మహాసౌధాల అద్దాల అరణ్యంలో దారి తప్పటం నాకెంతో ఇష్టం" తన్మయత్వంతో చెప్తున్నాను.

"రియల్లీ – ఒకరోజు నన్నూ తీసుకువెళ్ళండి" అని ఊరుకుంది.

అప్పటివరకూ ఉష మాంట్‌విల్లి వదిలి బైటకు రాలేదన్న సంగతి తెలియదు.

ఓ! పిటీ! అనుకున్నాను.

నా గుండె లోతుల్లో ఏదో సన్నని సంగీతం వినపడుతోంది.

❖ ❖ ❖

ఒక వీకెండ్ టెంపుల్ ఫండ్ రైజింగ్ ప్రోగ్రామ్‌కి వెళ్ళాం. మాంట్‌విల్లి దగ్గర్లో వెంకటేశ్వరస్వామి దేవాలయం కడుతున్నారు. ఆ రాత్రి ఫండ్ రైజింగ్ మ్యూజికల్ నైట్ జరుగుతోంది. కుర్రకారు పాటలు పాడుతూ డాన్సులు చేస్తున్నారు. అక్కడ పరిచయం అయిన రామారావుగారు చెప్పారు. "ఇది పది ఎకరాల స్థలం. ఇండియన్స్ అసోసియేషన్ 10 మిలియన్ల డాలర్లకు కొన్నారు – బ్యాంక్ ఆక్షన్‌లో.

అంటే, ఒకప్పటి చర్చి ఇప్పుడు హిందూ టెంపుల్‌గా మారుతోంది. వీళ్ళకి దైవభీతి ఉంది కదా. అందుకని చర్చి మెయిన్ ఆల్టర్‌ను పడగొట్టకుండా కమ్యూనిటీ హాల్ చేశారు. ఇంతలో "తు చీజ్ హై బడీ మస్తుమస్తు" అని పాడుతున్నారు. నాకెంతో ఆనందంగా ఉంది. డొనేషన్లు వచ్చిపడుతున్నాయి. రాజా వెయ్యి డాలర్లు ఇచ్చాడు.

ఎక్కడ ఉష? ఓ మూల కూర్చుని స్పూనుతో ప్లేటులో కెలుకుతోంది. ఇంకేమీ పట్టనట్టు? "అవును, ఇక్కడ గుడి ఎందుకు కడుతున్నారు?" అంది.

❖ ❖ ❖

మరో వీకెండ్, అట్లాంటిక్ సిటీకి ప్రోగ్రాం పెట్టాను. ఇక్కడికి 3 గంటలు డ్రైవ్. అది శుక్రవారం రాత్రి. ఎర్లీగా డిన్నర్ చేసి ఏడున్నరకే బయలుదేరాం. రాజారాం లింకన్ టౌన్‌కార్ పెద్ద పడవలా ఉంటుంది. వెనుక సీటులో గీత – రాజారాం రిలాక్స్ అవుతున్నారు.

ముందు నరేష్ డ్రైవ్ సీటులో ఉన్నాడు.

ఉషని ముందు ఎక్కించి, విండో పక్క నేను కూర్చున్నా. కారు గాలిలో తేలిపోతున్నట్లుంది. లోపల, హీటర్ వేడికి, వెచ్చగా ఉంది.

ఊరు దాటేసరికి ఉష నన్ను ఆనుకుని కూర్చుంది. అమెరికాలో కార్లన్నీ అట్లాంటిక్ సిటీకి వెళ్తున్నట్లు ఈ ట్రాఫిక్ ఏమిటి. శుక్రవారం అట్లాంటిక్ సిటీలో కాసినోలు అన్ని చుట్టుప్రక్కల సిటీల నుంచి ఫ్రీరైడ్ ఏర్పాటు చేస్తారు. రెండు రాత్రిళ్ళు – రెండు పగళ్ళు ఇక బయట ప్రపంచంతో పని ఉండదు.

దారిలో వర్షం మొదలైంది.

"బీ కేర్‌ఫుల్" అంటున్నాడు రాజారాం.

దూరంగా కారేదో బ్రేక్‌డౌన్ అయినట్లయింది. వర్షంలో తడుస్తూ ఎవరో లిఫ్ట్ అడుగుతున్నారు. ఎవరూ ఆపటంలేదు. అది చూసి "పాపం ఆపుదామా..." అంది ఉష.

అది సమాధానం చెప్పవలసిన ప్రశ్న కాదన్నట్లు కారు దూసుకుపోయింది ముందుకు.

రాత్రి పదిగంటలకు తాజ్ చేరాం. దీనికి తాజ్ అని పేరెందుకు పెట్టారో ప్రపంచంలోకెల్లా ఇదే పెద్ద బిల్డింగ్ అని అంటారు.

కారు పదో అంతస్తులో పార్క్ చేసి గ్రౌండ్‌ఫ్లోర్‌కి, గ్రాండ్ సెంట్రల్ హాలుకి వచ్చాం. విశాలమైన మెట్లు, ఎర్రటి కార్పెట్లతో మెరిసిపోతోంది.

మెట్లకి ఇరువైపులా వెన్నెల పోత పోసినట్లు పాలరాతి బొమ్మలున్నాయి. అవి బొమ్మలు కాదు అమ్మాయిలని తెలియటానికి ఎక్కువ సమయం పట్టలేదు.

"ఛీ, సిగ్గు లేకుండా...." ఉష గొణుగుతోంది.

"వాటీజ్ రాంగ్..... ఐవిల్ ఆల్సో పోజ్ ఇఫ్ దే పే మి" అని గీత అనటం విన్నా.

నా లోపలి గొలుసింకొకటి తెగిపోయింది.

నరేష్ బ్లాక్ జాక్ ఆడేందుకు వెళ్ళాడు. గీత – రాజారాం స్లాట్ మిషన్ల దగ్గర బిజీగా ఉన్నారు.

"ఏమోయ్ నా డబ్బు ఎప్పుడూ పోతుంది ఇక్కడ. ఐ హావ్ నెవర్ ఒన్" అంటున్నాడు రాజా.

లోపల ఎంతో చల్లగా ఉంది.

ఉష మెల్లగా నన్ను అతుక్కుపోయి తిరుగుతోంది.

కేసినో వాతావరణం.

ఇక్కడ అప్‌బీట్ మూడ్, పక్కన ఉషా వలయం, స్లాట్ మిషన్ల గలగలలు.... ఓహ్ వాట్ ఎ నైట్!

"నేనూ ఆడతాను" అంది. పది డాలర్లు చిల్లర తీసుకొని ఇచ్చాను. ఇద్దరం చెరో మిషన్ దగ్గర నిలబడ్డాం.

"డు యు బిలీవ్ ఇన్ లక్?" అడిగాను.

"ఐ డోంట్ నో, వాట్ లక్?" ఎదురు ప్రశ్న.

ఇంతలో ఒక జపాన్ అమ్మాయి బుట్ట నిండా డాలర్లు వచ్చి పడ్డాయి. సంతోషంగా కేకలు.

అయిదారు నిమిషాల్లో పది డాలర్లు పోగొట్టి ఉష నా పక్కన చేరింది.

నేను రెండు మూడు మిషన్లు మారి లీవర్ గట్టిగా లాగాను. గలగల రాలాయి క్వార్టర్లు! ఉష సంతోషంతో గెంతింది. నీలో ఇంత హుషారుందా?

కౌంటర్ దగ్గర బుట్ట ఇస్తే ఆటోమేటిక్ కౌంటింగ్‌లో 32 డాలర్లు ఇచ్చాడు.

గీతా ఆంటీ ఎక్కడా? అంటూ వెతికి పట్టుకున్నాం.

"నా కోటా అయిపోయిందయ్యా, ఏమోయ్ నీ సంగతేమిటి?" రాజారాం అంటున్నాడు.

గీత బుట్టనిండా కాయిన్స్ తెచ్చింది.

"ఇవ్వాళే డబ్బులు రావటం! ఎప్పుడూ పోవటమే. ఈ రోజు చాలా లక్కీ.... అంటూ గీత సంతోషంగా నవ్వుతోంది! అందానికి ఆనందం తోడయినట్లు!

తర్వాత బైటకు వచ్చాం. ఒక్కసారిగా అట్లాంటిక్ చలిగాలులు ముఖాలకు తగిలాయి చల్లగా – అతి చల్లగా చేతులు ముడుచుకుపోతున్నాయి. జెర్కిన్ జేబుల్లో చేతులు పెట్టుకుని ఆ చెక్క ఫ్లోరింగ్ మీద చల్లని ఉప్పు తుంపర్లు మీద పడుతుంటే గాలికి ఎదురు నడవటం ఓ వింత అనుభవం.

అక్కడే పక్కనే "ఇక్కడ మీ అదృష్టం చెప్పబడును" అని "అరచేయి చూస్తామని" చిన్నచిన్న సైన్‌బోర్డులు ఉన్నాయి! మనుషులెక్కడైనా ఒక్కటే – బలహీనతలు, యూనివర్సల్. వీటికి జాతి, మత భేదాలుండవు!

తెల్లవారుతుండగా ఇల్లు చేరాం.

❖ ❖ ❖

అట్లాంటిక్ సిటీ ట్రిప్ కూడా ఉషకు కీడే చేసింది. ఆ తర్వాత రాత్రి నరేష్ చేసిన గొడవ నాతో చెప్పింది. "మీతో చనువుగా ఉన్నానని అసూయతో మండిపోతున్నాడు. హి ఈజ్ ఎ బీస్ట్" అని.

"మీకు తెలుసా, నేను కావాలనే ఎగ్జామ్ సరిగ్గా రాయలేదు" అని ఆర్‌డిఎక్స్ పేల్చింది!

ఇంకా ఎన్ని వినాలో?

"నేను ఎగ్జామ్ పాసయితే ఉద్యోగం వస్తుంది. ఉద్యోగం వస్తే నన్ను వదిలిపెట్టడు! ఇప్పుడు నన్ను ఎలా వదిలించుకోవాలా అని వంకలు చూస్తున్నాడు. ఎస్! అదే నాక్కావాలి" అని నిజాలు కక్కింది.

నాలో గొలుసులన్ని తెగిపోయాయి. ఇప్పుడు కనుల ముందు పొరలు కూడా విడిపోతున్నాయి.

ఆ రాత్రి మెలకువ వచ్చి ఆమె గది తలుపు తీసి చూశాను.

అంత పెద్ద క్వీన్ బెడ్ మీద నిశ్శబ్దం గూడు కట్టినట్లు, నిరాశ నిద్రపోతున్నట్లు పోతపోసిన మంచుగడ్డలా పడి ఉంది!

ఆ తర్వాత రోజుల్లో నాతో ఇంకా చనువుగా ఉంటోంది. నన్ను వదిలిపెట్టకుండా తిరుగుతోంది. నాలో – నా ఎద లోయల్లో మోగిన సంగీతం

ఇప్పుడు స్పష్టంగా చెవుల్లో వినపడుతోంది. ఆ రాత్రి డిన్నర్ తర్వాత, నరేష్ ఒక్కసారిగా ఫ్లాష్‌న్యూస్ చెప్పాడు. "రేపు నేను ఇండియా వెళ్తున్నాను. ఒక నెలరోజుల్లో వస్తాను.....

ఎవరితో చెప్తున్నాడు? అందరం అవాక్కయిపోయాం!

"ఏమిటిరా ఇంత సడెన్‌గా.....?" గీత.

"ఎందుకోయ్ ఇప్పుడు?" రాజారాం.

"ఇంకో వారం రోజుల్లో నేను కూడా వస్తాను కదా" నేను.

ఉష మౌనంగా ఉండిపోయింది. మర్నాడు రాజారాం, నేను కెన్నడీ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా ఫ్లైటు ఎక్కడానికి నరేష్‌ని దింపి వచ్చాం!

✤ ✤ ✤

ఆ ఉదయం ఆలస్యంగా లేచాను. నాకు తెలియకుండా ఈ నిశ్శబ్దం నా నరాల్లోకి పాకుతోంది. నేననుకోకుండానే ఇక్కడి ఒంటరితనం నాకు జంటగా నడుస్తోంది. గోరువెచ్చని నెత్తురు చల్లబడిపోతున్నట్లు, గుండెలోని ఆవిరులు మంచుపట్టినట్లు, నా నుంచి నేను దూరమైపోతున్నట్లు, వర్తమానంలో నుంచి వాస్తవంలో నుంచి పారిపోతున్నట్లు, మంచు పర్వతాల అంచుల నుంచి జారిపోతున్నట్లు పీడకలగా అనిపించింది!

ఒళ్ళు విరుచుకుని సరాసరి బాత్‌టబ్ గోరువెచ్చని నీళ్ళలో పడుకున్నాను. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చాను!

"హాయ్! గుడ్‌మార్నింగ్!" కిందకి రాగానే మగ్‌తో కాఫీ ఇస్తూ ఉష హుషారుగా అంది.

"యూనో? ఇంక తను రాడు!"

ముందు మెరుపు మెరిసి, తర్వాత పిడుగుపడినట్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఏమిటి? నా మనసులో తెగిన గొలుసులు కాళ్ళకు చుట్టుకుంటున్నాయి? నేను మాట్లాడకముందే– "నన్ను న్యూయార్క్ తీసుకెళ్లండి, మీరు చూసి ఆనందించే ప్లేసెస్ నేనూ చూస్తాను."

పొద్దున్నే రాజారాం 8.15 ని॥లకు బయలుదేరాడు న్యూయార్క్‌కు. 45 నిమిషాలు డ్రైవ్ – లింకన్ పార్క్‌వే పైన. హడ్సన్ నది. వాషింగ్టన్ బ్రిడ్జి మీదుగా రోజూ అయిదారు డాలర్లు టోల్ కట్టి న్యూయార్కులో బ్రాంక్స్ ఏరియాలో ప్రవేశిస్తాం. గ్రాండ్ కాంకోర్స్‌లో దిగి, 181 స్టేషన్‌లో సబ్‌వే ట్రైన్ ఎక్కి, మన్‌హాటన్ ఫిఫ్త్ ఎవెన్యూలో దిగి, అక్కడి నుంచి న్యూయార్కు వీధులన్ని తిరగాలి. న్యూయార్క్ అంతా ఇలానే తిరిగాను.

ఈ రోజున పక్కన ఉష ఉంది. జీన్‌పాంటు, ఫుల్ టీషర్టు, పైన వైట్ జర్కిన్ వేసింది. గాగుల్స్ కూడా పెట్టుకుంది. తనకు కొత్తగా స్వేచ్ఛ లభించినట్లు వదులుగా కురులు వదిలేసింది.

ఒక్కసారిగా మాంటివిల్లి ప్రశాంతతలో నుంచి ఎనిమిది లేన్ల కార్లు – వాషింగ్టన్ బ్రిడ్జి స్టీలు భూతం, బ్రాంక్స్ నల్లవాళ్ళ గలీజు గల్లీలు, సబ్‌వే రైలు హడావుడి శబ్దాలు. రైలుపెట్టెలో చల్లదనం, శవాలు ఊగుతున్నట్లు మాట్లాడని ప్రయాణీకులు – ఎలుక కలుగులోనుంచి ఒక్కసారిగా బయటపడినట్లు మన్‌హటన్ ఆకాశ హర్మ్యాలు – ఇవన్నీ చూసి బెదిరిపోయినట్లు – నా చేతిని గట్టిగా పట్టుకుని వదల్లేదు – అక్కడ నుంచి వరల్డ్ ట్రేడ్ సెంటర్, ట్విన్ టవర్స్ దగ్గరకు వచ్చాం! నాకెంతో ఇష్టమైన ప్రదేశం!

జంట అందగాళ్ళవలె నిలువునా ఆకాశంలోనికి చొచ్చుకుపోయే ఈ రెండు అద్దాల భవనాలు – పైన ఉన్న అబ్జర్వేటరి – ఆపైన ఉన్న ఓపెన్ డెక్ నాకెంతో ప్రియం! థ్రిల్లింగ్‌గా ఉంటుంది. అరచేతిలో మెత్తని గులాబీల స్పర్శ ఉన్న ఈ రోజు ఇంకా బావుంది.

కింద, రెండు భవనాల మధ్య థాయ్ ఫెస్టివల్ జరుగుతోంది. వాట్ ఎ లక్! నాకెంతో నచ్చిన థాయ్ కల్చరల్ ఫెస్టివల్ గంటసేపు చూశాం. ఆ భవనాలు మాకు గొడుగు పట్టినట్లు నీడ పడుతుంటే – రామాయణంలోని దేవతలు – అక్కడ నర్తిస్తుంటే ఇక్కడ వినిపించే సంగీతం అవుటాఫ్ ది వరల్డ్ మ్యూజిక్‌లా ఉంది! నేను పులకరించిపోయాను.

అంతసేపు నన్ను అంటిపెట్టుకుని ఉన్న ఆమె సున్నితమైన ఉనికి కూడా అందుకు కారణం కావచ్చు.

"రా, పైకి వెళ్దాం. బాగుంటుంది" అన్నా. 12 డాలర్ల టికెట్లు కొని నూటపది అంతస్తులు 57 సెకండ్లలో తీసుకొని వెళ్ళే రాకెట్టులాంటి ఎలివేటర్లో అబ్జర్వేటరీకి వచ్చాం!

ఓహ్! వాట్ ఎ ఫీలింగ్ – ప్రపంచం అంతా మీ పాదాల కింద ఉన్నట్లు! ఈ రోజు ఎంత ఆనందంగా ఉంది. చుట్టూ తిరిగాం. ఒక్కొక్క విండో దగ్గర – అక్కడ నుంచి కనపడే ప్రదేశం గురించి వివరాలు.... నేను చాలాసార్లు ఒంటరిగా వచ్చి చూసినవే – ఈ రోజు ఇంకా అందంగా ఉన్నాయి.

"ఏమయినా తింటావా?" అబ్జర్వేటరీ రెస్టారెంట్‌కి వెళ్ళాం. అక్కడన్నీఉన్నాయి. తనేమీ వద్దంది! అక్కడ ఉన్న స్ట్రాబెరీ ఐస్‌క్రీం పొగలు చిమ్ముతోంది! చెర్రీ జెల్లి ఎర్రగా మెరుస్తున్నది. ప్లాస్టిక్ స్పూన్‌తో ఆ గులాబీ రంగు మంచు ముద్దని నోట్లో పెట్టుకున్నాను. నీటిలో నిప్పులా ఒక్కసారిగా నోరు కాలింది.

తర్వాత ఓపెన్ టెర్రస్‌కి ఎస్కలేటర్‌లో వెళ్ళాం. ఒక్కసారిగా అట్లాంటిక్ చలిగాలులు ఊపేశాయి. గట్టిగా రైలింగ్ పట్టుకుని తన్మయత్వంతో చుట్టూ పరికించి చూశాను. అదిగో లేడీ లిబర్టీ – ఇటు ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ – అటు స్టేటస్ ఐలాండ్! కాళ్ళ కింద కనుల ముందు మన్‌హటన్ మహాసౌధాలు – తోరణాల్లాగా ఈస్ట్ రివర్ మీద వంతెనలు. ఆకాశంలో తూనీగల్లాగా తిరుగుతున్న హెలికాప్టర్లు – మధ్యలో పెద్ద ఎమరాల్డ్‌లాగా సెంట్రల్ పార్క్... థ్రిల్లింగ్! రియల్లీ వండర్‌ఫుల్!

"ఉషా" అని దగ్గరకు లాగాను. ఆమె బుగ్గలు ఇందాక చూసిన స్ట్రాబెరీ రంగులో ఉన్నాయి. ఆమె పెదాలు – చెర్రీ జెల్లీలా మెరుస్తున్నాయి. నా వంట్లో నుంచి ఏవో సెగలు వస్తున్నాయి. మా చుట్టూ ఉన్నవాళ్ళు – కౌగిలింతలు, ముద్దులలో మునిగి ఉన్నారు.

"ఎలా ఉంది ఇక్కడ?"

అడక్కుండా ఉండవలసింది!

"ఏముంది, ఇక్కడ....?"

నాకైతే అక్కడ నుంచి దూకాలని అనిపించింది! తర్వాత, ఆమెను కిందకు తోయాలనే భయంకరమైన ఆలోచన వచ్చింది!

"ఏమీ లేదా? నీకు ఎక్కడా తేడా లేదా?"

ఆమె సమాధానం చెప్పేలోపు, గట్టిగా దగ్గరకు లాగాను. ఆమె స్తనాలు, రెండు మంచు ముద్దల్లా నా గుండెలకు తగిలాయి. స్ట్రాబెరి బుగ్గల్ని అరచేతుల్లో పట్టుకుని, కసిగా ఆ చెర్రీ జెల్లీ పెదాలను నా నోటిలోనికి లాగాను. ఒక్కసారిగా ఆమె చల్లని పెదాలు నా నోట్లో మండాయి! మెల్లమెల్లగా ఆమె చేతులు నా మెడకు చుట్టుకున్నాయి!

అతి సహజమైన ఇష్టం.

ఆమె కదలికల్లో కరుగుతున్న జడత్వం.

అహం ఆవిరవుతున్న నిశ్శబ్దం!





రెప్పచాటు లోకంలో



ఈ మధ్యనే 'ఊపిరి' అని సినిమా వచ్చింది. దీనికి మూలం ఫ్రెంచ్ 'ఇన్‌టచబుల్స్' – నిర్మాతలు నిజమైన సంఘటనలతో కథ నడిపినట్లు చెప్పారు. ఇప్పుడు మీరు చదువబోయేది దీనికంటే ఆర్ద్రమైన యధార్థ గాథ. మన కళ్ళు తడిపే కనురెప్ప కథ!

ముందుమాట :

పారిస్‌లో ఎల్లే పత్రిక సంపాదకుడు జీన్ డొమినిక్ బాబి (43 సం॥లు) ఒకరోజు మధ్యాహ్నం కారులో ప్రయాణం చేస్తూ హఠాత్తుగా కోమాలోకి జారిపోయాడు (డిసెంబరు 8, 1995).

అతని రోగాన్ని 'లాక్డ్ ఇన్ సింట్రోమ్' అన్నారు. శరీరమంతా చచ్చుబడిపోయి, మెదడు మాత్రం పనిచేస్తున్నది. కేవలం ఒక ఎడమ కనురెప్పలు కదపగలుగుతున్నాడు!

ఆ రెప్పపాటు కదలికతో, అక్షరం అక్షరం కూర్చి, తన భావాల్ని, బాధల్ని ఓర్పుగా ఒక సెక్రటరీ సాయంతో పుస్తక రూపంలో తెచ్చాడు!

❖ ❖ ❖

ఆ రోజు కూడా ఉదయాన్నే నిద్రలేచాను కానీ అదే నిద్ర నుంచి లేవటం చివరిసారి అని అనుమానం రాలేదు.

ఆకాశం మబ్బులతో మసకబారింది. వాతావరణం మూగగా మూలుగుతోంది. జనాలు ఏదో దిగులుగా తలలు వంచుకుని సాగిపోతున్నారు. పారిస్ బస్సులు, రైళ్ళు అన్నీ సమ్మెలో ఉన్నాయి. అస్తవ్యస్తమైన జనజీవితం, ప్రతి పౌరుడూ ఏదో శిక్షలాగా అనుభవిస్తున్నాడు.

నేను కూడా ఈ అయోమయంలోనికి అడుగుపెట్టాను. రోజువారీ పనులు, ఇప్పుడవే ఒక మాయలా అనిపిస్తున్నా - మామూలుగానే జరిగిపోయినాయి.

ఈ రోజేకదా, ఆ కొత్త మోడల్ జర్మనీ కారు తీసుకురమ్మని చెప్పాను! పారిస్‌కి దూరంగా ఉన్న మా బాబు థియోఫిల్‌ని, ఇంటికి తీసుకురావాలని అనుకున్నాను!

అపార్ట్‌మెంట్ మెట్లు దిగుతుంటే కొత్తగా పెట్టిన పాలిష్ వాసన వస్తోంది.

ఇదే చివరి వాసన - నాకు తెలిసేది అని కూడా తెలుసుకోలేకపోయాను.

అదిగో తళతళ మెరిసే కారుని ఆనుకుని తెల్లని దుస్తుల్లో నవ్వుతూ నిలబడి ఉన్నాడు డ్రైవర్.

ఎల్లే పత్రిక కార్యాలయంలోనికి రావటం, ఎడిటోరియల్ గదిలో మధ్యాహ్నం వరకు అంతా సవ్యంగానే జరిగిపోయింది.

లంచ్ అందరం కలిసే చేశాం. అప్పుడు కూడా అదే ఆఖరి భోజనం అని అనుమానం రాలేదు. మెల్లగా ఆఫీసు గది వదలి క్రిందికి వచ్చి, కారు డ్రైవరు సీటులో కూర్చుని బాబు దగ్గరకు బయలుదేరాను. అప్పటికి మధ్యాహ్నం 3 గంటలయింది. కారు పోనిస్తుంటే రోజూ తిరిగే రోడ్లయినా అంతా కొత్తగా అనిపించసాగింది. ఏదో తెలియనిచోటుకు పోతున్నట్లు మా కారుని దాటి పోతున్న కారు రెండుగా కనిపించింది.

అక్కడ కూర్చున్నది బాబు కదూ! సరిగ్గా కనపడటంలేదేమి? బాబుని కారెక్కించుకుని, డ్రైవర్‌ను కారు పోనిమ్మని నేను వెనకసీటులో కూర్చున్నాను. తలంతా ఇలా చెమటలు కారుతున్నాయేమిటి? నా తల వాలిపోతుంటే అంతా అయోమయంగా అయిపోతుందేమిటి? అక్కడికి దగ్గర్లో ఉన్న చెల్లి - నర్స్ డైయోని దగ్గరకు పోనిమ్మన్నట్లు గుర్తు. ఆ తర్వాత ఎక్కడికి జారిపోతున్నాను? ఏదో

చెప్పాలని, కానీ ఏ శబ్దం రావటంలేదే! ఏమిటి ఇది నిద్రా? చీకటా? నీటిలో మునిగిపోతున్నానా? ఎంత లోతు? అడుగెక్కడ? ఎంత దూరం? ఎంతకాలం – ఏమయింది?

జీవిత ఖైదు :

ఆ నలిగిన తెరల్లోనుంచి వెలుతురు తొంగి చూస్తోంది. అంటే తెల్లవారిందన్నమాట. నా తల, ఒక టన్ను బరువు పెట్టినట్లుంది మెడమీద!

కాలి మడమలు మండిపోతున్నాయి. శరీరంలో ఏ భాగమూ కదలిక లేదు. ఒళ్లంతా ఇనుప చట్రంలో బిగించి, తల ఒక్కటే మర్చిపోయారు ఎవరో. కారాగారంలో శరీరం ఉందో, లేక శరీరమే కారాగారంలా మారిపోయిందో ఇప్పుడు నాకు ఏదయినా ఒక్కటే!

ఇప్పుడేమిటి? సంవత్సరం నుంచీ ఇదే స్థితి! నా జీవితాన్ని ఎవరో తుంచివేశారు పువ్వునూ కాడనూ వేరుచేసినట్లు.

మెల్లమెల్లగా వెలుతురు గదిలో పరచుకుంటోంది. నా చిట్టితల్లి సెలిస్టీ నవ్వుతున్న ఫోటో, నా భార్య (సిల్వెస్టి) మెరిసే కళ్లు – బాబు యూనిఫాం అన్నీ కనపడుతున్నాయి.

నాకు ఆహారం పోస్తూ, గాలి అందిస్తున్న గొట్టాలు, సూదులూ వ్రేలాడుతున్నాయి. నేను పడి ఉన్న ఆసుపత్రి మంచం, నన్ను బందీ చేసిన రోగం, అన్నీ తెలుస్తున్నాయి!

ఒక బ్రెయిన్‌స్టెమ్ ఉంటుందని నాకు తెలియదు. దానికీ, వెన్నుపూసకీ ఏదో లింకు ఉన్న సంగతి అసలే తెలియదు.

ఏం జరిగిందని, ఆ లింకు తెగిపోయింది? మొండెం చచ్చుబడిపోయింది. మెదడు మాత్రం పనిచేస్తున్నది. నేను ఈ శరీరంలో బందీని! కదల్లేక, మాట రాక, వినికిడి తగ్గి, ఒక్క కనురెప్ప అదీ ఎడమ కనురెప్ప ఒక్కటే నా అధీనంలో ఉండి, మిగతా శరీరం అంతా మాంసం ముద్దలా మిగిలిపోయింది.

కదలిక లేని ఈ శరీరం – వీడని జైలు! జీవిత ఖైదు అనుభవించవలసిందని నాకీ యావజ్జీవ కారాగార శిక్ష ఎందుకు, ఎవరు వేశారు?

చక్రాల కుర్చీ :

ఇరవయి రోజులు మాయలాంటి, మంచు పొరలాంటి, అపస్మారక స్థితిలో నుండి మెల్లమెల్లగా ఈదుకుంటూ పైకి తేలి, తెలుసుకునేసరికి ఈ ఆసుపత్రికి 119వ గదిలో పడి ఉన్నాను. ఇంగ్లీష్ ఛానెల్ ప్రక్క ఫ్రెంచ్ తీరంలోని బెర్సెక్‌లో రెండవ ప్రపంచ యుద్ధంలో గాయపడిన వారికోసం ఎర్రని ఇటుకలతో కట్టిన ఆసుపత్రి ఇది. ఇక్కడ నాకేంపని? మంచం ప్రక్కనే చక్రాల కుర్చీ కనపడుతోంది.

ఆ రోజు చక్రాల కుర్చీ వాళ్లు తోసుకువచ్చిన రోజు!

అప్పటివరకూ నాకేమయిందో తెలియని స్థితి. నా కదలిక, నా మాట, మళ్ళీ మామూలు అవుతుందని ఆశతోనే ఉన్నాను. కాని, చక్రాల కుర్చీ తెచ్చి, నాకు మంచి బట్టలు మార్చి (నాలో నమ్మకం కలిగించటానికని అన్నారు).

ఇక ఇదే నీ ప్రపంచం – ఇదే నీ కదలిక అని శాసనం రాసి, వైద్యులు వెళ్ళిపోయారు. నర్సు వచ్చి, వార్డ్‌బాయ్ సాయంతో నన్ను కుర్చీలోకి మార్చి, ఆసుపత్రి వరండాలు అన్నీ త్రిప్పి, తల వాలిపోతుంటే ప్రత్యేకమైన దిళ్ళు పెట్టి, "ఈ కుర్చీ మీకు బాగా కుదిరింది. ఇందులో మీరు సుఖంగా ఉండగలరు" అని అన్నప్పుడు నాకు జీవితఖైదు విధించినట్లనిపించింది! నా మెడమీద తలారి కత్తి పడినట్లు వణికిపోయాను.

గమ్మత్తుగా, ఈ చక్రాల కుర్చీలో నేను సెటిల్ అయినా తర్వాత నా శ్రేయోభిలాషులు అందరూ వచ్చి అన్ని విషయాలూ చెప్పటం మొదలుపెట్టారు. నా స్థితి, స్థిరపడిన తర్వాత ఇక అది మామూలు అయిపోయింది. అన్ని విషయాలు, చివరికి నా రోగం, "లాక్డ్ ఇన్ సిండ్రోమ్" అని కూడా నిర్భయంగా చర్చించుకున్నాము.

ఈ రోగం రావటం, లాటరీ గెలవటం ఒకటే.

అది అంత అరుదైన విషయం మరి.

చచ్చుబడిన నా నరాలు మళ్ళీ పనిచెయ్యాలి అనుకుంటే, ఇంతవరకూ అలాంటి దాఖలాలు లేవు. అది కూడా నత్తనడకే. అదృష్టం బాగుంటే ఈ గొట్టాలు లేకుండా గాలి పీల్చగలగటం కొన్నాళ్లలో సాధ్యం కావచ్చు.

దీపస్తంభం :

సరే, వెలుతురు ముదిరింది కదా. 8.30 గంటలకు ఫిజియో థెరఫీ కోసం 'బ్రిగెట్' వస్తుంది. నా కాళ్ళూ, చేతులూ, వ్యాయామం చేయిస్తుంది. అరచేతులు రాస్తుంది. తన చేయిని నొక్కమని అంటుంది. నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. కానీ, నా చచ్చుబడిన చేతిని మంచం మీద పెడుతుంది.

చివరికి నా ముఖం మీద మసాజ్ చేస్తుంది. సగం స్పర్శజ్ఞానం మిగిలి ఉంది. అది కూడా ఎడమవైపు మాత్రమే సరిగ్గా నా పెదవులు సగానికి గీత గీచినట్లు ఎడమవైపునే తెలుస్తుంది. నాకు నేను సగం నవ్వు నవ్వగలను. అది ఎదుటివారికి తెలియాలి కదా.

నన్ను వారానికి ఒకసారి స్నానం చేయిస్తారు. ఈ స్నానం ప్రక్రియ నన్ను విపరీతమైన మానసిక క్షోభకు గురిచేస్తుంది.

ఒకప్పుడు – 'మార్టిని' ప్రక్కన పెట్టుకుని, దినపత్రికల దొంతర్లు పట్టుకుని, గంటలతరబడి, బాత్‌టబ్‌లో గడిపేవాడిని నా కాలి బొటనవ్రేళ్లతో వేడి, చన్నీటి పంపులు తిప్పుతూ, గోరువెచ్చని ఆనందాన్ని అనుభవించేవాడిని.

ఇప్పుడు – నా దయనీయ స్థితి నాకే భయంకరంగా తోస్తున్నది. రోజూ ఉదయం పదిగంటలకు వార్డ్‌బాయ్ వచ్చి చక్రాల కుర్చీలో నన్ను ఆసుపత్రి వరండాలలో త్రిప్పుతాడు.

ఒక గంట, గమ్యం లేకుండా తిరుగుతాము. మధ్యలో నా తల వాలిపోతుంటే సరిచేస్తాడు. నా రెప్పపాటుతో అతనికి కృతజ్ఞతలు తెలియజేస్తాను. అది అతనివరకూ చేరాలి కదా!

ఈ గంట పూర్తిగా అతనికే వదలివేస్తాను. ఎందుకంటే, ఈ విధంగా ఎన్నో అనుకోని కొత్త ముఖాలు, తెలియని కోణాలు ఆసుపత్రిలో చూడగలిగాను. ఆ రోజు అనుకోని విధంగా వేరే అంతస్తులో లిఫ్ట్ ఆగింది. అందులో నుంచి వరండాలోనికి రాగానే సరిగ్గా అక్కడే ఆ 'దీపస్తంభాన్ని' చూశాను.

ఎరుపు, తెలుపు చారలతో ఎంతో ఠీవిగా బీచ్ ఒడ్డున నిలబడి వెలుగులు విరజిమ్ముతోంది. నావికులకు దారి చూపటమే కాకుండా నాలాగా గతి తప్పిన ఒంటరి రోగులకు కూడా తీరాన్ని తెలిపే దీపంలా తోచింది.

నన్ను నేను ఆ దీపస్తంభానికి ఆసరాగా చేసుకుని, రాత్రి చీకట్లు ముసిరేవరకూ, చలిగాలి వరండా అంతా నిండేవరకూ అక్కడే ఆ కుర్చీలో దుప్పట్ల అడుగున ఉండేవాడిని, నా చీకటి బ్రతుక్కి, ఆ లైట్‌హౌస్ దారి చూపేది. నన్ను తన కాంతిరేఖలతో దిగంతాలకు తీసుకుపోయేది.

వింత రోగులు :

ఈ వరండాలలో తిరుగుతూనే, ఆసుపత్రి రోగులను తెలుసుకున్నాను. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత క్షయవ్యాధిగ్రస్తులకు రక్షణ కల్పించి, తర్వాత పిల్లల సంక్షేమం కోసం సేవలందించింది. ఇప్పుడు వింత రోగులకు నిలయమై నిలిచింది ఈ మారిటైం ఆసుపత్రి.

ఒకచోట దొంద ఒళ్లు రోగులు కదల్లేక ఆశగా వైద్యులు తమ ఒళ్లు తగ్గిస్తారని చూస్తుంటారు. ఒకచోట కాళ్లూ, చేతులూ తెగినవాళ్లు ప్రమాదాల సంఖ్యను గుర్తుచేస్తుంటారు. అన్ని రకాల భంగిమల్లో శీలలు వేసి బిగించిన అవయవాలతో అవస్థపడుతుంటారు.

ఇక మా కోసం, ఒక మూల చోటు కావాలి కదా! రెక్కలు తెగిన పక్షులం. పలుకలేని చిలుకలం. ఒక వరండా చివర, ఎవరికీ అడ్డు రాకుండా, మిగతా 'అదృష్టవంతులైన' రోగులకు దూరంగా మా గూడు.

రోగులందరకూ 'జిమ్' కూడా ఉంది. అదొక మాయలోకం! మోటార్ సైకిల్ ప్రమాదంలో ఎముకలన్నీ తునాతునకలైన కుర్రవాడు. నిచ్చెన పైనుంచి పడి, కాళ్లు విరిగిన ముసలమ్మ, రైలు కిందపడి కాలు తెగిన నడివయస్కుడు, వరుసగా వ్యాయమం చేస్తుంటారు. చేతులు, కాళ్లు ఆడిస్తూ మోతలు చేస్తుంటారు. నన్ను కూడా అరగంట ఏటవాలుగా వేలాడదీస్తారు! ఈ తతంగం తర్వాత చక్రాల కుర్చీలో నా 119 గదిలో వదలి, వార్డ్‌బాయ్ 'బోన్ ఆపిటైట్' అని చెప్పి వెళ్ళిపోతాడు.

"బోన్ ఆపిటైట్" ఆహా! భోజనం చేసి ఎంతకాలం అయింది! కాస్త నిమ్మనీళ్ల చుక్కలు తప్ప, ఏమీ గొంతు జారిన గుర్తు లేదు."

అన్నీ గొట్టాలు, సూదుల ద్వారానే కావలసిన శక్తి దేహంలోనికి వెళ్తుంది. కాని నా ఆనందం కోసం, నా మూడ్‌నిబట్టి, నాకిష్టమైన పదార్థాలు, రొయ్యల

వేపుడు, వైట్‌వైన్, బాయిల్డ్‌ఎగ్, సన్నగా తరిగి అన్ని సరిగ్గా ఉండాలి కదా. టోస్ట్ చేసి, మంచి సాస్‌వేసి, ఎదురుగా పాత్రల నిండా పెట్టుకుని ఆరగిస్తాను. అబ్బ! ఎలాంటి విందు! కాని ఇప్పుడు అజీర్తి అన్న సమస్య లేదుకదా!

రెప్పపాటు భాష :

పగలే నా అక్షరదేవత 'సాండ్రిని' వస్తుంది. మధ్యాహ్న సమయంలో ఈ ప్రపంచానికీ నాకూ గల ఒక్క సంబంధం, నా ఎడమ కనురెప్ప కదా! ఆ రెప్పపాటుతోనే నాకీ అక్షర దేవత – ఎలా 'మాట్లాడాలో' కోడ్ చేసి నేర్పింది.

"నీవు అక్షరాలు చదువుతూ ఉండు! నేను రెప్పపాటుతో ఎక్కడ ఏ అక్షరమో తెలియజేస్తాను" ఈ విధంగా ఒక మాట, ఒక వాక్యం ఏర్పడుతుంది. ముందుగా నా భావాన్ని ప్రోదిచేసి, వాక్యాల్ని కూర్చుకుని, పదాలుగా విడగొట్టి, అక్షరాలుగా దర్శించి, అప్పుడు ఒక్కొక్క రెప్పపాటుతో అక్షరాలను మాలగా చేర్చి, పదాలు వాక్యాలుగా గుదిగుచ్చి నా గుండెగోడును తెలియచెప్పుకుంటున్నాను.

ఇది ఎంత ఓర్పు, శ్రమ, సమయం పడుతుందో నా గోడంతా అక్షర రూపంలో రావటానికి, నా సెక్రటరీ 'క్లాడీ'కి ఎంత నేర్పు, ఓర్పు కావాలో ఎలా వర్ణించను? ఆమె నవ్వుతూ ఎప్పుడూ విసుగు దగ్గరకు రానీయకుండా ఎంతో సమయస్ఫూర్తితో వ్యవహరించేది. ఆమెకు ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపగలను?

నా మనసు తూనీగలాగా ఎగురుతోంది. సీతాకోక చిలుకలా తేలిపోతుంటుంది. అంతరిక్షంలో కాలంతో ఎటు కావాలంటే అటు ఎగిసిపడుతుంది.

నాకిష్టమైన ప్రదేశాల్ని, నేను ప్రేమించిన అమ్మాయిని, నా చిన్ననాటి కలల్ని, నా యౌవనపు ఆశల్ని అన్నింటినీ సాఫల్యం చేసుకోగలుగుతున్నాను. ఇలా తిరిగితిరిగి అలసిపోతాను. కాని ఈ పడక యాత్రల్ని గ్రంథస్థం చెయ్యాలి కదా!

శబ్దాలు :

నా మెడ కొద్దిగా త్రిప్పగలుగుతున్నాను. అంటే నా దృష్టి తీరాలు పెరిగాయన్నమాట. ఇప్పుడు పై వరండాలో నుంచి బీచ్, సముద్ర జలాలు, రంగురంగుల గొడుగులు, బీచ్‌లో పరుగులు తీసే చిన్నారుల్ని చూడగలుగుతున్నాను. కాని ఈ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు.

ఒకరోజు కంటి వైద్యుడు వచ్చి, నా కుడిరెప్ప ఎప్పుడూ తెరిచే ఉంటుందని, దానివల్ల కను గ్రుడ్డు చెడిపోతుందని చెప్పి, రెప్పను మూసి కుట్లు వేశాడు. పైగా "ఆర్నెల్లేకదా" అన్నాడు. దేనికి ఆరునెలలు? అతను మేజోళ్ళు కుడుతున్నట్లు నా కుడి రెప్ప మూసి కుడుతుంటే అర్థం లేని భయంతో లోలోపల ఉడికిపోయాను. పొరపాటున, నా ఎడమ రెప్ప మూసివేస్తే నా గతి ఏమిటి? అని ఆందోళన ఆవహించింది. ఈ ప్రపంచానికీ నాకూ మధ్య తెరిచి ఉన్న చిన్న కిటికీ అదేకదా!

ఆ తర్వాత శబ్దాల హోరు. దూరంగా బీచ్‌పైన విమానం ఎగురుతుంటే ప్రక్కనే ఏదో మిల్లు ఆడుతున్నట్లు కిటికీలో నుంచి ఏదో కీటకం గదిలోనికి వచ్చి శబ్దం చేస్తుంటే, అది వంద రెట్లు పెరిగి, చెవులు బ్రద్దలయినట్లు, వరండాలో బూట్ల చప్పుడు అర్థం లేకుండా మోగుతుంటే – అబ్బ! ఎంత భయంకరమైనవి, భరించలేని మోతలు–

ఈ గోలకు దూరంగా, నాలో నిశ్శబ్దం! రంగురంగుల సీతాకోక చిలుకల రెప్పల చప్పుడు వినిపిస్తుంది.

ఆ రెక్కల చప్పుడు వినాలంటే, ఎంతో శ్రద్ధగా ఆలకించాలి. గట్టిగా ఊపిరి పీలిస్తే ఆ రెక్కల చప్పుడు అందులో కలసిపోతుంది. నేను గాలి పీలవలేను కదా. అందుకే ఆ మృదువైన, అరుదైన రెక్కల సవ్వడి వినగలుగుతున్నాను.

చిన్నారి దేవత :

ఇక రాత్రయింది. చీకటి అలముకుంటోంది. చలి ముసురుకుంటున్నది. "లైట్‌హౌస్" నమ్మకంగా, కాంతి వెదజల్లుతోంది. ప్రపంచంలో నాకు తెలిసినవాళ్ల నాకు మేలు జరగాలని నా ఆరోగ్యం కోసం ప్రార్థించే వేళయింది.

'కామరూన్'లో ఆఫ్రికా దేవతలు నాకు స్వస్థతని చేకూర్చాలని ఒక అభిమాని ప్రార్థిస్తున్నాడు. 'బోరాక్స్'లో మా అత్తగారు మేరీమాతను వేడుకుంటోంది. కాని ఇంత రక్షక కుడ్యాలు నా చిట్టితల్లి సెలిస్టీ ప్రార్థనతో పోలిస్తే ఇసుక గోడలైపోతాయి. తన చిన్నారి కన్నులు మూసి తనకు తెలియని దేవుణ్ణి, నాకు మేలు చెయ్యాలని అడుగుతూ నిద్రలోకి జారుకుంటుంది. సరిగ్గా అదే సమయానికి నాకూ 'నిద్ర' పడుతుంది. నా రెప్పచాటు లోకంలో నా సుషుప్తి సామ్రాజ్యంలో నా చిన్నారి పంపిన దేవత నన్ను కాపాడుతూ వెన్నంటే ఉంటుంది.

ఈ విశ్వాంతరాళంలో అంతర్లీనంగా ఎక్కడైనా, ఈ ఖైదు నుంచి నన్ను విముక్తుణ్ణి చేసే తాళం చెవి దాగి ఉందా?

నాకు 'స్వేచ్ఛ'ను కొనగలిగిన విలువైన 'కరెన్సీ' ఎక్కడైనా లభిస్తుందా? వెతుకుదాం!!

చివరి మాట :

డొమినిక్ బాబి పుస్తకం వారం రోజుల్లో 25,000 కాపీలు అమ్ముడుపోయింది. అంతేకాక, తర్వాత తనలాంటి రెక్కలు తెగిన పక్షుల కోసం ఒక సంఘం పెట్టాడు!

ఇతని స్థితిని, కథను ఒక డైరెక్టర్ ఫిలిం కూడా తీసాడు!

1997 మార్చి 9న కదపగలిగిన ఆ ఒక్క కనురెప్ప కూడా శాశ్వతంగా మూతబడిపోయింది!

ఫ్రెంచ్ టెలివిజన్‌లో ఆ ఫిలిం ప్రసారం చేశారు, ఆయనకు నివాళిగా..







మా ఊరి చెరువు

చెరువు



మంచు పొరల్లో

"ఓల్డాన్"

కాకీ నిక్కరు క్లీనరు కేకతో ఎర్రబస్సు ఆగి "తుస్సు"మని సకిలించింది.

బాబు, నాన్న చేయి పట్టుకుని క్రిందకు దూకాడు. "రైట్–రైట్" బస్సు కదిలి వెళ్ళిన తర్వాత, ఆ ఊళ్ళోకి దారి కనిపించింది.

రాలిన నేరేడు కాయలు టైర్ల క్రింద చితికి నెత్తురు కారుతున్నాయి.

గాజు పురుగులు నలిగి, రోడ్డుకు అతుక్కుపోయాయి. రెండు తూములు దాటి, తడి ఇసుక దారిన, ఆ ఊరి ప్రధాన వీధిలో అడుగుపెట్టారు.

వర్షం వెలిసి చాలాసేపయింది.

పిల్లలు వీధిలో చేరి ఆడుకుంటున్నారు.

ఇది ఏమి ఊరు?

నిండా ముప్పై ఇళ్ళయినా లేవు..... కంకర రోడ్డుకు రెండు ప్రక్కలా కలిపి!

ఉత్తర దక్షిణాలుగా కంకర రోడ్డు వంకర లేని గీతలా పరిగెడుతుంది – తూరుపున కొన్ని – పడమర కొన్ని రెల్లు గడ్డి ఇళ్ళున్నాయి!

పడమర ఇళ్లలో ఒకరిద్దరు మోతుబరి రైతులున్నారు. ఒక పోస్టు డబ్బా ఇల్లు. అందుకు పోస్టుమాస్టరు కూడా ఉన్నాడు.

కొద్దిగా ముందుకు దక్షిణంగా వెళితే, ఎడమ ప్రక్కనే నాగభూషణంగారిల్లు, ఎదురుగా అంతా ఖాళీ స్థలం! పడమరంతా పంటపొలాలు!

ఆ ఇల్లు దాటగానే తూర్పుకి ఒక వీధి. బడి వీధి దాటితే కుడి ప్రక్కగా, బాబు, నాన్నగారిల్లు. రెల్లుగడ్డి కప్పు. మట్టిగోడలు – పేడతో అలికిన నేల చిన్న కిటికీలు!

తూర్పు పడమరలకు వాకిళ్ళు – ఉత్తరం ప్రక్కన చిన్న కిటికీ, తెరిస్తే వీధి – ఇళ్ళన్నీ కనపడతాయి. ఇప్పుడు వాళ్ళు నడచిన దారే! దాటిన ఇళ్ళే – బాబు వీధిలోకి పరిగెత్తాడు!

ఆ చివర ఊరికి ఈశాన్యపు దిక్కునే – చిన్న బావి మట్టి వరలు – పైకి తన్నిన నీళ్ళు. ఆ ప్రక్కనే చెరువు. అంచులదాకా నీరు పొంగి కంకర రోడ్డు పక్క సన్నని కాలవలోకి పోతున్నాయి. తూర్పున వెడల్పుగట్టు – పచ్చని గడ్డి! ఉత్తరాన తాడిచెట్లు, పడమర తుమ్మచెట్లు, దక్షిణం దిక్కున ఊరు!

బాబుకి వీధిలో ఆడే పిల్లలు నవ్వులతో స్వాగతం పలికారు. పిల్లలకు, పరిచయాలు అవసరం లేదుగా...

❖ ❖ ❖

"ఎప్పుడొచ్చారు, రావుగారూ...." అని

నాగభూషణం పలకరించారు. నాన్నగారితో బాబు బస్సు కోసం రోడ్డు మీదకు వెళ్తుండగా మర్నాడు. స్కూలుకు నాలుగు మైళ్ళు బస్సులో వెళ్ళాలి – ప్రొద్దునే. తర్వాత బస్సు ఉండదు!

నాగభూషణంగారు అరుగు మీద కూర్చుని చుట్ట కాలుస్తూ ఏం బాబూ! "ఏ క్లాసు?" "తొమ్మిది." "బాగా చదవాలి!" అంటూ బండగా నవ్వాడు.

"సీతా, మంచినీళ్ళు తీసుకురా...."

ఇంట్లోకి చూస్తూ పిలిచాడు.... బండ పెదాలు, బొంగురు గొంతు!

బాబు మొదటిసారిగా సీతను అప్పుడే చూడటం...... ఇరవయ్యేళ్ళుంటాయి. పూల లంగా, పసుపుపచ్చ ఓణీ, కోలముఖం, లావు పెదాలు, మెడలో గొలుసు,

చెవులకు బుట్టలు. మంచినీళ్ళ గ్లాసు అందిస్తున్న చేతికి బంగారు గాజులు, ఎడంచేతికి సన్నటి గడియారం! ఆమెలో అందం కంటే మిసమిసలాడే వయసు ఆకర్షణే ఎక్కువ. నిండుగా, ఆరోగ్యంగా ఉంది!

"బాబూ! సీతక్క!"

"రావుగారు! కాస్సేపు కూర్చోండి.... బస్సుకు ఇంకా టైముందిగా. సీతా, బాబుని లోపలికి తీసుకెళ్ళు."

ఇంకా పూర్తవకముందే "దా...." అని చేయి పట్టుకుని లాక్కుపోయింది.

హాలు పొడవుగా ఉంది. ఒకప్రక్క భోషాణం – చెక్క కుర్చీలు – నిలబెట్టిన మడత మంచాలు. కుడి ప్రక్క గది. హాలు దాటితే పెద్ద దొడ్డి! చుట్టూ గోడ; మట్టిగోడే! ఒక ప్రక్కగా సావిడి – అందులో రెండు ఎడ్లు! ఒక ఆవు. బైట రెండు గేదెలు, ఎండు గడ్డివామి. బండి, నాగళ్ళు పెద్ద వ్యవసాయమే!

వర్షం మూలంగా అంతా రొచ్చుగా ఉంది. గడ్డి, పేడ, నీళ్ళు కలిసిన ఏదో గాటంపు కంపు! సావిట్లో ఎడ్ల దగ్గర బాగుచేస్తున్నారు పాలేళ్ళు!

"బాబురా..." అని గదిలో కూర్చోబెట్టి వంటిల్లు తలుపు తీసుకుని వెళ్ళింది.

గది వెచ్చగా ఉంది! ఒకటే మంచం! పూల దుప్పటి – ఒక ప్రక్క అరమరలో – అద్దం – పాండ్స్ పౌడరు, ఆఫ్గన్ స్నో, దువ్వెనలు, ప్రక్కపిన్నులు అంతా ఆడవాసన! గోడమీద సావిత్రి, నాగేశ్వరరావు కాలెండర్! చెక్రాలు పాలు ఇచ్చి, "తీసుకో.... సినిమాలు చూస్తావా?" "ఆ! 'భలేరాముడు' చూశాను!"

అంతలో రావుగారి పిలుపు "బస్సు వస్తోంది.... రా"

వర్షాకాలం చివరికి చుట్టూ వరినాట్లు అయిపోయాయి. పొలాలు లేత పచ్చగా, వెలిసిన సముద్రంలా ఉన్నాయి. కంకర రోడ్డుమీద నేరేడు చెట్టు కాయలు రాలటం కూడా ఆగిపోయింది!

పొలం పనుల ఒత్తిడి తగ్గి, బండి చక్రాలకు ఆముదం రాయటం, ఎద్దులకు నాడాలు కొట్టించటం. నారతాళ్ళు పేనుకోవటం, బండి పట్టాలు మార్చటం, పనులు చేస్తున్నారు.

బాబు పోస్టుమాస్టర్ కొడుకులతో, ఎదురింటి డ్రిల్లు మాస్టరుతో బాడ్మింటన్ ఆడుతుండేవాడు. రాత్రి వెన్నెల్లో చెడుగుడు పోటీలు పెద్దలు దగ్గరుండి పెట్టేవారు.

సీతక్క అరుగుమీద కూర్చొని అరుస్తుండేది. అప్పుడప్పుడూ కొత్తపల్లిలో "కృష్ణరాయబారం" "ఉద్యోగ విజయాలు" నాటకాలు చూచి తెల్లవారు ఝామున వచ్చేవాళ్ళు!

నాటకాల్లో ఆడవేషాలు వేసే మొగవాళ్ళను ఆడవాళ్ళనుకుని భ్రమపడేవాళ్ళు!

అప్పుడు కాలం బాబుతోనే ఉండేది. రోజులు, వారాలు, నెలలు – పారిపోతుండేవి. దూరాల అలుపు తెలిసేది కాదు. ఉదయాన బస్సు రాకపోతే నాలుగు మైళ్ళు నడిచి స్కూలుకు చేరి, మళ్ళీ సాయంత్రం నాలుగు మైళ్ళు ఆడుతూ పాడుతూ, కంకర రోడ్డుని కాళ్ళతో వెనక్కి తోస్తూ నిద్రగన్నేరు చెట్ల నీడల్లో అగ్నిపూల (ఎర) వానల్లో ఇళ్ళకు చేరేవాడు!

పుస్తకాలు ఇంట్లోకి విసిరి, కావిడితో నీళ్ళు తేవటం, గోడ కట్టటానికి దూడతోపాటు మట్టి తొక్కటం, పారిపోయే కోడిపుంజుని తరిమి పట్టుకోవటం, అలుపు లేకుండా, ఆటల కిందే జరిగేవి....

వెన్నెల రోజుల్లో వెలుగు విరగపూసేది. ఇళ్ళల్లో గుడ్డిదీపాలు ఏడుస్తూ పొగచూరేవి!

వెన్నెలకు రుచి ఉంటుందా? మరి వెన్నెల తిన్న ఇసుక ఉప్పగా ఉందే? ఆడుతూ బోర్లా పడినప్పుడే బాబుకి అది తెలిసింది!

బాబు బాల్య ప్రపంచపుటంచున, కౌమార సౌధంపు బంగారు గుమ్మంలో – రంగుల తోరణంలా ఉన్నాడు!

వెన్నెల, పూలు పూస్తుందని, మల్లెలు, వెన్నెల కాస్తాయని గుర్తిస్తున్నాడు. రక్తంలో అడ్రినలిన్ అలజడిని ఆలకిస్తున్నాడు!

బాబుకి సీతక్క దగ్గరవటానికి ఒక బలమైన కారణం, ఇద్దరికీ తల్లి లేకపోవడమే!

బాబుకి అహం తెలియకముందే అమ్మ వెళ్ళిపోయింది.

సీతక్కకి ఓణీలివ్వకముందే ఏదో తొందర పని ఉన్నట్లు వాళ్ళమ్మ నిష్క్రమించింది. ఈ 'లేని' తనం ఇద్దరినీ 'అయిన'వాళ్ళను చేసింది.

నాగభూషణం గారికి ఇంకో ఊరిలో కూడా పొలాలున్నాయి. రావుగారు ఉద్యోగరీత్యా అప్పుడప్పుడూ ఊళ్ళు వెళుతుండేవారు. ఆదదిక్కులేని బాబుని సీతక్కకు అప్పగించి "రెండు రోజులు నీ దగ్గర ఉండనీయమ్మా" అంటూ! ఆయన దుఃఖాన్ని దిగమింగేవాడు.

కొడుకులు లేని నాగభూషణం గారు బాబుని అభిమానించేవారు.

సెలవల్లో వెదురు గేలంతో చెరువులో చేపలు పట్టేవాడు. పీత బొక్కల్లో నీళ్ళు పోసి, వాటిని బైటకు లాగేవాడు. నీటి పాముల్ని చంపి, కర్రతో తెచ్చి సీతక్కని దడిపించేవాడు. గోచీపెట్టుకుని చెరువులో దిగి, చెవులు, ముక్కు మూసుకుని, నీటిలో మునిగి, కళ్ళు తెరిచి ఇంకో ప్రపంచపు వెలుగును చూసేవాడు – ఎంత కొట్టుకున్నా ఈత రాక, నీళ్ళు తాగేవాడు!

✤ ✤ ✤

కోటి, నాగభూషణం గారి పనిలో ఎప్పుడు చేరాడో బాబుకు సరిగా గుర్తులేదు. వేరే ఊరు నుంచి, వాడికెవ్వరూ లేరని, కోటిని పెదపాలేరుగా తెచ్చి సావిట్లో పెట్టారు. నీరుకావి పంచె, గోచీ పెట్టేవాడు. బనీనుకి ఎక్కువ – చొక్కాకు తక్కువ, ఏదో వేసేవాడు. చిన్న తలకు పెద్ద తలగుడ్డ చుట్టేవాడు.

ఎండకు రాటుదేలి రాయిలా ఉండేవాడు. గడ్డం, మీసాలతో పాటు మెదడు పెరిగినట్లు లేదు. ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. నెత్తిమీద జుత్తు ఎప్పుడూ ఒకలాగే ఉండేది! ఎడం చెవుకి పైన కాడ ఉండేది. వాడి వయస్సెంతో వాడికే తెలియదు.

ఎంత పెట్టినా తినేవాడు – ఏమీ పెట్టకపోతే అడిగేవాడు కాదు.

"ఓరే కోటాయ్! ఎడ్ల దగ్గర బాగుచేశావా? ఉలవలు పెట్టావా?" ఇలాంటి కేకలతో నాగభూషణం గారు వాణ్ణి అదిలిస్తుండేవారు. పగలు ఎద్దులను కడిగి, ఎండుగడ్డితో రుద్దేవాడు..... రాత్రి నాగభూషణం గారు చుట్ట కాలుస్తూ దొడ్లో కూర్చున్నప్పుడు కాళ్ళు పడుతుండేవాడు.

ఏ పనయినా చెప్పందే చెయ్యడు. చెప్పిన పని ఎదురు చెప్పకుండా చేసేవాడు. ఎడ్లబండి కట్టి, వడ్లు మరాడించుకొని వచ్చేవాడు! తుమ్మల్లో పొద్దుగూకేది – పిట్టలన్నీ గూళ్ళకు చేరేవి. ఇళ్ళల్లో గుడ్డిదీపాలు మిణుకుమనేవి. చీకటి రోజుల్లో ఆకాశానికి స్ఫోటకం పోసినట్లు చుక్కలుండేవి. రాలుతుండేవి! ఎద్దులు పగలు తిన్న గడ్డి నెమరేస్తూ కూర్చొని తాదాత్మ్యం చెందేవి.

ఆ సావిట్లోనే, కుక్కిమంచంలో, ఎండుగడ్డి ఆవిరిలో, పేడ, ఉచ్చ కంపులో కోటిగాడు ఈ ప్రపంచాన్ని వదిలి, కలలు రాని నిద్ర లోకాలకు వెళ్ళిపోయేవాడు.

✤ ✤ ✤

ప్రక్క ఊళ్ళో ప్రతి మంగళవారం సంత జరిగేది. సంత రోజున సందడే. పండగలా జనం వచ్చేవాళ్ళు. కూరగాయలు, అన్ని సరుకులు పెద్దవీధిలో రెండు ప్రక్కలా పెట్టి అమ్ముతుండేవారు.

పరద పిట్టలు, పెద్దపెద్ద బాతులు కూడా తెచ్చి అమ్మేవాళ్ళు. దగ్గర్లోనే చీలమండల లోతు పర్రలు, కొన్ని వందల ఎకరాలుండేవి. పదిమైళ్ళ దూరాన సముద్రం ఉండేది. రాత్రిళ్ళు సముద్రపు హోరు వినపడేది!

సంతకు – బాబు సైకిల్ ప్రక్కతొక్కుడు తొక్కుకుంటూ వెళ్ళేవాడు. ప్రక్కనే కోటిగాడు పరిగెత్తేవాడు!

కంకర రోడ్డు మీద రాళ్ళుండేవి. అందుకని ప్రక్కన సన్నటి దారిలో అలలాగా సైకిల్ పరిగెత్తేది. వచ్చీ రాని తొక్కుడుతో కాళ్ళు కొట్టుకుపోయేవి.

కంకర రోడ్డు వంకర లేకుండా మైలు పొడవుండేది. రెండు ప్రక్కలా ఎత్తైన తాటిచెట్లు వరసలో ఉండేవి. ఎవరో రాజు వస్తాడని, ఈ రాజమార్గం వేసి, రెండు ప్రక్కలా స్తంభాలు వరసలుపెట్టి వింజామరులు సిద్ధం చేసినట్లు – ఈ దృశ్యం అద్భుతంగా ఉండేది. తాడిచెట్లు ఎన్నిసార్లు లెక్కపెట్టినా, లెక్క తప్పేది!

సగం దూరం దాటిన తర్వాత చిన్న వంతెన. ఆ ప్రక్కనే మాలపల్లి. ఏసుపాదం బాబుతో పాటు స్కూలుకు వెళ్ళేవాడు.

సంతలో, సందడిలో – జీడీలు, పప్పుండలూ – గాలికి తిరిగే కాగితపు చక్రాలు కొనేవాళ్ళు.

ఈ సంత జరిగేచోట రాత్రిళ్ళు అప్పుడప్పుడూ బుర్రకథలు పార్టీ సభలు జరిగేవి.

ఎక్కువగా కమ్యూనిస్టు సభలు – బుర్రకథలూ జరిపి, ప్రభుత్వం కమ్యూనిస్టులను ఎలా వేధించి, బాధిస్తుందో ఆవేశంతో చెప్పేవారు.

నైజాంలో ఆడవాళ్ళను ఏ విధంగా హింసిస్తున్నారో కళ్ళకు కట్టినట్లు వర్ణించేవారు.

ఒకసారి బాబువాళ్ళు సంత నుంచి తిరిగి వస్తున్నారు. వంతెన దగ్గర ఏసుపాదం ఉన్నాడు. అక్కడ ఆగితే పల్లెలో నుంచి కేకలు, అరుపులు వినపడుతున్నాయి.

"పంచాయితీ జరుగుతోంది. పల్లె పెద్ద తప్పేస్తున్నాడు..." అన్నాడు.

"ఇజ్రాయేలు, రావులమ్మతో పట్టుపడ్డాడు." పెద్దలకంతా కల్లుపోయించి, పందిని కోయించాలి" కాస్సేపు ఆ కేకలు విని ఇళ్లదారి పట్టారు!

బాబుకి ఎవరు తప్పు చేశారో, తప్పెవరికి వేశారో అర్థం కాలేదు!

చలి మొదలయింది....

ఎండ వెన్నెల కాస్తోంది..

వెన్నెల మంచు కురుస్తోంది...

పగలు సగమయి.. రాత్రులు సాగుతున్నాయి. పొగమంచుతో తడిసి, ఆ పైన ముడుచుకుంటున్నాయి. పొగడపూలు విరగబూసి, మంచులో తానమాడి బరువెక్కి ఉదయానికి రాలిపోతున్నాయి! ఊరంతా పొగమంచు దుప్పటి దట్టంగా కప్పుకున్నది. లోకం సద్దుమణిగింది! ఊరు ఎప్పుడో నిద్దరోయింది!

ఆ రాత్రి సీతక్క ఇంట్లోనే ఉన్నాడు బాబు.

"సీతక్కా, నీ పెళ్ళెప్పుడు?"

"మామయ్య జిల్లా ఆఫీసరు చదువుతున్నాడు. ఆయన చదువయి ఉద్యోగం వచ్చిన తర్వాత....."

"అంటే, ఎన్నేళ్ళు....?"

"ఏమో..... ఇప్పటికి పదేళ్ల నుంచీ ఆయన చదువుతూనే ఉన్నాడు!" గొంతులో దిగులు! గుండెలో గుబులు!

"నువ్వు పడుకో....." వంటిల్లు సర్దాలి.....

అని దుప్పటి కప్పింది. ఆమె హృదయం చెరువే అయింది.

గదిలో, గుడ్డి దీపం, చీకటి నోట్లో వణుకుతోంది! చలికి ముడుచుకుని, సీత అడుగుల చప్పుడు కోసం – చెవులు తెరచి వింటున్నాడు –

అతని వంటి వేడికి దుప్పటి లోపలి చలి, తలుపు సందుల్లోంచి పారిపోయింది. ఎప్పుడు నిద్రపట్టిందో?

ఏ అపరాత్రో ఎందుకో మగతలా మెలకువ వచ్చింది.

సీతక్క ఎప్పుడో దుప్పటిలో చేరింది. ఎన్నో రాత్రులు బాబుని తన దగ్గరే పడుకోబెట్టుకుంది. హాయిగా నిద్రపోయేవాడు.

సీతక్క బాబు ముఖాన్ని తన హృదయానికి హత్తుకుంది.... "పిచ్చీ....." అంటూ

ఆమె వయసు వేడి, ఆమె ఊపిరిలో ఆవిరిగా మారి, బాబుకు చలికాస్తోంది.

అతని మనసు – ఆమె రొమ్ముల పొంగులో అమ్మను వెతుక్కుంటోంది.

అతని తొలకరి వయసు, ఆమె పొంగారె యౌవనంలో ఓ ఆటబొమ్మను తడుముతోంది.

దుప్పటిలా కప్పిన బరువైన కురులు

మరుమల్లెలు నలిగిన వింత పరిమళంతో అతనికి

మత్తు మందు జల్లుతున్నాయి. సుతిమెత్తని పాలిండ్ల నడుమ – అతని నాసికాగ్రము ఆవేశపుటావిరికి, కాలుతున్న మంచులా, కరిగిన తడిలో తానమాడుతున్నది.

ఎప్పుడు తెల్లవారింది? రాత్రి కల తొలి వెలుగులో కరిగిపోయింది–

సీతక్క బాబును స్కూలుకు పంపి తన పనిలో మునిగిపోయింది......

నాలుగు రోజులకు నాగభూషణం గారు వచ్చారు. వాళ్ల దొడ్లో ఆవు ఎదయిందని, కోటిగాణ్ణి మలపరాజగూడెం తీసుకెళ్ళమన్నారు. అక్కడ ఒంగోలు ఆంబోతు ఉన్నదని, జాగ్రత్తగా పొర్లించమని చెప్పి డబ్బు ఇచ్చిపంపారు.

వాడు సాయంత్రానికి ఆవును తోలుకొని వచ్చాడు.

తెలతెలవారింది!
తొలి వెలుగు వచ్చింది!
తెరల మంచు కరిగింది!
గరిక చివర చేరింది!
కోడి కూతబెట్టింది!
ఊరు కళ్ళు తెరిచింది!
ఆవు అంబా అంటే – దూడ పాలకెళ్ళింది!
కోడిపిల్లలు గంపదాటాయి.
కాకులు కావుమన్నాయి.
కావిళ్ళు చెరువునూతికెళ్ళాయి.
వాకిళ్ళు కళ్ళాపితో తడిశాయి.
గొబ్బెమ్మలు – మధ్యలో కూర్చుంటే
బంతిపూలు నెత్తికెక్కాయి!
అనంతాకాశం దాటి, కోటి కిరణాలు.

అవన్నీ తలాన్ని ముద్దాడుతున్నాయి! పుడమితల్లి – పులకరించి – వళ్ళు విరుచుకుంటుంది! నవచైతన్యం నేల నాలుగు చెరగులా చెంగులెత్తింది!

సంక్రాంతి వచ్చింది – సంబరాలు తెచ్చింది! నెలపట్టారు. హరిదాసు గజ్జల మోతలో భజన చెక్కలతో, నిగనిగలాడే నగిషీ రాగిపాత్రతో తంబుర నాదంతో, నారదుడిలాగా పరుగులాంటి నడకతో, ఇంటింటికీ ఆగి, బియ్యం వెయ్యటానికి మునికాళ్ళమీద వంగి, స్ప్రింగులా లేస్తున్నాడు.

అతని పాట ఎన్నాళ్లు విన్నా – బాబుకి అర్థంకాలేదు! హరిలోరంగ! హరి! తప్ప.

రాత్రంతా కష్టపడి మంచులో తడిసి, గుమ్మం ముందు వీధిలో వేసిన ముగ్గులు సంక్రాంతి లక్ష్మిని వెయ్యి చేతుల్తో ఆహ్వానిస్తున్నాయి.

పిల్లలంతా పరిగ ఏరుకుని, వచ్చిన వడ్లు శేషావతారం కొట్లో అమ్మేసి, గాలిపటాలు, దారాలు కొంటున్నారు.

అందరి ఇళ్ళల్లో అరిసెలు వండుకుంటున్నారు. బాబుని పిలిచి, సీతక్క అరిసెలు పెట్టింది.

తలంటిపోసి, క్రొత్త మొలతాడు కట్టింది. సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు.

సంక్రాంతి పండక్కి, అందరిళ్ళకూ చుట్టాలు వచ్చారు. క్రొత్తబట్టలు, పిండివంటలు, ముగ్గులూ మురిపాలతో సరదాగా ఉన్నారు. సీతక్క మామయ్య వస్తాడని ఊరంతా ఎదురు చూశారు. ఎందుకనో ఆయన చివరి నిమిషంలో ప్రయాణం మానుకున్నారని తెలిసింది. జిల్లా ఆఫీసరు కాబోతున్నాడు కదా. ఎన్ని పనులో మరి!

సీతక్క దిగుల్ని దిగమింగింది!

కన్నీళ్ళను కనురెప్పల చాటునే దాచింది!

గుండె బరువుని పట్టుచీర పైట మాటునే మోసింది!

రావుగారు తెచ్చిన క్రొత్త బట్టలు – మొదటిసారిగా పాంటు, పొడుగు చేతుల చొక్కా – బాబుకి తొడిగి, తల దువ్వి అతన్ని తేరిపారా చూసి, బుగ్గమీద ముద్దుపెట్టింది. ఒక్కసారి గుండెలకు అదుముకుని, గుండెల్లో బరువు దించుకుంది!

ఎందుకు సీతక్క కళ్ళల్లో నీరు!

కోటికి తెల్ల పంచె, పొట్టి చేతుల చొక్కా ఇచ్చారు నాగభూషణం. వాడి సంతోషానికి అంతులేదు. ఆ బట్టలు వేసుకుని తలగుడ్డ చుట్టుకుని, కోడి ఈకలు పెట్టుకుని ఊరంతా తిరిగాడు. ఆ రోజు సినిమాకు వెళ్తానని డబ్బు తీసుకుని బస్సెక్కాడు....

పండుగ రోజున, మధ్యాహ్నం భోజనాలు నాగభూషణంగారింట్లోనే రావుగార్కి, బాబుకి......

అప్పుడే బాబుని తనదగ్గరే ఉండనివ్వమని రావు గారిని అడిగింది సీత. "వాడిష్టమమ్మా!" అని ఆయన ఆ రోజు పేకాటకు ఇంటికి మిత్రులను పిలిచాడు.

సీతక్క దుప్పట్లో ఎంత హాయిగా ఉంటుంది! అనుకున్నాడు. తనకు అమ్మ ఉంటే ఎంత బాగుండేది! సీతను పెళ్ళిచేసుకుని జిల్లా మామయ్య తీసుకెళ్ళిపోతాడు. అప్పుడు తనకు దుప్పటి ఎవరు కప్పుతారు?

అప్పటికే సీత కోసం చూసిచూసి నిద్రపోయాడు! ఎప్పుడో, ఏ మబ్బుల తాకిడికో మెలకువ వచ్చింది!

"సీతా....."

"ఊ....."

"నీ దగ్గర....."

"ఊ..."

"నీ దగ్గర – కోడి గుడ్డు సొన వాసన......"

"ఛీ...... పిచ్చీ......"

ఆమె జాకెట్టుకు హుక్స్ లేవు.

బలంగా బాబు తలను గుండెకు అదుముకుంది.

సీత అలసి ఉంది!

దుప్పటి మీద ఏదో దబ్బున పడిన చప్పుడు... సీత నిద్రపోతూనే ఉంది.

ఎవరో వస్తున్న అలికిడి.... గదిలో వెలుతురు....

దుప్పటి మీద ఏదో బరువుగా కదులుతోంది

కర్రతో ఏదో తీసిన సవ్వడి!

వెలుతురుతోపాటు అలికిడి కూడా

బైటకు వెళ్ళినట్లు – దుప్పటి మీద బరువు

తీసినట్లు.. ఇదంతా కలా! – తెలవారింది....

మర్నాడు సీతక్క చెప్పింది.

రాత్రి రెల్లు కప్పులో నుంచి కట్లపాము దుప్పటి మీద పడిందని.

కట్లపాము కరిస్తే – దానిమీద ఎన్ని కట్లు ఉంటే అన్నిసార్లు ఎక్కిళ్ళు వచ్చి చచ్చిపోతారని మరి కరవలేదే?

కోటి వచ్చి కర్రతో తీసి, బైటపడేసి చంపాడు. బాబు అప్పుడు చూశాడు. పాము రెండడుగులే ఉంది. ఎన్ని కట్లు? లెక్క పెట్టలేదు. తాడిచెట్లులాగా ఈ లెక్క తేలదు.

కోటి మా ప్రాణాలను రక్షించాడా? అనుకున్నాడు!

పండగ వెళ్ళి పదిరోజులయింది.

రిపబ్లిక్ రోజు శెలవు. ఆ రోజు చెరువులోనే ఎక్కువసేపు గడిపారు బాబు, స్నేహితులు. అక్కడే కోటి గేదెల్ని కడుగుతున్నారు.

ఎవరో చేపలుపట్టేవాళ్ళు వచ్చారు. ఊరి పెద్దలూ వచ్చారు. చెరువులో చేపలు పట్టుకోవటానికి పాటపెట్టారు.

వచ్చినవాళ్ళు కూడబలుక్కుని పాడారు.

ఊరి పెద్దలు, సరే అన్నారు వేరే దారిలేక!

చెరువులో ఎన్ని చేపలుంటాయో ఎవరు లెక్కపెడతారు?

ఇంతవరకు కంకర రోడ్డు రెండు ప్రక్కల ఉన్న తాడిచెట్ల లెక్కే తేలలేదు!

ఈ తాడిచెట్లు కూడా ఆకుల కోసం పాడతారు!

ఎన్ని ఆకులో ఏమి లెక్కో!

బాబుకి కోటాయ్ ముంజికాయలు కోసిపెట్టేవాడు!

✤ ✤ ✤

ఆ రాత్రి....

నేరేడు చెట్టు నిద్రపోతుంది నిశ్శబ్దంగా.

నిద్రగన్నేరు కలలు కంటోంది పూలకళ్ళతో!

నిలబడి తాడిచెట్లు ఊరికి కాపలా కాస్తున్నాయి.

నల్లతుమ్మ దెయ్యాలు కట్టినట్లు కదులుతున్నాయి.

చెరువు వెన్నెల మేసి సాగుతోంది.

లోపలి చేపలు నీటిలోకి జారిన వెన్నెల వెలుగులో కళ్ళు తెరిచి, కలలు కంటున్నాయి.

అంతలో. ఎందుకో నాలుగు చినుకులు రాలాయి ఉన్నట్టుండి!

చెరువు చేపలు నోళ్ళు బైటపెట్టి చినుకులు తింటున్నాయి!

"సీతా....."

"ఏమిటి.... ఇంకా నిద్రపోలేదా"

"నీ దగ్గర...."

బాబు ఆమె నిండు గుండెల్లో నుంచి ప్రపంచంలోకెల్లా మృదువైన ఆమె ఉదరతలానికి జరిగి, ఆస్పర్శానందంలోని అమృతత్వాన్ని, అనంతత్వాన్ని ఆస్వాదిస్తున్నాడు!

"నీ దగ్గర – గడ్డివాసన..."

ఒక్కసారి ఉలిక్కిపడింది "దూడకు గడ్డివేశా.....

అవును ఏదో ఎండుగడ్డి, ఎద్దు కంపు....

అయినా వదిలిపెట్టలేని హాయి – ఆగిపోతున్న రేయి.

ఎందుకు తెల్లవారుతుంది?

ఈ కల ఎందుకు చెదిరిపోతుంది?

✤ ✤ ✤

ఆ రోజు సాయంత్రం – నాగభూషణంగారు ఉగ్రుడై ఉన్నాడు. "ఒరే, కోటిగా" అరిచాడు. కోటి వచ్చాడు.

తెల్ల పంచె పొట్టి చేతుల చొక్కా!

చెర్నాకోలు తీసి, వాడి వళ్ళు చీరాడు

వారు చివర్లు వంటి మీద మండుతుంటే, వాడు కనీసం "అమ్మా" అని కూడా అనలేదు.

అందరూ చేరారు. ఎందుకు కొడుతున్నారో ఎవరూ అడగలేదు.

ఇక్కడ పంచాయితీ ఉండదు - శిక్షే!

నాగభూషణం గారు ఏమి చేసినా ఎవరూ అడగరు-

ఆ రాత్రి కోటాయ్ మాయమయ్యాడు!

వాడి కోసం ఎవ్వరూ ఎదురు చూడలేదు.

ఆ తర్వాత ఎవ్వరూ వెదకనూలేదు!

తెలతెలవారగా, దట్టంగా మంచు పడుతోంది!

సూరీడు ఆలస్యంగా లేస్తున్నాడు.

పొగ మంచు, చెరువు మీద దూదిలా వేలాడుతోంది.

బాగా ఎండ వచ్చిన తర్వాత గాని మంచు తెరలు విడిపోవటంలేదు!

ఆ రోజు ఊరంతా లేచి ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

అప్పటికే చెరువు మీద మంచు విడిపోయింది!

చేపలు వణుకుతున్నాయి.

చెరువు చేపలు పాడుకున్నవాళ్ళు వచ్చారు.

వలలు, తాళ్ళు తెచ్చారు.

చెరువులో దిగి, చేపల్ని ఒక ప్రక్కకు తరుముతున్నారు.

చెరువంతా కెలికి, అల్లకల్లోలం చేశారు.

పెద్దా చిన్నా చోద్యంలా చూస్తున్నారు.

బాబు బస్సు కోసం వెళ్తూ ఆగాడు.

అంతలో ఒక జాలరి కెవ్వున అరిచాడు.

✤ ✤ ✤

శవాన్ని ఒడ్డుకు చేర్చారు–

అందరూ – తోసుకు చూస్తున్నారు!

బాగా ఉబ్బి ఉన్నాడు – అప్పటికే కనుగుడ్లు చేపలు పీక్కుతిన్నాయి.

తెరిచిన నోట్లంచి బురదకొయ్యి బైటకు వస్తోంది...

మోచేతులు ముందుకు వంగి

కాళ్ళు వెనక్కి తిరిగి, వెల్లకిలా పడి

కోటిగాడు – ఈ ప్రపంచాన్ని వెక్కిరిస్తున్నాడు!







పులివేట



హిపొక్రైటిస్, ఒట్టువేసి – డాక్టరు పట్టా పుచ్చుకుంటున్న క్షణంలో తానూ, తన తలిదండ్రులు, సీటు కొనడానికి, తర్వాత ఆరు సంవత్సరాల మొద్దు చదువుకి, సబ్బుకు, పొడరుకు కూడా డబ్బు కోసం ఎన్ని కష్టాలు పడింది – మరిచిపోవటానికే ప్రయత్నించాడు! ఇప్పుడు తను చేయబోయే వృత్తి – పూర్వాపరాలు ప్రక్కనపెడితే తన స్టెతస్కోప్‌తో ఈ విశాల ప్రపంచాన్ని జయించటానికి సిద్ధంగా ఉన్నాడు!

డాక్టరు అయిన తర్వాత తొలిసారిగా తన ఊరికి వచ్చినపుడు ఆ చిన్న పల్లెటూరి జనం, తనపట్ల చూపిన గౌరవం, అతనిలో గర్వాన్ని నిద్రలేపింది. తను వీళ్ళందరికంటే గొప్పవాడు! తను డాక్టరు కదా!

మొదటి ప్రాక్టీసు – ఊరికి దగ్గర్లో జంక్షన్లోనే మొదలుపెట్టాడు. అందరు, డాక్టరు బాబు, డాక్టరు బాబు అంటుంటే పొంగిపోయాడు. మొదట్లో జనం కూడా బాగానే వచ్చారు. ఎవరూ డబ్బు ఇచ్చేవారు కాదు. ఎందుకంటే వాళ్ళ దగ్గర డబ్బు ఉండదు కదా!

పండక్కు, పబ్బానికి అవీఇవీ తెచ్చి ఇచ్చి దణ్ణంపెట్టి దీవించి వెళ్ళేవారు! అయితే అంతవరకూ ఆ చుట్టుపక్కల వైద్యం చేసే డిగ్రీ లేని డాక్టరు చూస్తూ ఊరుకోలేకపోయాడు. ఇతను ఎక్కువ కాలం ఇక్కడ ఉంటే తన సంపాదనకు, తన సామర్థ్యానికి కూడా అపాయమనేనని నమ్మి, ఒక వయసులో ఉన్న నర్సుని ఇతని దగ్గర చేర్పించి, తర్వాత ఒక దొంగ పేషెంటును పంపి, ఒక రాత్రికి

రాత్రి కేసులో ఇరికించగలిగాడు. తర్వాత పోలీసులు, అయిన ఊళ్ళో అల్లరి! నిజం దేవుడెరుగు – అవమానంతో అక్కడ ఉండలేక టౌనుకు చేరాడు!

అప్పుడే తెలిసింది – తన డిగ్రీకి ఉన్న విలువ! టౌన్‌లో ఉట్టి డాక్టరు డిగ్రీ – ఎవరు లెక్కచేస్తారు? కనీసం ఎమ్‌డి లేదా పిల్లల డాక్టర్ అయివుండాలి. లేకపోతే బోర్డు పెట్టినా జనం పట్టించుకోరు! అతను త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుని అక్కడకు అరవై మైళ్ళ దూరంలో అశ్వారావుపేటలో బోర్డు పెట్టి, శ్రద్ధగా హాస్పిటల్లో కూర్చున్నాడు. ఎక్కడో అదృష్టం ఉండి – అతని ప్రాక్టీసు త్వరలోనే అందుకుంది! అతని మీద అతనికి నమ్మకం కుదిరింది. అంతేకాక అతనికి పిల్లనిస్తామని సంబంధాలు కూడా వచ్చాయి.

❖ ❖ ❖

సంవత్సరం తిరిగేసరికి – పదిపడకల ఆసుపత్రితోపాటు రెండు బెడ్‌రూంల ఇల్లు, భార్య – సంసారం అన్నీ ఏర్పాటు చేసుకున్నాడు.

అయిదు సంవత్సరాలు – ఇద్దరు పిల్లలు – రాత్రి పగలు పేషెంట్లు – ఎన్నాళ్ళు చేసినా, పెరుగుతున్న వ్యయం! చాలని ఆదాయం! మనిషిని ఆశ నిలవనీయదుకదా! అందులోనూ డబ్బు సంపాదించాలనే ఆరాటం ఉన్నప్పుడు – ఎప్పుడూ కొత్త దారుల కోసం వెతుకుతూనే ఉంటాడు!

ఇరాక్, ఇరాన్ దేశాలలో డాక్టర్ల అవసరం ఉంది. నెలకు యాభైవేల పైనే జీతాలు వస్తాయి అని వార్తాపత్రికల ద్వారా, తనతో చదివిన ఒకరిద్దరు చెప్పగా, తెలుసుకు ఆ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. హైదరాబాద్ ఇంటర్వ్యూలకు, పేపరులో అడ్రసులకు అప్లికేషన్లు, ఇరాన్‌లో ఉన్న తన దూరపు చుట్టం అయిన మరో డాక్టర్ ఫోన్‌నెంబర్ తెలుసుకుని, ప్రయత్నాలు ముమ్మరం చేశాడు!

అయిదారు నెలల్లో అశ్వారావుపేటలో ప్రాక్టీసు మూసి, భార్యని, పిల్లల్ని అత్తగారింటికి పంపి, అతను నిర్దిష్టమైన గమ్యం, 'ఎశ్యూర్డ్‌జాబ్' లేకుండానే హైదరాబాద్ నుంచి బొంబాయి బస్సులో ప్రయాణం చేసి, వారానికి ఒకసారే వెళ్ళే 'ఇరాన్ ఎయిర్'లో బొంబాయి నుంచి టెహ్రాన్ చేరాడు. అప్పటికే ప్రయాణంతో ఒళ్ళు హూనమై ఉంది.

టెహ్రాన్ ఎయిర్‌పోర్ట్‌లో తనకోసం ఎవరూ లేకపోవటంతో ఒకరకమైన భయం ఆవహించింది. ఇమ్మిగ్రేషన్‌లో నుంచి బైటపడటం కష్టమైంది! ఇప్పుడు ఎవరూ రాకపోతే, ఏమిచెయ్యాలి – ఎలా ఫోన్ చెయ్యాలి? ఇక్కడ భాష తనకు ఒక్క ముక్క తెలీదు! టాక్సీ ఎలా పిలవాలి? అడ్రసు ఎలా చెప్పాలి? అన్నీ భయాలే. జీవితంలో మొదటిసారిగా అతనికి సరిదిద్దుకోలేని పెద్ద పొరపాటు చేసినట్లు అనుకున్నాడు! ప్రతి క్షణం బరువుగా కదులుతున్నట్లు, గాలి స్తంభించినట్లు, చీకట్లు ముసురుతున్నట్లు అనిపిస్తోంది! ఆర్యన్ సూర్యుడు – మసీదు గోపురాల వెనక్కు వెళ్ళిపోతున్నాడు. ఏవేవో పక్షులు నీడలా కదులుతున్నాయి. అతనికి గుండెల్లోని గుబులు దుఃఖంగా ఉబుకుతోంది!

✤ ✤ ✤

ఒక్కసారిగా భార్యాపిల్లలు గుర్తుకు వచ్చారు! తను ఇక్కడకు, ఇంత దూరం ఎందుకు వచ్చాడు? తన దేశాన్ని, సంసారాన్ని వదిలి?

ఇప్పటికీ అతనికి స్పష్టమైన ఆలోచనలే ఉన్నాయి. తను డాక్టరు చదివింది, డబ్బు సంపాదించే మార్గంలోనే, తన డిగ్రీకి ఎక్కడ ఎక్కువ విలువ ఉంటే అక్కడకు రావటంలో అతనికి తప్పు కనపడలేదు.

తన మెడలో ఉన్న స్టెతస్కోప్‌తో తన వృత్తి ద్వారా డబ్బు సంపాదించటానికి, మనుషులెవరైనా ఒక్కటే, గుండె చప్పుళ్ళు అన్ని ఒక్కలాగే ఉంటాయి – రోగాల్లో కూడా జాతి తేడాలేమీ ఉండవు! ఇప్పుడు అతను నిజంగానే ఈ విశాల ప్రపంచంలో ప్రవేశించాడు – తన స్టెత్‌తో!

"రియల్లీ సారీ రావుగారు. టాక్సీ రావటం లేటయింది..." తన ఆలోచనల్లోంచి – తన భయాల్లోంచి ఒక్కసారిగా స్పృహలోకి వచ్చాడు!

ఎదురుగా డాక్టర్ శ్రీనివాస్!

తన జీవితంలో ఇంత 'రిలీఫ్' ఎప్పుడు ఫీలయి ఉండలేదేమో!

టాక్సీలో సామానుపెట్టి, శ్రీనివాస్ ప్రక్కన, వెనుక సీటులో కూర్చుని కారు కదిలిన రెండు నిమిషాల్లో నిద్రపోయాడు! టెహ్రాన్‌కి సబర్బ్‌లో ఒక ఎత్తైన ప్రహరీ, నల్ల ఇనుపగేటు ముందు టాక్సీ ఆగింది! టాక్సీకి డబ్బులిస్తుండగా అతనికి

మెలుకు వచ్చింది! సామాను దింపి గేటు తీసుకుని కాంపౌండులో అడుగుపెట్టారు. ఒకే అంతస్తు ఇల్లు – చుట్టూ తోట – ఇంట్లోకి చేరిన తర్వాత డాక్టరు శ్రీనివాస్ చెప్పాడు. మనతోపాటు ఇంకా ఇద్దరు డాక్టర్లున్నారు. సంతోష్‌రెడ్డి, డాక్టర్ స్వరూప్. ప్రస్తుతం డ్యూటీలో ఉన్నారు – నేను నైట్‌డ్యూటీకి వెళ్ళాలి. ఇప్పుడే – మీరు రిలాక్స్ అవ్వండి – రేపు మాట్లాడుకుందాం. అని పదినిమిషాల్లో తయారయ్యి స్టైత్, వైటు కోట్‌తో బైటకు వెళ్ళిపోయాడు.

✣ ✣ ✣

అరబ్బు షుర్తా మోటు చెయ్యి అతని మెడమీద పడి బలంగా ఒక తోపు తోసింది!

ఆ వెనకనే – బరువుగా షిజ్జిన్ ఇనప తలుపు అతను ఏనాడు వినని వికృత శబ్దంతో మూసుకుంది!

షిజ్జిన్ గదిలో

కొత్తగా బోనులో పెట్టిన పులిలా తిరిగాడు. క్షణం కూర్చోగలిగేవాడు కాదు. విపరీతంగా ఉచ్చ వచ్చేది– తెరలు తెరలుగా – 'మోషన్' అయ్యేది – భయంతో! ఆ షిజ్జిన్ ఇరుకు గదిలో – చీకటి నీడలో –

ఏది ఎక్కడో కనపడేది కాదు. ఒక్క రోజులో అంతా వాసన – భరించలేని కంపు అక్కడే వాంతి కూడా చేసుకున్నాడు. గట్టిగా కేకలు వేశాడు – ఇంకా గట్టిగా అరిచాడు – 'ఎవ్వరైనా వింటున్నారా?' ఒక లావుపాటి షుర్తా తీరుబడిగా వచ్చాడు.

'కైఫీహాలిక్' అంటూ పలకరించాడు.

లోపలి 'కంపు' భరించలేనని చెప్పాడు.

వాడికి అర్థం అయ్యేట్లు.

'ఇన్షఅల్లా' అంటూ

"అలవాటయిపోతుందిలే..."

అన్నట్లు నవ్వాడు

తర్వాత ఒక ప్లాస్టిక్ బకెట్‌లో నీళ్ళిచ్చాడు!

"గుర్ఫాతందీప్ సువ్వి" "మస్సలామ్" అని వెళ్ళిపోయాడు!

షిజ్జిన్ గదిలో ఒంటరితనం,

ఇనప మంచం రూపంలో –
రాతి గోడ చెమ్మలో – గోడమీది 'అరబిస్కి'లో
ఎప్పుడైనా పడే ఓ ఎండ పొడలాగా –
రొట్టెముక్కలతో లోపలికి వచ్చే స్టీలు పళ్ళెం మోతలో –
చిన్ని తలుపు కిటికీ లోంచి తనను చూసే షుర్తా సుర్మ కళ్ళలో,
తను ఎంతో ప్రేమించిన, తన శరీరపు–
ఇప్పటి కంపులోను,
మొదట్లో భరించ శక్యం కాని,
ఇప్పటి మెల్లగా అలవాటయిన ఉచ్చ వాసనలోను –
ఎదురౌతుంటుంది!!
చీకట్లో కళ్ళు తెరిచినట్లు – తెరిచి కళ్ళతో నిద్రపోతున్నట్లు ఇనప మంచం మీద పడి. పైన రాతి సీలింగును చూస్తుండేవాడు –
రోజురోజుకీ తన ఆలోచనలతోపాటు ఆశలు – ఆవిరైపోతున్నట్లు తలంతా ఖాళీ అయి – తేలిగ్గా ఉంటోంది – ఇప్పుడిప్పుడే...
ఈ నాలుగు గోడలు తప్ప తనకేమీ కనపడవు –
అన్నీ శబ్దాలే – ఏవీ అర్థం కావు – ఈ వింత శబ్దాలు – అతను ఎప్పుడూ విననివి – అతనికి పిచ్చెక్కిస్తున్నాయి – తల గట్టిగా పట్టుకుని పెద్దగా అరుస్తున్నాడు – ఇక్కడ ఎవ్వరు వినేది? విని ఎవ్వరు వచ్చేది?
ఇలా ఎన్నాళ్ళు? ఇంకా ఎన్నేళ్ళు?

✤ ✤ ✤

ఖైదులోనే, రోజూ మూడు నాలుగు కిలోమీటర్లు నడుస్తున్నాడు –
షిజ్జిన్ బందరొట్టెలకు మెల్లగా అలవాటు పడుతున్నాడు – డ్యూటీకొస్తున్న షుర్తాలు – కొంచెం అలవాటవుతున్నారు –
'కైఫీహలక్', 'కైఫేహలక్ అమ్టే'
అని పలకరింపులు నడుస్తున్నాయి.
'సుబాల్కర్' 'సుబా ఎల్నూర్'
అని గ్రీటింగులు జరుగుతున్నాయి.
'మసాల్కర్' అనీ
"ఫీ అమానుల్లా....." అంటున్నారు.

"ఇన్షాఅల్లా" అని 'మంచి' కోరుతున్నారు.
ఈ 'స్నేహ'పూర్వకమైన 'వాతావరణం'లో కొంచెం
ఆలోచించగలుగుతున్నాడు–
తను మానసికంగా కోల్పోయిన స్వేచ్ఛను మళ్లీ సంపాదించ
కలుగుతున్నాడు–
అయినా వీళ్ళు ఎంత మూర్ఖులు?
తనను భౌతికంగా బంధించారు!
తన శారీరక స్వేచ్ఛను కట్టడి చేశారు!
కాని తన ఆలోచనలు – తన ఊహలు, తన జ్ఞాపకాలను –
తన ఫాంటసీలను అడ్డుకోగలరా?
మరి ఈ ఖైదుకు అర్థం ఏమిటి?
తన నుంచి ప్రపంచానికి రక్షా?
ఈ సమాజం నుంచి తనకు రక్షా?
ఎవ్వరికీ ఈ శిక్ష?!
నడుస్తూనే ఆలోచిస్తున్నాడు –
అన్నీ జరిగిన వాటి గురించే –
తన భవిష్యత్తు గురించి ఆలోచించటానికి ఏముంటుంది?
అంతా జరిగినవే – అన్ని జ్ఞాపకాలే!

❖ ❖ ❖

టెహ్రాన్ నుంచి దక్షిణంగా, ఇరాన్ సరిహద్దుకు దగ్గరగా, ఒక బీమరిస్థాన్ (హాస్పిటల్)లో ఉద్యోగంలో చేరాడు. అక్కడ ఒకరిద్దరు ఇండియన్ డాక్టర్లు ఉన్నారు. రెండు మూడు నెలలు తిరక్కుండానే 'షా' పడిపోవటం "అయొతుల్లా ఖొమినీ" రావటం – ఇరాన్ 'అంతర్యుద్ధం'లో ముల్లాలు అధికారంలోకి రావటంతో – ఒక దశ ముగిసింది. కాని వాళ్ళ ఉద్యోగాలు ఊడలేదు. అయితే ముల్లాల పాలనలో ఒళ్ళు దగ్గరపెట్టుకుని పనిచేయాలి. లేకపోతే చేతులు నరికివేస్తారు. ఈ పరిస్థితికి కూడా భయపడకుండానే అతని ఉద్యోగం జరుగుతోంది. యాభైవేలు వచ్చేవి, ఇప్పుడు తగ్గించారు. అయినా తన దేశంలోకంటే మెరుగే అనుకున్నాడు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం సాగలేదు.

అంతలోనే ఇరాక్‌తో పవిత్ర యుద్ధం మొదలయింది! తుపాకుల టపాసులు పేలుతుంటే బాంబులు పిడుగులు చుట్టుప్రక్కలే పడుతుంటే, భయం గుప్పెట్లో నిస్సహాయపు గూట్లో రాత్రిళ్ళు గడిపాడు అర్థరాత్రులు. క్షతగాత్రులు, తెగిన అవయవాలు.

మానవ దేహాల మారణహోమం. తనకేమాత్రం సంబంధం లేని బాధామయ ముఖాల విషాదపు ఆక్రందనలు ఇవన్నీ ఎంత నిర్లిప్తంగానో అనిపించాయి! తన డ్యూటీ రాత్రిగాని, పగలుగాని ఎంతో మెకానికల్‌గా నిర్వహించాడు – తూటాల తూట్ల శరీరాలు, తడి నెత్తుటి గాజు గుడ్డలు, గాయాలమయంతో, మృత్యుభయంతో విలవిలలాడే యుద్ధభూమి నుంచి వచ్చిపడే మీసాలైనా రాని సైనికులు, పవిత్ర యుద్ధపు వీరుల సేవలో తరించటానికి అతనికి అవసరం ఏముంది?

నిద్రలేని రాత్రుల అలసటగాని, ఎండి అట్టలు కట్టిన రక్తం తాలూకు మరకలుగాని, అతను బ్యాంకు నుంచి తీసుకునే బంగారు కడ్డీల మిసమిసలో మసకబారిపోయేవి!

అవును, ఇంత దూరం వచ్చింది!

ఇన్ని త్యాగాలు చేసింది; ఈ 'రిచెస్'కోసమే గదా?

ఎనిమిదేళ్ళు యుద్ధకాలంలో మొదట్లో దూర దూరంగా, తుపాకి మోతలు, తర్వాత తర్వాత చుట్టుపక్కలా బాంబులు పిడుగులు, ఆసుపత్రిలో రాత్రి పగలు.

క్షతగాత్రులకు ఎమర్జెన్సీ ఆపరేషన్లు – రెండు చేతుల్తో ఆక్సిజన్ సిలిండర్లు మోస్తూ శత్రువెవ్వరో తెలియని యుద్ధం – సేవ ఎవ్వరికో తెలియని ఉద్యోగం!

మనిషికి కావలసిన కనీస అవసరాలు కూడా లేని ఎడారి దినాలు – నెలకోసారి జీతం – అదే జీవితం! బంగారు కడ్డీల రూపంలో మెరుస్తుంటే ఏదో తృప్తి – ఎండమావులు అందినట్లు కొండ చివరలు చేరినట్లు!!

తండ్రి చనిపోయినప్పుడు, ఎందుకు వెళ్ళలేకపోయాడు? పిల్లలు చదువులు సాగటం లేదని తెలిసి – కదల్లేకపోయాడు? అప్పుడు కూడా, తన బాధ్యత, సంపాదనే అనుకున్నాడు!!

✤ ✤ ✤

ఎన్నాళ్ళు ఈ షిజ్జిన్ గదిలో నిద్రపట్టేది కాదు –
కాని పదేపదే గుర్తు రావటానికి,
తనకు ఆత్మీయులు ఎవ్వరున్నారు?
భార్యాపిల్లలతో కూడా అతనికి 'ఎమోషనల్ బాండేజి' ఏది?
సంపాదన కోసం ఆరాటం!
ఇప్పుడు – ఈ ఖైదులో తనకి తనే ఎదురైనపుడు,
సంజాయిషి ఏమని చెప్పుకోవాలి?

ఏ సాయం లేకుండా, వ్యసాయంలో చాలీచాలని ఆదాయంతో, తనని డాక్టరు చదివించిన తండ్రికి తను ఎప్పుడూ దగ్గరగా రాలేకపోయాడు. పైగా ఆయన ఎప్పుడు తన మెడికల్ కాలేజీకి రాకుండా జాగ్రత్తపడ్డాడు కూడా.

అందుకు కారణం, అతనిలో తెలియకుండా దాగి ఉన్న పేదరికం అంటే ఏహ్యాభావమే!

తెలియని భయమే!

ఎప్పుడూ దూరంగా వెళ్ళిపోదామా, ఈ పేదరికపు భయం నుంచి – ఈ 'అనారోగ్య' వాతావరణంలో నుంచి ఎలా పారిపోదామా అనే ఆలోచనే, అతనిని, తండ్రికి దగ్గరగా రానీలేదు–

ఇంటి చాకిరీ అంతా చక్కబెట్టి, పాలు పెరుగు అమ్మి, వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా, తన తండ్రి అంతంతమాత్రపు ఆదాయానికి ఆసరాగా నిలబడిన తల్లి!

అతని ఖరీదయిన ఆలోచనలు ఏనాడూ అందుకోలేకపోయింది!

ఏ తల్లీ, బిడ్డల నుంచి ఏమీ ఆశించదు. పైగా తన శక్తినంతా వెచ్చించి, వారి బాగోగులు చూస్తుంది.

అలాగే అతని తల్లి కూడా అతని జీవిత మహాయజ్ఞానికి ఒక సమిధ మాత్రమే!

✤ ✤ ✤

భార్య తెచ్చిన వరకట్నం తాలూకు పొలం, డబ్బు అతనికెంతో ఆనందం కలిగించాయి.

భార్యపట్ల గౌరవానికి కూడా అదే కారణం! అవును, డబ్బున్నవాళ్ళను గౌరవించాలికదా!

అశ్వారావుపేట ప్రాక్టీసు, భార్య తాలూకు పొలంపై ఆదాయం – డబ్బు పై వడ్డీ –

ఇవన్నీ అతన్ని చిన్నిపాటి 'నియోరిచ్' స్టేటస్‌లో పడవేశాయి.

వృత్తి తాలూకు గౌరవం – అతనికేనాడూ సంతృప్తినివ్వలేదు.

ఇక తన పిల్లలు, వాళ్ళను దగ్గరగా ఎప్పుడు చూశాడు?

వాళ్ళ ఆటపాటలు, చదువుసంధ్యలు ఎప్పుడు పట్టించుకున్నాడు?

చిన్నప్పుడు అంతా అత్తారింట్లోనే పెరిగారు.

తను దేశం వదిలిన తర్వాత,

మూడేళ్ళకొకసారి వస్తే, మళ్ళీ భయంభయంగా దూరదూరంగా ఉండేవాళ్ళు. ఫారిన్ చాక్లేట్లు, బాటరీ బొమ్మలు, ఆ దేశంలో చౌకగా దొరికేవి. ఈ దేశంలో ఖరీదుగా కనపడే బట్టలు, తీసుకువస్తే, తన బాధ్యత తీరినట్లే అనుకున్నాడు. తండ్రిగా తన గౌరవం ఖరీదుగల వస్తువులతోనే నిలబెట్టుకోవాలని అనుకున్నాడు!

ఈ విధంగా వచ్చినప్పుడే, బంగారు కడ్డీలు మార్చి, ఇంటి స్థలం విజయవాడలో కొనటం, ఇల్లు కటట్టం, ఉన్నవాళ్ళు పనులు, హడావుడి, డబ్బు ఫైనాన్సు కంపెనీలో పెట్టుబడి పెట్టటం.

ఇంకా పల్లెటూళ్ళో ఉన్న కాస్త పొలం తండ్రి వద్దంటున్నా అమ్మించి, చివరికి తల్లి, తండ్రికి మందుల డబ్బు కూడా కోడల్ని అడిగి తీసుకునే పరిస్థితికి తీసుకువచ్చాడు. ఇంటి పునాదులు, తర్వాత గోడలు పైకి లేస్తుంటే ఎంతో తృప్తి తన వృత్తికి, ఇదే గమ్యం –

రెండంతస్తుల భవనం కట్టించాడు –

మళ్ళీ మూడేళ్ళకు వచ్చినపుడు, అట్టహాసంగా గృహప్రవేశం చేశాడు.

సంపాదన అందరికీ ప్రదర్శించినపుడే కదా, సార్థకత!

సాంఘికంగా తన 'స్టేటస్' పెరిగేది!

ఇప్పుడు తన స్టేటస్ వేరు!

సంపాదించిన డబ్బు ఫైనాన్స్ కంపెనీలో పెట్టి, వడ్డీలు పెంచమన్నాడు.

ఇంకొంత ఫారిన్ కరెన్సీలు, లండన్‌లో 'మ్యూచ్యువల్ ఫండ్'లో పెట్టాడు.

వాళ్ళు నెలకో రెండునెలలకో డివిడెండ్, పౌండ్లలో పంపుతుంటే అతనికి ఆనందం – గర్వం!

దీనంతటికీ తనేం కష్టపడుతున్నాడు?!

తనవాళ్ళకు దూరంగా ఉంటున్నాడు!

వేరే దేశంలో తన వృత్తిని, ఎంతో ఖరీదుకు అమ్ముకుంటున్నాడు! ఇదేమీ దేశద్రోహం కాదే? తన వృత్తికి, మరో కోణం, సాంఘిక బాధ్యత. తన చదువుకు తన దేశం పెట్టిన పెట్టుబడిని, ఈ దేశంలో ఉన్న వృత్తి అవసరాల్ని, అతనేనాడూ పరిగణనలోకి తీసుకోలేదు!

✤ ✤ ✤

ఒకరకంగా తన ఇంట్లోనే పరాధీనపు బ్రతుకంటే విసిగి, ఆ దిగులుతోనే, తర్వాత సంవత్సరం, తండ్రి పోయాడు. సెలవు పెడితే ఉద్యోగం పోతుందని, వెళ్ళలేకపోయాడు. అందుకు ఎంతో బాధపడ్డాడు కూడా!

కాని, తండ్రి తలకొరివి పెడతాడని ఆశించిన తల్లి మొదటిసారిగా కొడుకు మీద ఏమైనా భ్రమలుంటే అవి కూడా తొలగించుకుంది.

బెంగుళూరులో చదువుతున్న కొడుకుల దగ్గర భార్య ఉంటోంది – అతను కట్టిన ఖరీదయిన భవంతికి తల్లి కాపలా మాత్రమే – ఒక లాబ్రడార్ కుక్కతోపాటు!

✤ ✤ ✤

షిజ్జిన్ గదిలో ఇనప మంచం మీద పడుకున్నప్పుడే తను అశ్వారావు పేటలో పెంచిన పామేరియన్ గుర్తుకు వచ్చేది. అది అందర్నీ కరుస్తుంటే కట్టివేయటం కుదరక చిన్న గదిలో పెట్టి, పగలంతా ఉంచేవాడు. మొదటి రెండు రోజులు అరుస్తూనే ఉండేది. తలుపు గీరుతూ – రాత్రిపూట మాత్రమే వదిలేవాడు –

ఇంటి చుట్టూ తిరిగేది. ఇలా రెండు రోజులకు అతను గమనించింది, ఉదయానికి సరిగ్గా ఆ గది ముందు నిలబడి ఉండేది. ఎప్పుడు తలుపు తీస్తే, అప్పుడు వెంటనే లోపలికి పోయి, నిద్రపోయేది. పగలంతా నిద్రపోయేది. ఆహారం తినేదికాదు, నిద్ర, ఒకటే నిద్ర!

ఇప్పుడీ జైలు గదిలో మొదటి పదిరోజులు ఆందోళన – భయం, అన్‌సర్టైనిటీ, ఇవన్నీ ఇప్పుడు సద్దుమణిగాక, నిద్ర ముంచుకు వస్తోంది – ఆపినా ఆగటంలేదు.

ఎప్పుడూ నిద్రపోతున్నాడు. ఒకటే నిద్ర, చుట్టుప్రక్కల శబ్దాలు కూడా వినపడటం మానివేశాయి.

ఎండ పొడ, షుర్తా కళ్ళు కూడా అతన్ని లేపలేకపోతున్నాయి.

ఆకలి ఎప్పుడో వికారమైంది.

ఎంత మత్తు నిద్ర – ఇన్నాళ్ళు ఈ నిద్రంతా వాయిదా వేస్తూ వచ్చాడు, సంపాదనలో పడి.

ఇప్పుడు నిద్ర – ఒకటే నిద్ర.... అర్ధరాత్రి ఎప్పుడైనా హఠాత్తుగా మేల్కొని అయోమయంగా చూసేవాడు.

ఇప్పుడెక్కడున్నాడు – ఇక్కడకు ఎలా వచ్చాడు – ఇది కలా – భ్రమా?

తన జీవితంలోని ఎన్నో అసత్యాలవలె ఇది కూడా అబద్ధమైతే ఎంత బాగుండును?

గోడమీది 'అరబిస్కి' వంక చూస్తూ 'ఈ ముగ్గుకు అర్థం ఉందా? ఉంటే ఏమిటి?

ఈ ఆలోచనలతో నిద్ర – అందులో జ్ఞాపకాలు, కలలు – కలవరింతలు....

✤ ✤ ✤

అందరికీ అన్నీ మంచిరోజులుండవు కదా! అతనికి ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు లేవు. ఇరాన్ ముల్లాలు – జీతాలు బాగా తగ్గించేశారు. శలవు ఇవ్వటంగాని, స్వదేశానికి వెళ్ళి రావటానికి టిక్కెట్టు ఇవ్వటంగాని ఆపివేశారు!

డాక్టరు రావు నిర్ణయం తీసుకోవటం ఎక్కువ రోజులు పట్టలేదు. ఆదాయం లేనిచోట, అంటిపెట్టుకుని ఉంటే ఏమి లాభం?

అందుకే పనికివచ్చేవన్నీ పాక్ చేయించుకుని, పనికిరానివి అయిన రేటుకి అమ్మి, బందర్ అబ్బాస్ వరకూ, లగేజీతో బస్‌లో వచ్చి, అక్కడ దుబాయ్‌కి ఫ్లైట్‌లో చేరి, ఆ రాత్రంతా ఎయిర్‌పోర్ట్‌లో పడి ఉండి, మర్నాడు ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లో బొంబాయి చేరి, అక్కడ కస్టమ్స్‌లో నానా కష్టాలు పడి, బ్లాక్‌లో కోణార్క్ టికెట్లు కొని, ట్రైన్ ఎక్కిన తర్వాత మరాఠా పోలీసులు, ఎయిర్‌లైన్ లేబుల్ ఉన్న సూట్‌కేసులు చూసి, 'క్యా స్మగుల్‌కరా....' అని బెదిరించి, ఒక వంద డాలర్లు గుంజి, వెళ్ళిపోయారు. చివరికి 30 గంటల తర్వాత విజయవాడ చేరి, తన 'పాలస్'కి వెళ్ళాడు, స్వాగతం చెప్పేందుకు తల్లి, కుక్క ఉన్నారు!

❖ ❖ ❖

మర్నాడు, ఎప్పుడో వచ్చిన మెయిల్ చూశాడు. లండన్‌లో పెట్టిన మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి, మొత్తం పోయినట్లు, అకౌంట్ పంపారు కంపెనీవాళ్ళు!

మూడునెలలు విశ్రాంతి తీసుకున్నాడు, తన పరిస్థితిని పరిశీలించుకున్నాడు.

విజయవాడ ఫైనాన్స్ కంపెనీ కూడా, రిజర్వ్ బ్యాంక్ రూల్స్ మారటంతో, ఇప్పుడు నడవటంలేదు.

బైట ఇచ్చిన డబ్బు ఎప్పుడు వస్తుందో చెప్పలేని స్థితిలో ఉన్నారు. కష్టాలన్నీ కట్టగట్టుకొని వచ్చాయి! దురదృష్టం కూడా, ఒక్కుమ్మడిగా వస్తుందేమో!

ఇప్పుడతనికి ఇల్లు – ఒక్కటే కనపడుతోంది, తను సంపాదించింది.

తల్లి ఆరోగ్యం బాగా క్షీణించింది. భార్యను, పిల్లల్ని బెంగుళూరు నుంచి తీసుకువచ్చాడు, ఖర్చు తగ్గించాలని.

మళ్ళీ ఇప్పుడేం చెయ్యాలి? విజయవాడలో ప్రాక్టీసు సాగదని ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. ఈ వయసులో, మళ్ళీ ప్రక్క ఊళ్ళోకి వెళ్ళి, ఆ రొచ్చు రొస్టులో ప్రాక్టీసు పెట్టలేడు – ఎంతైనా ఫారిన్‌లో ఉండి వచ్చాడు కదా!

❖ ❖ ❖

షిజ్జిన్ షుర్తా అరుపుతో ఉలిక్కిపడ్డాడు!

రాత్రయింది.

గదిలో చీకటిగా ఉన్నా, ఇనప తలుపు కిటికీలోంచి బైట వెన్నెల కనపడుతోంది!

మెల్లగా లేచి, తలుపు దగ్గరగా వచ్చాడు.

“కైఫే–హలక్” అంటున్నాడు. బండ గొంతుతో.

తను ఎలా ఉన్నాడు – వింత ప్రశ్న!

“కైఫే – హలక్ అమేట?”

అతన్ని అడిగాడు –

“అల్ హం బులిల్లా” అని నవ్వాడు షుర్తా

రొట్టెలందించి, వెళ్ళేముందు ఒక హెచ్చరిక చేశాడు!

“నీకు ఉచ్చపోయటం రాదా?

బక్కెట్‌లో పోసేపుడు చప్పుడు రాకూడదు–

ప్రక్కవాడు ఫిర్యాదు చేశాడు....”

ఎంత సిగ్గు?! ఇది షిజ్జిన్ శిక్ష కంటే సిగ్గుపడాల్సిన విషయం.

(తర్వాత బక్కెట్ లోపలి అంచుల మీద పోయటం అలవాటు చేసుకున్నాడు)

షుర్తా వెళ్ళేప్పుడు “ఫి అమానుల్లా....”

అంటూ వెళ్ళిపోయాడు–

తలుపు కిటికీ మూయటం మర్చిపోయాడో – కావాలనే వదిలివేశాడో...

తన సిగ్గు అతనికి చీకటిలో కనపడదుకదా!

కిటికీలోంచి బైటకు చూశాడు....

ఖాళీగా ఉన్న షిజ్జిన్ లోపలి కాంపౌండ్ అంతా వెలుగులో కనపడుతోంది.

వెన్నెల పల్చగా పరచుకుంది.

తన జీవితంలోని వెన్నెలంతా కొండలు, గుట్టలు, ఎడారి దారుల్లోనే ఎండిపోయింది!

తన రెండంతస్తుల మేడపైన ఇదే వెన్నెల్లో ఎన్నిసార్లు స్నేహితులతో కూర్చున్నాడు?

అదీ – ఇరాన్ నుంచి వచ్చిన తర్వాత, పగలంతా ఏ పనీ లేకుండా – సాయంత్రానికి – నలుగురితో పేకాటతో కాలం గడపటం, కబుర్లు చెప్పుకుంటూ.....

మళ్ళీ అతని కళ్ళముందు అన్ని మెదులుతున్నాయి....

✣ ✣ ✣

విజయవాడలో క్లినిక్ పెడదామని చాలారోజులు ఆలోచించాడు. అతనికి అంత బాధ్యత పెట్టుకోవటం అనవసరమనిపించింది.

ఇప్పుడిప్పుడే వస్తున్న మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్‌లో ఉద్యోగం చేద్దామనుకున్నాడు.

అయినా ఏమిస్తారు, చాకిరీ తప్ప అని ఆ ఆలోచన కూడా ప్రక్కనపెట్టాడు.

ఇప్పుడతనికి రెండు విధాల నష్టం కలుగుతోంది.

సంపాదించిన డబ్బు పోవటం,

సంపాదించలేకపోవటం.

అతనికిది చాలా కష్టం కలిగించింది.

మళ్ళీ ఫారిన్ దారులు వెతకటం ప్రారంభించాడు!

✣ ✣ ✣

అతను ఈ ప్రయత్నాలలో ఉన్నప్పుడు–

అతని భార్య ఎక్కువగా ఇతని 'ఆబ్సెన్స్'కి అలవాటుపడి, ఇప్పుడు ఇతన్ని దగ్గరగా ఎక్కువసేపు భరించలేకపోతోంది! అతనికి కూడా చీటికీమాటికీ కోపం రావటం, విసురుకోవటం, చేయటంతో 'ఈయన మళ్ళీ ఎక్కడికయినా ఉద్యోగం కోసం వెళితే బాగుండునని లోలోపల అనుకోసాగింది!

ప్రతి సంవత్సరం తప్పుతున్న కొడుకుల్ని కూడా అతను తరచూ తిట్టటం మొదలుపెట్టాడు.

ఇతని అసహనాన్ని, నిస్సహాయతను అర్థంచేసుకోగలిగిన తల్లి, తన అనారోగ్యంతో అతనికి ఆసరాగా నిలబడలేక, లోలోపల కుమిలిపోయేది.

ఆ వేసవిలో విపరీతమైన వడగాడ్పులకు ఆమె తట్టుకోలేకపోయింది.

తల్లి గదికి 'ఏసి' పెట్టాలనే ఆలోచన కూడా అతనికి ఏనాడూ రాలేదు!

ఒక మిట్టమధ్యాహ్నం ఆ తల్లి ప్రాణాలు ఆ వేడి గదిలోనే ఆవిరైపోయాయి!

✣ ✣ ✣

ఆ రాత్రి అతనికి పీడకలలు–

ఆ కలల్లో – తల్లి శవం –

తన కాలేజీలో, ఎనాటమీ హాల్లో, ఫార్మలిన్ తొట్టిలో ఎన్నో శవాలు,

ఒక్కో ముఖంలో ఒక్కో బాధ!

ఇద్దరు ముగ్గురు మెడికోలు –

కాళ్ళు, చేతులు కోస్తూంటే, చూస్తూ పడుకున్న శవాలు – ఫార్మాల్డిహైడ్ ఘాటైన వాసన –

అప్పుడే చేరిన స్టూడెంట్లు స్పృహతప్పి పోవటం –

ఎలక్ట్రికల్ క్రిమిటోరియంలో తల్లి దహనం –

చర్మం కాలిన వాసన – చిన్న ముంతలో చితాభస్మం!

కృష్ణలో నిమజ్జనం! అతను గుండు గీయించుకుని, మూడుసార్లు మునగటం – నీళ్ళలో కన్నీళ్ళు కలసిపోవటం, మళ్ళీ నిద్రలో, మత్తులో జారిపోయాడు!

✣ ✣ ✣

మస్కట్ నుంచి ఒక స్నేహితుడు 'ఇక్కడ పరిస్థితులు బాగున్నాయి – ప్రాక్టీసు పెట్టుకునే ఉద్దేశ్యం ఉంటే స్పాన్సర్ చేయిస్తాను" అని ఉత్తరం రాశాడు – అతనికి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. మళ్ళీ పూర్వ వైభవం కోసం తహతహలాడాడు. తర్వాత నెలలో, స్పాన్సర్‌షిప్ రావటం, హైదరాబాద్ నుంచి ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో మస్కట్ ఎగిరిపోవటం ఆల్‌సీబ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎంతో ఆత్మవిశ్వాసంతో దిగాడు.

అతనికోసం వచ్చిన డాక్టర్ శాస్త్రి చేయి ఊపుతూ కనిపించాడు.

మూడువందల కిలోమీటర్ల దూరంలో ఉన్న "అల్‌కమల్" పట్నానికి కారులో వెళ్ళారు. మూడు గంటల్లో!

ఇతన్ని స్పాన్సర్ చేసిన "లోకల్" షేక్ "రష్ది" దగ్గర్లో ఉన్న 'సుర్' టౌన్‌లో ఉంటాడు. వారం రోజుల్లో అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, ప్రాక్టీసు పెట్టాడు!

నెలకు 1200 ఒమాన్ రియల్స్ మిగిలేవి!

అంటే లక్ష రూపాయలపైనే! హుర్రే!

ఒక సంవత్సరం ఉత్సాహంగా గడిచింది.

అతను పరిసరాలు, లోకల్సు, అరబ్బి మాటలు వీళ్ళ అవసరాలు తెలుసుకోగలిగాడు.

ఇక్కడ ఆల్కహాల్ – పబ్లిక్‌గా త్రాగటం నేరం – ఇంటిలో అందరూ తాగుతారు, హోటల్స్‌లో అన్ని దొరుకుతాయి.

హిందీ సినిమాలు, కేసట్లు విపరీతంగా దొరుకుతాయి.

డాక్టరుగా తను ఒక నర్సుకు స్పాన్సర్ చెయ్యవచ్చు.

ఒక కేరళ నర్సుని 'ఇంపోర్టు' చేశాడు! ఆమె అతనికి, క్లినిక్ అవసరాలు, తన బయోలాజికల్ నీడ్స్ కూడా తీర్చేది. సో! ఇక్కడ 'Life is OK' అనుకున్నాడు.

✤ ✤ ✤

ఈ 'సెన్స్ ఆఫ్ వెల్ బీయింగ్' భావనలో ఆ రాత్రి బాగా నిద్రపోగలిగాడు!
జైలు గదిలో!
మర్నాడు ఎప్పుడు లేచాడు?
తను ఎప్పుడు లేచినా అడిగేదెవరు?
కాని ఈ రోజు తన కోసం ఎవరో వచ్చారని, ఇనప తలుపు మీద కర్రతో కొట్టి చెప్పారు!
తాళం తీసి, బైటకు తీసుకువెళ్ళారు.
ఒక చిన్న బల్ల దగ్గర కూర్చోబెట్టారు.
రెండు నిమిషాల్లో వకీలు వచ్చి ఎదురుగా కూర్చొన్నాడు.
"ట్రయల్ కోర్టులో రేపే జడ్జిమెంటు....
"నేను చేయవలసింది అంతా చేశాను.....
"మహమ్మద్ అల్‌నబ్రి నిన్ననే సాక్ష్యం చెప్పాడు....."
అతనికి ఏదో మైకం కమ్ముతున్నట్లు
కళ్ళు మూసుకుపోతున్నాయి –
"మహమ్మద్ అల్‌నబ్రి"..... అతని చెవుల్లో మోగుతోంది.
షిజ్జిన్ గదికి ఎలా వచ్చాడో –
ఇనప మంచం మీద ఎలా పడ్డాడో అతనికి తెలియకుండానే జరిగిపోయాయి.

✤ ✤ ✤

మహమ్మద్ అల్‌నబ్రి చెవుల్లో గింగురుమంటోంది....
కళ్ళు గట్టిగా మూసుకున్నాడు....

✣ ✣ ✣

ఒకరోజు ఉదయం 'సుర్'లో ఉన్న తన క్లినిక్‌లో కూర్చొని, నిన్నటి ఇంగ్లీషు పేపరు చదువుకుంటున్నాడు.

"సుబాల్కర్, డాక్టర్"

"సు బా ఎల్‌నూర్....." అని తలెత్తి చూశాడు.

ఎదురుగా ఒక లోకల్, కందూరాలో, తలమీద టోపీతో నిలబడి ఉన్నాడు.

"మహమ్మద్ అల్‌నబ్రి" అన్నాడు!

"కైఫే హాలక్?" అని పలకరించాడు.

"కడుపులో నొప్పి – విపరీతంగా"

ఆ విధంగా పరిచయమయ్యాడు!

అతనికి మామూలు పెయిన్ కిల్లర్స్ పనిచేయకపోతే–

పెతిడ్రిన్ ఇంజక్షన్ ఇచ్చాడు.

వాడికి అదే పెద్ద రిలీఫ్! పాతిక రియాళ్ళు ఇచ్చాడు –

పదిహేను రోజులకి, 'ఆలీసులేమాన్' అనేవాణ్ణి తీసుకుని వచ్చాడు. అట్లాంటి నొప్పితో. అదే ఇంజక్షన్ ఇవ్వమని, రికమెండ్ చేశాడు.

వాడు యాభైరియాళ్ళు ఇచ్చాడు. వాళ్ళిద్దరూ, మెల్లగా పెతిడ్రిన్‌కి అలాటుపడి, తన వెంట పడ్డారు.

ముందుగా నాలుగు రోజులకు ఒకసారి, వచ్చేవాళ్ళు మెల్లగా, రోజూ రావటం మొదలుపెట్టారు! వాళ్ళు ఎడిక్ట్స్ కావటానికి రెండు నెలలు కూడా పట్టలేదు.

అతను ఇది 'తప్ప'ని తెలిసి, 'చికిత్స'లో భాగమని సరిపెట్టుకున్నాడు. పైగా ఈజీ మని! కదా!!

ఇప్పుడతనికి తక్షణ సమస్య –

పెథిడ్రిన్ సప్లై! ఒకరోజు కైరో, ఫ్లైట్‌లో వెళ్ళి, తేగలిగినన్ని పెథిడ్రిన్, మార్ఫిన్ ఏంపుల్స్ తెచ్చుకున్నాడు. అదృష్టవశాత్తు ఎవరూ చెక్‌చేయలేదు.

ఈ రకంగా నడిస్తే, ఒక సంవత్సరంలో 50 లక్షలు సంపాదించవచ్చని, లెక్కవేశాడు. తర్వాత వారం మస్కట్ వెళ్ళినప్పుడు కేరళ నర్సుకి మంచి డ్రెస్ తెచ్చిపెట్టాడు. తన సంతోషంలో భాగంగా, కాని ఈ రహస్యం తనవరకే పరిమితం చేశాడు.

మొదటి ఆర్నెల్ల సంపాదన ఇండియా పంపాడు. ఇంకో ఆర్నెల్లలో పర్మనెంట్‌గా తన దేశం వెళ్ళిపోవాలని అనుకున్నాడు. మధ్యలో ఇంకా చుట్టుపక్కల ఉన్న ఇండియన్ డాక్టర్లతో వాహిబ సాండ్స్‌కి సఫారికి వెళ్ళేవాడు. ఎప్పుడైనా 50 కి.మీ. దూరంలో ఉన్న 'మీనాకబూస్' సముద్ర తీరానికి వెళ్ళి, తూర్పుగా చూసేవాడు. ఈ అరేబియా సముద్రం దాటితే తన దేశం! తనవాళ్ళు – ఎందుకని ఈ మధ్య ఇంటి బెంగ ఎక్కువౌతుంది? అతను వెంటనే వెళ్ళిపోవచ్చు. తననెవ్వరూ ఆపరు కాని ఇంకో ఆర్నెల్లు! సంపాదించాలి!

ఆర్నెల్లేకదా అనుకున్నాడు......

✤ ✤ ✤

కాని! షిజ్జిన్ గుర్ఫాకి వచ్చి అప్పుడే ఆర్నెల్లు దాటిపోయింది. ఇక్కడికి ఎలా వచ్చాడు?

✤ ✤ ✤

ఇండియా నుండి ఫ్రెండ్స్ వస్తే రెండు రోజులు మస్కట్ వెళ్ళాడు. ఒకరోజు రాత్రి తిరిగివచ్చే సమయానికి ఒక షుర్తా, ఒక కబీర్ షుర్తా తన కోసం ఎదురు చూస్తున్నారు. తనని చూడగానే 'కైఫీహాలక్' అని కబీర్ షుర్తా పలకరించి, షుర్తావాన్‌లో 'మర్కజ్ ఆల్‌షుర్తా'కి తీసుకుపోయారు!

అతనికి ఏం జరిగిందో తెలియటానికి రెండు రోజులు పట్టింది. రెండు రోజులు 'మర్కాట్' సెల్‌లో ఉంచారు. అతని రిక్వెస్ట్ మీద ఒక రాత్రి క్లినిక్ – ఇంటికి వెళ్ళనిచ్చారు! ప్రొద్దున్నే తిరిగి వచ్చే షరతుతో!

ఆ రాత్రి – గత రెండు రోజుల విపరీతమైన మానసిక ఒత్తిడిలో – ఎటూ తెగని ఆలోచనల అయోమయంలో – క్లినిక్‌లో అడుగుపెడుతూనే – పేషెంట్‌లను

పరీక్షించే బల్లమీద పడిపోయాడు.
అంతలో కేరళ నర్సు, వచ్చి ఏడుస్తూ పలకరించింది – అంతే.
దప్పికతో ఉన్న కుక్క, ఆత్రంతో నీళ్ళు గతికినట్లు ఆమెని గట్టిగా, గట్టిగా పట్టుకుని పెదవులు, మెడా అంతా నాకాడు! తన జీవితానికి ఇదే ఆఖరి సుఖమనుకుని, ఆమెని ఆత్రంగా, ఆక్రమించున్నాడు...

✤ ✤ ✤

వారం క్రితం!

ఆల్‌నబ్రి – సులేమాన్ ఇద్దరూ – ఈసా అహమ్మద్ అనేవాడిని తీసుకువచ్చారు. వాడికి కూడా పెతిడ్రిన్ ఇవ్వమని అర్థించారు. బలవంతం మీద, ముగ్గురికీ మూడు ఏంపుల్స్ చేసి, వదలించుకున్నాడు. వంద రియాళ్ళు తీసుకుని. తర్వాత రెండు రోజులకు ఈసా అహమ్మద్ శవం, మీనకబూస్ ఆయిల్ జెట్టీల దగ్గర తేలింది.

షుర్తాలు, అల్‌నబ్రి, సులేమాన్‌లు పట్టుకోవటానికి ఎక్కువ సమయం పట్టలేదు!

'మర్కజ్ ఆల్ షుర్తా' సెల్‌లో పడవేశారు.

అప్పటికీ రహస్యం బయటకు రాలేదు. తర్వాత ఆల్‌నబ్రికి రెండోరోజు విత్‌డ్రాయల్ ఎఫెక్ట్స్ బయటపడినాయి.

ఇక ఆ తర్వాత అంతా మంచులా విడిపోయింది.....

✤ ✤ ✤

మర్నాడు ప్రొద్దున్నే, షుర్తా వాన్ డాక్టర్‌ని తీసుకుపోవటానికి సిద్ధంగా ఉంది!!

✤ ✤ ✤

న్యాయపరమైన ప్రక్రియలన్నీ ఫక్తు వ్యాపార లావాదేవీల్లాగానే
జరిగిపోతుంటాయి.
ప్రపంచంలో ఎక్కడైనా.....
అందులో భాగంగానే అతని 'గుల్తాన్ వాజిద్!' అతని తరుపు వకీలు ఏమని

వాదించి ఉంటాడు?

అయినా ప్రపంచంలో ఏ కోర్టు అయినా ఏ వకీలునైనా గౌరవంగా చూస్తుందా?!

అలాగే తర్కానికి ఎదురేముంటుంది!

బ్రతకాలనుకునేవాడికి తర్కంతో పని ఏముంది?

అప్పుడే, అతను అనుకున్నాడు –

"నేను నాలాగా కాకుండా – ఇంకో విధంగా ఎలా ఉండగలను?

కాని అందుకేనా వీళ్ళు నన్ను శిక్షిస్తున్నారు?"

(ఆదామికాన్ కోర్టు నుంచి అతన్ని మళ్ళీ షిజ్జిన్‌కి తీసుకువస్తున్నారు!)

నిశీథిలో వీధులన్నీ నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి! అక్కడక్కడా గుంటల్లో నీళ్ళు చలికి వణుకుతున్నాయి.

వెన్నెల అన్నిటిమీద సమానంగా ప్రసరిస్తోంది!

ప్రకృతికి పక్షపాతం ఉండదు కదా!

'బహుత్ బరీత్ జానా' డ్రైవర్ అంటున్నాడు.

తనని వేరేచోటుకి తీసుకుపోతారేమనని వణికిపోయాడు. తన 'షిజ్జిన్ గుర్ఫా'ని మారుస్తారేమోనని ఆందోళన చెందాడు.

తను చాలాసార్లు వచ్చి 'వాహిబాసాండ్స్' మీదుగానే ప్రయాణం చేశారు....

'నూర్' వెలుగు రాక ముందే షిజ్జిన్ గేటు దగ్గరకు చేరారు.....

✤ ✤ ✤

లోపలి కాంపౌండ్‌లో.... అక్కడే, ఇన్నాళ్ళు అతను 'కాపురం' ఉన్న 'షిజ్జిన్ గుర్ఫా' ముందు నుంచే లోపల కాంపౌండులోకి వచ్చారు. అక్కడే..... వాళ్ళు సిద్ధంగా ఉన్నారు.....

✤ ✤ ✤

వాళ్ళు ఏదో నాటకంలో నుంచి వచ్చి అక్కడ నిలబడినట్లున్నారు!

చుట్టూ కలయచూశాడు!

✤ ✤ ✤

తలారులు – ఉరికంబం, మెలిపెట్టి ఉన్న లావుపాటి తాడు అన్నీ నిర్జీవంగానే ఉన్నాయి!

'తను ఒక్కడే జీవించి ఉన్నాడు మరి?

తను వీటికి ఎలా బలి అయిపోతున్నాడు?

తనని ఇంత చౌకగా, అదీ ఒక తాడు ముక్కతోనే అంతం చేస్తారా?

ఇదేనా తను జీవితమంతా కష్టపడి సంపాదించిన 'తన' విలువ? వాళ్ళకి తను శత్రువు కాదే? మరి ఎందుకు వీళ్ళు నన్ను చంపుతున్నారు?!

ఈ ప్రపంచాన్నంతా వెయ్యి చేతుల్తో స్వంతం చేసుకుందామని ఆశపడ్డాడు – అదీ ఎటువంటి నిర్దిష్టమైన హేతువు లేకుండానే?!

ఇప్పుడు అన్ని అసంపూర్తిగా, అసంబద్ధంగానే వదిలి, ఈ లోకం నుంచి వెళ్ళిపోవాలా?

వీళ్ళు, తనతోపాటు తన అవమానాన్ని కూడా అంతం చెయ్యగలరా?

ఇప్పుడు – తను ఎప్పుడూ చూడని, తనకీ శిక్ష వేసిన జడ్జి ఎక్కడున్నాడు – ఏం చేస్తుంటాడు?

తనకు ఉరిని ఖాయం చేసిన – 'హై' కోర్టు మూసి ఉంటుందా?

ఏమిటి తన కళ్ళు మూసుకుపోతున్నాయా?

లేక చీకటి కమ్ముకుందా?'

నల్లని నూలుగుడ్డ మెల్లగా అతని తలపై నుంచి ముఖం మీదకు దిగింది!

ఆ తర్వాత అతనికి శబ్దాలే వినపడుతున్నాయి!

'మస్సలామ్'.... 'అమ్జె'...

కొండ చిలువలా మెడకు తాడు చుట్టుకుంది.

గుండె వేగంగా కొట్టుకుంటోంది.

'ఎక్కడ తన స్టెత్? ఎంతమంది గుండె గోడులు విన్నాడు – ఇప్పుడు తన గుండె చప్పుడు ఎలా వినాలి?'

ఇంతలో కాళ్ళ కింద బల్ల తెరుచుకుంది –

వికృతమైన శబ్దంతో!

బిగ్గరగా అరవాలనుకున్నాడు –

అంతలో గొంతు బిగిసింది –

అతనికి బాధ తెలియకముందే –

అంతా నిశ్శబ్దం –

వింత నిశ్శబ్దం –

✤ ✤ ✤

అతన్ని ఈ ప్రపంచమే జయించింది!
అతను వదిలి వెళ్ళిన అవమానంలా అతని దేహం వ్రేలాడుతోంది!!





పారిజాతం



మీరు కూడా నాతోబాటు ఈ వంతెన దగ్గర బస్సు దిగండి! కింద నిండుగా కదిలే కాలవ చూడండి ఒక్క నిమిషం! నీటిపై నుండి విసురుగా వస్తున్న గాలి వినండి! నీటిలో మెరుస్తున్న బంగారం చూడండి! పడమటాకాశంలో దూరంగా పడకటింటికెళ్ళిపోతున్న పొద్దు చూడండి!

కాలవ గట్లకు కాపలా కాస్తున్న మామిడి చెట్ల ధీమా చూడండి!

ఇప్పుడు – ఈ వాలులోంచి క్రిందకి, గట్టుమీదికి జాగ్రత్తగా దిగుదాం. ఒక్కసారిగా ఊపు వస్తుంది. నడక పరుగులా మారిపోతుంది. తూలకుండా దిగాలి మరి. ఆ ఇప్పుడు, కాలవ నీళ్ళ కలకల వినపడుతుంది. ఒళ్ళంతా బంగారం చేసుకొని పరుగులుపెట్టే నీళ్ళు, గట్లకు తన్ని వొరుసుకుంటున్న నీళ్ళు – ఎన్ని నీళ్ళు! ఎక్కడికీ పరుగులు? నురగలు!

చెట్లపై చేరుతున్న పక్షుల కలకలలు. ఈ కాలవ గట్టు దారే మా ఊరు చేరుస్తుంది! ఎక్కడా వంకర లేని కాలవ, అటు ఇటు చెట్ల తలలు కలసిపోతున్నట్లు, నీటిపైకి కొమ్మలు.

ఆ మధ్యలో నుంచి, దూరంగా చూడండి –

ఓ తెరచాప, రాదారి పడవ, మనవేపే వస్తుంది.

తెరచాప నిండా గాలి నింపుకుని, వెనకనే పొద్దు వెలుగు దాచుకుని బద్దకంగా,

వయ్యారంగా కదులుతుంది. దగ్గరయ్యేకొద్దీ పక్షుల కిలకిలతోపాటు ఏదో పాట కూడా వినపడుతోంది.

మెల్లగా, మెలమెల్లగా మనల్ని దాటి వెళ్ళిపోతుంది. పడవ కదలికతో, అలలు ఒడ్డుకు తగులుతాయి.

జవరాలి కాలి అందెలు మ్రోగినట్లు!

అంతలోనే ఊరు దగ్గరవుతుంది. సాయంత్రం పొగ కాలవ నీటిమీద వేలాడుతుంటుంది. ఊళ్ళో అన్ని పొయ్యిలు పిడకలతో అంటుకుని ఉంటాయి! ఇక్కడే కాలవగట్టు దిగి, ఊరి దారి పట్టాలి. మెత్తటి ఇసక, చవిటి ఇసక! ఇళ్ళకెళు తున్న ఎడ్లబళ్ళు, చక్రాలు మెత్తగా ఇసుకలో తిరుగుతూ, ఎప్పుడో తిన్న గడ్డి నెమరేస్తూ, తెల్లని నురుగులు కక్కుతూ, బలిసిన ఎద్దులు!

పగలంతా పనిచేసినా అలసిపోని ఆసాములు, పలకరింపులు, ఒలుకులుదాటి, హరిజనవాడ దాటి, గవళ్ళ ఇళ్ళు దాటి ఎండు చేపల ఘాటు వాసనలో నుంచి కోమటి అరుగులు దాటి, మున్సబు దొడ్డి దాటి, పెద్ద అరుగుల వెంకయ్య మామ ఇంటి తర్వాత, మా ఇంటికి సన్న సందులో తిరిగి....

దూరంగా రామాలయంలో నూనెదీపం కనపడుతోంది. అప్పటికే చెరువు, చీకటిని కప్పుకుంది!

ఇంటర్ పరీక్షలు రాసి, ఈ రోజే బాబాయి ఇంటికి వచ్చాను. మా పిన్ని కూతురు తారక్క, "పరీక్షలు బాగా రాశావా" అని అడిగి 'కొత్త సినిమా' 'మాయాబజార్' చూశావా?' అంది. నేను "ఆ...." అంటుండగానే.

"నరసయ్య మామ రెండో పెళ్ళి చేసుకున్నాడు" అని చెప్పింది. రాత్రి బాబాయితో పొలం పనులు గురించి అడిగితే "ఆకుమళ్ళకు రేపట్నించీ అరక కట్టాలి" అని పురమాయించాడు. మా ఉమ్మడి కుటుంబం వ్యవసాయం అంతా బాబాయే చూస్తుంటాడు. అన్ని శలవలకూ బాబాయి ఇంట్లోనే ఉండి వ్యవసాయం పనుల్లో సాయం చేయటం అలవాటు.

✤ ✤ ✤

మర్నాడు నరసయ్య మామ ఇంటికెళ్ళా, తారక్కతో...

(అప్పుడే చూశా, చిన్నత్తను...)

ఆమె... ఎక్కడ నుండి దిగి వచ్చింది, ఇక్కడకు?

ఆ ముఖంలో ముందుగా పెద్దపెద్ద రెప్పలు ఏదో బరువుతో వాలిపోతూ....

తెల్లని కనుగుడ్లు. నల్లని కనుపాపలు – సగం రెప్పల చాటునే.... ఈ ప్రపంచానికి తన రహస్యం తెలియనివ్వని చీకటి పాపల్లో రెండు వెలుగు చుక్కలు!

విలాసంగా వంగిన కనుబొమ్మలు....

మధ్యలో అస్తమించే పొద్దులా కుంకుమ బొట్టు!

ఎవరో చెక్కినట్లు చక్కని ముక్కు, చివరన ఓ చిన్న రతనాల నక్షత్రం... ఎవరికో దారిచూపుతూ....

నిండైన పెదవులు... చిన్న నోరు!

సన్నగా మారిన చుబుకం, మధ్యలో చిన్ని గుంట, ఎవరో చిలిపిగా నొక్కినట్లు. ఆ బుగ్గలు, కనీసం వెలుగు కూడా నిలవని నునుపు! నల్లని కురులు కప్పుకుంటు పల్చని చెవులు – బుట్టలోలాకులు ఊగుతూ, నిశ్శబ్ద శృంగార ఘంటికలు మ్రోగిస్తూ ఎప్పుడైనా గోరింటాకు మెరిసే పొడవైన మునివేళ్ళు – కళ్యాణపుటుంగరం!

ఏవో స్వర్గాలు దాచినట్లు

అప్పుడప్పుడు కనపడే బంగారు పట్టీలు – సన్నని మువ్వల్తో మట్టెల మోతలు!

(ఎవరీమె? ఏ లోకపు దేవత? ఏ శాపంతో ఇక్కడకు వచ్చింది?)

తారక్క నన్ను పరిచయం చేసింది.

అప్పుడే చిన్నత్త కనుల్లోకి చూశాను. ఏవో రహస్యపు లోకాలు. అనంత మర్మాలు దాస్తున్నట్లు అరమోడ్పు కనులు. ఎక్కడో నిద్రపోయి ఇక్కడ మేల్కొన్నట్లు, బరువుగా వాలుతున్న నీలపు రెప్పలు, తన లోకంలోకి రమ్మని చిరునవ్వు స్వాగతం!

✤ ✤ ✤

నరసయ్య మామది పెద్ద పెంకుటిల్లు.

ముందు, వెనుక పెద్ద దొడ్డి.

ఎప్పుడూ సున్నాలతో కళకళలాడుతుంటుంది!

ముందు, మందారచెట్టు, మల్లెపందిరి.

పెరట్లో పెద్ద రోలు, పొగడచెట్టు, కొబ్బరిచెట్లు. బయటే చిన్న వంటిల్లు.

ముందు వరండా దాటగానే హాలు. ప్రక్కనే చిన్న గది.

వెనుకనే పెద్ద పడకగది!

ఆ గదికి బరువైన ఒంటరి తలుపు, ఇత్తడి గుబ్బలు. వాకిలికి పూసల తెర, రంగురంగుల పూసలు ఊగుతూ, మ్రోగుతూ!

లోపల పందిరి మంచం, రోజ్‌వుడ్ రంగుతో చుట్టు చిన్నచిన్న చిలకలు, తలదగ్గర పెద్ద అద్దం తిరుగుతూ... మాయలాంటి తెర!

బూరుగుదూది పరుపు – మెత్తమెత్తని మబ్బుల్లాంటి తలగడలు, శాటిన్ కవర్లు, పట్టుదుప్పట్లు.... ఏదో మైకంలాంటి మత్తైన వాసనలు.

మంచం ఎక్కటానికి, చక్కగా చెక్కిన ఎత్తుపీట!

గుండ్రని నగిషీ మంచపు కోళ్ళు.

గోడకు చిన్న అలమర, ప్రక్కనే దీపపు గూడు! అక్కడే కోడిగ్రుడ్డు దీపం!

అస్పష్టమైన బొమ్మలతో ఒక ఆయిల్ పెయింటింగ్ ప్రక్కనే వెంట్రామా అండ్ కో కేలండర్ – మార్చి – పంతొమ్మిదివందల యాభైఎనిమిది.

* * *

కుక్కపిల్ల గ్రామఫోను రికార్డులు వినేవాళ్ళం. పిన్నులు పెట్టటం, కీ ఇవ్వటం రికార్డు తిరుగుతుంటే వెలుగు ఊగిసలాడుతుంటే పాటలు బైటకు వస్తుంటే అదొక వింత లోకంలో ఉన్నట్లు ఉండేది! ఆమెతో ఉన్నంతసేపు.

చిన్నత్త క్రొత్తగా కాపురానికి వచ్చిన స్నిగ్ధ! కదులుతున్న శృంగారం, ప్రేమతో దగ్గరకు తీసుకొని ఆకలి దప్పిక తీర్చే ప్రేమ దేవత.

ఎప్పుడైనా మధ్యాహ్నం వెళ్ళినప్పుడు ఆ పందిరి మంచం మీద నిద్రపోతున్న రతీదేవిలా అనిపించేది.....

"చిన్నత్తా..... దేవతలుంటారా? కథల్లో మాదిరి ఎప్పుడైనా మన మధ్యకు, ఈ భూమ్మీదకు దిగి వస్తారా? నువ్వు అలాగే వచ్చావా?"

అడిగేవాణ్ణి.

"నువ్వు ఇక్కడకు ఎలా వచ్చావు?" అడిగా మళ్ళీ.

"అదుగో కాలవ! పడమీద, తెరచాప పడవమీద, కాలవ ప్రవాహంలో ఒక రోజు, ఒక పగలు, కాలవ గట్లు, ఎండలో ఒళ్ళు ఎండబెట్టుకుంటున్నాయి. గట్లమీద గడ్డి మేస్తూ గేదెలు, పరుగులు పెడుతూ మేకలు, తెరచాప నిండా గాలి. సరంగు పాటలు, పగలంతా, మెల్లగా, బద్ధకంగా ప్రయాణం. రాత్రి, సగం చంద్రుడు, కోటి చుక్కలు.

ఆగిపోయిన గాలి, దిగిపోయిన తెరచాప, పడవ లాగుతూ సరంగులు, పాటలు పాడుతూ సరంగులు.

రాత్రంతా..... తెలతెలవారుతుండగా ఈ ఊరి రేవులో ఆగింది పడవ... మెట్ల బల్ల పసుపు పూసివేశారు. గట్టుమీదకు దిగుతుండగా ముత్తయిదువులు దిష్టినీళ్ళు, ఆ రోజే ఈ ఇంట్లో అడుగుపెట్టా....!!"

స్వగతంలా చెప్పింది....

"నువ్వు ఎక్కడికీ వెళ్ళవా?" అడిగా.

"అయినా ఎక్కడికి వెళ్ళాలి?"

"ఎన్నో పగళ్ళు, కలలు కన్నాను, ఏ రాకుమారుడో వస్తాడని"...

ఆపైన ఆమె చెప్పలేదు.

ఇప్పుడు నరసయ్య మామ బలమైన చేతుల్లో, లంక పొగాకు ఘాటైన వాసనల్లో ఏవో పీడకలలు.

కలల్లోంచి పీడకలల్లోకి మేల్కొని, తెల్లవారగా ఒళ్ళంతా పచ్చి పుండు, వేడినీళ్ళ స్నానం.

సాంబ్రాణి ధూపం, తలారబెట్టుకుంటూ,

ఆ పొగల వెనక నుంచి, ఆ కురుల మధ్య నుంచి....

మబ్బుల్లో చందమామలా ఉండేది – అప్పుడే నే వెళ్ళేది!

పొగల తెరల్లోంచి – వత్తైన కురుల్లోంచి, మత్తు కనుల్తో వాలిపోతున్న రెప్పల రహస్యపు లోకాల లోంచి – చూస్తూ పిలిచేది.

“రా....” అంటూ నాకేదో తెలియని ఆకర్షణ, చెప్పలేని ఆరాధన!

ఈ దేవతను ఎలా కొలవాలి?

ఎర్రమందారం పూలు కోసి ఇచ్చా!

వెడల్పాటి రేకుల మధ్యలో పుప్పొడి అలవోకగా బుగ్గలకు అలదుకుంటూ–

“ఇవ్వాళ ఎక్కడకు వెళ్ళావు.....” అనేది!

“ప్రొద్దున వంతెన దగ్గరకు వెళ్ళా – సరుకుల కోసం. నాట్లు మొదలుపెడుతున్నారు.... పదిహేను రోజుల పొలం పని.

నిలవ కూలీలు వచ్చారు. చెరువు దగ్గర దొడ్లో పెట్టారు.

రేపే మా ఊడుపు! మీకు చాలా పొలం ఉందిగా.

మామ చెప్పలేదా?”

“ఆ ఇప్పుడే తెలుస్తున్నాయి....”

అన్నప్పుడు సున్నుండలు పెట్టింది – మత్తైన నేతి వాసన!

తర్వాత చేను దమ్ము చేయటం, నిండా నీరు పెట్టటం, గట్లు వేయటం, నారు మోయటం.

దున్నలతో బల్లలాగటం, చేను చదును చేయటం ఆడకూలీలు, తుమ్మెద పాటలు పాడుతూ నాట్లు వేస్తుంటే నారు అందీయటం – ఊడుపులు అయ్యేవరకూ ఊపిరాడేది కాదు.

❖ ❖ ❖

ఎప్పుడైనా తీరిక ఉంటే, సాయంత్రం కాలవ గట్టుకు నేను, చిన్నత్త వెళ్ళే వాళ్ళం – తారక్క అప్పుడప్పుడు వచ్చేది....

దారిలో పెద్ద మర్రిచెట్టు, బలంగా ఊడలు దిగి కాళ్ళ కింద ఆకులు, ఒకోసారి మెత్తగా, ఒకోసారి గలగలలాడుతూ – గట్టుమీద కూర్చొని – వాలే పొద్దుని చూస్తూ ఉండిపోయేది.

అంతలో రాదారి పడవ చిరుగుల, తెరచాపనిండా గాలితో బరువుగా వయ్యారంగా వస్తుండేది.

మెల్లగా మమ్మల్ని దాటి, దిగువకు వెళ్ళిపోయేది "ఎక్కడికి పోతున్నాయి ఈ పడవలు....?" అనేది. దిగంతంలో పొద్దు దిగిపోతుంటే ఎంత వింతగా ఉండేది! చిన్నత్త, ఆమెకిష్టమైన పనులు ఎంతో తేలిగ్గా చేసేది – ఎప్పుడూ అలసినట్లు కనపడేది కాదు.

ఊడుపులు అయిన తర్వాత యూరియా వేశాం – చేను ముదురు పచ్చగా మారి ఆరోగ్యంగా ఉంది!

నేను త్వరలోనే గుడివాడ వెళ్ళిపోయాను, డిగ్రీలో చేరేందుకు.

✣ ✣ ✣

వినాయక చవితికి వచ్చినపుడు, చిన్నత్తను చూసేందుకువెళ్ళా. పెరట్లో ఒకరకమైన గ్రేస్‌తో నడుస్తోంది.

అప్పటికి చూలాలు! ముఖం అంతా వింత మెరుపుతో వెలిగిపోతోంది – పొగడపూల చెట్టు క్రింద, నవారు మంచం మీద కూర్చొని ఏదో దండ గుచ్చుతోంది.... సన్నగా పాడుతూ...!

మంచం అంచున కూర్చున్నా....

నన్ను చూసి చిన్నగా నవ్వింది. "ఎలా ఉన్నావు?"

నా గుండెల్లో ఏదో బరువు – తెలియని దిగులు –

ఈ దేవత మనిషైపోతున్నట్లు, మనుషుల్లో ఒకటైపోతున్నట్లు చెప్పలేని బాధ – నాకు.

ఆమె ఏదో బాధ్యత కోసం వచ్చినట్లు ఏ కంప్లైంటు లేకుండ తన పని, తన శాపం అనుభవిస్తున్నట్లు నిర్లిప్తంగా అనిపించేది నాకు!

వారం రోజులు అప్పుడు, చేలలో కలుపు తీసి, నీరు మార్చేవాళ్ళం. చేను రెండడుగులు పెరిగి, గాలికి తలలు అలలుగా మారుతుండేది.

అక్కడక్కడా తెల్లని పిట్టలు వాలి నీళ్లలోని పురుగులు తింటుండేవి. పెద్ద గట్ల మీద దోసపాదులు పెట్టాం.

మళ్ళీ నేను కొద్దిరోజులు శలవలకు వచ్చేసరికి-

ఆ ఇంట్లోనే ఒక మిడ్‌వైఫ్ సాయంతో మగపిల్లవాణ్ణి కన్నది.

ఆ తర్వాత బాలింతరాలిగా తలకు, చెవులకు గుడ్డ కట్టుకుని తిరుగుతున్న చిన్నత్తను చూశాను.

కాని, ఆమెలో తన్మయత్వం ఏది - ఇవన్నీ తన బాధ్యతలేనా? శాపంలో భాగాలేనా?

ఈమె తల్లితరపువాళ్ళెవరూ రాలేదే? ఎవరూ లేరా?

ఎక్కువసేపు నేనూ, తారక్కా ఆమెతోనే ఉండేవాళ్ళం.

బాబుని ఎత్తుకోవటానికి ఇచ్చేది....

నాకేదో వింత ఆనందం - ఆ పసిగుడ్డును పొదివి పట్టుకుంటూ, ఆ లేత స్పర్శకు ఆ మెత్తని పొత్తిళ్ళ, జాన్సన్ బేబి పౌడరు వాసన నాకెంతో హాయిగా ఉండేది. బాబు అరిచేతులు, అరికాళ్ళు, బుగ్గలు నా ముఖానికి అద్దుకుని ఆనందిస్తుంటే చూస్తూ ఉండిపోయేది. వాడి నవ్వు నాకెంతో అబ్బురంగా ఉండేది! నరసయ్య మామకు కలిగిన ఆనందానికి అంతులేదు! ఊరంతా పండగ చేశాడు. తర్వాత ఉయ్యాల పండక్కు ఊరు, పక్క ఊరు అందర్నీ పిలిచాడు. ఊళ్ళో ఆడంగులకు ఈమెమీద ఏదో అసూయ ఉండేది. గర్విష్టి అని గుసగుసలుపోయేవారు.

అయినా ఉయ్యాలకు అందరూ వచ్చారు....

నాకు ఈ ఉయ్యాల కూడా చిన్న పందిరిమంచంలాగానే అనిపించింది.

అంతా నగిషీలతో, చిన్న తెరతో బొమ్మలతో - కొత్త వార్నిష్ వాసనతో, గిలకలతో - మీగడలాంటి గుడ్డలతో - వాడి బుల్లి గుప్పిట్లతో - అప్పుడే వేసిన పులిగోరుతో - బంగారు మొలతాడుతో - అంతా సందడే - అంతా పండగే -

ఇంత సందడిలోనూ, మామూలుగా తన పని చేసుకుంటూ కనిపించింది చిన్నత్త.

మరికొంత శాపం తీరినట్లు – అనిపించింది!

❖ ❖ ❖

వరిచేలు ఏపుగా పెరిగి, గాలికి ఊగుతున్నాయి. ఇప్పుడిప్పుడే పొట్టమీదకొస్తున్నాయి. పొలం చుట్టూ తిరిగి, మావులు, బోదులు సరిచూసి, గొడ్లకి పచ్చి వరి కోసుకొని మోపు నెత్తిన పెట్టుకుని ఇంటికి వస్తుంటే చిన్నత్త చూసేది!

'అబ్బో! చాలా కష్టపడుతున్నావే! అనేది.

"కాదులే అత్తా! కాలేజీలో చదవటం ఇంకా కష్టం!"

అంటూ నవ్వేవాణ్ణి!

తర్వాత వారంలో.....

అప్పుడే నాకు ఆట్లమ్మ పోసింది. అరిటాకుల్లో చుట్టి, చాకలి పరగడుపునే కల్లు త్రాగించాడు. తర్వాత వారం రోజులు జ్వరంతో మంచాన పడ్డాను. నన్ను చూడ్డానికి చిన్నత్త వచ్చింది. నా మంచం మీద కూర్చోబోతే "వద్దత్తా! నీకు అంటుకుంటుందేమో......" అంటున్నా ప్రక్కనే కూర్చొంది.

నా గొంతులో వణుకు – కన్నుల్లో చీకటి చూసి కంటతడి పెట్టింది.

అయ్యో! దేవతలు ఏడుస్తారా?!

బాబాయి పోలేరమ్మకు పుంజును కోయించాడు! గణాచారి పూజ గడగడలాడించాడు. కాలేజీ పదిరోజులు పోయింది!

❖ ❖ ❖

ఈసారి సంక్రాంతి సెలవలకు రాగానే ముందుగా చిన్నత్త దగ్గరకు పరిగెత్తాను.

ఈ మధ్య నాకు రోజు కల్లోకి వచ్చి కల్లోల పెడుతుంది. కనపడదేమోనని కలవరపెడుతోంది. అందుకే రాగానే పరుగెత్తాను.

ఒక్కసారిగా చిన్నత్తను చూసి నిశ్చేష్టున్నయ్యాను. బరువుగా, దిగులుగా నడుస్తోంది.

మిసమిసలాడే మేను వెలవెలపోయింది.

కనుల కింద చీకటి చేరింది. ఒకప్పుడు వెలుగే నిలవని బుగ్గలు ఇప్పుడు చీకటిగూళ్ళయినాయి.

అయ్యో, ఈ పారిజాతానికి బురద అంటుతుందా?

ఈ వెన్నెలకు బూజుపడుతుందా?

ఈ దేవత మనిషిగా. మట్టిగా మారిపోతుందా? ఎంత దిగులు నాకు..... ఎంత బరువు ఈ గుండెకు......

"అత్తా – ఇలా ఉన్నావేమిటి......." నాకు ఏడుపే తక్కువ.

గచ్చుమీద గవ్వలు రాలినట్లు – నవ్వింది......

"నాకేంరా, పిచ్చి....." అని దగ్గరకు తీసుకుంది.

పెరడంతా బంతిపూల వాసనతో, గొబ్బిళ్ళతో వింతగా ఉంది.

నరసయ్యమామ, కొడుకుని పెద్దపెళ్ళానికి పెంపకానికి ఇచ్చాడు. ప్రక్క ఊళ్ళోనే.

అప్పుడు కూడా ఏమీ నిరసన చెయ్యలేదు.

నిర్లిప్తంగానే ఉండిపోయింది.

మరికొంత విముక్తి జరిగినట్లుగానేమో........

✤ ✤ ✤

సంక్రాంతికి ముందు –

కుప్పలు తీశాం –

ఎడ్లు – దున్నలతో నూర్పిడి మొదలుపెట్టాం. పగలంతా గడ్డిలో వడ్లు తూర్పారబట్టటంలో వళ్ళు పులిసిపోయేది!

పదిమందితో పని – సరదాగా ఆటగా అయిపోతుండేది. పొద్దువాలే సమయానికి ఎడ్లు తోలుకొని ఇంటికి చేరేవాణ్ణి. వేణ్ణీళ్ళు పిన్ని సిద్ధంగా ఉంచేది. ఉడికిన ఉలవలు కమ్మని వాసన!

స్నానం చేసి మీగడ పెరుగుతో అన్నం తిని –

తారక్కతో చిన్నత్త దగ్గరకు వెళ్ళేవాణ్ణి –

బయట చలిగా, చల్లగా, మంచు పడుతుండేది.

నా చేతిలో కర్ర, తలగుడ్డ, గొంగళి చూసి ఎక్కడికెళ్తున్నావని అడిగేది.

“కుప్పదగ్గరకు కాపలా” అంటే

“ఏమిటి..... నువ్వు కాపలానా?.....” అంటూ నవ్వేది!

“భయంవెయ్యదా.....”

“చిన్నత్తా.... ఇప్పుడు మీసాలున్న మొగవాణ్ణి”

అని గర్వంగా చెప్పాలని అనిపించేది.

ఇలా అనుకుంటూ చిన్నత్తను చూస్తున్నప్పుడు, నా అంతరంగంలో చెప్పలేని అలజడి రేగేది – అంతుబట్టని దిగులు ఆవహించేది.

“అంతా బడాయి. మా పెద్దపాలేరు కూడా వెళ్తాడు తోడు....”

అంటూ తారక్క నవ్వేది!

తలగుడ్డ సరిచేసుకుని, మెడలో మఫ్లరు వేసుకుని చేతికర్ర తిప్పుకుంటూ కుప్పలున్న చేలోకి గట్టుమీద మోళ్ళమీద నడుచుకుంటూ చేరేవాణ్ణి.

అప్పటికే వెన్నెల వచ్చేది. కాపలాకి ఇక్కడ మంచెలుండవు. బండి వాల్చి, చక్రాలకు గడ్డి గుచ్చి, పైన గడ్డిమోపులు వేసి, బండ కింద కూర్చునేందుకు వెచ్చగా గడ్డిమీద ఈతాకు చాప, దుప్పటి వేసేవాళ్ళు. లాంతరు మసిబారుతా ఉండేది. పెద్దపాలేరు, కుప్పలో దూరి నిద్రపోయేవాడు. బండి క్రింద వెచ్చగా గొంగట్లో కూర్చొని చూస్తుంటే వెన్నెల మంచులో తడుస్తుండేది. కట్లూడదీసుకున్న గొడ్లు మోళ్ళుమేస్తూ దెయ్యాల్లా కదుల్తుండేవి!

రాని దొంగల కోసం, వచ్చే నిద్ర ఆపుకుంటూ, భయం పోవటానికి గట్టిగా సినిమా పాటలు పాడుతూ, ప్రక్కచేలో కుప్ప దగ్గర కాపలావాణ్ణి కేకలు వేస్తూ ఎప్పుడో నిద్రపోయేవాణ్ణి!

నిద్రలో చిన్నత్త నవ్వుతూ, కనిపించేది.

దగ్గరకు వచ్చి వళ్ళో నా తల చేర్చి తోడుండేది!

నా కలల్లో తను వచ్చి, కలవరపెట్టేది!

తొలి కోడికే మెలకువ వచ్చేది.

తొలి వెలుగులో ఇంటికి చేరేవాణ్ణి!

పిన్ని అప్పుడే పితికిన గుమ్మపాలు ఇచ్చేది!

✤ ✤ ✤

ధాన్యం కొనటానికి గుడివాడ వడ్ల బ్రోకరు వచ్చేవాడు. రోజుకో ధర చెప్పేవాడు.

ఇవ్వక తప్పదు.

వాడే సంచులు పంపేవాడు, రామాలయం దగ్గర లారీ పెట్టేవాడు.

అక్కడవరకూ బండ్ల మీద బస్తాలు తోలాలి.

బస్తాల కాటా వేసేప్పుడు, తడి వడ్లని ఎక్కువ వేసేవాడు.

మాకు వాడు, వాడిలాంటి బ్రోకర్ తప్ప అమ్మేదారి లేదు.

సగం డబ్బు చేతిలో పెట్టి,

"పదిహేనురోజుల్లో మిల్లు నుంచి డబ్బు తెచ్చి ఇస్తానన్నయ్యా" బాబాయితో చెప్పి వెళ్ళిపోయేవాడు. మళ్ళీ ఆర్నెల్లలోపు కనపడేవాడు కాదు. బాబాయి ఆ డబ్బు జాగ్రత్తగా, పడక గదిపైన గూటిలో దాచేవాడు. దాయటానికి బీరువా ఉండదు, బ్యాంకు లేదు!

సంవత్సరం అంతా ఆ డబ్బే వాడుకోవాలి. మళ్ళీ వ్యవసాయపు పనులకు పెట్టుబడి పెట్టాలి. అయినా రోజులు ఒడిదుడుకులు, ఒత్తిడులు లేకుండా నడుస్తుండేవి!

భోగిమంటలు వేశాం, పంచ బిగించి, తడి మంచులో చెడుగుడు ఆడాం! నవంబరులోనే తారక్కకు పెళ్ళయింది. సంక్రాంతి అవగానే అత్తారింటికి వెళ్ళిపోయింది. నేనూ కాలేజీ తెరిచేసరికి పట్నం వెళ్ళిపోవాలి.

ఒంటరిగా కాలవ గట్టుమీద నడిచి వంతెన దగ్గరకు చేరి, అక్కడ బస్సెక్కి వెళ్ళాలి.

కాలవ నిండుగా ప్రవహిస్తోంది, ఈ సంవత్సర దాళవా ఉంది. తెరచాప పడవలు మందంగా, బరువుగా కదులుతున్నాయి –

కడుపులో కొబ్బరియాకలు, సరుకులు దాచుకుని.

ఇంకా మామిడి పూయలేదు –

కోయిల కూయనూ లేదు.

❖ ❖ ❖

వేసవి సెలవలకు వస్తున్నప్పుడు, గుడివాడలో పిన్నికి మందులు కొన్నాను. ఆఖరి బస్సు చాలా ఆలస్యంగా నన్ను వంతెన దగ్గర దింపి కదిలిపోయింది. చూస్తుండగానే వెనక ఎర్రటి దీపాలు కనుమరుగైపోయాయి.

అంతా చీకటి – చిమ్మచీకటి......

తడుముకుంటూ వాలు దిగాను గట్టుమీదకు కాలవలో నీళ్ళు సగానికే నడుస్తున్నాయి. నీటి నడక వినపడుతోంది. చీకటి! అంతా చీకటి – దట్టంగా కమ్ముకున్న మామిడిచెట్లు, గట్టు ఎత్తు పల్లాలు – కీచురాళ్ళు గోల పెడుతున్నాయి.

చుక్కల మినుకు చెట్లపైనే ఆగిపోతుంది. కటిక చీకటి, కన్ను తెరచినా మూసినా ఒక్కలాగేనే ఉంది. తెలిసిన దారే, అయినా తడబాటు! గుండె దడ – అడుగులో అడుగు; గొంతులో వణుకు రాగం, భయాన్ని తోలటానికి ఈలపాట, ఇలా ఎంత దూరం – ఎంతసేపు గడిచింది? ఇంతలో వెనక నుంచి ఏదో శబ్దం – ఏమిటి? పాములు కదులుతున్నాయా? దెయ్యాలు చెట్లు దిగుతున్నాయా? భయం గుప్పెట్లో – గుండె దడదడ.

వెనక నుంచి ఓ తెరచాప పడవ మెల్లగా వస్తోంది. వడ్డు అంచుకు దగ్గర చేరుతోంది – చూశాను.

గమ్మత్తుగా చుక్కాని దగ్గర లాంతరు వేలాడదీసి ఉంది. ఆ వెలుగులోనే చిన్నత్త నిలబడి ఉంది. కన్నులు నులుముకుని మళ్ళీ చూశాను. "పిచ్చి.... రా" అంటూ పిలిచింది ఇక్కడ రేవు లేదు – వడిగా నడిచి పడవలో దూకాలి. చేయందించింది – అప్పుడే దగ్గరగా చూశాను.

"ఎక్కడనుంచీ....."

✤ ✤ ✤

వెన్నెల్లాంటి చీర – చీకటిలో కూడా కనపడుతోంది తల నిండా మల్లెపూలు – మత్తుగా వాసన......

చుక్కలు దాక్కున్న కనుపాపలు....

నా చేయి ఆమె అరచేతిలోనే ఉంది.

గులాబీల మెత్తదనం – ఆమె నవ్వుతూనే ఉంది.

✤ ✤ ✤

ఊరు దగ్గరయింది. రేవు ప్రక్కనైంది.

ముందుగా నేను దూకాను "జాగ్రత్త సుమా....."

వెనకనుంచి అంటోంది..... "చిన్నత్తా......." అంటున్నా –

పడవ సాగిపోతోంది – "నువ్వు దిగవా?"

నవ్వుతోంది. వెళ్ళిపోతోంది. పడవ వెళ్ళిపోతోంది.

✤ ✤ ✤

ఇసక దారిలో ఊరకుక్కలు నిద్దరోతున్నాయి. గొడ్ల ఉచ్చలో తడిసి ఇసక ఏదో వాసన వేస్తోంది. నిద్రలో నడుస్తున్నట్లు ఊళ్ళోకి – ఇంటికి చేరాను.

పిన్నికి – అమృతాంజనం – మందులు ఇచ్చాను.

"అన్నం తిందువురా..." అంటోంది పిన్ని...

ఎక్కడో ఓ నక్క ఊళ వేస్తోంది –

అంతా నిశ్శబ్దంగా, సద్దుమణిగి నిద్దరోతోంది ఊరు.

దొడ్లో ఎద్దుల గంటలు మూగపోయాయి.

దూరంగా పెద్ద మర్రిచెట్టు దెయ్యంలా నిలబడి ఉంది.

గుడ్లగూబల్ని, గబ్బిలాల్ని తల్లో దాచుకుని,

ఊరి చుట్టూ తాడిచెట్లు నిలబడి కునికిపాట్లు పడుతున్నాయి.

ఊళ్ళో గాలంతా తెరచాప ఎక్కి, ఎక్కడికో వెళ్ళిపోయింది. ఉక్కగా, చెమటగా నిద్రపట్టలేదు.

✤ ✤ ✤

తెలతెలవారుతుండగా ఎద్దుల గంటలు వినపడుతున్నాయి.

నాగళ్ళు తిరగగట్టి ఆకుమళ్ళు దున్నటానికి వెళ్తున్నారు.

కళ్ళాపి పేడవాసన వస్తోంది, కాకులు అరవటం మొదలుపెట్టాయి.

పిచ్చుకలు కంకుల కోసం వాలుతున్నాయి. చూస్తుండగానే భళ్ళున తెల్లారింది.

✤ ✤ ✤

ప్రొద్దెక్కిన తర్వాత నరసయ్య ఇంటికి బయలుదేరాను. పిన్ని మామిడి ఊరగాయ పెడుతోంది. నలుగురి సాయంతో కారం, ఆవపిండి, వెల్లుల్లి మామిడి ముక్కలు ఎంతటి కమ్మని వాసన.... నోరూరే వాసన. ఊరగాయ అన్నంలో కలిపి ముద్దలు తిని ఎలా ఉందో చెప్పాలి ఉప్పు. సరిపోయిందా ఇంకో ముద్ద – ఎర్రగా రుచిగా మంటగా, కమ్మగా..... నేను రెండు ముద్దలు తిని, ఒక ముద్ద గుప్పిట్లో దాచుకుని, చిన్నత్త ఇంటికి వెళ్ళాను.

నరసయ్య మామ వీధిలో అరుగుమీద కూర్చొని చుట్టతాగుతున్నాడు. పాలేళ్ళ మీద మెత్తగా పెత్తనం చేస్తున్నాడు. ఏదో హడావుడి పడుతున్నారు....

నోట్లో చుట్టతో, చుట్టూ పాలేళ్ళతో, బలంగా ఊడలు దిగిన మర్రిచెట్టులా ఉన్నాడు!

నేను లోపలికి వెళ్ళాను. అలికిడి లేదు.

నిద్రపోతోందేమో, పందిరి మంచం చూశాను, దుప్పటి కూడా నలగలేదు.

పెరట్లో పొగడపూల చెట్టు కింద కూడా లేదు.

చిన్నపాటు వణుకుతో 'చిన్నత్తా' అన్నాను. ఎవరూ పలకలేదు.

గుప్పిట్లో అన్నం ముద్ద, కొత్త పచ్చడి కలిపిన అన్నంముద్ద, బరువుగా ఉంది. ఎక్కడని పిలవాలి? ఎవరిని అడగాలి? మెల్లగా కాలవగట్టుకు వెళ్ళాను. నీళ్ళు మెల్లగా తగ్గిపోతున్నాయి. రేపటి నుంచీ పడవలు రావు. కాలవకు రెండు ప్రక్కలా బారునే చూశాను. ఎండలో మామిడిచెట్లు కాయలతో బరువెక్కుతున్నాయి. కనపడే వరకు ఎక్కడా పడవ జాడలేదు. ఈ రోజు బల్లకట్టు కూడా వెళ్ళిపోయింది. కాసేపు గట్టుమీద కూర్చున్నా..... ఒక్కసారిగా ఒంటరినైపోయినట్లు నాలో దుఃఖం పొంగుకొస్తోంది. గుప్పెట్లో కొత్త పచ్చడి అన్నం ముద్ద.... మెల్లగా నీళ్లలోకి వదిలేశా...

దేవత శాపం తీరిపోయిందేమో?


✣ ✣ ✣

ఆ రాత్రి బైట నులక మంచం మీద పడుకున్నా. చుక్కలాకాశం బిక్కుబిక్కుమంటోంది. ఎన్ని చుక్కలో! చిన్నత్త ఆలోచనలతో నిద్రపట్టలేదు.





ఎవరు పిలిచేది?



1. "హలో, గ్యాస్ కంపెనీయా?" మృదుస్వరం...
"ఏ గ్యాస్.....?"
"కాల్ గ్యాస్?" అనుమానపు జీర సన్నగా...
"ఈ కాల్, గ్యాస్ కాదా?" చిన్న పజిల్
"హలో.... ఎవరూ?..." కొంచెం సాత్వికం, కట్!

2. "హలో, గ్యాస్ బుక్ చెయ్యాలి....." అదే స్వరం మధ్యాహ్నం నాలుగు గంటలకు
"చెయ్యండి....." కావాలనే పొడిగించా....
"నంబరు తీసుకోండి....." మెత్తగా వత్తి.
"ఏ నంబరు? ఫోన్ నంబర్....?" టీజింగ్
"హలో ఎవరూ....." పోనీ ఎవరో చెప్పండి...."
"ఆనంద్... మీ వాయిస్ అందంగా ఉంది...." కాంప్లిమెంటు!
"థాంక్యూ..... బై...."

3. మళ్ళీ రింగ్‌రింగ్... అదే సమయం మర్నాడు
"హలో గ్యాస్‌కేనా....."
"......."
"మీరేనా, ఎలా ఉన్నారు.....?"

"సో, సో మీరు....?"
"బైట మబ్బులు, డల్‌గా ఉంది......"
"మీరెవరు?......" ఏదో ఉత్సుకత!
"చెప్పానుగా..... ఆనంద్......"
"నన్నడగలేదూ?......" నిష్ఠూరం
"నాకు తెలుసు - మీరు ఇప్పుడే....."
"అడగండి......?"
"అవును గ్యాస్ వచ్చిందా......?"
"సన్నని నవ్వు - మువ్వలు రాలినట్లు"
మరున్నాడు,
ఫోన్ రింగ్ కోసం చూస్తున్నా.......
ఈ రోజు మ్రోగలేదు.

4. మర్నాడు కాస్త ఆలస్యంగానే రింగుమన్నది
"హలో - నిన్న?......."
"హాస్పటల్‌కి వెళ్ళవలసి వచ్చింది....." దిగులుగా
"ఏమిటి ప్రాబ్లమ్.......?"
"పాపకి వంట్లో బాగుండలేదు....." గొంతులో జీర
"అయ్యో - ఏమిటి ఫీవరా?"
"హై ఫీవర్..... మందులు వేయటం కష్టంగా ఉంది......"
గొంతులో బాధ మడతపడింది.
"అయామ్ సారీ..... సాంత్వనగా
"ఇటీస్ జోక్.. బై......"

5. మర్నాడు మూడు గంటలకే రింగ్..... రింగ్
"ఆనంద్ గారా?"......
"అవును - పాప ఎలా ఉంది....."
"రాత్రి ఐసియులో పెట్టారు - ఏదో భయం....."
సన్నగా గొంతులో తడి!
"అయ్యో ధైర్యంగా ఉండండి. తగ్గిపోతుంది.....!"

“కెనయ్ హెల్ప్‌యు ఎనీవే?”
“నోనో – అవసరం లేదు – బై.....”

6. మర్నాడు రింగ్ రాలేదు......

7. మర్నాడు రాత్రి
“హలో.... ఎవరూ.....?”
“హలో మాట్లాడండి.......” పేరైనా తెలీదే? ఎలా పిలవాలి?
“నేనే........” సన్నని దుఃఖం గొంతు పూడ్చింది.
“ఎనీ థింగ్ రాంగ్?.........”
ఇప్పుడెవరైనా ఆసరా కావాలి.
“భుజం మీద తలపెట్టుకుని ఏడ్వాలి......”
“ఏమయింది... బి బోల్డ్.....”
“లేదు.... పాప ఇక లేదు......” ఆగని దుఃఖం
“అయామ్ సారీ, రియల్లీ సారి మై హార్ట్ ఈజ్ విత్ యు..... ప్లీజ్ కన్సోల్....”
“మీరు రాగలరా?.......” అడ్రసు.....”
“........”
“ఇంకో విధంగా అనుకోవద్దు – నేను రాగలిగిన స్థితిలో లేను!”
“ఓ గాడ్...... ఎంత దురదృష్టం.....”
ఒక దుఃఖం మరో దుఃఖాన్ని కప్పివేసింది!







భవాని



ఉత్తమ పురుషలో రాస్తున్న ఈ కథ ఓ స్త్రీ అంతరంగ మథనం. అందుకే ఉత్తమ స్త్రీ కథనం అందామా? కాలావధులు – పరిసరాల పరిధులు, వీటికి అతీతంగా ఈ వ్యక్తుల్ని – ఇందులో సంఘటనలనూ – అవీ నామమాత్రం – వ్యక్తులకి పేర్లు కూడా అవసరం లేని విధంగా కథను వినిపించాలనుకోవటం సాహసమే. మరి అలాంటి సాహసాలు చేయకపోతే – మర్త్యులు గంధర్వులెలా అవుతారు? ధూళి నుంచి మధూళి ఎలా లేస్తుంది? కన్నీటి చుక్కలో హరివిల్లు ఎలా విరుస్తుంది? ఇక వినండి...

కొందరికి జీవితంలో కొన్ని తొందరగా జరిగిపోతుంటాయి. పదకొండేళ్ళకే ఓణీలు వేశాను – పదిహేను నిండకనే మెట్రిక్ పూర్తిచేశాను. పదిహేడవ ఏటనే ఎమ్‌సెట్ రాశాను.

వయసుతోపాటు శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూనే వున్నాను. ఇవి బాహిరకమూ ఆంతరికమూను. అంతేనా – నాతోటివారు, కుటుంబం వారిలోని మార్పులూ గుర్తించకనూపోలేదు. పైట సింగారంతో గొంతులో వచ్చిన గండుతనం నాకే వినిపించింది! నెలసరి, చిమ్మిలి చిరాకులు – రొమ్ములు పొంగటం, కనురెప్పలు బరువెక్కటం, చనుమొనలు పదునెక్కటం, ఇవేమీ నా చదువుకు ఆటంకం కాలేదు.

మెడిసన్‌లో చేరిన కొత్తలో – ఒక కొత్త వాతావరణం – పరిచయం అయింది. కాస్త బెదురూ కలిగింది – కాని మొదటి అనాటమీ క్లాసు సంఘటన...

ఆ వెలుగు నీడల హాలులోకి అందరితోపాటు వెళ్ళాను. ఒక్కసారిగా ఏదో మందు వాసన గాలిలో ఘాటుగా కలిసిపోయివుంది. నాలుగు వరసల్లో తొట్టెలున్నాయి. నాతోపాటు పదిమంది అమ్మాయిలు పదహారుమంది అబ్బాయిలున్నారు. అనాటమీ అసిస్టెంటు ప్రొఫెసరు – ఒక అటెండరు – ఆ తొట్లలో ఏమున్నదో అన్న ఉత్సుకతే తలా ఒకచోటికి చేర్చింది. మరొక అయిదు నిమిషాలకు అయిదుగురు అమ్మాయిలు మూర్ఛపోయారు. మరో ముగ్గురు బైటకు పరుగుపెట్టారు – వాంతి చేసుకోవటానికి.

ఇక అబ్బాయిలు – సగం పైగా ఇదే పరిస్థితి!

నాతోపాటు మరో అమ్మాయి స్థిరంగానే వుంది. అప్పుడే నాకు నా ఎదురుగా వున్న తొట్టెలో వున్న మానవుణ్ణి చూసినప్పుడు అతని ముఖంలోని బాధ అలాగే మృత్యువులో చేరి ఘనీభవించిపోయింది. చేతులు, రెండు ప్రక్కలా దీనంగా వాలిపోయి వున్నాయి. మోకాళ్ళవరకు వంగిన కాళ్ళు నీరంతా పోయి, ఎండిపోయి ఉన్నాయి. తొట్టిలో ఫార్మాల్డిహైడ్ ద్రవంలో తన రహస్యాలు కనుక్కోమని ఆహ్వానిస్తున్న 'ఆ డెడ్ బాడీ'ని చూసి నిలబడినపుడే నాకు జీవితం మీద నమ్మకం కలిగింది. మరణం మీద బెరుకూ పోయింది. ఇది కూడా పద్దెనిమిది ఏళ్ళకే జరిగిపోయింది.

అప్పటివరకూ ఈ విషయాలపై ఆలోచనలు పోయినా యౌవనారంభపు వసంతంలో ఆకులు రాలటం కూడా చూసి జీవితంలో 'విషాద'మంటే అవగాహన కలిగింది. కానీ ఇదే నా తదుపరి జీవితానికి పునాదులని ఇప్పుడే నాకెలా తెలుస్తుంది?!

అదే కొన్నికొన్ని కొందరి జీవితాలలో తొందరగా జరిగిపోతాయి.

❖ ❖ ❖

రెండో సంవత్సరంలో ఒకరిద్దరు వెంటబడినా అదీ నా అందాన్ని చూసి కాదు. వారి వయసు వేడికి ఒక తోడు, ఆడుకోవటానికి ఆడది కావాలి కదా – అందుకే అనుకున్నాను. అదీ నా అందంమీద నా నమ్మకం. కాని అడపాతడపా నా గొంతులోని గండుతనం గుర్తించిన వాళ్ళు, పాడమని ప్రోత్సహించేవాళ్ళు, నాకూ కూనిరాగాల నుండి, రాగాల స్పృహ రావటానికి చాలాకాలమే పట్టిందని

చెప్పాలి. అయినా ఇవన్నీ నన్ను నేను ఆనంద పరచుకోవటానికే పరిమితం కాని, కచ్చేరీలు చేయటంవరకూ రాలేదు.

అప్పుడే శివుడు పరిచయం అయ్యాడు. పరిచయం అంటే నాకు రెండేళ్ళు సీనియర్ అన్నమాట. నేను కాస్త వళ్ళు చేయటానికి, సీనియర్ల కళ్ళు పడటానికీ ఆమాత్రం సమయం పడుతుంది – పట్టింది. అయినా మీకు శివుని గురించి చెప్పాలి.

✤ ✤ ✤

నాకు అన్ని విషయాల్లో శివుడు మరో ధృవం! నేను పొడగరి. అతను నా ఎత్తు కూడా వుండడు. నా వంటి ఛాయ బంగారం అనలేను కాని, పసుపు, పాలు కలిసినట్లుంటుంది. మరి శివుని రంగు – మనవాళ్ళు ఆనవాయితీగా అనే గారంటీ కలర్! సరే, రంగు – 'స్కిన్‌డీప్' అనుకుంటాం! నాకు బోలెడంత జుత్తు – పిరుదులు తాకే జడ! శివది – ఎప్పుడూ మొలిచే ఆకుమడి! "నీకు జుట్టు పెరగదా?" అంటే 'పెరగనివ్వను' అనేవాడు. దీనికీ ఒక సంకేతం వుంది. ముందుముందు మీకు తెలుస్తుంది. ఆ విధంగా శివ నా వెంట పడ్డాడని చెప్పనుగాని మా స్నేహాన్ని పెళ్లిదాకా తీసుకువెళ్ళింది అతనే! తను డాక్టరు డిగ్రీ తీసుకోగానే పెళ్లి అన్నాడు. 'నేను ఇంకా రెండేళ్లు చదవాలికదా' అంటే 'నేను పాఠాలు చెబుతాలే' అని దాటవేశాడు.

ముందే చెప్పినట్లు కొందరి జీవితంలో కొన్ని తొందరగా జరిగిపోతాయి. అలా నా పెళ్లి కూడా తొందరగానే జరిగిపోయింది!

✤ ✤ ✤

నేను డాక్టరు డిగ్రీ తీసుకోక పూర్వమే కాపురం పెట్టాల్సి వచ్చింది. అయితే చదువుతున్నచోటే కాబట్టి చదువుకు ఆటంకం కలగలేదని చెప్పాలి! మరుసటి సంవత్సరం ఒక మగ పురుగు పుట్టుకువచ్చాడు. చూశారా కొన్ని కొందరి జీవితాలలో ఎంత తొందరగా జరిగిపోతుంటాయో – అప్పుడే ఏమయింది – భార్యనయ్యాను – ఎలాగో డాక్టర్నయ్యాను – అమ్మనయ్యాను – ఇంకేం కావాలి? పి.జి. చేసే కోరికా, ఓపికా ఇద్దరికీ లేదు. మామూలు డిగ్రీలయినా నేను గైనో డిప్లమో – శివుడు ఎనస్తీషియా 'డిప్' చేతబట్టుకుని, పొట్ట చేతబట్టుకొని బాబుని

ఉయ్యాలదింపి, ఒకమాదిరి టౌన్‌లో అదీ అంతగా కాంపిటేషన్ లేని టౌన్‌లో క్లినిక్ – ఓ పెద్దాయనతో క్లిక్‌మనిపించాము. అదే మెల్లగా నర్సింగ్‌హోంగా మారింది.

ప్రాక్టీసు ప్రవాహంలాగా లేదుగానీ పొట్టకూటికి ఇబ్బంది లేదు.

ప్రకృతిసిద్ధంగా జరిగే ప్రసవాలే ఎక్కువ! రెండు చేతులడ్డంపెట్టి కాన్పులు చేస్తుంటాము. అమాయకులు అందుకు 'ఫీజు'లూ ఇస్తుంటారు. సరేలే, ఇవన్నీ లౌకికంగా అంత నేరం కాదు ఈ రోజుల్లో.

ఈ రోజుల్లోనే శివుడు బయట ఊళ్ళకు వెళ్తుండేవాడు. సర్జరీకి ముందు మత్తుమందు ఇవ్వటానికి, అతని సంపాదన బాగానే వుందనుకున్నరోజుల్లో–

ఒక రాత్రి ఇంటికి విపరీతమైన తలనొప్పితో వచ్చాడు. తలనొప్పికి వంద కారణాలుంటాయి. ప్రొద్దున్నే మామూలుగా నిద్ర లేవలేక "భవా! ఇవాళ ఎక్కడికీ వెళ్ళలేను. ఏమైనా ఫోనులు వస్తే చెప్పేయి" అంటూ ఏదో పెయిన్ కిల్లర్ వేసుకుని పడుకున్నాడు. నేను క్లినిక్, పేషెంట్లు గొడవతో అంత సీరియస్‌గా శివ తలనొప్పిని పట్టించుకోలేదు – కాని వారంరోజులు ఆగి ఆగి వస్తున్న అతని తలనొప్పిని అశ్రద్ధ చేయలేకపోయాను. గుంటూరు తీసుకెళ్ళి స్కాన్ చేయించాను. స్కాన్ రిపోర్టులు చూస్తే నూరోసర్జన్ – ఎడిమాలా వుంది, ఎంత త్వరగా సర్జరీ చేస్తే, అంత మంచిదని సలహా ఇచ్చాడు. ఇప్పుడు కారణాలడగనా? 'వీన్' ఒకచోట చిన్న బెలూన్‌లా వుబ్బి వుందని, ఎప్పుడైనా పగలవచ్చని, ఇది 'లైవ్ బాంబ్' అన్నాడు. సర్జరీకి ముహూర్తం పెట్టమన్నాం. శివుడు, జుట్టు ఎందుకు పెరగనివ్వడో తనకి ఈ సింప్టమ్స్ ఎప్పటినుంచో వున్నాయా? అశ్రద్ధ చేశాడా? వెంటనే సర్జరీ చేయటానికి నూరోసర్జన్ అందుబాటులో వుండాలికదా. మందులిచ్చి ఆ డేట్‌కి రమ్మన్నారు! ఎక్కువ దూరం కూడా లేదు ఆ రోజు. అందుకని నేనూ తొందర చేయలేదు. ఒకరోజు ముందుగా వెళ్ళి సర్జరీకి సిద్ధంగా వుండాలి. ఆ రోజు ఉదయం నుంచీ అతని తలనొప్పి పెరిగిపోయింది. వెంటనే కారులో ఎక్కించుకుని, గుంటూరు పరుగెత్తాను. వెనకసీటులో నా ఒడిలో పడి, బాధతో నన్నే చూస్తున్నాడు. బెజవాడ బారేజీమీదకు వచ్చేసరికి అతని కళ్ళల్లో వెలుగు ఆరిపోయింది. నాతో ఏమీ చెప్పే అవకాశం కూడా లేదు.

నేను సిద్ధంగా లేని ఈ సంఘటన నన్ను, నా నమ్మకాలను వమ్ముచేసింది. ప్రాణం – ఇంత పెళుసా? సబ్బునీటి బుడగా? నా ఒడిలో వున్న శివ శవాన్ని – ఇప్పటివరకూ అతను శివ – ఇప్పుడు శవం! కేవలం డెడ్‌బాడీ! ఎన్ని డెడ్‌బాడీలు చూడలేదు – జీవన్మరణాల సన్నటి గీత తెలియదా? కాని నా జీవితంలో ఇంత తొందరగా అది చెరిగిపోతుందని ఎట్లా అనుకుంటాను?

ఎందుకో నాకు నా మొదటి ఎనాటమీ హాలు – తొట్టెలో అపరిచితుని 'బాడీ' గుర్తుకు వచ్చింది. ఇప్పుడు – ఈ బాడీని ఏంచెయ్యను?

అలాగే గుంటూరు తీసుకువెళ్ళి 'మరణ కారణం' తెలుసుకోవాలికదా? ఆటోప్సి చేసి 'బాంబు' పేలింది – అతని మెదడు కణాలన్ని రక్తంలో తడిసి, ప్రాణం పోగొట్టుకున్నాయి. మెదడునుంచి సంకేతాలు రాకపోతే శరీరంలో మిగతా అవయవాలు పనిచేయవు. So - death is instant.

✤ ✤ ✤

ఈ పరిస్థితి నుంచి, నేను తేరుకోవటానికి మరీ ఎక్కువ రోజులు తీసుకోలేదు.

కర్మకాండలన్నీ పూర్తయి – శివ ఫోటోరూపంలో గోడకు చేరింతర్వాత గంధం బెరడు దండవేస్తూ ఎందుకిలా చేశావు? నిండా ముప్పయి నిండలేదు. ముచ్చటలన్నీ ముగిసిపోయినట్లేనా? ఒంటరి జీవితం ఎలా గడపాలి – ఒకప్పుడు వున్నది – ఇప్పుడు లేదనుకుంటే, ఆ వెలితి మరింతగా భయపెడుతుంది – ఎందుకు నా జీవితంలో అన్ని తొందరగా జరిగిపోతున్నాయి. బాబును ఎలా పెంచాలి? ఎన్నేళ్ళు – నాకంతా చీకటిగానే వుంది! గోడమీద బొమ్మ మౌనంగానే వుంది.

✤ ✤ ✤

కాలం ఎవరి కష్టాలు పట్టించుకోదు. ఋతువులు క్రమం తప్పకుండా గడిచిపోతున్నాయి. జీవితంలో వెలితి ఏర్పడిన తర్వాత పూడ్చుకోక తప్పదు. కాని ఇది పూడ్చగలిగిన – సరిపుచ్చుకో కలిగిన వెలితి కాదు. మానసికంగా – భౌతికంగా – పేషెంట్లు – మందులు – నా పగళ్ళు ఎక్కువ సమయం గడిచిపోవటానికి ఆసరాగా వుంటున్నారు. క్రింద క్లినిక్ వదిలి మెట్లెక్కి ఇంటికి చేరగానే – ఒక శూన్యం – నిశ్శబ్దం మనస్సంతా ఆవరించేది. పుస్తకాలు చదవటం

అలవాటు చేసుకున్నాను. పాతవి - కొత్తవి - బాబుని ఎక్కువగా అమ్మ సంరక్షించేది.

ఒంటరితనం కోర్కెలను మంటపెట్టేది! ఋతుక్రమంలో సెగలు రేపేది - ఇవి ఆరే మంటలు కావు. తీరే కోర్కెలూ కావు! అణచుకోవాలి - ఆర్పుకోవాలి ఎలా?? ఇదేకదా జీవితంలో విషాదం!

సినిమాలు చూడటం - పుస్తకాలు చదవటం, సభలకు వెళ్ళటం - ఇవన్నీ భౌతిక సమయాన్ని ఆక్రమించేవిగాని - మానసికంగా శూన్యాన్ని పెంచేవి - రాత్రికి ఒంటరిగా మంచంమీద చేరితే - వేడితో - తోడు కోసం శరీరం ఉడికిపోయేది. ఏ.సి. ఎంతవరకు? చర్మానికి ఉపరితలానికే కదా - అయినా నిద్ర, కలత నిద్రే కానివ్వండి కలలతో సేదతీర్చేది.

❖ ❖ ❖

కొన్నాళ్ళు పూర్వ విద్యార్థుల సంఘంలో చేరి, ఊళ్ళు పూళ్ళు తిరిగాను. అక్కడందరూ ఆనందంగా వున్నట్లు కనిపించేవారు. కాని ఎవ్వరి కష్టాలు వారికున్నాయి. అవి ఎక్కువ వృత్తి సంబంధం - విత్త సంబంధం - కాని నాలాగా గుండె లోతుల్లో మొదలయి వళ్ళంతా మరగపెడుతున్న నీటిలో నిప్పు కాదు. ఇది ఆరేది కాదు. పుస్తకాలు ఎందరినో పరిచయం చేశాయి. చాలా మందితో సంభాషణలు - చర్చలు నడిచాయి. అవి పుస్తక విషయాలకే పరిమితం - కొన్ని స్నేహాలు కుదిరాయి. అవి సభలకు - సమావేశాలకు మాత్రమే, ప్రాంగణ పరిమితం! కొందరు పేరున్న, వయసులో పెద్దయినవారు ఇంటికి వచ్చేవారు. అదీ నా ఆహ్వానంమేరకే. ఇవన్నీ నా శూన్యాన్ని తగ్గించుకోవటానికే, కాని విస్తృతమైన నా మనోభావనా ప్రపంచంలోకి ఎవరూ ప్రవేశించలేకపోయారు.

నాకు తెలియకుండా - ఈ శూన్య వేదన నా హృదయాన్ని రమణీయ సుందర వనంగా మార్చివేసింది. పారిజాతాలు - బొండుమల్లెలు విరగబూసి పరిమళంతో నిండిపోయింది. ఆ చీకటిలో మెల్లమెల్లగా వెన్నెల పొరలు ప్రవేశించాయి. మంచుతెరల్లా విడిపోతున్నాయి. చలితెమ్మెరలకు ఊగిసలాడే లతల నీడలో చలువరాతి సింహాసనం ఎప్పుడు రూపుదిద్దుకుందో నేను గుర్తించేలోపు సిద్ధమయి కూర్చుంది! ఈ వింత వనంలో కొమ్మల రెమ్మల పూవుల ఊయలలో ఊగుతూ ఆ చలువరాతి పీఠాన్ని చూస్తుంటాను. అది ఎవరికోసం?

వెన్నెల కిరణాలలో నుంచి గంధర్వుడు దిగి వస్తాడా?

పూలపరిమళాలు రూపుదిద్దుకుని మూర్తిమంతమవుతాయా? లతానికుంజాల పార్శ్వం నుంచి – దారి చేసుకుంటూ నడిచి వస్తాడా? కేవలం నా కోర్కెలలో, భావనలలో అంతరంగకీలలలో మరిగిమరిగి పోతపోసుకుంటున్న ఈ 'మూర్తి'ని – నేనెలా గుర్తుపట్టేది??

సంగీతం మనల్ని కాలగతినుండి కాపాడుతుంది! నాకిష్టమయిన పాటలు వింటూ బాల్యాన్ని, గతాన్ని మరిచిపోవటానికే ప్రయత్నించాను. ఈ లలిత సంగీత సమీరాలు – నాలో ప్రేమ భావాన్ని మరింతగా పరిపుష్టం చేశాయి. ఇంతవరకూ ఎవర్నయినా ప్రేమించానా? ఏమో? శివుడు ఒక సందర్భం – అంతే – అప్పుడు ప్రేమకు – రమణీయమైన భావనలకు అవకాశం ఏది? అదీ అంత సమయం లేకుండానే సమసిపోయింది! కార్డియం – తన వర్జినిటీని ఎవరికోసం కాపాడుకుంటోంది? నాకెలా తెలుస్తుంది?

✤ ✤ ✤

ప్రకృతిలో ఒక్కో ఋతువు ఏదో ఒక జీవానికి పదునుపెడుతుంది. జల్లులు పడితే నేల పదునెక్కుతుంది. వర్షాలు పడితే నదులు పరుగులు పెడతాయి. పూలు పూసి, పిందెలు కాయలవుతాయి. చిరువేడి ఎండ పొదలకు కాయలు పండ్లవుతాయి. ప్రాణికోటి తమతమ ఋతువుల్లో పునరుత్పత్తికి పదునెక్కుతాయి. ఇవన్నీ సహజంగా జరిగిపోతుంటాయి.

కాని, ఆరోగ్యంగా, ఉడుకు రక్తంతో పరుగులు పెడ్తున్న నా శరీరం పదునెక్కి, అదే కీట్సు అన్నట్లు 'ripening breasts' బరువెక్కి ప్రతి రాత్రి నా భావనావనంలో నేనూగే ఊయల లతలు తెగిపోతాయేమోనని భయంతో, వెన్నెలతో తడిసిన చలువరాతి పీఠాన్ని చూస్తూనే వున్నా – అది ఖాళీగా నన్ను వెక్కిరిస్తున్నట్లు నవ్వుతోంది.

ఏదీ – ఈ లలిత లతానికుంజాల గజిబిజిలో చలి వెన్నెల వేడిలో పొగడపూల పరిమళాల గిలిగాలులలో ఎన్నాళ్ళకొస్తాడు? ఎదురు చూసి వాలిపోతున్న రెప్పల బరువుకు కొలమానం ఏ ఋతువు??

✤ ✤ ✤

జీవితం మనకు కావలసినట్టు ఎప్పుడూ ఉండదని నాకెప్పుడో కను విప్పు కాలేదా? అయితే బ్రతుకులో వెలితి ఎలా పూడుతుంది? ఎవరికి వారు నింపుకోగలిగితే ప్రేమకు ఎవరి ఆసరా అవసరంలేదుకదా? మరి ఎలా వుంటుందో – ఎక్కడుంటుందో



ఊహల ఊయల

ఎప్పుడుంటుందో తెలియని 'మూర్తి' కోసం ఎలా గాలించాలి? ఏ గాలి నడగాలి? లేకపోయినా పరవాలేదు – రాకపోయినా పరవాలేదు – కాని ఎదురుగా వుంటే ఎంత బాగుండును? అని ప్రతి నిద్రలోని కలలో కలవరిస్తూనే వున్నాను.

కలల మబ్బుల్ని పిండితే వలపు తేనియలు రాలతాయా?

పూల తేనెలను మోసుకొచ్చే తేనెటీగల్లా నా ఆలోచనలన్నీ మనసుని – మధురాతి మధురమైన ప్రేమతో నింపి వేసాయి.

✣ ✣ ✣

ఆ రోజు ఏదో సమావేశం – సమాజంలోని వ్యక్తులు ఏదో మిషతో కలిసే సందర్భం – అక్కడే ఆ సాయంత్రమే అతనిని గుర్తుపట్టాను. గుర్తు పట్టానంటే అంతకు ముందు కలిశానని కాదు.

కవితల కలతలలో – కథల సంపుటిలో పరిచయం వున్న, రేఖామాత్రంగా ఆ ముఖాన్ని ఏ పుస్తకం చివరో చూసినవాడే, ఒక్కసారిగా గుర్తుపట్టానంటే – నే వెదికేది ఇతడేనేమో? ఎలా తెలుస్తుంది – గుండె దడ వినబడటానికి ఇది ప్రశాంతవనం కాదు. అంతా గడబిడ ధ్వనులే. అయినా గుండె లోపల గొణుగుడు – పెదవిపైన వణుకుగా తెలుస్తుంది.

సమావేశ మందిరం బయట పచ్చికలోనో ఆ గట్టుమీదో కూర్చున్నాం. ఇంకా ఒకరిద్దరు వున్నారు. ఏదో మాట్లాడుతున్నారు. అందరూ అందరితో, అతనంతగా పట్టించుకోలేదు. 'మీ కథలు చదివాను. కవితలూ చదివాను' అంటూ చొరవ తీసుకుంటే 'మీరూ?' అని అంటాడు. 'నేనెవ్వరిని?' అది నాకే వింతగా అనిపించింది. పరిచయం చేసుకుంటుంటే – 'ఓ' 'ఇంకా ఏమి చదివారు?' 'మీకు తీరుబడి వుంటుందీ' అలా – మాటలు సాగితే రాత్రి ఆగిపోతుందా?

'మళ్లీ కలుద్దాం' అనుకుని విడిపోయాను.

ఆ రాత్రి నా ఆలోచనల వనంలోని చలువరాతి పీఠం ఖాళీగా కనిపించలేదు, ఏదో వెన్నెల నీడ పరచుకొన్నట్లు!

✤ ✤ ✤

అతని కథలన్నీ మళ్ళీ చదివాను – కవితలన్నీ మళ్లీమళ్లీ చదివాను. ఆ రచనలన్నీ అనుభూతి రచనలేననిపించాయి. కథల్లోని వ్యక్తులు నాతో స్నేహం చేస్తున్నట్లు – కవితల భావావేశం నన్ను చుట్టివేస్తున్నట్లు ఉక్కిరిబిక్కిరి అయిపోయాను.

ఒక్కసారిగా నా మధురోహలన్నీ మూర్తిమంతమయి – మనోహరంగా చలువరాతి పీటమీద ఆసీనమయినట్లు – నాకు తెలియకుండా నేను వెతికే వ్యక్తి సజీవంగా స్నేహపూర్వకంగా ఎదురుచూస్తున్నట్లు – కలవరపరచి – కలల వరాలు రాలుస్తున్నట్లు–

హృదయావేదన నిదానమై – నన్ను ఇన్నేళ్ల కలవరింతల నుంచి మేలుకొలుపుతున్నట్లు రమణీయ భ్రమల సంభ్రమాల సంరంభంలో తలమునకలయి మర్నాడుదయం నిద్రలేచాను.

ఎండ కొత్తగా వుంది. చెట్లు సరికొత్తగా తలలూపుతున్నాయి. ఇప్పుడే ప్రవేశిస్తున్న శీత గాలులు మరింతగా కేరింతలు చిలుకుతున్నాయి. ఉదయపు నడకలో లోగిళ్ళ ముగ్గులు నాకోసమే ఆదరంగా పరుచుకుని లేలేత ఎండ పొడకు వళ్ళు విరుచుకుంటున్నాయి. కాలవలో నీరు పెళ్లి నడకతో కదులుతుంది. ఒకటి రెండు కొంగలు – పచ్చగడ్డి పురుగులేరుకుంటున్నాయి. ఎప్పుడూ చూడని పూలు రంగులు పూసుకుని కళ్లు తెరుచుకుని తుమ్మెదలకోసం ఎదురు చూస్తున్నాయి.

ప్రకృతి ఇంతగా పరవశించిపోతున్నట్లు నేను గుర్తించానా? లేక నా మానసికోల్లాసం ఈ ఉదయ శోభను మరింతగా వెలిగిస్తుందా?

✤ ✤ ✤

ఇప్పటివరకూ ఎంతో తొందరగా జరిగిపోయిన నా జీవితం ఇప్పుడు స్లో మోషన్‌లో వెళ్తున్నట్లు! మళ్ళీ ఎప్పుడు కలుస్తాడో? ఎక్కడ ఎలా కలవాలి? నాలో ఒక ఆలజడి – ఒక అసహనం పెరిగిపోతున్నది. చివరికి తెగించి ఒకరోజు

ఫోను చేశాను. 'చెప్పండి!' అన్నాడు. హలో అనాలికదా? ఫోనులో అతని గొంతు – మంద్ర గమకాలతో హాయిగా వినిపించింది! 'నేను, మొన్న క్షేత్రంలో కలిశాం' అని గుర్తుచేశాను. 'ఆఁ – ఎలా వున్నారు!' ఎలా వున్నానో ఎలా చెప్పను? మరి ఏమి మాట్లాడాలి? 'వచ్చే ఆదివారం – లంచ్‌కి రాగలరా?' 'ఏమిటి విశేషం?' 'మీరు రావటమే' 'మరో ఫ్రెండ్‌తో...' 'మీరొక్కరే రండి' అని 'వచ్చే ఆదివారం – ఎదురు చూస్తుంటాను' అంటూ ఎలాగో ముగించాను. నా మానసిక స్థితి అస్తవ్యస్తంగా వుంది. ఆదివారం ఇంకా ఎన్నిరోజులు? పేషంట్లనూ – నర్సునీ విసుక్కుంటున్నాను – రాత్రిళ్ళు నిద్ర తగ్గిపోయింది. ఎందుకీ అలజడి? రేపు ఆదివారం అనుకుంటాను–

ఆ రాత్రి నిద్ర లేదు. నిద్ర లేకపోతే కలలెలా వస్తాయి? కల రాకపోతే వెన్నెల వనంలో చలువరాతి పీఠం ఎలా కనపడుతుంది? ఆ పీఠాన్ని అలంకరించిన 'అతగాడు' ఎలా కనబడతాడు? నాకు ఒక్కసారిగా ప్రేమస్వరూపం అవగతమయింది. నా హృదయంలో ప్రేమ ఉప్పొంగి ఉప్పెనగా నన్ను ముంచేస్తోంది – ఊపిరి సలపక ఊయల – లలిత లతాశృంఖలాల ఊయల నుంచి – అతని ఒడిలో పడిపోయి ఎప్పుడో నిద్రపోయాను. చలువరాతి ఆసనం పూల రథంలా మారిపోయింది!

మధురోహలు పూల పుప్పొడిలా కలల కలవరింతలు వడివడిగా వరవడిగా ఒడలంతా పరచుకుంటే రాగరంజితమో – అనురాగ రంజితమో తెలియని మానసిక స్థితి స్థిరంగా ఎలా వుంటుంది? ఇప్పటివరకూ దర్శనమిచ్చిన నా భావనా వనంలోని చలువరాతి ఆసనం పూలరథంలా మారిపోతే ఆశ్చర్యపోవటమే నేను మెలకువలో కలగనటం!!

మాధవీ లతలు మల్లెల మాలలూ పెనవేసుకుపోయి నిర్హేతుక హృదయావేదనలు రగిలిస్తుంటే సంవేదనల ఝరి వెన్నెల ఏరయింది–

✣ ✣ ✣

ఆదివారం దాదాపు పదిగంటలకు కారు ఆగిన శబ్దం విని – గుండె దడ పెరిగింది. మెట్లు దిగి ఎదురువెళ్ళి నవ్వుతూ ఆహ్వానించాను. గుప్పెడు గులాబీలు ఇచ్చాడు – ఇన్ని తొక్కుడు లడ్డూలు తెచ్చాడు – పైకి తీసుకెళ్ళి పుస్తకాల గదిలో కూర్చోబెట్టాను. కాస్త ఆశ్చర్యంగా – 'చాలా పుస్తకాలున్నాయే' అన్నాడు. నేను

అతన్నే చూస్తున్నాను. అంతలో నా 'సీజర్' వచ్చి అతని కాళ్ళదగ్గర కూర్చుంది – ఇది కూడా ఇతన్ని గుర్తుపట్టిందే!



కాస్సేపు పుస్తకాలు చూస్తూ 'చాలా చదివారు' స్వగతంలా అన్నాడు. అతన్నే చూస్తున్నాను.

ఎలా వుంటాడో మీకు తెలుసుకోవాలని వుంటుంది!

కాని అతను నా ప్రేమస్వరూపం – ఆ రూపానికి ప్రేమ, రమణీయ – కమనీయ కవచం. చూస్తూ వర్ణించలేని అంధత్వం నాది. అతనికి నేనేమి సంకేతాలివ్వగలను?

పదహారేళ్ళ మనసేగాని – పడుచు ఈడు కాదు – యౌవనోద్రేకంలో మైమరచి లేనుకదా – నా ప్రేమకు ఆసరాగా లభించిన బహుమతిని చేజార్చుకునే ఆవేశం లేదుకదా–

అందుకే – అతన్ని శ్రద్ధగా పరీక్షగా గమనించాను.

బహుశా నా వయస్సే వుంటుంది. జుట్టు కాస్తంత పలచబడుతోంది. నుదురు నదరుగా వుంది – కనురెప్పలు పెద్దవే. ఐ లాషెస్ పొడవుగా కాస్త వంపులో ఉన్నాయి.

ఆ రెప్పల చాటున తెల్లని కనుగుడ్డులో నల్లని పాపలు – నావంక చూసినప్పుడు రెండు వెలుగు చుక్కలు మెరుస్తూ! కనుబొమ్మలు తీర్చినట్లున్నాయి. ముక్కు సూటిగా కొనదేలింది. దాని క్రింద చిన్న మూతి, తక్కువ మాట్లాడతాడేమో. సన్నని మీసకట్టు – చుబుకంలో కాస్త చీలిక – కనపడని ఆడమ్స్ యాపిల్ – చెవులు కాస్త పెద్దవే, ఎటువంటి వంకా లేకుండా బుద్ధుని తమ్మునిలా వున్నాయి. ఎక్కువగా వింటాడేమో. చెంపలు మరీ నునుపుగా లేవు. చాలా జాగ్రత్తగా షేవ్ చేసుకొని ఓల్డ్ స్పైస్ రాసుకున్నట్లుంది. సైడ్‌లాక్స్‌లో ఒకటి రెండు వెండి వెంట్రుకలు! లేత నీలం రంగు కలర్ ఫ్లస్ లినెన్ షర్టు – ఫుల్ హ్యాండ్స్ గుండీలు – ఎడంచేతికి సిటిజన్ ఈకో వాచ్ మెరుస్తుంది – వేళ్ళు మరీ పొడవు కాదు.

గోళ్ళు నీట్‌గా మెనిక్యూర్ చేయబడి ఉన్నాయి. ఎమరాల్డ్ రాయితో ఉంగరం ఉంది కుడిచేతికి. అరచేతులు రక్తంతో గులాబి రంగులో ఉన్నాయి. 'కాకీస్' సీ బ్లూ జీన్‌ప్యాంటు నీలాకాశంలా ఉంది. బూట్లు బయట విప్పాడు కదా – గ్రే రంగు సాక్సులో పాదాలు దాక్కున్నాయి. ఆరోగ్యంగా ఉన్నాడు. but he knows how to present himself.

ఇవన్నీ అతని అందాన్ని పరిచయం చేయటానికి చెప్పటంలేదు. మీకు ఎక్కడైనా కనిపిస్తే గుర్తుపట్టగలరేమోనని!

అయినా నా ప్రేమస్వరూపం రమణీయం – రమణీయ రమణీయంగా వుండక మరెలా ఉంటుంది! నా మనసు ఆనందంతో పరవళ్ళు పోతున్నది. తన పుస్తకాలు చూసి కళ్ళు పెద్దవిచేసి నావంక చూశాడు. 'అన్నీ చదివాను – ఒకటికి రెండుసార్లు' అన్నాను. 'ఏమిటీ విశేషం?' 'మీ శైలి – అనుభూతి వేదన, దానికి అతికిన ఊహల తళుకు – పూర్తికాని వాక్యాలు – రమణీయ విషాదం, అంతంకాని ఆ కథాంతాలు!'...

'అబ్బా చాలా వున్నాయే. నా కవిత ఏదయినా చదివి వినిపిస్తారా?'

"... సుషుప్తి నిక్షిప్తాల నుండి
స్వప్నాకాశపు కాల మేఘాల కావల
కనిపించే నీ రూపు...
తళుక్కున మెరుస్తూ
ఇక్కడినుంచే చేతులు సాచి
నేనేడుస్తూ...!..."

ప్రేమ విషాద కవిత చదవడం మొదలుపెట్టాను. అతను కళ్ళు మూసుకుని వింటున్నాడు.

"అవ్యక్త మహాశూన్యపు ఒంటరితనం నాది...
అమ్మ జ్ఞాపకాల కోసం జన్మ రహస్యాన్ని వెతుకుతున్న దురదృష్టం నాది."

అతని కంటి చివర ఓ తడిచుక్క.

"నా నిరీక్షణా నిష్ఠురతతో,

ప్రకృతినుండి నీవు ఉద్భవించాలి
నా ప్రేమ ఆర్ద్రతలో నుంచి
నీవు ప్రాణం పోసుకోవాలి
లేని నిన్ను సృష్టిస్తాను,
రాని నిన్ను రప్పిస్తాను..”

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు – సూటిగా నా కళ్ళల్లోకి చూశాడు! ఆ చూపుల్లో సూదులే వున్నాయి. అవి నన్ను దాటి చూస్తున్నాయి.

అతనికి సంకేతాలు చేరాయని నాకు తెలిసింది – అర్థమయ్యిందనీ అర్థమయ్యింది.

✤ ✤ ✤

వెండి పళ్ళెం – బంగారు పువ్వుతో వున్న వెండి పళ్ళెంలో పూర్ణాలు పెట్టాను – వేడి గారెలూ పెట్టాను – పూర్ణంలో నా చూపుడువేలుతో నొక్కి కమ్మటి నెయ్యి వేశాను – అతను ఇష్టంగా తింటుంటే – చక్కని అతని పలువరస చూశాను – ‘ఊఁ బాగుంది!’ అంటే కొసరి కొసరి వడ్డించాను. మల్లెపూవులా మెత్తని అన్నం వడ్డించి, ఆవకాయ ముక్క వేసి, ముద్దపప్పులో నెయ్యి పోసి... అతను కలుపుకుని తింటుంటే నా కడుపు నింపుకున్నాను. మళ్ళీ దప్పళంలో పప్పు కలిపించి తినిపించాను. బెండకాయ వేపుడు పచ్చిపచ్చిగా వేసింది, తెల్లని అన్నంలో పచ్చగా కలిపించి తినిపించాను. ములక్కాయ, సొరకాయ ముక్కలతో పప్పుచారు వేడిగా ఆరగింపచేశాను. ఎక్కిళ్ళు వస్తే వెండి గ్లాసుతో నీళ్ళందించాను. గడ్డపెరుగు మీగడతో వేసి, చక్రకేళి వలిచి పళ్ళెంలో పెట్టాను. ఏవో కబుర్లు చెబుతూనే తినిపించాను.

‘మీరు భోజనం చేయండి’ అంటే ‘తరువాత’ అన్నాను. నా ఆకలి తీరిపోయిందని అతనికెలా తెలియజేయను?

చేయి కడిగించి, తువ్వాలుతో నేనే తుడిచాను – ‘అయ్యో’ అంటున్నాడు.

మళ్ళీ పుస్తకాల గదిలో కూర్చోబెట్టి – పాయసం తెచ్చి యిచ్చాను – అతను స్పూనుతో పాయసం నోటికందిస్తుంటే – వేడికి తన పెదవులు కందిపోతాయేమోనని భయపడ్డాను – పాయసంతో తడిసిన పెదవులు తియ్యగా వుండవా!

'ఎందుకు మీకీ శ్రమ' ఎందుకు? నాకు నేనే సమాధానం చెప్పుకోలేని - వెతుక్కోవలసిన ప్రశ్న! ఎందుకంటే ఏమిచెప్పను? ఆ తరువాత పుస్తకాలు - పాటలు - సినిమాలు ఎన్ని కబుర్లు చెప్పుకున్నా - నేను గాలిలో మూడు అడుగులు ఎత్తులోనే వున్నాను - అతన్ని నాకంటే ఒక అడుగు ఎత్తులోనే కూర్చోపెట్టాను - తర్వాత విడిపోవటం బాధాకరం కాబట్టి ఆ వివరాలు చెప్పలేను.

ఆ కథ ఇక్కడితో ఆపివేస్తే బాగుంటుంది. కాని తర్వాత ఏమి జరిగిందో తెలుసుకోవాలని మీరు ఆతృతతో ఎదురుచూడటం నేనర్థం చేసుకోగలను. కాని, అప్పుడు, నాకు తర్వాత జరిగే సంఘటనలు ఎలా తెలుస్తాయి? ఏ విధంగా అర్థమవుతాయి! మర్నాడు, తెలతెలవారక ముందే తూరుపు చెరువు వైపు వెళ్ళాను. చిరుగాలులు అలసిపోయినట్లు ఇంకా మేలుకోలేదు. చెరువులో అలలే లేవు. పురుగుల కోసం పిట్టలు వాలటమూలేదు.

కొంతసేపు తూర్పు వెలుగు కోసం చూస్తూ నిలుచున్నాను. సుదూరంగా సూర్య రథాశ్వాల గిట్టల శబ్దంగా పిట్టలు వాలటం వినిపించింది. వాటి వెనకే దిగంతంలో బంగారపు దుమ్ము రేగింది. తాటిచెట్ల వెనకనుంచి బాలభాస్కరుడు తప్పటడుగులతో ఎగబాకుతున్నాడు.

నా జీవితంలో ఒక క్రొత్త పొద్దు - రాగరాగరంజితమై వెలుగు రెక్కలు విప్పుకుంది! అలా ఎంతసేపు నిలుచున్నానో - చివరికి ఎండ చురుక్కుమంటున్నప్పుడు తిరిగి ఇంటికి చేరాను - అప్పటికే ఒకరిద్దరు రోగులు వచ్చి బల్లమీద కూర్చున్నారు. మళ్ళీ మందుల ప్రపంచంలోకి...

❖ ❖ ❖

అలా రోజులు - ఇంతకు పూర్వంలాగా కాకుండా ఒక ఉత్సాహంతో ఏదో తెలియని, ఏదో జరగబోతున్నదనే కొత్త ఆశతో తేలికగా తేలిపోతున్నాయి. రోగుల్ని నవ్వుతూ నయం చేస్తున్నా - నర్సును విసుక్కోవటం తగ్గించాను - వాళ్ళు అన్ని గమనిస్తుంటారు - 'అమ్మగారు - ఆనందంగా వున్నారు!



ఉదయ కిరణాలు



డాక్టరుగారు నవ్వుతున్నారు' అనటం వింటూనే వున్నాను. నాలో మార్పును గమనించిన సీజర్ ఎక్కువ చనువుతో తోక ఆడిస్తోంది. అమ్మ ముఖంలో ఏదో తెలియని తేలికదనం.

అప్పుడే వసంతం ప్రవేశిస్తోంది – కొత్త మావిచివుళ్ళు మేసి కోయిలలూ పిలుస్తున్నాయి. పెరటిలో మామిడిచెట్టు పిందెలు వేలాడదీసింది. వేపచెట్టు పూత విరగబూసింది. ఈ రోజుల్లోనే – మా స్నేహం దగ్గరయ్యిందని అనుకోవచ్చు – అనుకున్నాను. అంతేనా – ఎప్పుడూ నేతచీరలు కట్టుకునేదాన్ని – కాశ్మీరు సిల్కు, కంచిపట్టు చీరలే కడుతున్నాను – ఎప్పుడూ చేతిగోళ్ళు మరీ పొడవుగా కాకుండా తీరుగావుంచి – గోరింటాకు పెడుతున్నాను – అరచేతుల్లో 'ఆకు' పెట్టి పండించాను – కొత్త కారూ కొన్నాను. పాయిజన్ పెర్ఫ్యూమ్ కూడా వాడుతున్నాను!

అతని ప్రతి ఉత్తరం ప్రేమలేఖలా అనిపించేది – అందులో విషయాలేమి వున్నా – అతని ప్రతి కవితా నా కోసమే రాసినట్లుండేది. ఒకసారి అడిగాను – 'పత్రికలకు పంపకూడదూ?' అంటే 'అవి ఎవరికి చేరతాయి' అని నవ్వి ఊరుకుంటాడు.

ఒకటో, రెండో నేనే పంపాను కూడా – అవి అచ్చయితే – 'కాపీరైటు ఉంటుందని తెలుసుకదా!?' అని మందలింపు – అయినా నాకెంత ఆనందమో అవి అచ్చులో కనపడితే – ఈ మధ్య పగటి కలలు ఎక్కువైనాయి మరి.

ఒకసారి కొత్త కారులో అతని ఆఫీసు దారిలో వెళ్తూ – పాటల కాసెట్టు ఇచ్చాను. ఇస్తూ "వినండి – రాత్రి ప్రశాంతంగా కళ్ళు మూసుకుని" అన్నాను. 'నువ్వు కనపడతావా?' అన్నాడు. అప్పటికే ఏకవచనమే కావాలని పిలిపించుకుంటున్నాను – ఆ మర్నాటినుంచే అతని ఫోనుకోసం ఎదురుచూశాను. రెండు మూడు రోజులు ఏ ఫోనూ లేదు. వినలేదా? వింటే ఈ మౌనానికి అర్థం ఏమిటి? ఈ సస్పెన్సు భరించటం కష్టంగానేవుంది. ప్రేమ వున్నచోట అహం వుండదు. అహం లేనిచోట తెరలూ వుండవు. ఓ రాత్రి పదిగంటలకు ఫోన్ చేశాను! అతని తీయని గొంతు వగరుగా వినిపించింది. 'విన్నారా!' 'ఆఁ, ఇప్పుడు కూడా వింటున్నాను' 'ఇంకా?', 'స్వింగ్‌లో కూర్చుని వైన్ – సిప్ చేస్తున్నా' 'అబ్బో బావుందే' – 'ఈ అదృష్టం మీకు లేదుకదా!' 'అవును – ఇప్పటికి

ఉన్నవాటితోనే ఎక్కువైపోయి' అని. 'ఏమీ అనుకోలేదుకదా?' 'అనుకోవలసిందే – అనుకున్నాను, మనం అమాయకులం కాదుకదా?' 'మరి?' 'మరి సమాజం?'

'ఆమాత్రం నాకు తెలియదా?' అంటూ ఫోనుపెట్టేశాను.

గుండె బరువుగా వుంది. బయట డాబామీదకు వచ్చాను – నిండు పున్నమి వెచ్చగా వుంది. మామిడిపండు – అందనంత దూరంలో చెట్టు కొమ్మకు నిండుగా వుంది. పొగడపూలు – జాబిలి కన్నీటి బిందువుల్లాగా రాలుతున్నాయి. అనంత లోకాలలోని తారలు ఆరి ఆరి వెలుగుతున్నాయి – వెన్నెలలో నా చెక్కిళ్ళు వెచ్చని కన్నీళ్లతో తడుస్తున్నాయి.

రాత్రంతా కళ్ళు తెరిచే నిద్రపోయాను – కలలు – పగటి కలలు – ఇప్పుడు పీడకలలై కళ్ళు పీకుతున్నాయి.

✤ ✤ ✤

పుస్తకాల సంత జరుగుతుంటే ఓ సాయంత్రం వెళ్ళాను – అలా తిరుగుతుంటే ఓ చోట చుట్టూ మనుషులతో గంధర్వుడు కనిపించాడు! చాలాసేపు దూరంనుంచే చూస్తూ నుంచున్నాను – నా ఉనికి గమనించి, లేచి వచ్చాడు. ఇద్దరం–

తర్వాత పుస్తకాల దుకాణాల వెంట – చాలాసేపు కలిసి తిరిగాము. దాదాపు రెండు గంటలు నాకు గాలిలో కలిసిపోయాయి. ప్రేమ సామీప్యంతో ఎంత సాంత్వన వుంది! సాయంత్రం రాత్రయింది. రాత్రి ఎనిమిదయ్యింది – ఇక వెళ్ళిపోవాలి – నాకు వెళ్ళాలని లేదు – 'సినిమాకెళదామా?' 'మనం చూసే సినిమాలేమున్నాయి? అయినా నీకు ఆలస్యం అయిపోతుంది – దూరం వెళ్ళాలి కదా?' అని నా నెత్తిని నీళ్ళు జల్లాడు – విడిపోయేముందు – ఒకసారి అతనిచేతిని రెండు చేతుల్లోకి తీసుకుని – గుండెకద్దుకున్నాను – 'ఏమిటీ పిచ్చి?' అని రహస్య వేదనతో, అదే వెచ్చని చేతితో నా చెక్కిలి నిమిరాడు. అవును ఇది పిచ్చికాదా? ఎలాగో ఎప్పుడో ఇల్లు చేరాను.

ఈ పరిస్థితికి అతనే పరిష్కారం చూసినట్లున్నాడు. ఒకరోజు ఫోన్‌చేసి "ఊరు మారిపోతున్నాను – నీకు దూరంగా వెళ్ళిపోతున్నాను" అన్నాడు – 'ఎందుకు ఇంత సడెన్‌గా?', 'మరో వ్యాపకం', 'నేను రాలేనంత దూరమా?' 'మనం కలవలేనంత దూరం', 'పారిపోతున్నారా?' 'మారిపోవటం లేదుగా – ఫోన్

చేస్తుంటాను – మాట్లాడు!' అంతే – ఫోన్ ఆగిపోయింది. అతని తియ్యని గొంతు విషపు బిందువులు రాల్చినట్లు నాకు వళ్ళంతా మండిపోయింది. నేను పూర్తిగా కోలుకోవటానికి వారంరోజులు పట్టింది.

✤ ✤ ✤

ఇంతలో ఎన్ని మార్పులు – సెల్‌ఫోన్లు వచ్చాయి – అప్పటికే ఇంటర్నెట్ గూడు అల్లుకుంది – నాకు రోగులు పెరిగారు – రోగాలు ఎక్కువగా ముసురుకుంటున్నాయి. ఏ రోగం ఎందుకు వస్తుందో – ఏ మందు దేనికి పనికివస్తుందో డాక్టర్లకే తెలియని పరిస్థితి వచ్చేసింది. ఏ జ్వరం దేనిదో – మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ – ఒకటేమిటి రోగులను చూస్తుంటే జాలివేస్తుంది. రోజులో పదిగంటలు క్లినిక్‌లోనే గడిచిపోతుంది. రాత్రిళ్ళు ఇన్‌పేషెంట్లు ఉండనే ఉంటారు – శరీరం అలసిపోతే – మనసు విశ్రాంతి తీసుకుంటుంది – ఎండలు ముదిరిపోతున్నాయి – వేసవి తెచ్చే రోగాలు పెరిగిపోతున్నాయి.

ఒకరోజు సెల్‌ఫోన్ మోగింది – 'ఎక్కడ వున్నావు' నేనే అడిగాను. 'హాస్పిటల్‌లో' ఎంత డాక్టర్నయినా – ఏదో కీడు శంకించాను – 'ఏమయింది' నా గొంతు పూడుకుపోయింది – 'ఏయ్ – నథింగ్ - 'I was knocking the soft golden gates of St. Peter for three days and nights...' 'నీ కవిత్వం ఆపి – ఏమయింది, చెప్పు – 'అదే Haematoma - Burr hole evacuation మూడు రోజులు సెమీకోమాలో, అంటే జీవితంలో మూడు రోజులు మిస్సింగ్!'... ఏదో అంటున్నాడు – 'సరే – సరే' అని ఫోన్ ఆపివేశాను.

'అయ్యో – ఎంత దురదృష్టం – ఎంతదృష్టం! ఏం చెయ్యాలి? వెళ్ళనా? తట్టుకోగలనా? నాకే ఎందుకిలా జరుగుతోంది – కట్టుకున్నవాడు – మెదడుబాంబుతో గట్టెక్కాడు. నేను అపురూపంగా – మనసంతా ప్రేమతో నింపుకున్న గంధర్వుడు – ఇప్పుడు అలాంటి మరో ప్రమాదంలో కోమాలోకి వెళ్ళివచ్చాడు – ఇదేనా నా 'మిడాస్ టచ్?'

ఒకప్పుడు నేను క్లినిక్‌లో కూర్చుని రోగుల కోసం చూస్తుండేదానిని. ఇప్పుడు రోజులో ఎప్పుడూ రోగులుంటున్నారు. రోగుల సేవలో సేదతీరుతున్నాను – దీనికీ ఒక కారణం వుంది. ఇప్పుడే చెబుతాను– అతను నాకు దగ్గర్లో వున్నప్పుడే

తన గురించి చెప్పాడు – తను పెరిగిన వాతావరణం – తన ఒంటరితనం – ఆ వివరాలు మీకు అవసరం లేదు కానీ – నాకతని 'లోతు' తెలియటానికి – ఈ నాగరకతను, ప్రపంచాన్ని అతని దృష్టిలో చూడగలిగాను. నా హృదయంలో అప్పటివరకూ అమృతంలా నిండిన ప్రేమ – అతనిపట్ల ఆరాధనగా పరివేదన చెందటానికి – ఆ వేదనలోని అమృత బిందువులు, దుఃఖంలోనూ సాంత్వన పొందటానికి దోహదం చేసింది. అప్పటినుంచే రోగుల్ని మరింత శ్రద్ధగా పట్టించుకుంటున్నాను. ఒకప్పుడు పదిమంది రోగుల్ని చూస్తే అలసిపోయేదాన్ని. ఇప్పుడు పదిగంటలు పనిచేసినా రోగులతో, అలసట తెలియటంలేదు. ఎంతో ఇష్టంగా సేవలో సేదతీరుతున్నాను. ఇదీ అతని పుణ్యమే అనుకున్నాను.

✤ ✤ ✤

హాస్పిటల్ నుంచి బైటపడిన తరువాత రోజూ ఫోను చేస్తున్నాడు – అతనిలో ఏదో తెలియని మార్పు – నాకిష్టమైన మార్పే స్పష్టంగా కనపడుతోంది. 'ఎక్కడున్నానో చెప్పనా – కాకుల గోల వినపడుతుందా?' నవ్వుతూ అంటాడు! అంటే పార్కులో వున్నాడన్నమాట – చాలాసేపు మాట్లాడుతున్నాడు – 'నీ ఆరోగ్యం ఎలావుంది?' 'నాకేమిటి మృత్యుంజయుణ్ణి కదా?' అయ్యో అతనికి ఎలా చెప్పాలి? 'సరే, వుంటాను' అని ఫోన్ కట్‌చేశాను. కాలక్రమేణా నేను మాట్లాడటం తగ్గించాను. ఈ సమయంలోనే అతని కవితలు వచ్చి నన్ను కలవరపెట్టాయి. ప్రతి కవితా ఒక విషాద సౌందర్యమే! ఒక కథ కూడా పంపాడు, ఇవన్నీ నన్ను ఆనందంలో ముంచి తేల్చవలసింది. ఎందుకు ఆందోళన చెందుతున్నాను? ఈ పరిస్థితికి నాకు స్పష్టంగా కారణం తెలుసు. కాని అతనికి ఎలా తెలియచెప్పాలి?

✤ ✤ ✤

నెలరోజులు చాలా తీవ్రంగా ఆలోచించాను – ఎటూ పాలుపోవటంలేదు. ఇంకా ఆలస్యం చేస్తే అతనే వస్తాడేమో? ఏమో? మళ్ళీ నా నీడపడితే? వద్దు... వద్దు... నా వృత్తిలో ఎన్ని మరణాలు చూడలేదు – మృత్యువు ప్రకృతిలో భాగమని తెలియదా? కాని దానిచుట్టూ ఎంతటి విషాదపు గోడు! భౌతికమైన మరణం – అగాధమైన విషాదానికి దోహదం కావటం లేదా?

✤ ✤ ✤

మరి, మరి నా గంధర్వుణ్ణి రెక్కలు తెగిన అడోనెస్‌లా ఊహించగలనా –

నా సుప్తచేతనం నుండి తెగిపడిన స్వప్నంలా భావించుకోగలనా? నా కలల పదార్థం ఆవిరైపోతుంటే భరించగలనా? ఇది – ఇంతకంటే విషాదం ఏముంటుంది?

ఈ రోజులలోనే నా రాత్రులన్నీ భరింపజాలని వేదనలో భారమైపోయాయి. పూల తోరణాల మనోవనంలో విహరించటానికి మనసొప్పటం లేదు. అయినా నా విషాదం అటే నడిపిస్తోంది. కలలు, కల్లోల లోకమైపోయాయి. హఠాత్తుగా ఒక రాత్రి నిద్రలోని మెలకువలో, మండు వేసవిలో వాడివత్తలయిన మృదుల పూలహారాల హాహాకారాలు నిశ్శబ్దంగా వినిపించాయి. హరిత లతానికుంజాలు ఎండిపోయి హృదయ విదారకంగా కనిపించాయి. ఎంతసేపని వెదికాను? కఠిన శిలాశకలాలు కర్కశంగా గాయపరుస్తున్నాయి. నా చలువరాతిగూడు పూల పుప్పొడితోబాటే వెన్నెల పొడిగా మారిపోయి అంతర్థానమైపోయింది. అయ్యో... అయ్యో... నా గంధర్వుణ్ణి ఎక్కడ కూర్చోబెట్టాలి? ఈ శిధిల సమాధుల వనంలో మరో స్మృతిఫలకం ఎలా చూడగలను..?



అయ్యో... సమాధుల వనం

నా మధురోహల ప్రేమవనం – సమాధుల పెనంలా దర్శనమిస్తోందేమిటి?

✣ ✣ ✣

పగళ్ళు కదలటంలేదు – రాత్రిళ్ళు వదలటంలేదు – ఈ సమయంలోనే ఒక రోగికి నెలరోజుల పైగా జ్వరం వస్తున్నది. నా దగ్గరకు రావటమే ఆలస్యం చేశాడు. రక్త పరీక్షలు, స్కాన్ చేస్తే బ్రెయిన్ టి.బి. అని తేలింది. వెంటనే గుంటూరు పంపాను. ఇక్కడ నేను చేయగలిగింది ఏమీలేదు. ఇది జరిగి ఎన్నాళ్ళయిందో కూడా గుర్తులేదు. తర్వాత అతని బంధువులు వచ్చి కోమాలో వున్నాడని చెప్పారు...

ఆ సాయంత్రం బెజవాడ నుంచి తిరిగివస్తూ ఒకచోట ఆగి, పడమటి దిక్కువైపు చూశాను. చెంగావి సంజెపొద్దు దిగంతాన్ని కాషాయంతో నింపివేసింది. వాలిపోతున్న దివసాంతం నా వేదనను మరింతగా పెంచింది. ఆ ప్రకృతి సౌందర్యం నన్ను దుఃఖంలో ముంచివేసింది.

ఆ ఉదయం ఆలస్యంగా మేల్కొని, చాలా ఆందోళన చెందాను – వెంటనే నా దేవుడికి ఫోన్ చేశాను – 'ఎక్కడ?' 'న్యూరోఫిజీషియన్ దగ్గర' అన్నాడు. 'వద్దు... సెల్ మాట్లాడకు' అని పెట్టేశాను. ఆ తర్వాత అతనే ఫోన్ చేశాడు. 'అంతా బాగానే వుంది, అప్పుడప్పుడు కాస్త తలనొప్పి వస్తుంటే చూపించాను' అన్నాడు.

'This is the last straw...' అనుకున్నాను. 'సరే, Take care, సెల్ మాట్లాడకు, మంచిదికాదు' అని ముగించాను.

✤ ✤ ✤

ముగించాను అంటే – ఇక అతనితో మాట్లాడటం ముగించాను. నా ఇంగితాన్ని ఇంతటితో ముగించాను – అతని ప్రాణదీపం కోసం – నా ప్రేమపాశాన్ని తెంచాను.

అదే, కొందరికి జీవితంలో అన్నీ తొందరగా ముగిసిపోతాయి...



కనక

రాత్రి నుంచి, కనక పురిటి నొప్పులు వింటూనే వున్నాడు – ఎప్పుడో తెల్లారుతుండగా – బిడ్డ ఏడుపు వినపడింది.

నా బిడ్డ మాయలోకంలో పడింది, అనుకుని ఆసుపత్రి వరండాలో గోడవారగా ఆనుకుని మగత నిద్రలోకి జారుకున్నాడు.

ఎండతోపాటు ఆసుపత్రి మేల్కొంది. వచ్చే పోయే జనంతో – నర్సుల హడావుడి నడకలతో, మందుల వాసనతో నారాయణ ఉలిక్కిపడి లేచాడు – ఆసుపత్రి ఆరుబయట వేపచెట్టు క్రిందకు వెళ్ళి పళ్ళు తోముకొని ముఖంమీద నీళ్ళు చల్లుకున్నాడు.

మెల్లగా వరండాలోకి వచ్చి రాత్రి కనక పడిన నొప్పులు – బిడ్డ ఏడుపు గుర్తుకువచ్చి – నర్సమ్మను అడిగాడు – చూడవచ్చా అని – ఆమె అటు అన్నట్లు వేలు చూపింది.

కనక మగతగా పడివుంది – పక్కలో పండులాగా బిడ్డ – నల్లని జుత్తుతో – మేలుకునే వుంది. మెల్లగా దగ్గరకు వెళ్ళి పరీక్షగా చూశాడు; పాప తనని చూసి నవ్విందా? తన భ్రమా? మళ్ళీ వరండాలోకి వచ్చి తర్వాత వేపచెట్టు క్రింద కూర్చున్నాడు. తన చుట్టూ వున్న పరిసరాలు – మెల్లమెల్లగా పొగమంచులో కనపడకుండాపోయాయి.

మర్నాడో, ఆ మర్నాడో, కనకను, పాపనూ తీసుకుని ఆ చిన్న టౌను బస్సుస్టాండుకి చేరి తన వూరు పోయే బండి కోసం కూర్చున్నాడు. కనక, తలకు చెవులమీదుగా గుడ్డ కట్టుకుని నీరసంగా వుంది. తన చేతుల్లో పాప కదుల్తోంది. ముద్దుగా! ఇంకా పురిటివాసన!

బస్సులో ఎక్కిన తర్వాత పాపకు చెంగుచాటుగా చనుబాలు కుడిపి కనక నిద్రపోయింది. నారాయణ పాపను చేతుల్లో పొదివిపట్టుకుని ముద్దులు పెట్టాడు. అమ్మ వాసన! ప్రక్కనే వున్న దంపతులు నారాయణను చూసి నవ్వి – 'పాప బావుంది' అన్నారు. వాళ్ళు చేతులు జాస్తే పాపను అందించాడు. నారాయణ కళ్ళు తడిసిపోయాయి.

కనక మగతగానే వుంది. గంటో – రెండు గంటలో ఎంతసేపు ప్రయాణం సాగిందో పొద్దు దిగే వేళకు–

వాళ్ళ వూరి స్టాపులో బస్సు ఆగింది. వెనకాలే దుమ్ము లేచింది.

ముందు కనక దిగింది. అలా మగతగానే అక్కడి చెట్టు క్రిందకు చేరింది.

వెనక నారాయణ దిగాడు – బస్సు కదిలిపోయింది; మళ్ళీ దుమ్ము లేచింది.

కనక, నారాయణ రావటం చూసింది. బస్సు రేపిన దుమ్ములో, తన కంటి నీటి పొరల్లో నారాయణ ఎండమావుల్లోంచి నడిచి వస్తున్నట్లుంది. నీరసంగా లేచింది – 'పాపేది?' 'పాపేదయ్యా!' అని ఏడుపులాంటి అరుపు.

'వద్దే – అది బతకనివ్వదు – వద్దే – దాన్ని బతకనివ్వదే' అంటూ ఏడ్చాడు.

కనక అతని చేతుల్లో వాలిపోయింది.

వెనక పొద్దూ వాలిపోయింది.



భట్టు గారు చెప్పిన బి.బి.సి. నాలుగు నిమిషాల కథకు అక్షరరూపం. *–ఎ.కె.*



మావుళ్ళయ్య

"పంట పోయింది..."

'................'

"కాంట్రాక్టు ఎయ్యి, బువ్వ తినాలిగా..."

'.....................'

మావుళ్ళయ్య పాటందుకున్నాడు.

తలెత్తి చూశాను.

ఎండిన బోదిలా ఉన్నాడు.

గొంతులో జీర ఎక్కువైంది.

'సరేలే – కాంట్రాక్టు వేద్దాం...'

"చల్లని తల్లి, చల్లగ ఉండాలి..."

వారం రోజులు – ఎరువుల బస్తాలో రెండు కిలోలు ఎర్రమిరపకాయలు.

"ఇదిగో – ఒక కిలోకి డబ్బులివ్వు – ఇంకో కిలో ఉంచుకో."

రెండు కిలోలకు డబ్బులిచ్చి పంపాను.

ఎర్రని మిరప – ఎండిపోయింది – విత్తనాలు కుండీలో వేసి, నీరుపోశాడు నా పెనిమిటి.

మట్టిని చీల్చుకుని మొక్క పొడుచుకొచ్చింది.

మూడు నెలల్లో, ఎర్రని మిరప పచ్చని మొక్కకు వేలాడుతున్నాయి. తుంచి పోపులో వేశాను, తొక్కి పచ్చడీ చేశాను.

మావుళ్ళయ్య పాటలు – కాంట్రాక్టుతో రికార్డు చేయించాను. ఏడాదిలో ఇరవై వేలు ముట్టజెప్పాను.

ఒకరోజున ఎర్రని అంచు పచ్చని నేత చీర – తెచ్చాడు.

'ఎందుకు?'

"దసరాకు దుర్గమ్మకు సీర బెట్టరా?"

'సరే కనకదుర్గ కొండకు పంపుతాలే–

'నీ కొడుకు పాడతాడా?'

'వాడికి పాట నేర్పినా – కాని ఉజ్జోగం చేస్తాడంట! అరే, పాట వదలొద్దురా – ఏ తల్లయినా అన్నంబెట్టుద్దురా అని చెప్పినా..'

ఎండలు మండిపోతున్నాయి.

కుండీలో మిరపమొక్క వడగాలికి విలవిల్లాడింది.

మా తమ్ముడు, ఇంజనీరింగ్ – ఈరోజే వచ్చాడు.

సాయంత్రం సంగీత కచ్చేరీకి వెళ్ళినప్పుడు వాడు 'కిండిల్' వెలిగిస్తున్నాడు

వచ్చి చూస్తే, మిరపమొక్క పీకి ప్రక్కన పడేసి ఉంది. 'అక్కా – ఎండిపోయిందిగా.'

మర్నాడు మావుళ్ళయ్య కాంట్రాక్టు ముగిసింది.

గొంతు మూగబోయింది.

నా పెనిమిటి ఆ మొక్కనే కత్తిరించి, మళ్ళీ కుండీలో పెట్టి నీళ్ళు పోశాడు. వాడి, ఎండి – మెల్లగా చిగురేసింది.

తర్వాత ఎర్రని మిరపకాయ ఉదయకాంతిలో మెరిసింది.

రేడియోలో 'ఉదయరేఖలు' ప్రోగ్రాంలో మావుళ్ళయ్య పాట వినబడుతోంది.

(ఒక రైతు ఆత్మహత్య ఆగిపోయింది.)







హిమాలయం

మంచుపెట్టె



సాయంకాలం – అయిదో నంబరు బస్సు గురునానక్ కాలనీ S.B.H. స్టాప్ దగ్గర ఆగినపుడు అతను నిదానంగా ఎక్కుతాడు – ఆటోనగర్‌లో బయలుదేరిన ఆ బస్సులో సామాన్యంగా సీట్లు ఖాళీగానే ఉంటాయి. ఎడమవైపున కిటికీ ప్రక్కన కూర్చుంటాడు. రమేష్ హాస్పిటల్ సిగ్నల్ వచ్చేలోపు, టికెట్టు ఏడురూపాయలు, పది యిచ్చి మూడురూపాయలు మర్చిపోకుండా తీసుకుంటాడు – సాయి కర్రీపాయింట్ ప్రక్కన స్వీటు–హాటు–ఐస్‌క్రీం కొట్టు – దాటి, పుల్కా సెంటర్ తర్వాత సిగ్నల్ వస్తుంది – ఇక్కడ కొంత గందరగోళం – సర్వీసు రోడ్డు, ట్రాఫిక్ అడ్డంగా వస్తుంటుంది – ఈ లోపు గ్రీన్ సిగ్నల్ పడితే ఒకటే హడావుడి. ముందు మోటార్‌సైకిళ్ళు పరుగెడతాయి. తర్వాత ఆటోలు మూతిపెట్టి దూరతాయి – పాపం కార్లు – ఎక్కడ దెబ్బలు తగులుతాయోమోనని జాగ్రత్తగా నడుస్తుంటాయి – బస్ బరువుగా ధీమాగా రింగ్‌రోడ్డు దాటుతుంది. కరెంటు ఆఫీసు స్టాప్‌లో ఎక్కేవాళ్ళు చాలా ఎక్కువ. బస్ నిండిపోతుంది. కండక్టర్ టికెట్లు ఇవ్వడానికి ముందుకు వెనక్కు వేలాడతాడు. ముందు సీట్లన్నీ ఆడవాళ్ళకే – కొన్ని పాస్‌లూ వుంటాయి. తర్వాత స్టాప్ ITI గేటు – తర్వాత అమ్మ కల్యాణం! అక్కడనుంచి ఎడంపక్కకు తిరిగి మోడరన్ బేకరీ చేరుతుంది – సిద్ధార్థ కాలేజీ సర్కిల్ తిరిగి చౌదరి పాకర్స్, గుహసైన్స్, జమ్మిచెట్టు, మొగల్‌చౌక్ – అక్కడనుంచి ఎడంపక్కగా తిరిగి ఎత్తు ఎక్కాలి.

ఇక్కడే మీకు ఒక విషయం చెప్పాలి – అతను మొగల్రాజపురంలో పుట్టి పెరిగినవాడు – అతని చిన్నప్పుడు ఈ ప్రాంతంలో రెండు కొండలు పెద్దవే వుండేవి – ఇప్పుడు గుహలున్న భాగాన్ని వదిలి ఆ కొండల్ని పిండిచేసి బందరు కాలువలో, పడవల్లో రోడ్లు వేయటానికి కృష్ణాజిల్లా అంతా తరలించారు. ఇక్కడ తప్ప కృష్ణాజిల్లాలలో తూర్పుగా మరే రాతికొండలు లేవు మరి – అందుకని ఈ రెండు కొండలూ నేలమట్టం అయిపోయాయి. వాళ్ళ తాతమ్మ అంటుండేది – "అరే, కూర్చుని తింటుంటే కొండలూ కరిగిపోతాయి" అని. అలాగే సంపన్న కుటుంబాలు సాదా కుటుంబాలుగా మారిపోయాయికూడా. బెజవాడలో చాలా కొండలు ఇలాగే తరిగిపోయాయి. సరే, ఈ కొండలు పోయిన ఖాళీలో – చాలాకాలం ఆ చుట్టుపక్కల రిక్షా కార్మికులు – తాపీ పనివారు – వీళ్ళంతా వలసదారులే – బయలుచోటుగా వాడుకున్నారు – రోడ్డు మార్జిన్లు కూడా వదలకుండా. అతను సైకిల్‌పై వెళ్ళేప్పుడు ఈ కంపు భరించలేకపోయేవాడు. కానీ ఇది ఒక్కటే దారి. మరో దారి తర్వాత చాలా కాలానికి పుష్పా హోటల్ ముందుగా అయిదో నంబరు బస్సు కోసం వేశారు. అది పూర్వ రంగమన్నమాట.

ఇప్పట్లోకి వస్తే – బస్సు ఈ ప్రాంతం చేరగానే ఆ ప్రాంతమంతా వలస కార్మికులు ఆక్రమించి కొంత, మున్సిపాలిటీ ఓట్ల కోసం కొంత ఎలాగైతే పనివాళ్ల పాకలు పుట్టగొడుగుల్లా వచ్చాయి. కింద అంతా కటికి రాయి. అంటే పునాది లేకుండా గోడలు లేపవచ్చు. అలా పెరిగిపెరిగి అది బాడవపేట కాలనీగా బందరు రోడ్డుకు దారిచేసుకుంటూ పశువుల హాస్పిటల్‌కు చేరుతుంది. ఇప్పుడు ఈ రోడ్డుతో మనకి పనిలేదు. బస్సు బాడవపేట స్టాపులో ఆగుతుంది. అతను యథాలాపంగా ఎడమవైపు చూస్తాడు. అక్కడే ఒక షెడ్డులాంటి కొట్లో పొడవాటి గాజుపెట్టెలు పడుకుని వుంటాయి. మొదట్లో అవి ఏమిటో, ఎందుకో అతనికి అవగాహన లేదు. అవెందుకో తెలుసుకోవలసిన అవసరం ఏముంది? యథాలాపంగానే బస్సు ఆ స్టాపు దాటిపోతుంది. కాస్త ముందుకు పోయి కుడిపక్కన, తిరిగి చర్చి దాటి, స్టేడియం వెనక కాలనీ, ఇది ఓట్ల కోసం ఆక్రమించిందే – దాటి బిషప్ హజరయ్య స్కూలు దగ్గర మళ్ళీ ఎడంవైపు తిరుగుతుంది. గోపాలరెడ్డి రోడ్డులో ఫారెస్ట్ గెస్ట్‌హౌస్, స్టేట్ గెస్ట్‌హౌస్, ప్రబోధ సెంటర్‌ల మీదుగా గవర్నరుపేట, బీసెంటు రోడ్డు స్టాపులో దిగిపోతాడు.

ఇక్కడకు ఎందుకొచ్చాడు?

బీసెంటు రోడ్డులో గుండుసూది దగ్గర్నుంచి గుడారాలదాకా అన్నీ దొరుకుతాయి. ఎడంవైపు ఎండురొయ్యలు, కుడివైపు కొమ్ముదువ్వెనలు రోడ్డుమీద పెట్టి అమ్ముతుంటారు. ఆ ప్రక్కనే వక్కలు, అరటిపళ్ళు, ఆ వెనకనే పట్టుచీరల దుకాణాలు బారులు తీరి వుంటాయి. ఇది బెజవాడ మార్కెట్ ప్లేస్ అన్నమాట. ఒక మైలు పొడవు – బందరురోడ్డు – ఏలూరు రోడ్డు కలుపుతూ నడుచుకుంటూ లైట్లు – అద్దాలు, అమ్మాయిలు, మల్లెపూలు కాళేశ్వరీ రోడ్డు క్రాస్‌లో – మూల గుడి – మోడరన్‌కేఫ్ పెన్‌కార్నర్ దగ్గర ఏలూరు రోడ్డు దాటి రెండు బందరు మిఠాయిల దుకాణాలు దాటితే పాతపుస్తకాల కొట్లు వస్తాయి. అదీ, అక్కడ వెతుకుతుంటాడు. ఏదైనా తను చదవని పుస్తకం దొరుకుతుందా అని.

సామాన్యంగా సాయంత్రంపూట ఇదే కార్యక్రమం – ముందుకు వెళ్తే అలంకార్ సెంటర్. అలంకార్ థియేటర్ వైభవం తొలినాళ్ళ నుంచీ చూసివున్నాడు – సరిగ్గా ఆరుగంటలకు గంటలు మోగి సినిమా మొదలయ్యేది. అక్కడే 'బీస్ సాల్ బాద్' వంద రోజులు ఆడింది. ఇప్పుడు సినిమాల గోల మనకెందుకు? అదీ హార్రర్ సినిమా!

ఆ రోజున విల్‌డురాంట్ 'నెపోలియన్' దొరికింది. అది అతని ఆటలో మంచి 'గేమ్'కిందనే లెక్క. తరువాత తిరుగు ప్రయాణం – మళ్ళీ బీసెంటురోడ్డుకు వచ్చి ఈసారి ప్రకాశం రోడ్డులో 5 వ నంబరు బస్సెక్కుతాడు. ఇది నక్కల రోడ్డు దాటి పుష్ప హోటల్ మీదుగా కస్తూరిబాయిపేట మళ్లీ ప్రజాశక్తి నగర్, మొగల్‌చౌక్ దగ్గర పాతరోడ్డులో కలుస్తుంది. అప్పటికే లైట్లన్నీ వెలుగుతాయి. జమ్మిచెట్టు దాటితే గుహవైన్సు దగ్గర జనం మూగివుంటారు. కొండప్రక్కనుంచి జర్నలిస్ట్ కాలనీ దాటి అమ్మ కల్యాణం మీదుగా ఎగ్జిక్యూటివ్ క్లబ్ రోడ్డు దాటి, పుల్కాసెంటర్‌లో గురునానక్ కాలనీవాసులు ఫాస్ట్‌ఫుడ్ పాకింగ్ చేయిస్తుంటారు, అదే S.B.H. స్టాప్ దగ్గర కూరగాయలు, పుచ్చకాయలమ్ముతుంటారు. అక్కడ దిగి, మెల్లగా ఇంటిదారిన నడుస్తాడు!

✤ ✤ ✤

ఒకరోజు అతని స్నేహితుని కొడుకు ఏలూరు దగ్గర కారుప్రమాదంలో చనిపోయినట్లు, తమ ఊళ్ళోనే 'చివరి పనులు' జరుగుతున్నట్లు కబురువస్తే

హడావుడిగానే ఆ ఊరు చేర్తాడు. బెజవాడకు యాభైమైళ్ళుంటుంది. మధ్యాహ్నమయ్యింది! చిన్న ఊరే – స్నేహితులు, చుట్టాలు చుట్టూవున్నారు. చిన్న వయసులో చనిపోవటం బాధాకరం. అక్కడకు చేరి ఒక్కసారిగా షాక్ తిన్నాడు. ఏమిటిది? అయిదోనంబరు రూటులోని గాజుపెట్టె ఇక్కడకు వచ్చింది. ఈ పెట్టెలు ఇందుకా? అందులో 'చనిపోయినవాడిని' పడుకోపెట్టి లోపల బైట పూలు జల్లి, ఆ గాజుపెట్టెను మంచుపెట్టెగా మార్చారు. ఒక వైరు మెలికలు తిరుగుతూ ఎక్కడో ప్లగ్గులో కూర్చుంది. అప్పటికే ఆ 'మంచుపెట్టె' పని అవగాహనకు వచ్చింది. కానీ అతని బాబాయి పోయినపుడు ఆయన పెంపుడు కొడుకు రావటం ఆలస్యం అవుతుందని మంచుగడ్డలు పక్కన టౌన్ నుంచి తెప్పించి చుట్టూ ఊకపోసి పెట్టారే! అది గుర్తువచ్చి అతనికి దుఃఖం ముంచుకువచ్చింది. చుట్టూ వాతావరణం అంతకంటే విషాదంలో జొరబడిపోయింది.

✤ ✤ ✤

తరవాత ఏరోజు అయిదో నంబరు బస్సులో బీసెంటురోడ్డు వెళ్ళినా ఈ మంచుపెట్టెలను చూడకుండా లేదా అవి అతని దృష్టినుంచి తప్పించుకోవటం లేదు. ఒక్కరోజున అయిదు వుండవు. నాలుగే వుంటాయి. అంటే ఒకటి ఎవరికోసమో వెళ్ళింది. వేసవికాలంలో రెండు, మూడు కనపడేవి కాదు. అందరికి ఎ.సి. గదుల్లాగానే శవాలకీ మంచుపెట్టెలు కావాలి! ఎన్నాళ్ళు చూసినా ఆ పెట్టెలకు అలవాటుపడలేకపోయాడు. చూసినప్పుడల్లా అతన్ని ఆందోళనపరుస్తూనే వున్నాయి. అవి చివరికి చావుకి చిహ్నంగా అతనికి స్థిరపడిపోయాయి.

✤ ✤ ✤

అతని స్నేహితుడు, వయసులో పెద్దవాడు కోటయ్యగారు వారంరోజులు ఆసుపత్రిలో వుండి శలవు తీసుకున్నట్లు తెలిసి వెళ్ళాడు. ఆ ఎపార్ట్‌మెంట్ పార్కింగ్‌లో ఓ బల్లమీద ఈ మంచుపెట్టెలో నిశ్చలంగా పడివున్నాడు కోటయ్యగారు. అయ్యో, ఏమయిపోయింది చేతనం? ఎటుపోయింది ఆయన చదివిన చదువు? ఏ గాలిలో కలిసిపోయింది ఆయన జ్ఞానం? చివరికి మంచుపెట్టెలో పడుకుని దీర్ఘనిద్రలో వుంటే పూలు జల్లివస్తుంటే!?

✤ ✤ ✤

ఇక మంచుపెట్టెల వంక చూడటం మానివేశాడు. బలవంతంగా రెండోవైపు చూపు మరల్చుకుని ఆ స్టాపు దాటింతర్వాత బైటకు చూస్తున్నాడు. కానీ ఆ గాజుపెట్టెలు అతన్ని వెన్నాడుతూనేవున్నాయి. ఆ వేసవిలో ఇంట్లో బెడ్‌రూంకి ఎ.సి. పెట్టించారు. అతని భార్య ఆనందంగా ఎ.సి.లో పడుకుంటే అతడు టేబుల్ ఫాన్ పెట్టుకుని బాల్కనీలో నిద్రపోతాడు. అతనికి ఎ.సి. గది ఒక పెద్ద మంచుపెట్టెలా అనిపించేది! తర్వాత ఒకసారి అతని స్నేహితుడు హైద్రాబాదులో చాలాకాలంగా వుంటూనే కాలం చేశాడు. ఆ కబురు తెలిసి ఎ.సి. 3 టయర్‌లో ప్రయాణం చేయటానికి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఆ బోగీలో అప్పటికే నిద్రపోతున్నవాళ్ళు చీకటిలో మార్చురీ పెట్టెల్లో కదులుతున్నట్లు తెల్లవార్లూ చూస్తూనే వున్నాడు. ఎప్పుడో తెల్లవారుతుండగా నిద్రపట్టింది. సికింద్రాబాదులో ఆగటం, నాంపల్లికి బయలుదేరటం అతనికి తెలియలేదు. బేగంపేట దగ్గర్లో హఠాత్తుగా మెలకువ వచ్చి చూస్తే అందరూ దిగిపోయి తానొక్కడే మిగిలిపోయి శవాలగదిలో కదులుతున్నట్లు భయపడిపోయాడు.

తీరా ధర్మన్నను మంచుపెట్టెలో చూసి బోసిపోయిన ఆయన బోసినవ్వు గుర్తుకు వచ్చి కళ్ళ నీరు కుక్కుకున్నాడు. ఈయన బ్రతికి ఉన్నప్పుడు తనతోపాటు ఆనందంగా గడిపిన సమయం ఇప్పుడేమయ్యింది? తను ఒకప్పుడు రాసిన ఉత్తరం 'మరణంతో అంతమయ్యే శారీరిక బాధలు – ఎవరు మోసుకుపోతారు?' చదివి 'ఇది బాగా గుచ్చుకున్నది' మిత్రమా' అని కార్డుముక్క రాశాడే – మరి ఈయనతో ఈయన బాధలన్నిటినీ మంచుపెట్టెలో బంధించారేమిటి? ఇరుకుగా – బెరుకుగా ఆ దృశ్యం మిగిలిపోయింది, అతని జ్ఞాపకాలలో– ఈ విధంగా తన జీవితంలో పరిచయం అయిన మిత్రులు భౌతికలోకం వదిలిపోతే ఇక చూడటానికి రావటం మానివేశాడు. ఒక వేసవి బెజవాడ ఎండ తీవ్రతలో, మండిపోతే కట్టెలమీదకు తనకు రాఖీ కట్టిన అక్కను తరలించకముునుపు మంచుపెట్టెలో పెట్టనివ్వలేదు. 'మహాప్రస్థానం'లోనే తరలించాడు. పచ్చికట్టెలు మండటానికి ముందు పొగ కమ్మివేస్తే కళ్ళ నీరు ఎందుకొస్తుందో ఎలా తెలిసేది – ఆ మరుసటి సంవత్సరం, అదీ వేసవే – పిన్ని రాలిపోతే – కరెంటు మంటల్లో కమురు కంపు చూశాడు – వాళ్ళిచ్చే బూడిద ఎవరిదో ఎలా గుర్తుపట్టేది?

✤ ✤ ✤

స్నేహితులతో నేపాల్ వెళ్ళి హిమాలయాలు మంచుకప్పుతో మెరిసిపోతుంటే అతనికి ఆ కప్పుకింద కొండలెక్కబోయి మంచులోయల్లో కప్పడనివాళ్ళు మహా మంచుపెట్టెలో శాశ్వతంగా మిగిలిపోయేరనుకుంటాడు. తిరిగితిరిగి ఇంటికి వచ్చి ఆ సాయంత్రం అయిదో నంబరు బస్సెక్కి బాడవపేట స్టాపులో ఒక్కసారి ఆ మంచుపెట్టెల్ని పరీక్షగా చూశాడు. అవి ఎవరి పిలుపుకోసమో ఎదురుచూస్తున్నట్టు, మనిషి మరణానంతరపు చివరి క్షణాలను తర్వాత 'సుఖంగా' ఉంచటానికి, అచేతనమైన శరీరాన్ని క్రిమికీటకాల నుంచి కాస్సేపు కాపాడటానికి సిద్ధంగా ఉన్నట్లు అతనికి వాటిపట్ల ఒక సానుభూతి కలిగింది. అప్పటి నుంచి అతనికి అవి నేస్తాలుగానే కనిపిస్తున్నాయి.

మరణంలోని చలిని – ఆ గాజుపెట్టె తడిమి ఫీలయ్యేవాడు – ఎప్పుడైనా 'మంచు పెట్టె'లో 'మనిషి'ని చూడటానికి వెళ్తే?!

❖ ❖ ❖

ఒక అర్థరాత్రి బాల్కనీలో కూర్చుని రాసుకున్న తన 'చావుపట్టిక'లో "నా చివరి ఊపిరి తర్వాత, అది రాత్రయితే తొలిజామునే, పగలయితే వెంటనే తీసుకుపోవాలి! వీలయినంత త్వరగా కట్టెల్తో కాల్చివేయాలి. ఎట్టి పరిస్థితులలోనూ ఎవరికోసమో ఎదురుచూస్తూ నన్ను 'మంచుపెట్టె'లో పెట్టవద్దు. అందులో నాకు ఊపిరాడదు. ఇది నా చివరి కోరికగా మన్నించండి..." అంటాడు!!





పెళ్లిచూపులు...

'బాబాయ్! ఎందుకు నన్ను అమెరికా పంపిస్తున్నారు?.... ఈ చదువు చాలదా..? నాన్నకు నువ్వైనా చెప్పలేవా?'

ఇదీ వాడి ఏడుపు. అమెరికా ఎమ్.ఎస్. చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసి, వీసాకు పంపుతుంటే.

ఆ తంతూ అయింది. వీసాతో వచ్చాడు. అప్పుడు నేను హైదరాబాదులోనే ఉన్నా. వాడికి నా ఫియట్ కారులో డ్రైవింగ్ నేర్పమని అన్నయ్య ఒకటే గొడవ.

ఆ పనీ పూర్తి చేశాను – వాడి ఏడుపూ గొడవ మధ్యలో. 'నువ్వు డ్రైవ్ చేయ్, నేను చూస్తాను అనేవాడు' అంత బద్ధకస్తుడు....

వాడు ఇంజనీరింగ్ వెలగబెట్టేప్పుడు చూడటానికి కాలేజీకి వెళ్ళాను, కోయంబత్తూర్ దగ్గరలో. వాళ్ళ ప్రొఫెసర్‌నూ కలిశాను. 'మీరు?..' అన్నాడు. 'అఖిల్ బాబాయ్‌నండి!' 'ఓ! అలాగా! మీవాడు హాస్టల్‌లో నిద్రపోతుంటాడు... లేపుకురండి' అన్నాడు వెటకారంగా.

ఇవన్నీ అన్నయ్యకు చెబితే గోలపెడతాడు.

ఆ తర్వాత హాస్టల్‌లో ఉండనని స్నేహితులతో గదులూ వెలగబెట్టాడు. అక్కడకు కూడా వెళ్ళాను. బాగానే మర్యాద చేశాడు. 'ఏరా, చదువు ఎలా ఉంది?' అని అడిగితే, 'సినిమాకి వెళదాం పద' అన్నాడు. సినిమా అయిన తర్వాత 'అయిపోతుందా ఈ సంవత్సరం' అన్నాను.

కానీ, ఫైనల్ ఇయర్ గట్టెక్కలేదు. 'ఏరా' అంటే 'ఇది మామూలే. నువ్వేం కంగారుపడకు. ఈసారి లాగేస్తాగా' అంటాడు. 'ఏరా, కాస్త మారవా..' అంటే

‘ఈ వయసులో ఏం మారతాం బాబాయ్’ అంటాడు. అప్పటికి వాడి వయసు 22 ఏళ్ళే.

సరే, వీసా అయింది. వాళ్ళ అమ్మ ఏడుపూ అయింది. వాడి ఏడుపూ అయింది. ‘నన్ను ఎందుకు పంపిస్తున్నారు? ఆర్నెల్లు ఉంటా, అంతే’ అన్నవాడు – అమెరికా వెళ్ళి ఎమ్.ఎస్. చేశాడు, రెండు సంవత్సరాలు.

వాడు అమెరికాలో ఉండగా నేను రెండుసార్లు వెళ్ళాను. బ్రహ్మచారి బ్రతుకులు చూశాను. రెండేళ్ళు గడిచిపోయాయి. వస్తానన్న మాట ఇప్పుడు లేదు.

‘ఏదైనా ఉద్యోగం చూడు’ అన్నాడు. ‘ఇండియాలోనా’ అన్నాను ఏడిపించటానికి.

‘కాదు, కాదు. ఇక్కడే... సంపాదించి వస్తా’ అన్నాడు.

అలాగే ధర్మారావుగారికి చెప్పి, ఐ.బి.ఎమ్.లో పెట్టాం. ఫౌకిప్సీలో కుదురుకున్నాడు. నేను న్యూయార్క్ నుంచి ఫౌకిప్సీ ట్రైన్‌లో వెళ్ళి, వాడిని, లక్ష్మిని ఆమె భర్త శ్రీనివాసరావును కలిశాను. లక్ష్మి మా ఇద్దరినీ భోజనానికి పిలిచింది.

అప్పటికి వాడికి అమెరికా డ్రైవింగ్ అలవాటయ్యింది. ఇద్దరం వెళుతుండగా ‘అరె, ఇక్కడ ఆపు... పళ్ళు కొందాం’ అన్నాను. ‘ఇప్పుడు ఎవరు తింటారు’ అంటాడు. పళ్ళు తీసుకెళ్ళి లక్ష్మికి ఇస్తే ‘నీకు ఇన్నిసార్లు భోజనం పెట్టాను. ఒక్కసారైనా మీ బాబాయ్‌లాగా పళ్ళు తెచ్చావా’ అని తిట్టింది. ‘బాబాయ్, నన్ను తిట్టించటానికే తెచ్చినట్లుంది’ అన్నాడు.

అన్నయ్య, తరువాత వాడికి పెళ్ళి చేయాలి అని అంటే ‘ఇంకేం, చూడు’ అన్నాను. ‘సరేలే, అదేగా నీకు చెప్పేది’ అంటాడు ఆయన. ‘వాడు డాక్టర్‌ను చేసుకుంటాను అని అంటున్నాడు’ అని కూడా కలిపాడు. దానిలో ఆశ్చర్యం ఏముంది..... అక్కడ మనవాళ్ళందరికీ డాక్టర్ పెళ్ళామో, మొగుళ్ళో కావాలి. బాగా సంపాదిస్తారని ఒక ఆశ. అందుకని ‘వీలైతే డాక్టర్లే కావాలి మరి’ అన్నాను.

‘నువ్వు ఆ పనిలో ఉండు’ అంటాడు అన్నయ్య.

అది నా బాధ్యత అన్నట్లు.

సరే, డాక్టర్లయ్యేవాళ్ళు మెడికల్ కాలేజీలో ఉంటారు కదా. తెలిసినవాళ్ళకి చెప్పి, బెజవాడ, గుంటూరులలో ఉన్న మెడికల్ కాలేజీలలో మెరిట్ మెరికలను చూశాం. మెరిట్ లేకపోతే అమెరికాలో పనికిరారు, అందుకని.

దగ్గర స్నేహితుడు, దూరపు బంధువు కూతురు ఎమ్‌సెట్‌లో రెండవ ర్యాంకు వచ్చి, మెడిసిన్ పూర్తి చేసింది. ఇప్పుడు హౌస్‌సర్జెన్ చేస్తున్నది. వారిని, వీరిని కలిసి, బెజవాడలో మా ఇంటికి పిలిపించి, పరిచయం చేసుకున్నాం.

ఈ విషయం చెప్పి, అన్నయ్యతో 'వాణ్ణి అమెరికా నుంచి రమ్మను, కావాలంటే ముందు ఫోటో పంపుదాం' అన్నాను.

వాడు రానూ వచ్చాడు. ఇప్పుడు పెళ్ళి అవసరమా అని గొణుగుతున్నాడు. అటు ఇటు చేసి హైదరాబాదులో పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాం. అన్నిటికీ రెండు ప్రక్కల నేనే కదా. కొంచెం ఆర్భాటంగా, పద్ధతిగానే పెళ్ళిచూపులు జరిగాయి. ముందు అఖిల్‌ను అడిగాను 'ఏరా' అని. అన్నిటికీ మా అన్నయ్య నన్నే తోస్తాడు. 'ఇంటికెళ్ళి చెపుదాం బాబాయ్' అన్నాడు. 'ఏమిటి, తమాషానా! ఆలోచించుకో' అని అరగంట టైమ్ ఇచ్చాను. వాడి మనసులో సొనాలీబేంద్రే ఉంటుంది, తెలిసిన విషయమే. ఈ అమ్మడు బేంద్రేలా కనిపించటానికి కొంత సమయం కావాలి అంతే.

ఈలోపు నేను, అమ్మాయి ఉన్న గదికి ఒంటరిగా వెళ్ళాను. 'అమ్మా, నీ అభిప్రాయం?'

'నాకు, ఇంకో ఛాయిస్ ఉందా?' అంది.



(ఇంటికి వచ్చి డిక్షనరీలో 'ఛాయిస్'కి అర్థాలు వెతికాను.)





ప్రిన్స



బేగంపేట, చిన్నగుట్ట దిగి ఎర్రమట్టి మైదానంలో నుంచి వెడుతోంది మా మిలిటరీ జీపు, శీతాకాలపు సాయంత్రం. మా వెనుకే జేగురు రంగులో జారిపోతున్నాడు దినకరుడు. మా నీడలు పొడవుగా, వింతగా మా ముందు దారిలో పరుగెడుతున్నాయి. వెనుకనే ఎర్రటి దుమ్ము చెదురుతోంది. నిక్కర్లతో ఇద్దరు కుర్రాళ్లు జీపును వెంటాడుతూ అరుస్తూ ఒగరుస్తున్నారు. అంతలోనే, తలుపుల్లేని పెద్ద ప్రహరీలోని ఆర్చి దాటాము. ఎత్తైన రాతి గోడకు లోపల, బయట రేకులతో చిన్న చిన్న ఇళ్లలాంటివి ఉన్నాయి. చుట్టు తిరిగి ఎత్తైన ప్రదేశంలో జీపు ఆగింది. మధ్యలో పెద్ద వేపచెట్టు, చుట్టు సిమెంటు గట్టు. జీపు దిగి కలియజూశాను. బాగా విశాలంగా యాభై, అరవై కార్లు పెట్టేందుకు వీలుగా వుంది. రెండు బోగన్‌విల్లా ఎరుపు, తెలుపు చెట్లు వున్నాయి. ముందుకు చూస్తే చిన్నగోడ, తర్వాత ఎదురుగా కొంత ఖాళీ, ఆ పైన రైలు పట్టాలు, దాటితే హుస్సేన్ సాగర్, సాయంత్రపు టెండలో మెరుస్తున్న అలలు. మేము దాటి వచ్చిన పెద్ద ప్రహరీ కొంతవరకే వుంది. ప్రహరీకి మేము ఆగిన ప్రదేశానికి మధ్యలో ఒక పురాతన భవనం, దిగంతపు వెలుగులో ఆ భవంతి చీకటి అంచులు మాత్రమే కనబడుతున్నాయి. అయితే ఇది తప్పని సరిగా చిన్న రాజప్రాసాదమేననిపిస్తుంది. అప్పటివరకు డ్రైవ్ చేసిన మహేంద్ర, అంతకుముందు నేనిచ్చిన పొడవాటి సిగరెట్టు సుతారంగా వెలిగించి, "రండి..." అని కదిలాడు.

మహేంద్ర సిగరెట్టు వెలిగించే తీరు, ఆప్యాయంగా పొగపీల్చే వైనం, ఆస్వాదించే విధానం చూస్తే, ఎవరికైనా సిగరెట్టు రుచి చూడాలనిపిస్తుంది. కాని నాకు పొగపడదే! మేమాగిన ప్రదేశానికి, భవంతిని వేరు చేస్తూ ఇటుకరాతి ప్రహరీ, అక్కడక్కడా చెట్లు మొలిచి ఉన్నాయి. ఒక ప్రక్కగా నలుపురంగు ఇనుప తలుపు మూసి ఉంది. అక్కడకు చేరి, ఒక తాడులాంటిది లాగాడు మహేంద్ర. లోపల ఎక్కడో ఒక గంట మ్రోగింది. కొంత సేపటికి కష్టంగా, అయిష్టంగా ఇనుప తలుపు తెరుచుకుంది ఓరగా 'కౌన్'? అంటూ షేర్వాని, టోపీ, పండిన గడ్డం, లావు కళ్ళద్దాలు. కొంచెం వంగి 'దర్వాన్' దర్శనమిచ్చాడు.

ఆయన చరిత్రపుటల్లోంచి నడిచి వచ్చినట్లనిపించింది నాకు.

'ఆప్ కైసేహో రహీమ్‌జీ' అని మహేంద్ర పలకరించారు.

'ఆదాబర్‌సే, అచ్ఛాహుం ఆప్..." అంటూండగానే మహేంద్ర.

"హమ్ జనాబ్‌సే మిల్‌నే ఆయా" ఇంకా పూర్తి చేయలేదు.

"అచ్ఛీ బాత్, మగర్, జనాబ్ సోరహే హై..."

"అచ్ఛీ, హమ్ కల్ ఇసీ వక్త్ అయేగా, సాబ్‌కో బతాదేనా?"

'అచ్ఛీ బాత్... హాఫీ ఖుదాజ్" అంటూ బరువుగా తలుపు మూశాడు!

మర్నాడు సాయంత్రం, అదే సమయానికి ఇద్దరం జీపు పార్క్ చేసి, మహేంద్ర పొడవాటి సిగరెట్టు బూడిదై పోయేముందు, గంట మ్రోగించాము. మళ్లీ చరిత్ర పుటలోంచి బాబా తొంగి చూశాడు!

"ఆదా బర్జ్ సాబ్, అందర్ ఆయియే" అని మా సమాధానం కోసం ఎదురుచూడకుండా వెనుదిరిగాడు. వెంటనే మేమూ భవంతికి దగ్గరగా వెళ్లాం. ఆ ప్యాలెస్‌కి ముందు ఒక ఫౌంటెన్ ఉంది ఎండిపోయి, నీటి గొట్టాలు తుప్పుపట్టి.

ఆ ఫౌంటెన్‌కి అవతలగా ఒక రేకుల షెడ్డు ఉంది. అందులో రెండు ఏంటిక్ కార్లు ఉన్నాయి. నాకున్న కార్ల పిచ్చితో ఒకటి ఆకుపచ్చని పాకార్డు అని, రెండోది స్టుడీబేకర్ కన్వర్టిబుల్ అని గుర్తించాను. ఆ ప్రక్కనే బోయీలు లేని పల్లకీలలాగా రెండు బగ్గీలు వున్నాయి విశ్రాంతిగా. ఎక్కడా గుర్రపు వాసన కూడా లేదు. ఒక విశేషం ఏమిటంటే అన్నీ ఎక్కడా దుమ్ము లేకుండా తుడిచి ఉన్నాయి.

కాంపౌండ్ అంతా పరిశుభ్రంగా వుంది.

పోర్టికో నీడలో నడిచి నాలుగు మెట్లు ఎక్కితే సింహద్వారం! రాజసం ఉట్టిపడుతోంది.

మా కోసం మెల్లగా తెరుచుకుంది! లోపల అడుగుపెట్టాం. ఇప్పుడు నాకు చరిత్రలో అడుగు పెట్టినట్లనిపించింది. బ్లూ మొజాయిక్‌లో పసుపు రంగు పూలు, ఫ్లోరింగ్ వెలుగునీడల్లో మెరుస్తున్నాయి. కొంచెం తల ఎత్తి చూస్తే హాలు మధ్య తీర్చిదిద్దినట్లు మహారాజా సోఫాలు, నగిషీలతో రోజ్‌వుడ్ రంగుతో, లతలతో దర్పంగా వేచి వున్నాయి. ఓవల్ టీపాయి స్టెయిన్డ్ గ్లాస్ టాప్‌తో 'రిచ్'గా కూర్చుని వుంది. ఎదురుగా గోడకు రెండు 'ఆయిల్ ఆన్ కాన్వాస్' చిత్రాలున్నాయి.

కొంచెం పరీక్షగా చూస్తేనే ఈ రాజరికపు ఠీవి, వయసు భారం తెలుస్తోంది. అంతలో లేత పసుపు రంగులో జరీ లతల అంచులతో షెర్వాణీలో 'జనాబ్' వస్తూ 'రెడ్డి సాబ్, గుడ్ ఈవెనింగ్' అని గ్రీట్ చేశారు.

మహేంద్ర నన్ను పరిచయం చేశాడు. నేను 'సలాం' చేశాను.

ఆయన కూర్చున్న తర్వాత మేము కూర్చున్నాం. ఆయన దృష్టి నా మీద నిలిపి లేదు.

అందుకనే నేను పరీక్షగా చూడగలిగాను.

35, 40 సం॥ల వయసుండవచ్చు. పచ్చని ఛాయ, నల్లని జుట్టు, చక్కని ముక్కు, నలుపు, నీలం కనులు, అందం, రాజసం ఉట్టిపడుతోంది.

ఈయన రాకుమారుడే!

అంతలో బంగారు డిజైన్ చైనా కప్పులు, జగ్‌తో టీ తెచ్చాడు బాబా.

జగ్‌లో నుంచి టీ పొగలతో పాటు, తేయాకు పరిమళం. ఎంతో టెమ్టింగ్‌గా అనిపించింది.

టీ రుచి పరమాద్భుతంగా ఉంది. నేను ఈ పరిసరాల పరీక్షలో పడి వాళ్లిద్దరి సంభాషణ అంతగా పట్టించుకోలేదు.

మహేంద్రరెడ్డి, ఆయన దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు. నేను

'సెలవ్' అని నమస్కారం పెట్టి మహేంద్రని వెంబడించాను. జీపులో కూర్చుని బయలుదేరేవరకూ ఆ మిస్టరీ హిస్టరీ రాజకుమారుడు నన్ను వెన్నాడుతూనే వున్నాడు.

✤ ✤ ✤

'సార్' చెప్పండి, అని రెండు సార్లు అడిగాను.

ఈయన పేరు రాజా 'రామల్లా'.

సురవరం రాజవంశంలోని రాజుకు, అసఫ్ జాహి వంశీకురాలైన బేగం గారికి ఏకైక సంతానం.

రాజా, బేగంను వివాహమాడి, బేగంపేట – హుస్సేన్‌సాగర్ ఒడ్డున ఈ చిన్న పాలెస్ కట్టించాడు.

రాజా, సురవరం నుండి వస్తూ పోతూ వుండేవారు. చాలా కాలానికి మగబిడ్డను కన్నది బేగం. రాజాగారు అతనికి 'రామల్లా' అని నామకరణం చేసి, ఉస్మాన్ అలీఖాన్ గారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అతనికి ఇరవై సంవత్సరాల వరకూ అన్ని రాజభోగాలు జరిగాయి. రాజా మరణంతో వాళ్ల కష్టాలు మొదలయ్యాయి.

సర్దార్ పటేల్ సైనిక చర్యతో లొంగిపోవడం, ప్రీవీ పర్సుల రద్దుతో వీరికి ఆదాయం తరిగిపోయింది. భర్త మరణం, ఆదాయం లేకపోవడం, అనారోగ్యం, జరాభారాలతో బేగం కృంగిపోయింది.

ఓ అసుర సంధ్యవేళ, యువరాజును దగ్గర కూర్చోపెట్టుకుని, "రాజా బేటా, రాజుగారు పోయేముందు చెప్పినవి గుర్తుపెట్టుకో, మన వంశకీర్తికి భిన్నంగా నడవకు, మనకు ప్రాణం కన్నా పరువు మిన్న, నిన్ను నమ్మిన వాళ్లని కాపాడు" అంటూ చెప్పవలసినవి స్పష్టంగా, అతి కష్టంగా వినిపించి, అతని దగ్గర మాట తీసుకుని, భర్తను వెదుక్కుంటూ తెలియని లోకాలకు తరలిపోయింది!

యువరాజు చదువు రాజుగారి మరణంతోనే ఆగిపోయింది. పాలెస్‌కి వచ్చి, ఇంగ్లీషు, ఉర్దూ చదువు చెప్పే గురువులు ఆగిపోయారు. సురవరం సంస్థానం నుండి ఏటా వచ్చే 'భృతి' రావడం ఆగిపోయింది.

మెల్లగా పనివాళ్లను మానిపించివేశాడు. తర్వాత 'కిచెన్ స్టాఫ్'ని పంపించి వేశాడు. తను పుట్టక ముందు నుంచి ఉన్న 'బాబా'ను కూడా ఏదైనా ఉద్యోగం చూసుకోమన్నాడు. కాని బాబా 'రాజా బేటా మీతోనే నేను' అన్నాడు కన్నీరు పెట్టుకుంటూ.

వంశం ఎంత గొప్పదైనా, ప్రపంచం చిన్నదే కదా!

బేగంకి సిటీలో ఎక్కడో ఒక తోబుట్టువు ఉండేది. ఆమెకు అహమ్మద్ ఒక్కడే బేటా. కాలక్రమంలో పై తరం వారంతా కాలగర్భంలో కలిసిపోయాక అహమ్మద్ యువరాజును వెతుక్కుంటూ వచ్చాడు. అతను నిర్ఘాంతపోయాడు. పరువు గూట్లో, పసిడి పళ్లెంలో బిస్కత్తులు, తేనీళ్లతో, రాజఠీవితో బ్రతుకుతున్న అన్నగారిని చూసి అతను బావురుమన్నాడు.

రాచరికపు వంశంలో హద్దులు చాలా స్పష్టంగా ఉంటాయి.

అహమ్మద్ పాలెస్ కాంపౌండ్ గోడకు వెలుపల, ఆధారంగా చిన్ని షెడ్డు వేసుకుని ఎలాగో ఒక ఆటో అద్దెకు తీసుకుని, వచ్చిన ఆదాయంలో రోజూ 'బాబా'కి యాభయ్యో, వందో ఇచ్చేవాడు. దానితోనే పాలెస్ 'బతుకు' నడిచేది. అన్నగారికి ఏ కష్టం కలగకూడదనే అహమ్మద్ అతన్ని కలవటానికి, ఏ సలహా ఇవ్వటానికి సాహసం చేసేవాడు కాదు.

ప్రిన్స్‌ని కలవటానికి ఎవరైనా వస్తే, ఎక్కువగా ఎవరూ వచ్చేవారు కాదు. ఆ అతిథులకు టీ ఇవ్వటానికి పాలు, పంచదార, మంచి టీ పొడి ఉంటేనే దర్శనం ఇచ్చేవారు. లేకపోతే రాజాసాబ్ నిద్రపోతుండేవారు. ఇది విన్న తర్వాత నేను చాలా ఆలోచించాను. నాకు ప్రిన్స్‌ను తలచుకుంటే ఎంతో జాలివేసేది. చాలా కోపం కూడా వచ్చేది. అయినా అతని మానసిక స్థితి నేనెలా అంచనా వెయ్యగలను?

✤ ✤ ✤

కొన్నాళ్లకు మహేంద్ర, నేను, క్రొత్త మారుతీలో నిజాంబాద్ వెళ్లాం. ఆ దగ్గర నియోజక వర్గం నుంచి పోటీచేసి కొద్ది తేడాతో ఓడిపోయాడు మహేంద్ర అంతకు ముందు ఎన్నికల్లో. నాకు తెలంగాణా ప్రాంతం రావటం మొదటిసారి హైదరాబాద్ దాటి.

ఆర్మూరు దగ్గర ఊళ్లో మహేంద్ర దగ్గర బంధువుల ఇంట్లో పెళ్లి. ఒక వారం రోజులు ప్రోగ్రాం పెట్టి నన్ను తీసుకువచ్చాడు.

మొక్కజొన్న పొత్తులు దిగుబడికి వస్తున్నాయి. కొండాపూర్ దగ్గర్లో ఒక పొలం దగ్గర ఆగాం. అందరు మహేంద్రకు తెలిసినవాళ్లు. గుంపుగా వచ్చి గుమిగూడారు. మొక్కజొన్న పొత్తులు అప్పటికప్పుడు కంపవేసి కాల్చారు. కారం, నిమ్మకాయ పూసి ఇచ్చారు, ఆ రుచి, తినవలసిందే. తిని తెలుసుకోవలసిందే.

ఇంకా వెలుతురు ఉండగానే ఆర్మూరు వచ్చాం. అక్కడ పార్టీ కార్యాలయానికి వెళ్లి చిన్న మీటింగ్ లాంటిది పెట్టారు. చూస్తుండగానే జనం, పార్టీ కార్యకర్తలు, చేరిపోయారు. పోలీసు ఇన్‌స్పెక్టర్, డి.ఎస్.పి. వచ్చి పలకరించి వెళ్లారు. అంతకు ముందు వారం ఎస్.పి. కారుకు దగ్గర్లో అన్నలు బాంబు పేల్చడం ప్రస్తావనకు వచ్చింది.

పార్టీ మీటింగులో అన్న మీద వన్నుపోటు, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, అన్నగారి ప్రమాణ స్వీకారం, అసెంబ్లీ రద్దు తర్వాత రాబోయే ఎన్నికలు, అన్ని చర్చించారు. ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

ఆ రాత్రి నిజాంసాగర్ ప్రాజెక్టు గెస్ట్‌హౌస్‌లో వున్నాం.

మహేంద్ర స్నేహితులు చాలామంది వచ్చారు. రెండుగంటలు రమ్మీ ఆడారు. చాలా పెద్ద స్టేకు. నేను చూస్తూ కూర్చున్నాను. నాకు తోడుగా నలుగురు కుర్రాళ్లను పెట్టారు. మేము టెర్రస్ మీదికి వెళ్లి గోదావరి నడక చూస్తున్నాం. చల్లని బీరు వచ్చింది. మొక్కజొన్న విత్తులు నేతిలో వేయించి తెచ్చారు. ఒక్కోటి పంటికింద పేలుతుంటే నాకు వింతగా అనిపించింది. నాతోవున్న కుర్రాళ్లు చెప్పిన చాలా విషయాలు నాకు అర్థం కాలేదు. కాని మహేంద్ర అంటే వీళ్లందరికి, అన్నగారి తర్వాత వీరాభిమానం అని మాత్రం తెలిసింది.

ప్రొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్‌కి, డిచ్‌పల్లి వెళ్లాం. అక్కడ కృష్ణాజిల్లా పాకలు, ముగ్గులు, గడ్డివాములు కనిపించాయి.

అప్పుడే మహేంద్ర చెప్పాడు: వీరు పామర్రు నుంచి వచ్చారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుతో అని, అక్కడి ఎమ్.ఎల్.ఎ.ని. పరిచయం చేశారు. ఆయన మాట్లాడింది తెలుగు, ఉర్దూ యాస నాకు తెలియటానికి సమయం పట్టింది.

వాళ్ల నాన్నగారు నిజాంసాగర్ వచ్చిన క్రొత్తలో ఇక్కడకు వచ్చి భూమి కొని, వ్యవసాయం చేసి, రైసుమిల్లు కట్టి, వడ్డీ వ్యాపారం చేసి బాగా సంపాదించారు. ఎమ్.ఎల్.ఎ. గారు ఇక్కడే పుట్టి, నిజామాబాద్‌లో డిగ్రీ వరకు చదివి మొదటినుంచి లోకల్ పాలిటిక్స్‌లో చురుకుగా ఉంటూ అన్నగారి పార్టీలో ఎమ్.ఎల్.ఎ. అయ్యారు.

ఆయన పలుకు, యాస, అక్కడి ప్రజలతో మమేకం కావడం, ఆలోచనాసరళి చూసిన తర్వాత పరిసరాల ప్రభావంతోపాటు పరిస్థితుల కనుగుణంగా మారిపోవడం ఎంతో సహజమనిపించింది, సబబుకూడా అనిపించింది. వేడి ఇడ్లీ, కారప్పొడి, ఘుమఘుమలాడే నెయ్యి, పెసరట్టు, ఉప్మా, చిక్కని పాలతో ఫిల్టరు కాఫీ, బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేశాం. బయలుదేరే ముందు హైదరాబాదు నుండి ఫోను వచ్చింది. అన్నగారు నిజామాబాదులో మూడోరోజునే పబ్లిక్ మీటింగ్‌కి వస్తున్నారని. అందరిలో ఉత్సాహం ఉరకలేసింది. నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఏర్పాట్లన్నీ ఎలా చెయ్యాలో పాలుపోక అప్పటికప్పుడే కలసి సభకు వెన్యూ, సమయం, హెలిపాడ్, సెక్యూరిటీలాంటి విషయాలు ఎస్.పి.తో ఫోనులో మాట్లాడి, మిగతావి ఎమ్.ఎల్.ఎ. గారికి వదిలి, మహేంద్ర నేను పెళ్లివారింటికి బయలుదేరాం.

రెండు రోజులు పెళ్లి సందడి, ఒకరోజు వేకువనే నీరా సేవనం, వంద ఆవులమంద, రెండు వందల ఎకరాల మహేంద్ర కుటుంబ వ్యవసాయం, ఇవన్నీ చూసి –

మహేంద్ర కూడా ఒక రాజే అనుకున్నాను. ఈ ఎన్నికలలో గెలిస్తే మంత్రి కూడా అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

మూడోరోజు పదిగంటలకు మటన్, రైస్ కిచిడీ చేశారు. చిక్కని షేర్వా అందులో పోశారు. మహేంద్ర నాన్నగారు, ఎంతో మర్యాదగా, ఏం బాబూ, 'బ్రాందీ ఏమైనా పుచ్చుకుంటావా' అని అడిగాడు. ఇంత ఉదయాన్నే? అని అనుకుని, 'వద్దండి' అని భోజనం చేసి బయలుదేరాము.

దారిలో బోధన్‌లో ఆగి రైతుల్ని కలిసి, ఆర్మూరులో మధ్యాహ్నం గడిపి సాయంత్రం హైవే ఎక్కడం, దారిలో అడవి, వెన్నెల, వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. ఒకచోట ఆగి మా యిద్దరికీ ఇష్టమైన 'దేవదాసు' పాట 'అంతా

భ్రాంతియేనా...' వింటూ బీరు తాగుతున్నాం. అప్పుడే కారు చుట్టూ నలుగురు చేరారు, చెట్లలోనుంచి! మహేంద్రను పలకరించారు. 'అన్నా, నీ దగ్గర రివాల్వర్ వుండాలి' అని అడిగారు.

"మొన్నటి వరకూ ఉండేది. కాని పైసలు అవసరం వుండి అమ్మేశాను" అని చెప్పారు. అన్న మీద నమ్మకంతో వాళ్లు వెళ్లిపోయారు. నాకు వర్తమాన చరిత్ర చిత్రంలో చూస్తున్నట్లు వుంది. తర్వాత హైదరాబాద్ చేరాం.

✤ ✤ ✤

ఒక నెలరోజులకు మహేంద్రకు నేను ఒక ఆలోచన చెప్పాను. అది తక్షణమే ఆయనకు నచ్చి ప్రిన్స్‌ను కలవటానికి వెళ్ళాం. మా అదృష్టం, ఆ రోజు మాకు దర్శనం దొరికింది.

నా ఆలోచన, మహేంద్ర ప్రిన్స్‌కి విన్నవించారు. ఒక టూ బెడ్‌రూం ఎపార్ట్‌మెంటు ఆయన కోరిన చోటనే నెలకు పాతికవేలు ఇచ్చి, ఉండటానికి ఏర్పాటు చేసి, అందుకు ప్రతిఫలంగా ఈ పాలెస్‌ను మాకు 30 సంవత్సరాల లీజుకు ఇచ్చే విధంగా ప్రణాళిక చెప్పాను.

ప్రిన్స్ శ్రద్ధగా విన్నారు. తర్వాత 'ఎందుకు' అని క్లుప్తంగా అడిగారు.

అప్పుడు నేను 'ఇది చక్కని క్లబ్, ఒక స్టేటస్ క్లబ్‌కు అనువైన స్థలం. లొకేషన్, భవనం అన్ని అనుకూలంగా ఉన్నాయి. తప్పక మేము సక్సెస్ అవుతాం. మీకు మంచి షేర్ వస్తుంది అని ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పాను. అంతేకాకుండా పాలెస్‌నుగాని పరిసరాలనుగాని, రూపుమారకుండాఎలివేట్ చేస్తాం అని అన్నీ వివరించాను. అన్నీ విని ఆయన మా యిద్దరి కళ్లల్లోకి కొంచెం నిశితంగా చూసి, "ఐ నీడ్ సమ్ టైమ్"... అని నిష్క్రమించారు. మహేంద్ర నేను ఈ ప్రణాళికపై మరికొంత సమయాన్ని, వ్యయాన్ని కూడా పెట్టాం. నాకైతే ఇది మిలియన్ డాలర్ ఆలోచనగా ఎదిగి కూర్చుంది.

అద్భుతమైన లొకేషన్ ఎత్తైన ప్రదేశం, పెద్ద పార్కింగ్ స్థలం, ప్రిన్స్‌లీ భవనం, ఎదురుగా కదిలే రైళ్లు, ఇంకా ముందుకు హుస్సేన్ సాగర్ నీళ్లు, అవతలి గట్టు టాంక్‌బండ్ కళకళ..

అప్పుడే నాకు కలలు వస్తున్నాయి.

అయితే వారం రోజులకే మళ్లీ మేమే వెళ్లాం. ప్రిన్స్ చక్కని టీ ఇచ్చి, మా ప్రపోజల్‌ను చాలా సున్నితంగా తోసిపుచ్చారు. కారణం అడిగే హక్కుగాని, ధైర్యంగాని మాకు లేకపోయినా చెప్పే మర్యాద ప్రిన్స్‌కి ఉంది. "ఈ జీవితం ఇలా సాగవలసిందే. ఈ పాలెస్ వదిలి నాతోపాటు, తరతరాల ఇజ్జత్‌ను, పూర్వీకుల ఆత్మలను, గరీబులను చేయలేను" అని ఎంతో ఆత్మాభిమానంతో ఆయన వివరిస్తూంటే నేను విస్తుపోయాను.

చరిత్రకు, వర్తమానానికి ఉన్న ఆగాధం నాకు పెద్ద ఎబిస్ (abyss)లా అనిపించింది. గతంలో జీవించే గౌరవాన్ని, వర్తమాన జనారణ్యాలలో వేటాడలేం.

ఇక్కడ వేట వేరు.

ఇప్పుడు పాలక పులులు, సింహాలు, జరీ అంచు ముసుగులో జనసామాన్యాన్ని వేటాడుతున్నాయి. ఇది రివర్స్ గేమ్!

ఇప్పుడీ వేటకు అడవికి పోనక్కర్లేదు. భాగ్యనగరపు అభాగ్యపు బస్తీలు చాలు. అనాథల ఆనారోగ్యపు కాలనీలూ సహా!

✤ ✤ ✤

మాకు తెలిసిన విషాద వార్త, అహ్మద్ ఆటో ప్రమాదంలో మేడ్చెల్ సమీపంలో చనిపోయాడని.

పలకరింపు మిషతోనే పాలెస్‌కు వెళ్ళాం.

చీకటిలో వాన కురిసినట్లు, పాలెస్ వాతావరణం మరింత విషాదంగా వుంది.

హాలులో నేను చూసిన ఒక దారుణమైన పరిస్థితికి నా గుండె తరుక్కుపోయింది.

చక్కటి మొజాయిక్ బిళ్ళలు పెళ్ళగించి వున్నాయి. ఇప్పుడు ఫ్లోరింగ్ తెల్లసున్నపు నేల మాత్రమే. ఏమిటిది అని ఆగ లేక అడిగాను. బాబా చెప్పింది, అహ్మద్ అంత్యక్రియలకు పైసలు కావాలి. ఎవడో బొంబాయి బ్రోకర్, ఈ ఫ్లోరింగ్

ఎప్పుడో చూసి, కావాలంటే ఇప్పుడు, ఈ ఖర్చుకు అయిదువేలు ఎడ్వాన్సు ఇచ్చి, మొత్తం ఇరవై అయిదువేలకు బేరం, పదిరోజుల్లో వస్తానని వెళ్ళాడు. అయిదు వేలు అహ్మద్ అంత్యక్రియలకు, ఈ మొజాయిక్ బిళ్ళలు తీయటానికి కూలి ఇవ్వటానికి సరిపోతే – ఇవన్నీ పెళ్ళగించి బ్రోకర్ కోసం చూస్తున్నారు. వాడు వస్తానన్న రోజు దాటిపోయింది కూడా.

మేము ఎంతో బరువైన హృదయంతో బైటికి వచ్చాం అప్పటికి. ఆ సాయంత్రం మా యిద్దరికే టీ వచ్చింది. మూడో కప్పు పగిలిపోయిందా?

❖ ❖ ❖

నాకు, ప్రిన్స్ ఒక అబ్సెషన్ అయి కూర్చున్నాడు. అతని కమిట్‌మెంట్, ధీరత్వం, త్యాగబుద్ధి, ఆత్మాభిమానం, కాలం చెల్లిన పాలెస్ క్రీనీడల్లో పాలిపోతున్న అతని రాజసం, చరిత్ర శకలాలలో హీనమవుతున్న అతని యౌవనం, అతని మొక్కవోని ధైర్యం, ఇవన్ని ఎంతో అరుదైన గుణాలు వర్తమానంలో.

ఇది జరిగిన తర్వాత చాలా వారాలో నెలలో గడిచిపోయాయి.

మరి ఈ చరిత్రను ఇప్పటి వర్తమానంలోకి ఎలా తీసుకు రావాలి?

ప్రిన్స్ ఎందుకు నిరాకరిస్తున్నాడు? తన వంశ గౌరవానికి భంగమా, లేదా ఇప్పటి సమాజ ప్రలోభాలకు లొంగిపోవాలని భయమా? అహ్మద్ మరణం, మొజాయిక్ బిళ్ళల పెళ్ళగింపు – సున్నపు నేలతో హాలు, బ్రోకర్ వస్తాడో, రాడో నన్న సంశయం, ఇవన్నీ నన్ను కలత పెట్టినట్లుగా ప్రిన్స్‌ను కదిలించినట్లు లేదు.

ఒకరోజు ఆందోళనతోనే మహేంద్రను బయల్దేరదీశాను, ప్రిన్స్‌ని కలవాలని. అది శీతాకాలం. చలికి త్వరగానే పొద్దుగూటికి చేరింది. మేము గట్టుమీదకు వచ్చేసరికి ఏదో రైలు మెల్లగా సికింద్రాబాదు వైపు వెళ్తోంది. ఈ మధ్యనే ఈ పాలెస్‌కి ముందుగా కొత్త రోడ్ వేశారు. కొంత రాజావారి స్థలం కూడా తీసుకున్నారేమో. బేగంపేట విమానం మెల్లగా మినుకు మినుకుమంటూ వాలబోతోంది. శీతగాలులకు హుస్సేన్‌సాగర్ నీళ్ళు అలలుగా వణుకుతున్నాయి. అవతలి ఒడ్డున టాంక్‌బండ్ మీద, నగరం పరుగులు పెడుతోంది. మేము నల్లగేటు దగ్గరకు చేరేసరికి, అక్కడ ఇద్దరు వ్యక్తులున్నారు. మహేంద్ర అడిగాడు, విషయమేమిటని.

"సార్ మేము రెండు రోజులనుంచీ తిరుగుతున్నాం – ఈ పాలెస్‌కు సంబంధించిన స్థలం నెక్లెస్ రోడ్డుకు తీసుకున్నాం. పరిహారం తాలూకు చెక్కు రాజావారికి అందజేయాలి. నిన్న గేటు తెరవలేదు – ఈ రోజు ఇప్పుడే వచ్చాం." అని ఏకరువు పెట్టారు, కార్పోరేషన్ అధికార్లు!

మహేంద్ర, నేను ఎంతో సంతోషించాం. మహేంద్ర గంట మ్రోగించాడు. చాలాసేపటికి, బాబా అతికష్టంగా, అయిష్టంగా, ఇనుపగేటు కొద్దిగా తెరచి, "జనాబ్ సో రహా హై"... అని గేటు మూసేశాడు!

అప్పుడే నేననుకున్నాను. చరిత్ర వర్తమానంతో ముడివడదు. అడ్డంగా తరతరాల ఇజ్జత్ ఇనపతెరలు గేటు రూపంలో వున్నాయి.

ఇక్కడ ప్రలోభాలకు – ఆస్కారంలేదు. ఈ చరిత్ర శిఖరాలు వర్తమాన ప్రమాణాలకు ఎంతో ఎంతో ఉన్నతంగా ఉన్నాయి.

తన చరిత్ర నిక్షిప్తాల సుషుప్తిలో ఉన్న ప్రిన్స్ ఎప్పటికైనా జాగృతుడవుతాడా?







కల్యాణి



దీపస్తంభం – ఒంటరిగా...

ఈ కల్పన ...

ఒంటరితనం, వేదనలో ఓదార్పు.... సాంత్వన.... పరస్పర కథనంలో ఖాళీ...

మాధ్యమాలతో అనన్యత... పరిసరాలతో ఐక్యత...సముద్రం – అలలు ఇచ్చే తెలియని సంయమనం – వైరుధ్యాల ఏకత్వం...

ఆ సాయంత్రం చీకటిలోనికి మారుతున్నపుడు, క్రింద అలల నవ్వులు మాసి పోతున్నపుడు, సన్నగా చినుకులు మొదలయినాయి.

మనం వర్షానికి సిద్ధంగా వుండం కదా, అది కూడా అపురూపమైనది కదా.

తెన్నేటి తోటలో వున్న వారిలో చాలా మంది వానకు ఎవరి దారిన వారు బయలు దేరారు.

చినుకులు ఎప్పుడూ చివురులు కదుపు తుంటాయి. ఎండిన ఒంటికి ఊరట కలిగిస్తుంటాయి.

తడారిపోయిన గుండెల్లో చల్లని మంటలు రేపుతుంటాయి.

చినుకుల్లో ముఖం పెట్టి, సముద్రపు గాలికి మనసు పెట్టి అక్కడే కూర్చున్నా.

అప్పుడే చూశాను, ఆ చిన్నారి చిరువానలో గిరగిరా తిరుగుతోంది. పాపనే చూస్తున్నా – ఎక్కడైనా నా బాల్యం కనపడుతుందేమోనని. కాలం వెనుకకు తిరుగుతుందా? కాని గత మెప్పుడూ తియ్యగానే వుంటుందెందుకనో?

అంతలో అమ్మ, పాపను చెంగులో దాస్తూ తలదాచుకునే చోటు కోసం చుట్టూ చూస్తోంది.

ఎక్కడో సముద్రాల కవతల కంపూచియాలో పడవ ఇంటిలో ఓ చిన్నారి నాకు ఇచ్చిన ఈతాకు టోపీ నా చేతిలోనే ఉంది. మెల్లగా పాప తలమీద సవరించాను. అప్పుడే చూశాను కల్యాణిని – అక్కడే వర్షంలో తడుస్తూ. వాన పెరిగితే ముగ్గురం ఐస్‌క్రీం బండి చూరు క్రింద చేరాం. అది ఎంత చూరని, మమ్మల్ని చినుకుల నుండి కాపాడుతుంది?

పూర్తిగా ముద్దయి పోయాం. మొక్కల్లా నీళ్ళు కారుతూ నవ్వుకున్నాం.

తర్వాత వర్షం తగ్గినపుడో, ఆటో అటుగా వచ్చినపుడో వాళ్ళు వెళ్లిపోయారు.

స్నేహానికి ఏంకావాలి? ఒంటరి తనం, గతపు గాయాలు, కొంచెం విషాదం, కొంచెం సంగీతం కూడా.

రాత్రి 'కర్స్ ఆఫ్ ఎల్లోఫ్లవర్' ఒంటరిగా చూశాను.

నా గదిలో.

తెలిసీ విషం తాగుతున్న రాణీ అందంలోని విషాదం, ఏదో నిషాలా నాలోకి పాకింది. అందులోనే మన్వంతరాల దూరంలో ధ్వనించే సంగీతం నా నరాలన్నీ తెంపింది. ఎన్ని బంధాలో, ఎన్ని విచ్ఛిన్నాలో – ఎంత విషాదమో – ఎంత కర్కశమో – మనిషి బ్రతుకు. అంతఃపురాలు – అంతరంగాలు – అనంతతీరాలు ఇవేనా బ్రతుక్కి అర్థం?

ఎప్పుడో చెలి చెవిలో పాడిన పాట ఇప్పుడు వినిపిస్తోంది. హృదయం దేనికోసమో వేచి చూస్తోంది. దేనికోసం? నిదుర లేదు. అలాగే లేచి అలల తీరంలోకి వెళ్ళాను.

ఇంకా తూరుపు వెలుగు రాలేదు. తడి తీరంలో నడుస్తున్నా, అడుగులు వెతుక్కుంటూ. మెల్లగా తూరుపు మబ్బులమాటు నుంచి వెలుగు తొంగి చూస్తోంది. రెండు పిట్టలు తడిసిన ఇసుకలో పురుగులు ఏరుకుంటున్నాయి. చిన్న చిన్న పీతలు అడ్డంగా పరుగులు పెడుతూ నురగలలో కలుస్తున్నాయి.

ఎదురుగా కల్యాణి వస్తోంది.

"హాయ్, రోజూనా"

"ఎప్పుడైనా"

"పాప?"

"అమ్మ దగ్గరుంది"

తడిసిన పాదాలు మెరుస్తున్నాయి.

"పరుగెడదామా?"

కొద్దిదూరం కలిసే అడుగులు వేశాం.

తరువాత ముందుకు వెళ్ళి పోయింది.

ఏమిటి? అప్పుడే అలిసిపోయానా?

గుండె దడ దడ పరుగెడుతోంది, నాకంటే ముందుగా.

అవును – ఒంటరితనం వయసును దహిస్తుంది. కొంతసేపటికి తన దగ్గరగా వచ్చి అలసిన నవ్వుతో "నువ్వు రన్నర్ వా?"

"హుం, పారిపోతున్నా, అన్నిటి నుంచీ"

"మరి నీ నుంచి కూడానా?"

"అదే బాధ. ఎక్కడికి వెళ్ళినా నేనే ఎదురవుతున్నా."

"అప్పుడప్పుడు నేను కూడా?"

నవ్వింది. అక్కడే అలలు చుట్టుకుంటుంటే పొడిచే పొద్దు చూసి విడిపోయాం.

❖ ❖ ❖

మరో సాయంత్రం యోగా సెంటర్ గేటు బైట కారు పెట్టి అప్పల రాజు ఖర్జూరాలు, బాదంపాలు అమ్ముతుంటే ప్రక్కన కూర్చున్నా – ఔటర్ హార్బర్‌లో ఓడల దీపాలు మిల మిల మెరుస్తున్నాయి. లావుపాటి వాళ్లు రోడ్డుకి అటూ – ఇటూ గబగబ నడుస్తున్నారు. కొందరు కుక్కలను నడిపిస్తున్నారు – ప్రక్కన పచ్చికలో మరి కొందరు పడుకున్నారు. బీచ్ ఇసుకలో రెండు గుర్రాలు పిల్లలను మోస్తున్నాయి.

గోడ ప్రక్కన కండెల్ని కాలుస్తోంది, పైడి తల్లి.

గేటులో నుంచి కల్యాణి వస్తోంది.

"ఏమిటి యోగా కూడానా?"

"ఆఁ! నాలో లోతుల్ని తెలుసుకునేందుకు బాగా వుపయోగపడుతోంది, యోగా" చిన్నగా నవ్వి.

అంతలో అల్లం మజ్జిగ ఇచ్చాడు రాజు.

ఆ రాత్రి కారులో ఇంటి దగ్గర దింపాను.

"ఇంకా ఏదో ఇంకా ఏదో ఇదయి పోతావే...

"మదిలో ఇష్టాలే తెలిపేందుకు..." పాట కారులో వినపడుతోంది.

✣ ✣ ✣

ఆ పాత దీపస్తంభం నీడలో ఇసుక తిన్నెల లోయల్లో దగ్గరగా కూర్చున్నాం. కార్తీకమాసం సాయంత్రం చీకటిగా మారిపోతోంది. డాల్ఫిన్ కొండవెనక పొద్దు దిగిపోయింది. ఇంకా తరంగాల నీహారపు తెరలు సోడియం వేపర్ వెలుగుతో కలిసి పసుపు తెరలు మా చుట్టూ దింపుతున్నాయి.

ఉప్పుగాలి కప్పుకుంటుంటే దగ్గరగా మరీ దగ్గరగా ఉన్న ఆమె మదపువాసన నా నెత్తురు మరిగిస్తోంది. ఆ పూల మదన పరిమళం నా నరాల్లో విద్యుల్లతలు పాకిస్తోంది...

వణుకుతున్న ఆ పెదవి వెచ్చగా ఉప్పగా ఏదో చెప్పాలని అంటూంది.

ఎల్లలు లేని ఈ పరిసరాల్లో – అంతంలేని అలలు నురుగుల నవ్వులతో దూర దూరంగా జరుగుతున్న జనభాషలో, మెల్లమెల్లగా విరిగి పడుతున్న అలల చప్పుడు చిన్నబోతోంది.

అరమోడ్పు కన్నుల్లో అరకోటి కోర్కెలు ఆశల దీపాల వలె కంటిపాపల వెలుగు. అరచేతిలో చెలి చంద్రబింబం. ఇసుకలో మేడకట్టి – వయసుతో కాపురం పెట్టనా? ఈ వెలుగు ముద్దను అలలపై పడవలా వదలి పెట్టనా? ఇంతకంటే ఆహ్వానం ఏముంటుంది? పూలతోరణం ఎవరు కడతారు?

ఇక్కడ ఏ తలుపులు మూయాలి?

స్నేహానికి నిర్వచనమేమిటి? వయసు వలయాలు సంకెల లేనా? మనసు చిల్లుల నైలాన్ వలయేనా?

ఎక్కడో చందమామ అలలపై వెలుతురు పరుస్తుంటే, దూరంగా ఏవో ఊళ్ళ లాగా ఓడలు నిలబడి ఉన్నాయి. టూరింగ్ టాకీస్ లైట్లలాగా మినుకు మినుకు మంటున్నాయి.

ఆమె మృదువైన చేతులు గులాబి దండలై మెడకు చుట్టుకున్నాయి.

ఎటునుంచో నీచువాసన గాలి మోసుకు వచ్చింది. రోజూ తిరిగే రాజా అప్పుడే అటుగా వచ్చింది. చందమామ వెలుతురు పెరిగి క్రింద సముద్రాన్ని వెన్నెల్లో తడుపుతోంది.

"వెళ్దామా" అంటోంది. "ఎక్కడికి?" "ఇలా ఉండలేము కదా!"

అవును. వెళ్ళిపోవాలి, విడిపోవాలి. ఒంటరితనం లోనికి. నన్ను నేను వెతుక్కునే ఒంటరి తనం, గాయాలకు బర్నాల్ రాసుకుంటూ, నిదురకు ఎదురు చూస్తూ, కలల కోసం కలలు కంటూ, కళ్ళు తెరచి...

"వెళ్దామా?" ఇది ప్రశ్నకాదు. చిక్కుముడి.

గుండెలో దిగులు, కంటి చివరి నుంచి – నా చేతిలో వెలుగు ముద్దను తడిపింది – "ఛ" ఎందుకు అంటూ పెదవులతో అద్ది, కంటి పాపలను నీటితో తడుపుకుంది.

ఎవరికి ఎవరు ఓదార్పు? వెన్నెలతడి మంటల్ని ఆర్పుతుందా? దుఃఖానికి గమ్యముంటుందా?

దుఃఖాన్ని మింగుతున్న రాణి గుర్తుకొచ్చింది.

మంచులో తడుస్తున్న వెన్నెల్లో చీకటి ముద్దల్లా కూర్చున్నాం. ఎంతసేపు?

ఈ రాత్రి, అలలు తీరంలో కలల తాకిడిలో మేల్కొనే ఉంది.

బంతిపూల పసుపులో రాణి విషాదంలా...

✤





రాణీ విఠోభా...



అప్పుడు, నా ప్రేయసి నిండు పెదవులు, నీలినీలి వాలు కనులే నాకు లోకం.

ఆమె ఊపిరుల వెచ్చని వాసనలు, ఆ స్పర్శల సుమదళాల మెత్తందనాలు ఇవే ఆలోచనలు – లలిత లలితమైన ఆ కిలకిలలే నాకు పులకరింపు!

ఆమె వక్షోమృదుపర్యంకం కోసం, ఒక తీయని తపనలో గడిచేకాలం. ఆమె నవ్విందే నాకు లోకం – ఆమె నడిచిందే నాకు పూలదారి!

ఆమెచుట్టూనే నా అల్లిబిల్లి మల్లిపందిరి. మంగినపూడి మంగళస్నానాలు – పాండురంగని మండపంలో కలకండ ఎంగిలి, టూరింగ్ టాకీస్ రెండో ఆట మూడో విరామంలో దొంగదొంగ ముద్దులు – చీకటి సల్లాపాలు – గొడుగుపేట గుడిలో, ఒకరి ఒడిలో ఒకరు పడుకోవటం ఎవరూ రాని ఉదయాలు.

ఎవరి పెళ్లికో గుడిసె బండిలో మరుల యాత్రలు – చుట్టాలు – స్నేహితులతో విహార వినోద ప్రయాణాలు.

అలాంటి ఒకనాటి ప్రయాణమే మోటూరు; గుడివాడ, ముదినేపల్లి రహదారిలో ఒక మైలు లోపలగా, మా ఛైర్మన్‌గారి కారు ఊరిలోకి చేరేసరికి సాయంత్రం అయ్యింది! ఊరికి ఉత్తరాన ఒక మండపం! నేను, రాణి, దాసు, చిన్న, పడమటి వెలుగులో ఆ మండపం చేరాం.

అక్కడే నిలబడి ఉన్నాడు బాబా!

బాబా అంటే – మీరు పొరపాటు పడకండి – నిండా ముప్పయి ఏళ్ళు వుండవు. లేత కాషాయపు బట్టలే – రుద్రాక్షలు సన్నగానే వున్నాయి. గడ్డం లేదో పెరగలేదో మరి జుట్టు కూడా గిరజాలు తిరిగి లేదు. అయితే ఆయన దగ్గర ఇద్దరో ముగ్గురో చేతులు కట్టుకుని నిలబడి వున్నారు. చిరునవ్వుతో ఏదో చెప్తున్నట్లు, దూరంగా వున్న మాకు అన్పిస్తోంది – అంతే, మా రాక అంతరాయంతో అక్కడి వాళ్లు ఆయన పాదాలు తాకి నిష్క్రమించారు.

మాతో వచ్చిన దాసు, చిన్నా ఆయనతో అంతకు ముందు దర్శనమైన వారే, వెంటనే వంగి పాదాలు తాకి నమస్కరించారు.

నేను – రాణి దూరంగానే నిలబడ్డాం. ఆయన దృష్టి మా మీదే నిలబడింది!

అప్పుడప్పుడూ నాకనిపిస్తుంది ముందుగా తెలిస్తే – కొన్ని పరిచయాలు కొన్ని ప్రయాణాలు మానుకుంటే బాగుండేదని. అదే వీలుంటే ముందు ముందు జరగబోయే సంఘటనలు కొంతవరకైనా ఊహించగలిగే వాడిని కాని, అప్పటికి మాత్రం చీకటిలో నలుపులా, ఏమీ తెలిసేది కాదు! ఏది ఎందుకు జరుగుతుందో అర్థమయ్యేది కాదు! తర్వాత, జరిగిందానికి 'ఏమయినా అర్థమున్నదా' అన్న ఆలోచన అప్పుడు లేదు!

కాని ఈ కథ మీకు చెప్పటానికి కూర్చొన్నప్పుడు ఇవన్నీ, ఈ సంగతులన్నీ వింతగా, కొత్తగా అన్పిస్తున్నాయి...

బాబా చూపు మా మీదే వుందేమో! లేక నేనూ, రాణి బాబాని అంతగా పట్టించుకోలేదో... తర్వాత మేము అక్కడ వున్న రెండురోజులు బాబా ఎక్కువగా మిమ్మల్నే 'పట్టించుకున్నార'ని నాకనిపించింది!

మాకు – నిర్దిష్టమైన కార్యక్రమం ఏమీ లేకపోయినా, నాతోవచ్చిన దాసు, మాకు ఉండటానికి అన్ని ఏర్పాట్లు చుట్టాలింట్లో చేశాడు. ఆ రాత్రికి భోజనానికి ముందు ఒక గంట, తర్వాత ఇంకో గంట, ఏదో భజన వుందని అందరం బాబా సమక్షంలో కూర్చోవాలని చెప్పాడు దాసు. శిష్యుడు, చిన్నా ఎక్కువగా దాసుతోనే వుండేవాడు.

ఇక నేనూ, రాణి ఇదో ఆటవిడుపులా, వీలయినపుడు చేతులు కలుపుకుంటూ వీలు కానప్పుడు చూపులు కలుపుకుంటూ, భజనలో కూర్చొన్నప్పుడు ఆమె వెనకాలే కూర్చొని, ఆమె కురుల విరజాజి మరువాల పరిమళాల వలయంలో తిరుగాడుతూ అప్పుడప్పుడూ భజనలో భాగంగా పాడుతూ ఒక్కసారిగా బాబాని పరీక్షగా చూసేవాడిని. ఆయన అంత గుంపులో భక్తుల వరసల్లో నన్ను చూస్తున్నట్లు అన్పించేది లేక నా ముందున్న రాణిని చూస్తున్నాడేమోనని అనుమానం! ఈ భజన కార్యక్రమం ముందు అందరూ బాబా దగ్గరకు వెళ్లి నమస్కరించి కూర్చునేవాళ్ళు. భజన తర్వాత మళ్లీ ఒక్కొక్కరే వెళ్లి నమస్కరించి ఆయనిచ్చిన పూలు పళ్లు తీసుకోవాలి. ఈ తంతు ఒక అరగంట పైనే రెండుసార్లు జరిగింది. భోజనాల తర్వాత భక్తుల గుంపు పెరిగింది. మేము కూర్చున్న ఛైర్మన్‌గారి పెద్దహాలు ముందు వరండా నిండిపోయింది. కరెంటు పోయినా ఇబ్బంది లేకుండా రెండు పెట్రోమాక్స్ లైట్లు పెట్టారు. నిజం చెప్పొద్దూ, ఆ భజన పాటలేమిటో ఎందుకో ఇప్పుడేమీ గుర్తులేవు. అయితే కొంతసేపు క్రిష్ణగీతాలు, విష్ణుస్తోత్రాలు, లక్ష్మీనామాలు వినపడినట్లు కోరస్‌లో, ఎక్కువ ఆడభక్తులే వుండేవారు.

రాత్రి పదిగంటలకు ఈ కార్యక్రమం ముగిసింది. అందరికీ ఫలహారాలు ఫలాలూ అందాయి. భక్తులందరూ మెల్లమెల్లగా బాబాకి నమస్కరించి శలవు తీసుకుంటున్నారు. బాబా చిరునవ్వుతో దీవించి పంపుతున్నారు. మేము చివరి వరకు వున్నాం. దాసు ఆయన కాళ్లమీద పడి దీవెనలందుకున్నారు. బాబా, వాడికేదో ఉపదేశం చేశారు. వాడికర్థమయినట్లు తలవూపాడు. చిన్నా నెత్తిన చెయ్యిపెట్టి ఆశీర్వదించారు.

ఇక నావంతు, ఈ తంతు నాకేమీ అంతగా నచ్చలేదు. అయినా వెళ్లి నమస్కారం పెట్టి బాబా కళ్లలోకి చూశాను. ఆయన గంభీరంగా మారిపోయారు. కనులు మూసుకుని ఏదో ధ్యానం చేసినట్లున్నారు. తర్వాత నా చేతిలో రెండు అరటిపండ్లు పెట్టి 'రేపు ఉదయం ఒంటరిగా కలవాలి...'' అంతవరకు విన్పించింది.

నా తర్వాత రాణి వెళ్లి నమస్కారం పెట్టి నిలబడింది. బాబా వదనం ప్రశాంతంగా మారిపోయింది. పూలు, కాయలూ ఆమె చేతిలో పెట్టి ఒక నిమిషం ఆశీర్వదించారు. నాకు ఆ ఒక నిమిషం ఒక గంటలా అన్పించింది. త్వరగా వదిలేస్తే బాగుండును అనుకున్నాను.

ఆ రాత్రికి సభ చాలించి దాసుని ఆయన గూటికి తీసుకుపోయాడు! నేను, రాణిని ఛైర్మన్ గారి భార్యకి అప్పగించి చిన్నా, నేను మా బసకు చేరాం.


నాకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. కొత్త ప్రదేశమో లేక బాబా ప్రభావమో. ఎవరీ బాబా? ఎందుకు కాషాయం వేశాడు? ఇంత చిన్న వయసులో ఇతన్ని ఎవరు పోషిస్తున్నారు. రోజంతా ఏం చేస్తుంటాడు? ఏమీ చదువుకోలేదని దాసు చెప్పినట్లు గుర్తు. మరి చదువులేనివాడు ఎదుటి వానికి ఏం చెపుతాడు? భక్తుల కోరికలు ఎలా తీరుస్తాడు? ఇతనికి మహిమలున్నాయా? ఎలా వచ్చాయి? ఇవీ ఆలోచనలు. అప్పటివరకూ భక్తి, దేవుడు వీటి అవసరం నాకు వచ్చినట్లు గుర్తులేదు. ఏదీ సీరియస్‌గా తీసుకోని వయసు. చదువుకూడా ఆడుతూ పాడుతూ పూర్తి చేస్తున్నది. రేపటి గురించి ఆలోచనలేని స్థితి. పైగా రాణి పరిచయం ఒక్కసారిగా నా లోకాన్ని వసంతంలా, నా కాలాన్ని సంగీతంలా మార్చిన సందర్భంలో నడుస్తున్న రోజులు. ఇప్పుడు ఈ బాబా ఏమిటి నాకు? అనుకుంటూ ఎప్పుడో నిద్రపోయాను.

ఇక్కడికి రాకముందు దాసు, "నేను ఒక స్కీము పెడుతున్నాను. బాబా దగ్గర ఆశీర్వాదం, ముహూర్తం తీసుకోవాలి. రెండు రోజులు సెలవలే కదా అని" మమ్మల్ని కూడా కారెక్కించాడు. ఆ విషయం అక్కడితో వదిలి, రాణితో రెండురోజులు దగ్గరిగా ఉండవచ్చు అని బయలుదేరాను. అప్పుడు బాబా నాకు ఒక సమస్య అవుతాడని ఊహ, ఆలోచన నాకెలా వస్తుంది?

సరే, పల్లెటూరు ప్రొద్దున్నే నిద్రలేస్తుంది. కోడికూతలు వినలేకపోయినా, ఎద్దులగంటలు, ఆవుదూడల అరుపులు, కళ్లాపి వాసనలు, మంచు తెరల్లోంచి పడుతున్న ఉదయ కిరణాలు, ఇవన్నీ నన్ను మంచంలో నుంచి లేపి వేశాయి. రాత్రి దాసు వచ్చి ఎప్పుడు పడుకున్నాడో నేను లేచేసరికి స్నానం కూడా చేసి విభూతి బొట్టుపెట్టి "ఎనిమిదిన్నరకి పీఠం దగ్గరకు రావాలి..." అని హెచ్చరించి హడావుడిగా వెళ్లిపోయాడు.

కాస్త ఆలస్యంగానే పీఠం దగ్గరికి చేరాం. పీఠం అంటే బాబా పూజలో కూర్చుని ఒంటరిగా ధ్యానంలో ఒక గంట గడిపి తర్వాత భక్తుల్ని ఒక్కొక్కరినీ ఆయన గదిలోకి పిలిచి వారి కోరికలు విని ఆశీస్సులు అందిస్తారు. ఇదీ పీఠం కార్యక్రమం. భక్తుల రద్దీనిబట్టి మూడునాలుగు గంటలు నడుస్తుంది. నేను, చిన్నా అక్కడికి చేరేసరికి అప్పటికే భక్తులు వచ్చి కూర్చొని వున్నారు. చుట్టుపక్కల

ఊళ్ల నుంచి ఎక్కువగా మధ్యతరగతి మహిళలు, కొంతమంది మగవాళ్లు వస్తున్నారు. ఈ వరస చూస్తే ఇక్కడ ఈ బాబాకి బాగా డిమాండ్ వున్నట్లు చాలా వూళ్లకి ఈయన మీద 'గురి' కుదిరినట్లు తెలుస్తోంది. అంతలో రాణి వచ్చి నా దగ్గర్లో నిలబడింది! పాపం చలిలో చన్నీళ్ల స్నానం. పైగా బాబా భక్తి సోకినట్లు తలస్నానం చేసి ఇంకా పూర్తిగా ఆరని కురులతో కుంకుళ్ల వాసనతో, కంఠం మీద గంధం మరకలతో పెద్ద కుంకుమ బొట్టుతో సిల్కుచీర మడతలతో వచ్చింది. నన్ను చూసింది. సన్నగా కన్నుగీటాను. 'తప్పు' అన్నట్లు ముద్దుల మూతి సున్నచుట్టి చూపుడు వేలు చూపింది. చుట్టూ సందడిలో పడిపోయాం. త్వరలోనే పిలుపులు మొదలైనాయి. ముందుగా దాసు వెళ్లి బాబా గదిలో పది నిమిషాలు పైనే వున్నాడు. వాడికి చాలా అవసరాలు అనుమానాలూ ముహూర్తాలు మరి. పావుగంటకే బయటికి వచ్చాడు. తేట మొహంతో తెల్లకాగితంతో.



రాణి

తర్వాత భక్తుల్ని ఒక్కొక్కరినీ లోపలికి దాసే పంపుతున్నాడు. తలుపు వేస్తున్నారు. ఒక్కొక్కరు రెండు నిమిషాల్లో వస్తున్నారు. కొందరు ఎక్కువ సమయం వుంటున్నారు. ఏదయినా బాబా ముఖాముఖినే భక్తుల్ని డీల్ చేస్తారని, 'ఒన్ టు ఒన్'గానే సలహాలిస్తారని తెలుస్తోంది. ఇలా ఒక గంట గడిచింది. దాసు ఇక తొందరపడటం మొదలయ్యింది. అంటే వాడికి ఇక్కడ పని అయిపోయిందని అర్థం! అందుకని నన్ను దగ్గరకు పిలిచాడు. "నువ్వు కూడా వెళ్లి కలువు. బాబా అడిగారు" అని నాతో అన్నాడు. అంతటితో ఆగలేదు. లోపలి నుంచి భక్తురాలు రాగానే నా ముఖాన బొట్టుపెట్టి తలుపు తీసి లోపలికి తోసి తలుపు మూశాడు.

మానసికంగా సిద్ధంగాలేని ఎదురుచూడని ఒక వికృతి! లోపల పెద్ద గది. వెలుతురు తక్కువగానే వుంది. అది అగరవత్తుల పొగతో మందంగా వుంది. ఎదురుగా ఒక మాదిరి ఎత్తు పీట మీద బాబా పద్మాసనంలాంటి ఒక

అంగవిన్యాసంతో కూర్చున్నాడు. చుట్టూ పసుపు కుంకుమ అరటిపళ్లు తమలపాకులు అగరువత్తులు అందరి దేవుళ్ల పటాలు రెండుప్రక్కలా రెండు దీపపు సెమ్మెలు, నూనె దీపాలు. లోపల గాలికూడా లేదు.

ఆ వెలుతురులో బాబాని చూశాను. ఎంతో అసహజంగా అసందర్భంగా అన్పించింది నాకు!

అప్పటికి కళ్లుమూసుకుని వున్నాడు. ఎవరోవచ్చిన అలికిడికి కళ్ళు తెరిచాడు. ఎదురుగా నన్నుచూసి అనుకోలేదేమో గంభీరంగా "కూర్చో" అన్నాడు. గొంతు పీలగానే అన్పించింది! ఆయనముందు కూర్చుంటే తక్కువ ఎత్తులో వుంటాము. ఆయన్ని చూడాలంటే మెడపైకి ఎత్తి చూడాలి. అప్పుడు ఆయన కరుణా కటాక్ష వీక్షణాలు పైనుంచి మనమీద ప్రసరిస్తాయన్నమాట!

"ఏమిటి నీ సమస్య?" అన్నాడు. నిజం చెప్పొద్దూ! నేను ఖాళీ బుర్రతో వెళ్లాను. వెంటనే ఏ సమస్య నాకు తట్టలేదు కూడా. అందుకే నవ్వొచ్చింది. "ప్రత్యేకంగా ఏమి" నేను పూర్తి చెయ్యలేదు. ఏదో నా ఆలోచన చదివినట్లు "నీవనుకునేది జరగదు... "జాగ్రత్త" అని కళ్లు మూసుకున్నాడు.

నేను బయటకు వచ్చాను... అక్కడ ఉక్క భరించలేక వరండాలోకి వచ్చి నిలబడ్డాను. బయట ఆకాశం నిర్మలంగా వుంది. చెట్లు చల్లగా గాలి వీస్తున్నాయి. కొన్ని పక్షులు ఎగురుతూ పోతున్నాయి. కాకులు అరుస్తున్నాయి. తల్లి కోడిపిల్లల్ని వెంటబెట్టుకొని గింజల్ని తింటున్నది. పాలేళ్లు పొలంనుంచి తిరిగి వస్తున్నారు పచ్చని గడ్డిమోపుల్తో. అరె, అంతా సహజంగానే వుందే, మరి ఏమిటి లోపం?

మరో అరగంటకు రాణి, చిన్నా వచ్చేశారు. దాసు ప్రయాణానికి కారు సిద్ధంగా వుంచాడు. కారులో వెనక సీటులో నేను, రాణి, చిన్నా కూర్చున్నాం. దాసు, ముందు కూర్చున్నాడు. డ్రైవరు కారుని వూళ్లోనుంచి గుడివాడ రోడ్ ఎక్కించాడు. అప్పుడు రాణిని గమనించాను. చాలా కలతగా ముభావంగా వుంది! ఇంకా కొంతదూరం వెళ్లిన తర్వాత ఆమె చేతిని తీసుకుని మృదువుగా నొక్కాను "బి... బోల్డ్" అన్నాను. నన్ను వింతగా చూసింది!

పామర్రు దగ్గర చిక్కని మసాలా టీ దొరుకుతుంది. అక్కడ కారాపాం! దాసు, డ్రైవర్, చిన్నా దిగారు.

నేను రాణిని గమనించాను. ఎప్పుడూ గోరువెచ్చగా వుండే అరచేతులు చిరుచెమటలతో చల్లగా వున్నాయి. ఉత్సాహంతో కాంతులీనే కనుపాపలు చీకటి తెరలు వేసుకున్నాయి. పూరేకు కనురెప్పల చాటున దుఃఖపు వూట కనపడుతోంది.

ముంగురులు సవరించి రెండు చేతుల్తో ముఖబింబాన్ని పొదివి "ఏమిటి విషయం?" అన్నాను. అదిరే పెదవులతో ఏడుపు జీరతో చెప్పింది.

"నీ స్నేహం మానివేయమన్నాడు, బాబా ... నాకు మంచిది కాదని హెచ్చరించాడు."

"చాలాసేపు నన్ను కూర్చోబెట్టి, ఏదో చెప్తూనే వున్నాడు, ఎలా బైటపడ్డానో..."

నిజంగా నాకు బాబా మీద చాలా కోపం రావాలి. కాని ఇది నేను అనుమానించిందే, అనుకుంటున్నదే. అందుకే ఆమెను ఓదార్చాను "బి బోల్డ్" అంటూ. బాబాని నేను ఒక్కమాట కూడా అనలేదు. ఇదికూడా నాకెంతో అసహజంగా అన్పించింది.

✤ ✤ ✤

ఈ ప్రయాణాన్ని ఈ పరిచయాన్ని మరిచి పోవటానికి ప్రయత్నించాలి, కాని రాణిని మామూలుగా ఎలా చేయాలి? ఆమె మనసులోపడిన అనుమానాన్ని ఎలా మాపాలి?

✤ ✤ ✤

తర్వాత మార్చివరకూ చదువు, పరీక్షలు, టెన్షన్‌తో పాసనాలు! తలొకదారి: దాసు మూహూర్తానికి బాబాని తీసుకువచ్చి చాలా హంగామా! స్కీము ఫంక్షన్ షాపులో పెట్టాడు. స్కూటర్‌లు నెలనెలా వాయిదాలు. వందమంది సభ్యులు! తన స్కీంలో ఒక మాదిరిగా జనందగ్గర సొమ్ము వసూలు చేసి, కారు, షెర్లాక్ హోం పైపు, తెల్ల లుంగీ, కాన్పూరు చెప్పులు– దర్జా పెంచాడు.

ఎప్పుడైనా నన్నుకూడా తనతోపాటు రెండు జిల్లాలూ తిప్పేవాడు. ఒకటిరెండు సార్లు 'బాబా' దగ్గరకు రమ్మన్నా నేనే పోలేదు. రాణికి మద్రాసులో మెడిసిన్‌లో సీటు వచ్చింది. నాకు సెకెండ్ క్లాస్ రావటంతో సాగర్లో లిటరేచర్ ఎమ్.ఏ చదివేందుకు బయలుదేరాను. చెరొకదారి. వెళ్లేముందు కలవలేకపోయాం!

సాగర్ యూనివర్శిటీ మూడు కొండల మీద ఉంది. ఇక్కడ సైకిల్ తొక్కవలసిన పని లేదు. సైకిలెక్కి కూర్చొంటే ఒక కొండమీద నుంచి క్రిందకు వచ్చేయొచ్చు. మళ్లీ హాస్టల్‌కి వెళ్లాలంటే మెల్లగా సైకిల్ తోసుకుంటూ పైకి వెళ్లవచ్చు! ప్రొద్దున్నే లడ్డు, జిలేబి, బూంది టిఫిన్! తర్వాత చాయ్! ఇక తిండి విషయం – కట్టెల్లాంటి రొట్టెలు. శనగల పులుసు!

అతికష్టం మీద మూడు నెలలు గడిపి బెజవాడ వచ్చేశాను. ఇంటికి వచ్చిన రోజున నేనెప్పుడూ తినని వంకాయ కూర కూడా అమృతంలా అన్పించింది! సాయంత్రం దాసు ఇంటికి వెళ్లాను. హడావుడిగా వున్నాడు. 'బాబా'కి బాగోలేదు, చూడటానికి వెళ్తున్నాను అంటూ కారెక్కి వెళ్లిపోయాడు. రాణి మద్రాసులోనే వున్నదని వాళ్లింట్లో చెప్పారు!

లీలామహల్లో 'గన్స్ ఆఫ్ నవరోన్'చూసి ఇల్లు చేరాను.

ఎప్పుడో అర్ధరాత్రి సమయంలో దాసు గేటు కొట్టాడు. కారులో 'బాబా'ని తీసుకువచ్చి మా యింటి వరండాల్లో కూర్చోబెట్టాడు. ఇతను నేను చూసిన 'బాబా'ఏనా? కనీసం మంచం మీదకూడా కూర్చోలేదే? నేలమీద ముడుచుకుని, దడుసుకుని వణుకుతున్నాడే. పిచ్చివాడిలా బెదురుచూపులు చూస్తున్నాడే?

దాసు సలహామీద, ఇక్కడికి దగ్గర్లో గుహల గుట్ట మీది 'కమలి బాబా'ను లేపి తీసుకు వచ్చాం. ఆయన మాట్లాడడు. ఆయన్ను చూసి 'బాబా' ఒక్కసారిగా కాళ్లమీదపడి బావురుమన్నాడు. ఏదో ప్రాణ భయంతో గడగడలాడిపోతూ కాళ్లకు చుట్టుకుపోయాడు.

'కమలి బాబా' అతని జుట్టు పట్టుకుని గట్టిగా గుంజి కూలవేసి రెండు చెంపలూ వాయించాడు. భుజం మీద నల్ల గొంగళి ముఖానికి కప్పి నడినెత్తిమీద గుప్పిట బిగించి, పిడుగులా మాడు మాడగొట్టాడు. స్పృహతప్పిన బాబాని తీసుకుపొండని సంజ్ఞచేసి, అరలుంగీ, చిరిగిన గొంగళి, సన్నటి బాణాకర్రతో చీకటిలో కలిసిపోయాడు కమలీబాబా! అపస్మారకంలో ఉన్న బాబాని కారులో వేసుకొని దాసు ఆ అపరాత్రి తీసుకుపోయాడు. నేనొక అపరాధిలా నిలబడి ఇవన్నీ చూశాను. తర్వాత 'బాబా'ని దర్శించే భాగ్యం నాకు కలగలేదు.

డిగ్రీతో ఉద్యోగాలేమి వస్తాయి? ఎమ్.ఏ. మానేసి, సంపాదన లేకుండా

ఎన్నాళ్లు? సరే అని ఇంట్లో వాళ్లను ఒప్పించి మద్రాసు నైట్ కాలేజి ఇంజనీరింగ్ సీటుకు అప్లికేషన్ పంపాను. దాసు పని బాగానే వుంది. ఇప్పుడు నేను మద్రాసు వెళ్తున్నానని చెప్పాను.

"నేను బెంగుళూరు వెళ్లాలి, కలిసి వెళ్దాం మద్రాసు వరకు, ఆ తర్వాత చూడవచ్చు" అని ముహూర్తం పెట్టాడు. తర్వాత "ఎందుకు, బెంగుళూరు?" అని అడిగాను. అక్కడ ఒక స్వామీజీ వున్నారు, కలవాలి, చాలా పవర్‌ఫుల్" అని అన్నాడు.

మద్రాసులో, వాడే హోటల్ రూం పెట్టాడు. నేను మౌంట్‌రోడ్ P & ORR వెనక ఉన్న ఇంజనీరింగ్ కాలేజీ ఆఫీసుకు వెళ్లి ఫీజులు కట్టి కాలేజి అడ్రసు టైమింగ్స్ తీసుకువచ్చేసరికి దాసు గదిలోనే చాలా సంతోషంగా వున్నాడు. "ఏమిటి సంగతి" అన్నాను.

"బెంగుళూరు, ఆదివారం వెళ్దాం" అని "రాణిని కలవవా?" అన్నాడు – ఒక్కసారిగా నాకు గుండె ఉప్పొంగి ఇన్నాళ్లూ దాచుకున్న భావోద్వేగాన్ని, దాసుని కౌగిలించుకుని వాడి చొక్కా తడిపి తగ్గించుకున్నాను.

'వెళ్దామా?' అన్నాను – 'నాకు పని వుంది' నువ్వు కలిసిరా' అని భోజనం తర్వాత విడిపోయాడు.

✤ ✤ ✤

నేను సాయంత్రం కోసం ఎదురు చూస్తున్నాను. సరిగ్గా ఆరుగంటలకు సెంట్రల్ ప్రక్క సదరన్ రైల్వే ఆఫీసు ప్రక్క నర్సింగ్ హాస్టల్ ప్రక్క మెడికల్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్ గేటు దగ్గర ఫియట్ టాక్సీ దిగాను! గేటు లోపలికి వెళ్లకూడదు. బైట నిలబడి, బిల్డింగ్ ఎంట్రన్స్ వైపు చూస్తున్నాను.

మెడికోలు ఎందరో సీతాకోక చిలుకల్లా తిరుగుతున్నారు. అంతలో రాణి మెట్లు దిగి వస్తోంది.

'చక్కనమ్మ చిక్కినా అందమే' అనుకుంటా! నవ్వుతూ – "ఎలా వున్నావు?" అని కళ్లలో దీపాలు వెలిగించాను! "పద, నాకు చాలా ఆకలిగా వుంది" అంది! దగ్గర్లో బుహారీ దగ్గర దిగి కాబిన్‌లో కూర్చున్నాం.

నేను సాగర్ అనుభవం, తను ఎనాటమీ అనుభవం చెప్పుకున్నాం!

"బెంగుళూరు వస్తావా? రెండురోజులే" అన్నాను. హాస్టల్ గేటు దగ్గర దింపేముందు "రేపు సాయంత్రం అయిదుగంటలకు ఫోన్ చేస్తాను" అన్నాను.

ఆ రాత్రి దాసుతో చెప్పాను – "నేను, రాణీ" బెంగుళూరు వస్తాం" అని వాడు నిజంగా ఎగిరి గంతేశాడు! ఆదివారం ఉదయం బెంగుళూరు వెళ్ళే వైకౌంట్ విమానంలో ముగ్గురం ఎక్కి థ్రిల్‌గా ఫీలయ్యాం!

మొదటిసారిగా విమానప్రయాణం! అందులోనూ, రాణి షిఫాన్ చీర వింతవాసన ప్రక్కన, కిటికీలో నుంచి మబ్బులు కదిలిపోతున్నాయి. రోల్స్‌రాయిస్ ఇంజన్‌లు ఆరోగ్యంగా తిరుగుతున్నాయి. మబ్బుల్లో నుంచి, రన్‌వే మీదకు దిగిన విమానం అప్రాన్ దగ్గర ఆగిపోయింది.

చల్లగా, చలిగా బెంగుళూరు. ఎయిర్‌పోర్ట్‌కు బైటకు రాగానే గులాబీలతో లారీలు వెళ్తున్నాయి. ఎంత అద్భుతం! ఊరంతా పూలతోటేనేమో!

"మద్రాస్ ఉడ్‌లాండ్స్"లో వున్నాము. రెండు గదులు. పదిగంటలకే స్వామీజీ దర్శనంకోసం, బయల్దేరదీశాడు. తప్పదుకదా?

ఆశ్రమం విశాలమైన ప్రదేశంలో పచ్చనిగడ్డి నేలతో చెట్లతో ఆహ్లాదకరంగా వుంది. బోగన్ విల్లా లతలు తెలుపు ఎరుపు పూలతో గాలికి ఊగుతున్నాయి. అక్కడక్కడా గులాబీ మొక్కలు పూలకిరీటాలతో దర్పంగా కదులుతున్నాయి. పసుపు పచ్చ గన్నేరు పూలు రాలి స్వాగతం చెపుతున్నట్లున్నాయి. అగ్నిపూలు కొమ్మల చివర ప్రమాద సూచికలుగా మెరుస్తున్నాయి. అక్కడ ప్రార్థనా మందిరం విశాలంగా పాలరాతి నేలతో చల్లగా చలిగా వుంది. ఒక మంటపం మీద స్వామీజీ నల్లటి గడ్డంతో, తెల్లని చీర కట్టుకుని వీణ వాయిస్తున్నాడు. చాలా పట్టుచీరలు భక్తితో పాలరాతి నేలమీద కూర్చొని స్వామీజీ వీణానాదాన్ని వింటున్నారు. నాకు నవ్వాగలేదు. దాసు కోపగించాడు. వాడికి ఛాన్సు రాగానే వెళ్లి కాళ్లమీద పడ్డాడు. ఎంతో వినయంగా చేతులు కట్టుకుని వంగివంగి ఆయనతో ఏవో విషయాలు మాట్లాడాడు. అంతకు మునుపే వారిద్దరికీ ఏదో లింకు వున్నట్లు నాకు అనుమానం వచ్చింది. స్వామీజీకి రాణిని పరిచయం చేశాడు. రాణి ఆశీర్వాదం తీసుకుంది. నేను దూరంగానే వుండిపోయాను!

అక్కడే భోజనాలు. నాలుగ్గంటలకు బైటపడ్డాం! 'నన్ను, రాణిని' లాల్‌బాగ్‌లో దింపమని చెప్పాను.

గులాబి గుత్తుల మత్తులో – మెత్తటి పచ్చటి గరికపై కూర్చుని త్వరగా చీకటి పడటం గమనించాం.

"సినిమా చూద్దాం" అంది రాణి. ఈ ఆలోచన నాకు రాలేదే? సిడ్నీపాయిటర్ 'గెస్ హూ ఈజ్ కమింగ్ టు డిన్నర్'కి వెళ్లాం. బాల్కనీ ఖాళీగా వుంది! రాణికి దగ్గరగా వెచ్చగా ఆమె భుజం క్రింద ఎడంచెయ్యి పట్టుకుని తలవాల్చి తన్మయత్వంలో తెరమీది బొమ్మలు చూస్తున్నాను. ఆమె కుడి చేతి మునివ్రేళ్లతో నా తల నిమిరింది. అప్పుడే పదునెక్కుతున్న ఆమె ఎద మెత్తందనాలను ఒత్తుతూ బొమ్మలు చూస్తున్నాను.

అమెరికా తెల్లజాతి అమ్మాయి, ఒక నల్లజాతి కుర్రవాడిని ప్రేమించి, తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి. ఇదీ కథ!

ఆట అయ్యేలోపు రాణి నాకు మరింత దగ్గరయ్యింది. ఆటోలో ఉడ్‌లాండ్స్ చేరాం. ఎంత పిలిచినా దాసు తలుపు తీయలేదు. ఇద్దరం ఒక గదికే వెళ్లాం. ఆందోళన. తెలియని ఆవేదన నన్ను అశాంతికి గురిచేస్తున్నాయి.

గదిలో మంచినీళ్లు ఉన్నాయి. ఒక మంచమే వుంది. "నిద్రపో" అన్నాను నేను చిన్న సోఫాలో కూర్చుంటూ.

"నువ్వు పడుకోవా?" అని "ఫరవాలేదు వచ్చి పడుకో" అంది.

ఎంత నమ్మకం! మౌనంగానే చీకటిలోనే ఒక మంచం మీదే ఆమె చేయిపట్టుకునే నా గుండెగోడు వింటూనే కళ్లు తెరుచుకునే పడుకున్నాను. ఆ రాత్రి ఎలా గడిచిందో ఎప్పుడు నిద్రపోయానో ఆమె గుండెల్లో ఎప్పుడు చేరానో ఆమె తలలో నలిగిన గులాబీలు వింతవాసనలు ఎప్పుడు పులుముకున్నానో ఆ రాత్రి అనంతంగా సాగాలని ఏ దేవతను కోరాలో తెలియని అజ్ఞానంతో తెలతెలవారుతుండగా లౌకిక ప్రపంచంలోకి కళ్లు తెరిచాను.

బ్రేక్‌ఫాస్ట్ దగ్గర దాసు కలిశాడు. "ఏమయిపోయావు రాత్రి?" అని వింతగా అడిగాను.

తర్వాత స్వామిజీ ఇచ్చాడని చాలా డాలర్ల చెక్కులు చూపించాడు. "ఏం చేస్తావు వీటిని" అడిగాను. వాడు నవ్వి "సినిమా తియ్యాలి" స్వామీజీకి నేనే ప్రొడ్యూసర్ని" అంటుంటే నేను తెల్లబోయాను.

తర్వాత మద్రాసు వచ్చేశాం.

✤ ✤ ✤

దాసు – ప్రొడక్షన్‌లో బిజీ అయిపోయాడు. వాడు బెజవాడ వెళ్లటం మానేశాడు. రెండు సంవత్సరాల స్కీము, సంవత్సరం నడిపి సగంపైనే సభ్యులకి డబ్బు ఇవ్వలేక మకాం మార్చివేశాడు. నేను రాత్రి కాలేజి మూలంగా రాణిని కలిసే అవకాశమే కుదరటం లేదు.

ఒకరోజు లోకల్ ట్రైన్‌లో ఒక తెలుగు పెద్దాయన కలిసి 'ఏం చేస్తున్నావని' అడిగారు. 'నైట్ కాలేజి ఇంజనీరింగ్' అన్నాను. 'పగలు పనేమీలేదా' అని "మాకు విల్లివాకంలో తెలుగు స్కూలు ఉంది. రైల్వే ఉద్యోగస్తుల పిల్లలందరూ అక్కడే చదువుతారు. రేపు పదకొండు గంటలకు సెంట్రల్ ఆఫీసులో రెండోఫ్లోర్‌కి వచ్చి నన్ను కలువు" అన్నారు. ఆయనే ఆ స్కూల్‌కి కరెస్పాండెంటు!

ఆ తర్వాత ఆయన ఉత్తరంతో, స్కూలు హెడ్‌మాస్టర్ కలిస్తే, "ఇంగ్లీషు, తెలుగు సైన్సు ఏడు ఎనిమిది తరగతులకు చెప్పాలి. టైంటేబుల్ ఇస్తాను పుస్తకాలు తీసుకోండి. నోట్సు ప్రిపేరు చేసి చూపించండి, రెండు రోజుల్లో."

ఆ విధంగా పగలు స్కూలు మాస్టర్‌ని అయి, రాత్రి ఇంజనీరింగ్ విద్యార్థిగా సిటీలో క్లాసులకు వెళ్లేవాడిని. తర్వాత తొమ్మిదో తరగతికి కూడా నన్నే పంపేవారు. ఆ క్లాసులో అడుగు పెట్టగానే పెద్దగా 'గుడ్ మార్నింగ్ సర్' అని వినపడింది. సగంపైనే ఆడపిల్లలు. జీవితం మరోమలుపు తిరుగుతోంది!

సెంట్రల్ నుంచి లోకల్ ఎక్కితే ఆవడి లైన్‌లో విల్లివాకం స్టేషన్‌లో దిగాలి. మళ్లీ సాయంత్రం లోకల్లో సెంట్రల్లో దిగి, సదరన్ రైల్వే ఆఫీస్, నర్సెస్ హాస్టల్, తర్వాత రాణి నివాసం దాటుకుంటూ పారిస్ కార్నర్ చేరి క్లాసులకు వెళ్లాలి. రాగారాగా పగలంతా స్కూలు తరగతుల్లో అరచి అరచి, అలసి రాత్రి క్లాసుల్లో నిద్రపోయేవాడిని.

సంపాదన, స్వాతంత్ర్యం ఇచ్చినట్లే, స్వార్థపరుణ్ణి చేస్తుందేమో!

స్కూలు పిల్లలు పాఠాలు, నోట్సు, రోజులో ఎక్కువ సమయం ఆలోచనలో సింహభాగం ఆక్రమించి నన్ను సిటీకి దూరం చేశాయి. విల్లివాకంలోనే ఇల్లు తీసుకుని స్కూలయిన తర్వాత సిటీకి వెళ్లి క్లాసులో నిద్రపోయి వచ్చేవాడిని రాత్రి పదిగంటలకు.

అప్పుడప్పుడూ దాసు కలిసి తన సినిమా ప్రొడక్షన్ గురించి చెప్తుండేవాడు. స్టూడియోలకు కూడా వెళ్తుండేవాళ్లం. ప్రీవ్యూ కూడా చూపించేవాడు.

ఇదేదో భక్తిముసుగు వ్యాపారంలా తోచింది! ఇదంతా స్వామీజీ దయేనని చెప్పేవాడు.

స్వామీజీ సమాజ సేవకూడా బాగా చేస్తాడని, ఆశ్రమంలో మెడికల్ కాంపు పెట్టించి ఇక్కడనుంచి డాక్టర్లను మెడికోలను తీసుకువెళ్లి రోగులకు మందులు కూడా పంచాడని, రాణి కూడా కాంపుకు వెళ్లి స్వామిజీని కలిసిందని చెప్పాడు. ఇవన్నీ నాకంతగా ఆసక్తికరమైన విషయాలుగా అన్పించలేదు.

✤ ✤ ✤

తర్వాత సంవత్సర కాలంలో రెండుమూడు ఆదివారాలు రాణిని కలిసే అవకాశం కలిగింది. ఈ సమాగమాలన్నీ నన్ను ఎంతో ఉత్తేజపరిచి జీవితం అంటే వసంతంలా అన్పించేది. ఎడబాటును రద్దీరోడ్లు దాటే జాగ్రత్తలో, లోకల్ రైళ్ల హడావుడి శబ్దాలతో, స్కూలు తరగతులు, చైతన్యంతో నిండిన విరిసీ విరియని మొగ్గల్లాంటి విద్యార్థులతో, ఎలక్ట్రోమాగ్నెటిక్ క్లాసులు నిద్రలో మరిచిపోయేవాడిని. ఈ సమాంతర జీవితంలో ఏ సమయం ఎందుకు వినియోగం అవుతుందో తెలిసీ తెలియని అయోమయం?!

కాని నా స్మృతుల సుడులతో నిరంతరం తిరిగే ఆ మూడు ఆదివారాలను ఇప్పుడు తడుముకోకుండా ఎలా ఉండగలను?

మొదటి ఆదివారం!

వర్తమానంలా సముద్రజలాల చైతన్యం. అలల వెకిలి నవ్వులు.

మానవజాతి గతంలా సముద్ర గర్భ శోకం.

లేనీ, తెలీని భవితలా శూన్యాకాశం.

ఎక్కడో చుక్కల చిక్కుల వెలుగు!

మరి నాతో నువ్వు. అన్నిటికి భిన్నంగా అటుగా, ఇటుగా, అతీతంగా నిర్హేతుకంగా ఇక్కడ నేనూ నువ్వు. అలలమీద కదిలే వెన్నెల. ఒరిగిన పడవ పడగ నీడలో నీతో నేను. చుట్టూ కదులుతున్న భయాలు. నిన్నూ నన్నూ మింగేసే తిమింగిలాలు. జరజరమంటున్న విష వలయాలు విషయమయాలు. బరువుగా కదిలే ముసలి తాబేళ్లు. ఇసుకలో శిలాజాలు!

నిన్ను దాచేయాలని, ఇసుక గూట్లో గుండె గుల్లగా చేసి! నిన్ను కాపాడాలని కాలపు పొరల్లో మమ్మీని చేసిన తపన!

నా ఆలోచనలకు ఆకారంలా అండమాను జలాలు దాటి వచ్చిన ఒక వికృతాకారం.

"ఎన్నపన్రె?" గంగ్రగొడ్డలి ఎండు కట్టెల్ని చీల్చినట్లు ఒక్కసారిగా చెదిరిన, బెదిరిన, అదిరిన నిదుర కల!

దగ్గరవుతున్న ప్రమాదం! ఆలోచన లేని ఆవేశం. రెండు గుప్పిట్లలో ఇసుక, చిన్న పరుగుతో రెండు కాళ్లతో వాడి రొమ్ములో తాకిడి!

అంతటి ఆకారం కూలిపోతే, గుప్పిట్లో ఇసుక వాడి ముఖాన గుప్పి,

"రా, రాణీ" అంటూ హీరోచితంగా కదిలి, మళ్లీ జనంలోకి, జీవితంలోకి జనవనంలోకి! గుండెల్లో భయంతోనే, వాడిలో నాకు బాబానే కనిపించాడా? అట్లా అనిపించాడా?

ఎప్పటి నుంచి అణిగివున్న కోపం ఇప్పుడు తన్నుకు వచ్చిందా?

మళ్లీ కలిసే రోజు?

❖ ❖ ❖

ఐటిఐ దగ్గర్లో గాంధి పార్కు. వలయ మండపం.

మెట్లమీద చెట్లచాటున, మనం!

సంజెవేళ, పిట్టలు చెట్టులెక్కే వేళ, అలసిన ముఖాలు ఇళ్లకు మళ్లేవేళ.

దూరంగా సముద్రపు హోరు వినిపించే వేళ! తొందరలోనే పార్కుగేటు మూసేవేళ!

అప్పుడు నిన్నరాసిన చిన్న లేఖ నీకిచ్చినపుడు

"ప్రియా, ప్రియతమా, వెన్నెల పందిరిలో, అలల లయలో, ముంగురుల మబ్బుల దోబూచులాటలో, వెన్నెల మింగుతున్న కన్నుల చీకటిలో, వడిలో – దడిసిన సారంగపు అలజడి అలికిడితో చీకటి చిదుముతున్న భయమయ హృదయంపు గుహలో.

గుప్పిటలో జారిపోతున్న ఇసుక రేణువుల సమయాన్ని బంధించాలని వృథాప్రయాస!

ఇలా ఎన్ని యుగాలు? ఎన్ని జన్మలు?

జారిపోయే కాలానివా?

జరిగిపోయే వెన్నెలవా?

ఇసుకని గడ్డ కట్టించాలనే వెర్రి ఆశ నాది!

నువ్వున్నంత సేపు నువ్వెళ్లి పోతావని భయం!

నువ్వెళ్లిపోయిన తర్వాత

అయ్యో నువ్వులేవని బాధ!"

ఈ లేఖ చదివి, నీరు నిండిన కన్నుల్తో నన్ను చూస్తూ, మమతావేశంతో ముద్దుపెట్టావు కదా!

నీ కన్నీళ్లతో ఉప్పెక్కిన నీ పెదవులు ఎంత రుచి!

"ఇంకో ముద్దివ్వు" (అంటే),

"ఇంకో లేఖరాయి" అన్నావుకదూ!

"ఇప్పుడే చెప్పనా?" 'ఆఁ'

“వరాలిచ్చిన దేవతవే

ఏ పూలతో పూజించను?

కదిలిపోయే కాలానివే,

నిన్నెలా బంధించను?”

చూపుడు వేలుతో నా నోరు మూసి,

తన బాహువుల్లో నన్ను బంధించి, నా ముఖాన్ని తన వక్షోమృదుసీమలో హత్తుకుని వత్తుకుని మౌనంగా రోదించే హృదయంతో రాణి! అంతలో,

“కాలం ముడింజిపోచ్చే” పార్కు కాపలాదారుని కేక!

మళ్లీ అక్కడనుంచి జనంలోకి, జీవితంలోకి... జన జీవితంలోకి...

✤ ✤ ✤

ఈ ఆదివారం దూరంగా, తీసుకువెళ్లమన్నావు కదా!

అడయారు బీచ్‌లో అలలతో ఆట.

ఎవ్వరూ లేని పరిసరాలు ప్రపంచంలో, ప్రకృతిలో మనమేనేమో! ఈ అలలేనేమో! ఎదురుగా అనంతసాగరం! ఎండలేని సాయంత్రం, ఎక్కడో గతంలోకి తిరిగిపోతున్న నౌక! జరిగిపోతున్న ఓడ!

అంతలో ఓ అల, అలజడి, జడివానలా మనల్ని ముంచి నురగలతో పారిపోయింది కదూ!

తడి ఇసుకలో, కదలని కాలంలాంటి ఇసక తడిలో నువ్వు – నేనూ!

నా కళ్లనిండా నీవు, రెండు కళ్లు పట్టని అందం, తడిసిన నీ చందం!

మెల్లగా ఇసుకలో నడుస్తూ, బీచ్ రూంకి, వరండాలో కూర్చుని, అనంత దిగంతాలలో ఆకాశం, అర్ణవం కలిసే భ్రమలో నువ్వు నేను!

ఆ తర్వాత ఆ గదిలో నీ తడిసిన వలువలూడ్చిన దుశ్శాసనుడిని కదా!

నీ జాకెట్టు ఒక్కొక్క హుక్కు తప్పిస్తున్నప్పుడు నాలో ఎన్ని నరాలు పుటుక్కుమన్నాయో ఎలా చెప్పను?

బందు చిక్కుముడి తియ్యలేక తికమకపడుతుంటే నీ కొంటె నవ్వుతో అలవోకగా తొలగించినపుడు నా ప్రాణంబులు తావుల్ దప్పలేదా?

నీటిలో నిప్పులా నీవు సెగలు రగులుతుంటే నీ వయసు పుప్పొడి నేనలదుకోలేదా? నీ యౌవన గంధం నన్నలముకోలేదా?

నీ వంటికి అంటిన కాలంపు రేణువులు తడిమితడిమి తుడిచి తుడిచి, నీ సుడుల నాభిలోని లవణాన్ని జిహ్వా చాపల్యంతో గిలిగింతలు పెట్టిన చిలిపి కృష్ణుణ్ణి కదా!

నా దృష్టి తీరాలకందని నీ వక్షోజాల వైశాల్యం, అందుకోలేక నీచనుమొనలను మునిపంట కొరికిన మొరటువాణ్ణి కదా,

నీ కంఠాన్ని క్రూరంగా గాటుపెట్టిన డ్రాకులానా? నీ నిండు పెదవుల్ని తనివితీరక చప్పరించిన పసిపాపనా?

నీ నోటిలో వెచ్చని ఊపిరులు, ఆవిర్లు వస్తున్న నీవంటి ఆడవాసనతో మత్తిల్లిన నేను మోహ వివశంతో, నీ నాలుకను నా నోటిలో బంధించి, అడయార్ ఈడెన్‌లో, ఈవ్ రాణి వర్జినిటిని కొల్లగొట్టిన శాటనిక్ ఆడమ్‌నే కదూ!

గుండె పువ్వుని నెత్తుటి కుండలో మరిగించి నీకు నివేదించలేదా.

ఒకే ఒక్క క్షణం, మనసు వయసూ ఏకమైన ఒక దివ్యానుభూతిలో నన్ను తరింపజేయలేదా? ఈ అమృతానందాన్ని ఎందుకు అందించావో తెలుసుకోలేని అజ్ఞానిని కదా!

నువ్వెందుకు నాకు 'ప్రేమ కానుక' ఇచ్చావో అర్థం చేసుకోలేని అల్పజీవిని. నా ప్రేమ స్వార్థపూరితమని, నీ అనురాగం అమృతమయమని తెలియని మూర్ఖుణ్ణి కదూ!

అప్పటికే నీకు ఎన్నారైతో పెళ్లి కుదిరిందని, దానికి దాసు, స్వామీజీ బ్రోకర్లని, అప్పుడు తెలుసుకోలేకపోయాను.

✤ ✤ ✤

నా పగటి పంతులు, రాత్రి విద్యార్థి జీవితం ఎక్కువకాలం సాగలేదు. రాత్రి కాలేజీ మానివేశాను. పూర్తిగా విల్లివాకం స్కూలుకే బల్లిలా అంటుకుపోయాను. రోజులు బరువుగా, నెలలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

ఒకరోజు వర్డ్స్‌వర్త్ 'డాఫడిల్స్' చెప్తున్నా. సహజంగానే నా మనసు నిండా రాణీయే పూలతోపాటు కూర్చుంది. క్లాసులో సుబ్రమణ్యం అల్లరి చేస్తున్నాడు. ఎందుకో తెలియని కోపం వచ్చింది. వాడిని నిలబెట్టి దగ్గరగా వెళ్లి చెంప ఛెళ్లుమనిపించాను.

సాయంత్రానికి వాడి బుగ్గ బూరెలా అయ్యింది. నా వేలి ఉంగరం గట్టిగా తగిలిందేమో కాని వాడిలో స్వామిజీ పోలికలున్నాయేమిటి?

మర్నాడు వాడి అమ్మానాన్న వచ్చి హెడ్‌మాస్టర్‌తో పంచాయితీ పెట్టారు. ఆయన వాళ్లముందు నన్ను కోప్పడి, వాళ్లు వెళ్లిన తర్వాత, నా ముందు వాళ్లని తిట్టి, సుబ్రమణ్యాన్ని పిలిచి 'తోలు వలుస్తాను గాడిద' అని అందర్ని సర్ది పంపిన, లౌక్యుడు!

ఇలా ఎన్ని సంవత్సరాలయింది? తొమ్మిదో తరగతి పదో తరగతయింది.

డి.ఇ.ఓ. స్కూలుకు వచ్చినప్పుడు ఏడోతరగతిలో సైన్సు చెపుతూ క్లాసు చివరిలో ఎవరిదో నోట్సు చూస్తున్నా. ఆయన గుమ్మంలో నుంచి కాసేపు చూసి, హెడ్‌మాస్టరు (ఇప్పుడు ప్రిన్సిపాల్ అంటున్నారు) 'ఆ క్లాసులో టీచర్ లేడే' అన్నాడని, అప్పుడు ఆయనగారు నన్ను పిలిచి పరిచయం చేస్తే, 'ఓ! హి ఈజ్ లైక్ ఎ స్టూడెంట్' అని ఆశ్చర్యపోయాడని ఈ విషయం తర్వాత క్లాసులో చెప్పినప్పుడు 'హే' అని గోలగా అరిచారు! ఆడపిల్లలంతా!

ఒకరోజు స్కూలయిపోయిన తర్వాత, స్టేషన్ ప్లాట్‌ఫాం మీద పరధ్యానంగా నిలబడివున్నాను. ఆవలివైపున పచ్చని వరి పొలం మధ్యలో నా గది ఒంటరిగా నిలబడి ఉంది నా ఏకాకి జీవితానికి ప్రతీకలా.

పెరంబూరు కోచ్‌ఫాక్టరీ 'బాడీప్రెస్' ధన – ధనా మోగుతోంది. వరండాలో రైలుపట్టా గంట గణగణమంటూ రైలు రాకను కేకవేస్తోంది! బొంబాయి మెయిలు వేగంగా మోగుతూ రైలు పట్టాలవెంట కాగితాలనూ ఆకులు రేపుకుంటూ పోతోంది.

ఒక్కసారిగా, ఈ వింత శబ్దప్రపంచంలో నేనే తరంగాన్ని?

ఎవ్వరికీ చెందని ఏకాంత నిశ్శబ్దాన్నా? నిరామయ సమయాన్నా?

అంతలో సన్నగా కలకలం! పదోతరగతి ఆడపిల్లలందరూ గుంపుగా నన్ను

దాటుకుని వెళ్తున్నారు. ముందుకు వెళ్లి, ముసిముసినవ్వులూ కిలకిలలూ. ఏమయింది? ఏదో ఉంది! అందులో మాలతిని పిలిచి "ఏమిటి సంగతి?" అని అడిగాను.

"సర్, మీరు ఏప్రిల్ ఫూల్! వెనుక మీ చొక్కామీద ఇంక్ చల్లారు" అని వెళ్లిపోయింది నవ్వుకుంటూ!

ఆ మర్నాడు, స్టాఫ్‌రూంలో ఒక్కడినే వున్నాను. విఠోబా, వచ్చి, "సారీ సర్, నేనే ఇంకు చల్లాను" అని అంది.

"మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

"లేరు సర్, అమ్మా, ఆఫీసక్కా, కిచెనక్కా నేనూ ఉంటాం సర్, పెరంబూరు ఇంట్లో" అంది

"నాకు మరాఠీ నేర్పుతావా?"

"కుదరదు సర్" అని వెళ్లిపోయింది!

రెండురోజుల తర్వాత "ఈ ఆదివారం మా యింటికి భోజనానికి రావాలి సర్" విఠోబా అంది.

"ఎందుకు" అన్నాను.

"నా బర్త్‌డే సర్"

"ఆదివారం పెరంబూర్ స్టేషన్‌లో పదకొండు గంటలకు ఎదురుచూస్తుంటాను సర్" అని సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్లిపోయింది!

శనివారం సిటీకి వెళ్లి బర్త్‌డే గిఫ్ట్ కొని పాక్ చేయించి, దాసుకోసం కోడంబాక్కం వెళ్లి వెదికాను. ప్రొడక్షన్ ఆఫీసు మూసివేశారు. వాడు ఏదో కేసులో ఇరుక్కున్నాడని, పోలీసులు వచ్చారని, స్వామీజీని కూడా కేసులో పెట్టారని, ఆయన లండన్‌లో వున్నాడని, ఈ సంగతి తెలిసి రావటం లేదని, ఇవన్ని ప్రొడక్షన్ బాయ్ షణ్ముగం సినిమా స్క్రిప్టులా చెప్పాడు!

తిరిగి విల్లివాక్కం ఇంటికి వచ్చి పోస్టులో వచ్చిన ఉత్తరాలు; ఫైనల్ పరీక్షలొస్తున్నాయి కదా, తలిదండ్రులు రాస్తుంటారు. ఆ రోజు దాసు ఉత్తరం.

ఎప్పుడో రాసింది ఎక్కడో డబ్బాలో వేసింది, వచ్చింది. అప్పటికీ తెలిసిన విషయాలతోపాటు, రాణి లండన్ వెళ్లిపోయిన సంగతి కూడా చాలా ఆలస్యంగా తెలిసింది! జీవితం ఎన్నో నేర్పుతుంది ఓర్పు, ఓదార్పు కూడా!

ఆదివారం పదిగంటలకే స్టేషన్‌కి వచ్చాను. జనం పల్చగా వున్నారు. సిమెంటు బెంచీలు ఖాళీగానే వున్నాయి. కుచ్చుపూల చెట్లు ఆకులు రాలుస్తున్నాయి. స్టేషన్ మాస్టర్ రూం దగ్గర రైలుపట్టా గంట వ్రేలాడుతోంది శబ్దాన్నంతా వంట్లో దాచుకుని. ఫ్లాట్‌ఫాం చివర ఇద్దరు గాంగ్‌మెన్‌లు బీడీలు కాలుస్తున్నారు. సౌత్‌సిగ్నల్ కాబిన్ దగ్గర సందడేమీలేదు. నల్లకుక్క ట్రాక్‌మీద నడుస్తోంది.

పెరంబూరు కోచ్ ఫాక్టరీ మూగబోయింది.

వెలిసిపోయిన కాషాయంతో అలసిపోయిన కన్నుల్తో బక్కచిక్కిన ఒక బైరాగి మెల్లగా ఇటే వస్తున్నాడు. నా దగ్గరకు రాగానే ఆగి నన్ను చూసి నవ్వాడు! “ఎంగెపోరెంగే” అడిగాను. “శీరంగం...” అన్నాడు. పదిరూపాయలు తీసి ఇచ్చాను. చేతిలో కాగితాన్ని చూసి తర్వాత నన్నుచూసి మెల్లగా వెళ్లిపోయాడు! అంతలో

“ఎన్నాసారు, వండిపోచ్చా?” ఓ తెలిసిన ఆరుముగం.

“ఆమ”

“పిన్నాల వేరె వండి వరదే” అంటూ వెళ్లిపోయాడు.

పెరంబూరు లోకల్ ఆ వైపు రావాలి! ఫుట్ బ్రిడ్జి ఎక్కి రెండుప్రక్కలా చూశాను! రైలుపట్టాలు పొడవుగా, బారుగా, నేరుగా, అనంతంలోకి సాగి ఎండలో దూరంగా ఎండమావుల్లో కరిగిపోతున్నట్లు.

ఎక్కడినుంచో వస్తున్న పొడవాటి గూడ్సుబండి, నా కాళ్లక్రింద నుంచి ఎక్కడికో వెళ్లిపోయింది. పెరంబూరులో దిగాను. విఠోబా గులాబి రంగు నైలాన్ చీర సింగారించి జడలో కాగడా మల్లెపూలు పెట్టి, నవ్వుతూ ఎదురు చూస్తోంది!

ఈ అమ్మాయేనా క్లాసులో పాఠాలు వినేది?

మంచులో తడిసిన ముద్దబంతిలా స్వచ్ఛంగా నిండుగా ఎండలో మెరుస్తున్న ఆమె ప్రక్క నడుస్తుంటే నాలో మబ్బుల పొరలు చెదిరిపోతున్నాయి.



ఎంతో సంతోషంగా మాట్లాడుతూ, ఇంటికి తీసుకు వెళ్లింది. ఇల్లంతా సర్ది శుభ్రంగా వుంది.

ముందు చిన్నవరండా, తర్వాత కూర్చునే హాలు, ఒకప్రక్క కిచెన్, మరోప్రక్క పడగ్గది. ముందు అమ్మని, తర్వాత ఆఫీసక్కని, రైల్వేలోనే ఉద్యోగం, ఆ తర్వాత కిచెనక్కని ఈమె వంటలే తినబోతున్నారని, ఇంటిపనీ వంటపనీ అన్నీ ఈమె. చాలా అందంగా అమాయకంగా వుంది!

అప్పుడు విఠోబా నన్ను పడగ్గదిలోకి తీసుకువెళ్లి 'బసాహెూ' అంది! చేతులు పట్టుకుని మంచం మీద కూర్చోబెట్టింది!

క్లాసు కబుర్లు గలగల చెప్పింది. అందరి నిక్‌నేమ్‌లూ ఏకరువు పెట్టింది. మరినాదో? అప్పుడు నవ్వింది! 'ఎస్.ఎమ్' అని అంటే? నవ్వేసింది.

తర్వాత ఎంతో ఆప్యాయంగా భోజనం పెట్టింది. దగ్గర వుండి కొసరికొసరి. వంటకాలు మెచ్చుకుంటే కిచనక్క కిచకిచమనేది. విఠోబాని 'నీకు వంట రాదా?" అంటే "వడ్డించటం వచ్చుగా" అని కోపంగా చూసింది!

వీరి అనురాగం, ఆప్యాయత నన్నెంతో కదిలించి వేశాయి. మగ సహాయం లేని ధీరోదాత్తమైన వీరి అనుబంధం నాకు ఆశ్చర్యమనిపించింది.

వచ్చేముందు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చాను. ఎంతో ఆతురతతో విప్పి చూసింది!

ఫ్రెంచ్ ఆకుపచ్చని ఇంకు పెన్ను! చూసి నోరు తెరిచింది. అమాయకురాలు కాదుగా! నేను కొంటెగా నవ్వాను!

అందరికీ చెప్పి, తేలికగా స్టేషన్‌కి వచ్చాను. వితోబా ప్లాట్‌ఫాం వరకూ వచ్చింది. సెంట్రల్ వైపు నుంచి వచ్చే లోకల్ కోసం చూస్తున్నాం.

"ఈ వారం సినిమాకు తీసుకు వెళ్తారా?" అని హఠాత్తుగా అడిగింది వితోబా!


"ఏ సినిమా? విల్లివాక్కంలో 'పాశమలరా?"

"కాదు, కాసినో లో "టు సర్ విత్ లవ్" అంది!





రేణు



ఇప్పటికి ఎన్నిసార్లో శ్రీనివాస మహల్లో 'దేవదాసు' చూసి ఆలస్యంగా అత్తయ్య ఇంటికి వచ్చాను. తెరమీద విషాదం జీవితంలోకి వచ్చిందో – బ్రతుకులోని దుఃఖం తెరమీది వ్యక్తులు మోస్తున్నారో తెలియని ఒక నిరామయ సమయంలో చీకటిలో సైకిల్ తొక్కుకుంటూ – రాత్రి పదింటికి – గేటు తీసుకుని పెరటిలో సైకిల్ పెట్టాను. అమావాస్యముందు అయిదోరోజు చంద్రుడు ఏడుపు ముఖంతో చీకటి ఆకాశంలో దారి తెలియక వ్రేలాడుతున్నాడు. మాలీగేదె ఒక ప్రక్కగా చీకటి ముద్దలాగా కూర్చొని గడ్డి సములుతోంది ప్రక్కనే దూడ నిద్రపోతోంది – ముసలి అల్సేషన్ సైకిల్ అలికిడి విని – తలెత్తి – మళ్లి పడుకుంది – ఒకటి రెండు పందికొక్కులు అటు ఇటూ పరుగులు పెట్టాయి. పెరటి తలుపు తోసుకుని ఇంటి వరండా ఖాళీ స్థలంలో నీళ్ల టాంకు దగ్గర కాళ్లు కడుక్కుని – మడత గేటు ప్రక్కకి తోసి – వరండా దాటి హాల్లోకి వచ్చాను. సినిమా విషాదం – ఇంట్లోకి వచ్చిందా అన్నట్లు నా మరదలు ఏడుస్తోంది – అత్తయ్య కళ్లొత్తుకుంటూ కూర్చొంది. ఏమయింది?

నన్ను చూసి "బావయ్యా నన్ను రేణు దగ్గరకు తీసు కెళ్లు" "ఇప్పుడే ప్లీజ్..." అంటూ నా చెయ్యి పట్టుకుని – అంటోంది – అప్పుడు ఆ రాత్రి తప్పనిసరై బస్‌స్టాండ్‌కి వెళ్ళేందుకు – బయలుదేరుతుంటే – మా యిద్దర్నే పంపటం బాగోదనో లేక తనకు కూడా రావాలని ఉందో – అత్తయ్య కూడా మాతోపాటే అరమైలు

నడిచి జమ్మిచెట్టు దగ్గర ముగ్గురం ఒక ముసలి రిక్షా ఎక్కి బస్‌స్టాండ్ చేరి – గుంటూరు బస్ ఎక్కేసరికి అర్ధరాత్రికి అటూ ఇటూ అయింది.

తీరా గుంటూరు వెళితే – మెడికల్ కాలేజీ హాస్టలు దగ్గర రేణు వాళ్ల వూరు వెళ్లారు – అని తెలిసింది. అప్పుడు గుంటూరు రైల్వేస్టేషన్ చేరాం. ఏదో పాసింజర్ బండి బిట్రగుంట వెళ్ళేది బయలుదేరవచ్చని తెలిసి టిక్కెట్లు తీసుకున్నాను. ఆ బండి ముక్కుతూ మూలుగుతూ ప్లాటుఫాం మీదికి వచ్చేసరికి జయ అలసి నిద్రపోయింది. మెల్లగా లేపి ఒక చెక్క బల్లల డబ్బా ఎక్కాం. అంతరాత్రి జనం ఎవరుంటారు? అత్తయ్య ఒక ప్రక్కగా పడుకుంది. జయ నా చేయిపట్టుకుని మధ్యలో ఉలిక్కిపడుతూ నా తొడ మీద తలపెట్టుకుని నిద్రలో కూడా వెక్కుతూ ఏడుస్తోంది.

ఎందుకు అలా జరిగింది? ఈ బండి ఒంగోలు ఎప్పుడు చేరేను – అక్కడ నుంచి రేణూవాళ్ల వూరు ఎంత దూరం? అక్కడికి చేరేది ఎలా? నాకు నిద్రరాదు సరే – బండి తుమ్ముతూ దగ్గుతూ మెల్లగా కదిలేసరికి, కాస్త చల్లగాలి తగిలింది–జయ కన్నీళ్లతో పాంటు కాస్త తడిసి – చిరాకుగా వుంది –

వేసవి తొలిరోజుల్లో – పొలాలన్నీ నెగుళ్లయి బండి పరుగెడుతుంటే – ఏదో ఎండువాసన వేస్తోంది. విషాదానికి చీకటి రంగులా, దుఃఖానికి ఎండువాసన ఉంటుందా? తుమ్మచెట్లు – దయ్యాల్లా వెనక్కు పరుగెడుతున్నాయి. ఈత చెట్లు – జుట్టు విరబోసి నిలబడి నిద్రపోతున్నాయి. ఈ బండి ఏ గతంలోకి వెళ్తోంది?

❖ ❖ ❖

రేణు ప్రతి శని, ఆదివారాల్లో మా అత్తింటికి వస్తుండేది. జయ, రేణు కలిసి మాంటిస్సోరిలో చదివారు. రేణు అమ్మగారు – అత్తయ్య ఎంతో స్నేహంగా ఉండేవారు – రిక్షాలో మ్యాట్నీలకు – బీసెంట్‌రోడ్ మాచింగ్ సెంటర్‌కు వెళ్తుండేవారు. రేణు నాన్నగారు PWD ఇంజనీరు – మ్యూజియం రోడ్ గవర్నమెంటు క్వార్టర్స్‌లో ఉండేవాళ్లు. PUC తర్వాత మెడిసిన్‌లో గుంటూరులో రేణు చేరటానికి వెనుక పెద్ద రాద్ధాంతమే జరిగింది. జయ మేరీస్ స్టెల్లాలో డిగ్రీలో చేరింది. ఆడుతూ పాడుతూ బియ్యే చదివితే – ఇంటి దగ్గర్నుంచి రిక్షాలో వెళ్లవచ్చు – హాస్టల్‌లో వుండాల్సిన పని వుండదని రేణు కూడా ఒక గమ్యం

లేకుండానే బియ్యే చేస్తానంది, కాని వాళ్లమ్మ, నిర్మలమ్మ, ఏమైనా సరే మెడిసిన్‌లో చేరాల్సిందేనని, అప్లికేషన్ పెట్టమంది. గ్రూపులో బాగా మార్కులు వచ్చిన రేణుకి మెడిసిన్ సీటు తేలిగ్గానే వచ్చింది. 'నేను చేరను' అంటున్నా, నిర్మలమ్మ గుంటూరు తీసుకుని వెళ్లి ఫీజులు కట్టి ఆమె డాక్టరు చదివినంత సంబర పడిపోయింది. రేణు నాన్నకి ఈ విషయంలో ప్రమేయం లేదు. రేణు చెల్లెలు కూడా 'అక్క డాక్టరు' అని అందరితో చెప్పి గొప్పగా పోజు పెట్టేది.

కొన్నాళ్లు బెజవాడ నుంచే రోజువెళ్లి – కాలేజీనుంచి సాయంత్రానికి వచ్చేది – రెండు నెలల తర్వాత 'నేను తిరగలేను – మానివేస్తానంటే – మళ్లీ నిర్మలమ్మగారు హాస్టల్లో రూం సంపాదించి పెట్టెలో బట్టలు సర్ది కలెక్టర్ బంగళా ప్రక్కన వున్న వుమెన్స్ హాస్టల్లో అమ్మాయిని దింపి అన్ని జాగ్రత్తలూ చెప్పి – ప్రతివారం వెళ్లి చూసి వస్తూండేది.

అప్పుడప్పుడు జయకు, అత్తయ్యకు మెడికల్ కాలేజీ విశేషాలు అక్కడ అమ్మాయిల రాగింగ్‌లు చాలా ఇష్టంగా వర్ణించి రేణు వాళ్ల అమ్మ చెపుతుంటే – నేను ఉండలేక "మీరు డాక్టరు చేసివుంటే చాలా బాగా రాణించే వారు" అంటే – "అవును బాబూ – మాకు ఆ అవకాశం ఏది? చదువు ఆపి, పెళ్లిచేసి, మా అమ్మ తన బాధ్యత తీర్చుకుంది. నేను కూడా అలాంటి తప్పుచేసి రేణు కేరీర్ పాడు చేయను. ఏ తరం బాధ్యత ఆ తరానికి వుంటుంది కదా". ఎవరివి కోరికలో, ఎవరివి బాధ్యతలో! ఎవరి బాధ్యతలు ఎవరి కేరీర్‌లో! నేను చాలా సేపు మథనపడ్డాను. జయ, రేణు, నేను వారాంతాలలో కారమ్స్ ఆడేవాళ్లం. ఒక్కోసారి మా యింట్లోనే వుండిపోయేది. రేణు ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడేది కాదు – జయ మాత్రం – జోకులేస్తూ ఎంటర్‌టైన్ చేస్తుండేది. ఎప్పుడైనా ముగ్గురం సినిమాలకు కూడా వెళ్లేవాళ్లం – ఒక ఆదివారం సాయంత్రం రేణు బెజవాడలో వుండగా జయతో మ్యూజియం రోడ్‌లో వాళ్లింటికి వెళ్లాను. ఎప్పుడూవుండే వారికంటే ఎక్కువ మంది వున్నట్లుంది, ఇల్లంతా సందడిగా వుంది. అప్పుడే రేణు – వాళ్ల బావను మాకు పరిచయం చేసింది. 'శివరాం' డిగ్రీ మానివేసి వాళ్లవూళ్లో వ్యవసాయం చేస్తున్నాడు. పొగాకు, ప్రత్తిలాంటి మెట్టపంటలేనని మాటల్లో తెలిసింది. రేణుకంటే ఒక అంగుళం తక్కువ ఎత్తుంటాడు. చాలా సామాన్యంగా వున్నాడు.

ఎందుకు చెపుతున్నానంటే, తర్వాత రేణు ఈ బావనే ఎంతగానో ప్రేమించినట్లు తెలిసి, నల్లటి కళ్లతో నవ్వుతూ ఉండే రేణు, ఈ రైతుని ఎలా – ఎందుకు ఇష్టపడిందో అని కొద్దిగా ఆశ్చర్యపోయాను.

తర్వాత సంవత్సరకాలంలో రేణు నవ్వు వన్నె తగ్గింది. నల్లని కళ్ళ చుట్టూ చీకటి గూడు కట్టింది. బెజవాడ రావటం తగ్గించింది – ఎక్కువగా హాస్టల్లోనే ఉంటోంది.

ఈ పరిణామాలకు కారణం జయ త్వరగానే తెలుసుకుంది.

మొదటిది – రేణు మెడిసిన్ చదవటం అసలే ఇష్టం లేదు. ఇప్పుడు బావ మీద ఇష్టంతో, తను డాక్టర్ అయితే అతను తప్పనిసరిగా దూరమవుతాడని దిగులు – ఇంకా రెండు మూడేళ్ళలో 'రేణు' డాక్టర్ అయి అమెరికా వెళ్లిపోతుందని అమ్మ ప్రచారం! ఇదే ఆ అమ్మాయి సంఘర్షణ! ఈ ఘర్షణతోనే మరో సంవత్సరం కూడా జరిగిపోయినట్లుంది.

ఈ సంవత్సరంలోనే – రెండు సంఘటనల ద్వారా 'రేణు' ఎంత నలిగిపోయిందో తెలిసింది – ఎప్పుడో సెలవులకి బెజవాడ వచ్చినపుడు రెండు రోజులు జయ దగ్గరవుంది. అప్పుడు వేసవి రాత్రులే – ఆరుబయట వెన్నెల్లో మడత మంచాలు వేసుకుని – మల్లెల వాసనలో వరసనే పడుకునే వాళ్లం – అటువంటి ఒక శారద రాత్రి చందమామ వన్నె తగ్గే వేళ సన్నగా ఏడుపు వినపడితే లేచి చూశాను. రేణు – మంచం మధ్యలో కూర్చొని వెన్నెలని చూస్తూ కన్నీరు కారుస్తోంది – ఏ ఆలోచన లేకుండా.

"ఎందుకు రేణుకా – ఏమిటి..." అని అంటుండగానే నన్ను గట్టిగా పట్టుకుని ఉద్వేగంతో "నన్ను నలిపి వేయి, నన్ను ముద్దు పెట్టుకో, నన్ను గట్టిగా పట్టుకో..." అంటూ. ఆవేశంతో నన్ను ఊపిరాడనీయకుండా కౌగిలించుకుని, ముద్దులతో ముంచివేస్తుంటే ఆమె వెచ్చని ఊపిరి నన్ను రెచ్చగొడుతుంటే, ఆమె మెత్తని చనులు నన్ను వత్తిడిచేస్తుంటే మల్లెపూలు నలిగిన వాసన నాకు మత్తెక్కిస్తుంటే – రేణుని ఎంతగా హత్తుకున్నానో ఎంత మోహంతో ఆమె మొహాన్ని పెదవులతో తడిపానో – ఎంత కామంతో ఆమె నోటిని ఎంగిలి చేశానో – ఆ వివరాలు ఇప్పుడు ఎలా చెప్పను? ఆమెను పువ్వులా నలిపి పుప్పొడిలా వంటికి పూసుకున్నాను.

ఆ హఠాత్ సంఘటనకు నేను తర్వాత సిగ్గుపడి ఆమె కళ్ళల్లోకి చూడలేకపోయాను కాని, రేణు చాలా రిలీఫ్‌గా ఉదయం ఏదో బరువు తీరినట్లు నాతో – జయతో నవ్వుతూ మాట్లాడింది. ఆదివారం రాత్రి హాస్టల్‌కి వెళ్లిపోయింది. ఏదో మాటల సందర్భంలో జయ నాతో చెప్పింది – 'రేణు బావకు ఏదో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ వేసవిలోనే కుదరవచ్చు' అని, ఈ విషయంలో నిర్మలమ్మగారే చొరవ తీసుకుంటున్నారు, అని కూడా అంది! అప్పటికి నాకు కొంత అవగాహనకు వచ్చింది. రేణు మానసిక స్థితి – రాజీపడలేని వింత పరిస్థితి. అప్పుడే రేణుకి నేనొక ఉత్తరం రాశాను.

జీవితం ఎంతో విశాలమైనదని, ఒక వ్యక్తికి, ఒక వృత్తికి పరిమితం చేసుకోవలసిన అవసరం లేదని, ఆకాశంలో నల్లమబ్బుల్లాగా బ్రతుకులో విషాదం కూడా తాత్కాలికమేనని, విల్ పవర్‌తో దుఃఖాన్ని అధిగమించ వచ్చని.

ఇలాంటి పడికట్టు చెత్తంతా రాసి హాస్టల్‌కి పోస్టు చేశాను. ఆ విషయం అంతటితో మరిచిపోయాను కూడా.

తర్వాత ఎప్పుడో నా పేరుతో ఒక ఇన్‌లాండ్ కవర్ వచ్చింది.

"డియర్ ఫ్రెండ్, నీ ఓదార్పు ఉత్తరానికి థ్యాంక్స్. నీవు రాసిన విషయాలు నాకు తెలియనివి కావు. కాని నాకు తెలియని విషయం – మన బ్రతుకు మనం అనుకున్నట్లు ఎందుకు నడవదు అని. అలా నడవాలంటే ఏం చేయాలి? అసలు ఏదయినా మన ఇష్టమైనట్లు చెయ్యగలమా? ఈ మధ్య నాకు సరిగ్గా నిద్రపట్టడం లేదు – ఏవేవో కలలు వస్తున్నాయి – ఎండిపోయిన సముద్రంలో ఒంటరిగా నిలబడినట్లు – ఎగిరే రెక్కల గుర్రం మీద ఎవరో వచ్చి ఎత్తుకుపోయినట్లు – అలా జరిగితే ఎంత బాగుండును? ఇంకెపుడూ నాకు ఉత్తరం రాయకు. ఇది కూడా చింపెయ్యి..." రేణు!

ఆ ఉత్తరం వెంటనే చింపివేశాను కాని, అందులో విషయాలు చాలా కాలం నన్ను వెన్నాడుతూనే వున్నాయి. ఈ విషయం జయతో చెప్పేది కాదు – జీవితంలో రహస్యాలు ఎలా పోగవుతాయో చింపిన ఉత్తరం ముక్కలు చూస్తే అర్థమయ్యింది!

✤ ✤ ✤

మామయ్య – నాకు, జయకు పెళ్ళి ప్రసక్తి తెచ్చాడు కాని అత్తయ్యకు అసలు ఇష్టం లేదు. నా తరఫున మాట్లాడేవాళ్లు ఎవ్వరూ లేరు. ఎందుకైనా మంచిదని అత్తయ్య – జయను తీసుకుని వెళ్ళి హైద్రాబాదు కోఠీలోని ఉమెన్స్ కాలేజీలో చేర్పించి, హాస్టల్లో పెట్టి చాలా సంతోషంగా తిరిగి వచ్చింది. తన తీరని కోరిక ఈ రకంగా తీరినట్లు సంబరపడి పోయింది కూడా! ఆమె సంబరం మూణ్ణాల్ల ముచ్చటగానే అయ్యింది. ఇంటికి, బెజవాడకు అలవాటు పడిన జయ – ఆ కోఠీ ఉమెన్స్ కాలేజీ ఎత్తైన గోడలు జైలు గోడల్లా అన్పించి – హాస్టలు గది ఖైదు మాదిరి భయపడి – STD లో బాగా ఏడ్చేసరికి – అత్తయ్య "బాబ్బాబు, నువ్వెళ్లు, దాన్ని తీసుకు వచ్చెయ్యి" నా గడ్డం పట్టుకుంది.

ఆ కాలేజి చెర విడిపించి, ఆ రాత్రే గౌలిగూడ బస్టాండ్‌లో బెజవాడ బస్సెక్కిన తర్వాత – జయ ప్రశాంతంగా నా ఒడిలో పడి నిద్ర పోతుంటే – ఎవరికి ఏమి కావాలో ఎప్పుడు తెలుస్తుంది? ఎవరు నిర్ణయిస్తారు? ఎప్పుడూ నాకు బస్సులో నిద్రపట్టదు – చలి గాలులు తగులుతున్నాయి – పలుచని వెన్నెల పరుగులెత్తే పరిసరాల మీద సమానంగా పడుతోంది – ప్రకృతికి పక్షపాతం ఉండదు గదా!

✤ ✤ ✤

నిర్మలమ్మ ప్రయత్నాలు ఫలించి చివరికి శివరాంకి – రేణు బావ – పెళ్ళి కుదిరినట్లు గుంటూరులోనే పెళ్ళి జరగబోతున్నట్లు తెలిసింది. ఆ పెళ్ళికి మేమెవ్వరమూ వెళ్లలేదుకాని, రేణు బాగా సిక్కయిందని తెలిసి గుంటూరు ఆసుపత్రికి వెళ్లాం. మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోనే నాలుగు బెడ్‌ల స్పెషల్ రూంలో వుంది. డ్రిప్ పెట్టి హాస్పిటల్ మెటల్ మంచానికి అతుక్కుపోయి కళ్లలో ప్రాణం పెట్టుకుని వున్న రేణుని చూస్తే – చాలా జాలి వేసింది – మలేరియా – టైఫాయిడ్ అన్ని కలగలిసి ఆమెను చుట్టుముట్టినట్లు – మూడు వారాలు జ్వరం తగ్గక ఆహారం లేక అస్థిపంజరంలా అయిపోయింది. రెండు మూడుసార్లు ఆమెను చూడటానికి వెళ్లినపుడు ఒక సందర్భంలో – "నీ మనసు నీ బావకు తెలుసా" అని అడిగితే – ఒక నీరసపు నవ్వుతో "ఏమో" అన్నట్లు చూసింది. ఆమె మానసికంగా ఎంత కుంగిపోయిందో – ఈ రోగాల బారిన పడిన తీరే తెలుస్తోంది. అన్నిరకాల శిక్షల్ని ఆహ్వానిస్తున్నట్లు – ఆ రాత్రి నన్ను ఆహ్వానించినట్లుగా – దేనినీ వ్యతిరేకించే శక్తిలేనట్లు కన్పించింది. తర్వాత కొంత కోలుకుని –

వి(శాంతికోసం బెజవాడ రమ్మంటే – అమ్మకు దూరంగా వుండాలనేమో అమ్మమ్మ దగ్గరకు – వెళ్ళి కొన్నాళ్లు గడిపి – కాలేజి పోతుందని అమ్మగొడవ చేస్తే వచ్చి హాస్టల్లో జేరి మళ్లీ ఇష్టంలేని చదువు సాగించింది – ఇదంతా జరిగి అప్పుడే అయిదారు నెలలు గడిచిపొయ్యాయి. త్వరలోనే ఫైనల్ ఇయర్ పరీక్షలు జరుగుతాయి. నిర్మలమ్మగారు, కూతురు కోసం గుంటూరులోనే ఇల్లు తీసుకుని, దగ్గరుండి చదివిస్తోంది. ఫైనల్ పరీక్షలు కూడా అయిందనిపించింది. హౌస్ సర్జన్‌కి వెళ్లే ముందు రేణు మా యింటికి వచ్చింది. ఆమె చూపులు ఎక్కడా ఫోకస్ అవుతున్నట్లు లేవు. నడుస్తుంటే గాలిలో తేలుతున్నట్లు వుంది. జయతో “నీవు నీ బావను పెళ్లిచేసుకో. మీ అమ్మ కోరికలు నీవు తీర్చాల్సిన అవసరం లేదు...” అని హఠాత్తుగా అంది! తర్వాత హౌస్ సర్జన్ చేయటానికి గుంటూరు హాస్టల్‌కి వెళ్ళిపోయింది. వాళ్లమ్మ రేణుకు అమెరికా సంబంధాలు కుదిర్చే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తోందని తెలిసింది.

❖ ❖ ❖

రైలు ఒంగోలు స్టేషన్‌లో ఆగింది. మెల్లగా ప్లాట్‌ఫారమ్ మీదకు దిగాం. గుడ్డి దీపాలు వెలుగు లేకుండా దిగులుగా వున్నాయి. ఎక్కడా మంచినీళ్ల జాడ కూడా లేదు. అంతలోనే మేము దిగిన బండి చక్రాలీడ్చుకుంటూ వెళ్లిపోయింది. చివరి డబ్బా ఎర్రదీపం మినుకు మినుకుమంటూ మాయమైపోయింది. ఎక్కడా ఎవ్వరు కనపడని ఈ ప్లాట్‌ఫారమ్ అసలు వర్తమానంలోనిదేనా అని అనుమానం వచ్చింది. మెల్లగా స్టేషన్ మాస్టర్‌ను వెతుక్కుంటూ వెళ్లితే బైట బల్లమీద ఎవరో పడుకుని వున్నారు. ‘బాబూ, అల్లూరికి దారెటు’ అని అడిగితే ‘కొత్తపట్నం’? అని అదిగో – ఆ రైలు గేటు దగ్గర ఉండండి – ఒంగోలు నుంచి ఆ వూరెళ్లే బండి ఏదైనా రావచ్చు’ అని వరం ఇచ్చాడు. ‘తూరుపుగా, సముద్రం వేపు’ అని కలిపాడు. ప్లాట్‌ఫారమ్‌కి రైలు గేటు చాలా దూరం వున్నట్లుంది రాళ్లు రప్పలు చీకట్లో తడుముకుంటూ ఇద్దరి ఆడవాళ్లను తీసుకుని అక్కడికి చేరాను – ఆ రైలు గేటు ఎర్రదీపం ఒకటి నాకు ఈ చీకటిలో ఆశా దీపంలా కనపడింది. అక్కడి గేట్‌మన్ సిగ్నల్ ప్లాట్‌ఫారమ్‌మీద కూర్చొని కూనిపాట్లు పడుతున్నాడు – అడిగితే ఓ చెంబుతో నీళ్లిచ్చాడు. గొంతులు తడుపుకుని, ఎక్కడ కూర్చోవాలో తెలియక తిరుగుతున్నాము. కష్టాల్లో కూడా అదృష్టం ఉంటుందేమో. ఓ అరగంటలో మూడు

చక్రాల టెంపో ఒక కిరసనాయిల్ దీపం లాంటి హెడ్ లైటుతో కూసాలన్ని కదులుతూ రైలు పట్టాలు దాటి వచ్చింది. ఆ డ్రైవర్ని ఆపి అల్లూరులో దింపమన్నాం. ఎట్లాగో – ఇరుక్కుని అప్పటికి అందులో ఎందరున్నారో ఆ చీకటిలో చూడలేక పోయాను. ఎక్కిన తర్వాత – పొగాకు వాసన, తాళ్ల వాసన – ఉల్లిపాయల వాసన, మనుషుల వాసన అన్ని ఎక్కడో ఎండు చేపల కంపు కూడా వచ్చినట్లు గుర్తు. ఒక జీవితకాలం తర్వాత కొత్తపట్నం అనే పాత ఎండు మొండి గోడల వూళ్లో దింపి ఆ దుగుడుగు బండి ఎటో వెళ్లిపోయింది. చీకటిలో ఈ వూరు – కాలానికి, దూరానికి కూడా ప్రస్తుతంలో ఉన్నట్లు లేదు. తూరుపు నుంచి సముద్రపు హోరు దగ్గర్లో వినపడుతోంది. ఆ చిన్న వూళ్లో – రేణు వాళ్ల ఇల్లు తెలుసుకోవటానికి ఎక్కువ సమయం పట్టలేదు – అప్పటికి నాలుగు గంటలు దాటి వుంటుంది. ఆ ఇరుకు మట్టి దారిలో మొండి గోడల ఇంటి దగ్గరకు చేరాం. ఆ ఇంటి వరండాలో ప్రపంచంలోని విషాదమంతా విడిది చేసినట్లుంది!

✤ ✤ ✤

ఈతాకుల చాప మీద పడుకుని వుంది. తల దగ్గర నూనె దీపం దీనంగా నిలబడి వుంది. ఆ ప్రక్కనెక్కడో పొగచూరిన లాంతరు – రేణు ముఖం మీద కాస్త వెలుగు పడుతోంది – దుఃఖం నిద్రపోతున్నట్లు, విషాదం రూపుకట్టినట్లు, చావుదుప్పటి కప్పుకున్నట్లు – నిర్జీవంగా వున్న రేణుని చూస్తుంటే నాకు ఏడుపు ఆగలేదు. జయ కుళ్లి కుళ్లి ఏడుస్తోంది. ధైర్యం చేసి నేను రేణు నుదుటి మీద చెయ్యివేశాను. ఇంత పిచ్చిపని ఎందుకు చేశానో? మంచుగడ్డలా ఆమె నుదురుతగిలితే నేను ఉలిక్కిపడి చెయ్యి వెనక్కి – తీసుకున్నాను – అందరూ ఒక్కసారిగా బావురుమన్నారు – మళ్లీ. నిశ్శబ్దంగా తన వాజ్మూలాన్ని వినిపించి, రేణు వాళ్లమ్మకు యావజ్జీవ శిక్ష విధించింది. తన కూతురు వేసిన లైఫ్ సెంటెన్సు తప్పించుకోలేక నిర్మలమ్మ ఎప్పుడో స్పృహ తప్పి పడిపోయింది. ఈ శిక్ష – ఇంత కఠోరంగా వుంటుందని, తెలియని నాకు అక్కడి సమయం అంతా గతంలాగానే తోచింది. కాస్సేపటికి అన్ని సిద్ధం చేశారు. పావుగంటలో పాడె మీద పడుకో బెట్టారు. ఒక ప్రక్క నేను కూడా లేపి భుజం కాయబోతే అత్తయ్య వారించింది – ఇంకా వెలుగురాని తూరుపు దక్షిణాలకు రేణు వెళ్లిపోతుంటే – దగ్గర్లోని సముద్రం బావురుమంటోంది. ఆమె తెల్లకోటు, స్టెతస్కోపు వరండాలో గోడకు వేలాడుతున్నాయి.

✣



మహాబలి



మద్రాసు పొలిమేరల్లో మూడెకరాలు కౌలుకు తీసుకున్నాను. బంతిపూలు, కాగడామల్లి, కనకాంబరం మొక్కలు పెట్టి పూలు పూయించాను. పొగమంచులో పూలు కోసి, ఆ దగ్గరలో వున్న పూలమ్మే బజారు కెళ్లి అరవల మధ్యలో, ఆరని బురదలో ముడుచుకుని కూర్చుని, బుట్టెడు పూలు అమ్ముతుంటాను. ఆ రోజు పూలమ్మితే రెండు వందలు వచ్చాయి. బుట్టలో కొన్ని బంతిపూలు, కాగడామల్లి వుంచాను – ఇవాళ ప్రయాణం వుంది.

ఇల్లు చేరి, బురదకాళ్లు కడుక్కుని, వందరూపాయలు ఇల్లాలికిచ్చి – పిల్లల్ని బడికి తీసుకెళ్లాను. ఇంటికి వచ్చి ఇంత తిని, కునుకు తీద్దామంటే – కనురెప్ప అంటనే లేదు. ఇవాళ ప్రయాణం వుంది. సాయంత్రం పిల్లల్ని తీసుకువచ్చి– 'నేను ఏలూరు వెళ్తున్నాను జాగ్రత్త...' అంటే – ఏనాడూ ఏమిటి అని అడగని ఇల్లాలు – 'జాగ్రత్తగా వెళ్ళి రండి' అని మాత్రం అంది. ఇవాళ ప్రయాణం కదా – సంచిలో పూలు, ఒక చొక్కాతో లోకల్ ట్రయిన్‌లో సెంట్రల్ చేరి, మెయిలు జనరల్ బోగీలో ఎక్కి – ఎలాగో పైన చెక్క బల్ల మీద పడుకో గలిగాను– మెయిలు బయలు దేరింది. ఎంత సేపయినా నిద్రపట్టలేదు– చేతి సంచిలో పూలు సువాసన వస్తున్నాయి...

✤ ✤ ✤

వేంగి తీరం నుంచి – తూర్పు చాళుక్యులు దండులు నడిపిన ఊరు.

ఊరి పొలిమేరలు పొగమంచులో తడిసిన వేళ...

తాత–తాత పెళ్ళి ఇంకా కోతలంత దూరం ఉన్న వేళ....

కొత్తింటికోసం బ్రాహ్మీ ముహూర్తంలో పునాదులు తవ్వే వేళ...

గడ్డపలుగులు నేల తల్లి గుండెల్లో దిగుతున్న వేళ...

గుడ్డి కాగడాలు నూనె గబ్బు కొడుతూ– కొడిగడుతున్న వేళ...

వెన్నెల వెలిసి – చుక్కలు బిక్కు బిక్కు మంటున్న వేళ...

ఆ పవిత్రమైన రాత్రి ఘల్లు ఘల్లున మ్రోగిన వేళ...

భూమి పగుళ్ల నుంచి సీతమ్మ – లక్ష్మి రూపంలో వచ్చిన వేళ...

అపుడు పునాదులు తవ్వుతున్న వీరయ్య, తాత తాతకు

నేల పొరల్లో దాగివున్న బంగరు బిందెల్ని అందించిన వేళ...

ఆశతో ఆశ్చర్యంతో అజ్ఞానంతో తాత తాతలు వణికిపోయిన వేళ...

కర్మ కాండలు జరిపి, ఎర్ర నీళ్లతో, పసుపు పొడితో శుద్ధి చేసి

వీరయ్య నెత్తిన పెట్టి ఇంటికి తెచ్చిన వేళ...

పరుసం – మాయ మర్మాలతో ఇంటిలో అడుగు పెట్టిన వేళ...

ఆ తొలి వెలుగు రేకలు ఇంకా చీకటిలో కళ్లు మూసుకున్న వేళ...

ఎక్కడో పొలిమేరలో నక్కలు ఊళలు వేసిన వేళ...

వీరయ్య కేం తెలుసు మాటున దాగివున్న ప్రమాదం?!

✣ ✣ ✣

తాతలు ముగ్గురు, ముందు తరాల వారు

రాజభక్తితో నెత్తురు చిందించి యుద్ధాలు చేసిన వారు...

వీళ్ల తరానికి వందల ఎకరాలు వారసత్వంగా ఇచ్చిన వారు...

దున్నలతో, ఎడ్లతో నేలదున్నిన వారు...

ఎకరాలు దున్నించి రాగులు, జొన్నలు విత్తులు చల్లిన వారు...

దండులూరినంతా పోషించిన వారు...

అన్ని వృత్తులవారు వీళ్ల పెద్దరికాన్ని నెత్తిన పెట్టుకున్నవారు...

దొడ్లనిండా గొడ్ల పాడితో సిరిగల వారు...

మాట శాసనంగా సాగుతున్న వారు...

మంచివారు – ప్రమాదం పొంచి వున్న వారు...

✤ ✤ ✤

పసిడి బిందెల్తో లోగిల్లోకి వచ్చినపుడు...

ఆనందం ఆశ్చర్యంతో పాటు అజ్ఞానపు భయం కమ్మినపుడు...

ముందు తరాల మూర్ఖత్వాన్ని ఆచారంగా అంగీకరించినపుడు...

వీరయ్యను మహాబలి కోరినపుడు...

ఎదురు చెప్పలేని జీవి, ప్రాణాలు పణంగా పెట్టినపుడు...

ఆ గుమ్మం అడ్డ కమ్మె మీద మెడనుంచి తలవేరయి,

నెత్తురు ఏరయి, కనక దోషాన్ని కడిగి వేసినపుడు...

అపుడే– అంతకు మునుపే– 'అయ్యా– మీ వంశంలో పెద్దాడి పెళ్లికి నాకు బోనం పెట్టించండి...'

అని మాత్రమే అడిగిన ధీరుడు నేల ఒరిగినపుడు...

'పెద్ద'మనసుతో వీరయ్య కుటుంబానికి,

పెద్దలు ఊరి పొలిమేరలకు పొలిమేరలో పదెకరాలు పెట్టినపుడు...

సూరీడు మామూలుగానే ఉదయించాడు.

ఊరు మామూలుగానే ఒళ్ళు విరుచుకుంది.

నాగళ్లన్నీ పొలాలు దున్నటానికి వెళ్లాయి.

కాకులు మెతుకుల కోసం వాలుతున్నాయి.


గూడెం స్మశానంలో శవం కాలుతోంది...

ఇంటి ఆడపడుచులు గుమ్మానికి ఎండిన నెత్తుటిమరకలు,

కుంకుడు నీళ్లతో కడిగి పసుపు పూసి కుంకుమ బొట్లు పెట్టినపుడు...

తొలి కిరణాలలో వీరయ్య నెత్తురులాగానే మెరిసింది!!

విశ్వరూపాచారి బంగారం కరిగించాడు. అరవంకీలయింది. జడకుప్పెలయింది, వడ్డాణాలయింది, కాసుల పేరయింది, చంద్రహారాలయింది, చెవి దుద్దులయింది. చీకటి–చీకటి మధ్య వెలుగులా వున్న పాపటిశేరయి మా ఆడవాళ్ల తలల మీద మెరిసింది!!



❖ ❖ ❖

కాలం కదిలిపోతోంది– చెట్లు ఆకులు రాలుస్తున్నాయి – పూలు పూస్తున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. వరదలు వస్తున్నాయి. తరాలు – తరలి పోతున్నాయి. కాలంలో కలిసి పోతున్నాయి.

అన్ని తరాల్లో పెద్దాడి పెళ్లిరోజున వీరయ్యకు బోనం పెట్టి – కొత్త కోడల్ని తీసుకు వచ్చి గుమ్మం దగ్గర – 'వీరయ్యా – బోనం పెట్టాను – కాస్త తప్పుకో...' అని అర్థిస్తూనే వున్నాడు. అలా అడుగుతూనే వున్నారు...

❖ ❖ ❖

ఇన్నేళ్లకు నా వంతు వచ్చింది. నాన్నకు పెద్ద కొడుకును నేనే కదా.

ఇన్నేళ్లలో ఎకరాల పొలిమేరలు తరిగి పోయాయి...

ఇన్నేళ్లలో బంగారం మెలమెల్లగా కరిగి పోయింది...

తాతల తాతలు – తండ్రులు తల్లులు – మామ్మలు – అమ్మలు – మట్టిలో కలిసి పోయారు...

ఇపుడు మేకలు, మెడలో ఆకులు తింటూ బలిపీఠానికి వెళ్తున్నాయి–

పాపం వాటికేం తెలుసు మెడతెగి తలవేరయి నేల పాలవుతుందని–

నేల తల్లీ నీ రక్తదాహం ఎప్పటికి తీరేనమ్మా–?

✤ ✤ ✤

నాకు పెళ్లయింది:–

పచ్చి తాటాకు పందిట్లో – బంతిపూలు, మల్లెపూల మంటపంలో...

మొగలి పొత్తుల జడలు, బిళ్లల్తో – ఊగే జడకుచ్చుల కులుకులతో... అరవంకీలు అరకొరగా ఉన్నాయి.

వడ్డాణాలు సన్నబడి పోయాయి. పట్టు చీరలు అంచులూ చిక్కి పోయాయి.

అయినా నా పెళ్లి జరిగిపోయింది– ఫెళఫెళమంటూ...

సన్నాయి మోగింది – డోలు డొక్కలు కొట్టు కుంది. కనపడని అరుంధతిని చూసి...

ఆనవాయితీగా, గుమ్మం దగ్గర ఆగి – 'వీరయ్యా బోనం తెచ్చాను – ఇదిగో తట్టనిండా పిండివంటలు అన్నం– కూరలు– నేను, నా భార్య వచ్చాం, కాస్త తప్పుకోవయ్యా...' అన్నాను.

నా గుండెల్లో వీరయ్య నెత్తురు మరిగింది. కన్నుల్లో ఆ కుటుంబం దుఃఖం నిండి పోయింది. కొత్తకోడలు బిత్తరపోయింది. ఎదురుగా వీరయ్య నిలబడి, 'నీకిది నాయంగా ఉందయ్యా?' అని అడిగాడు.

✤ ✤ ✤

అవును, ఇది న్యాయం కాదు. ఈ నెత్తుటి కూడు నేను తినలేను. ముద్ద ముద్దకీ పిండం పెట్టలేను. నా కొత్త పెళ్లికూతురి కాళ్లకి నెత్తుటి పారాణి రాయలేను. నా సంతానం ఈ నెత్తుటి చారల్లో ఆడుకో కూడదు...

ఇప్పటి వరకూ జరిగిన ఘోరం చాలు. ఇక్కడితో ఈ మహాబలిని సమాధి చెయ్యాలి... అంతే – వీరయ్య సమాధి కట్టించి, అమ్మను, నాన్నను, పొలాన్ని, ఊరుని, తమ్ముళ్లని, చెల్లెళ్ళను వదిలి, నా భార్యతో వెళ్లిపోయాను.

నా భార్య మహాయిల్లాలు. ఏనాడూ ఏమీ అడగలేదు. ఆ తర్వాత నా సంతానం– చల్లని తల్లి పెంపకంలో– వాళ్లూ అడగలేదు – 'నాన్న – పొలం ఏమయింది, బంగారం ఏమయింది' అని.

ఆ నేలను, ఆ పొలాన్ని, ఆ గుమ్మాన్ని వదిలాను కాని, తరతరాల అపరాధం నా వెంటనే ఉంది...

✤ ✤ ✤

మద్రాసు మెయిలు ఏలూరులో ఆగింది. తెల్లారింది. మెల్లగా దిగి అక్కడే కాలకృత్యాలు తీర్చుకున్నాను– సంచిలో వున్న చొక్కా మార్చు కున్నాను– అక్కడ నుంచి చాలా చాలా దూరాన వున్న వీరయ్య సమాధి దగ్గరకు వెళ్లి – నేను పూయించిన పూలను సమాధిపైన వుంచాను. మట్టి తడిగా వుంది. ఈ పూల విత్తులో ఏదో ఒకటి మొలకెత్తక పోతుందా? అని చిన్ని ఆశ!

✤ ✤ ✤

పది గంటలకు భీమడోలు – ద్వారకా తిరుమల దారిలో వున్న రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్లాను. నాన్న, బాబాయి నా కోసమే చూస్తున్నారు. నాన్న, "పొలం అమ్మాను– వచ్చి సంతకం పెట్టి వెళ్లు" అని ట్రంక్ కాల్ చేస్తే వచ్చాను– అక్కడ సంతకాల పని పూర్తి చేసి – నాన్నతో "నేను బయలు దేరతాను – బండి వుంది" అన్నపుడు ఆయన అవాక్కయి – "నీ వాటా సొమ్ము తీసుకుపోవా?" అన్నాడు. నేను బాబాయితో బైటకు వచ్చి – "వద్దు బాబాయి – నాన్నతో చెప్పు" అన్నపుడు – అదేమిటిరా దారి ఖర్చుకయినా...? 'ఉన్నాయిలే' అని అక్కడ నుంచి బయలు దేరాను– ఇంతవరకూ ఈ కథ ఎవరికీ చెప్పలేదు. ఇప్పుడు మీకు చెప్తున్నది నా గుండె బరువు తగ్గించు కోవటానికే...



దొమ్మేరు



అది దొరల కాలం. తెల్ల దొరల పాలన. రవి అస్తమించని సామ్రాజ్యంలో దేశాల సరిహద్దులు చెరిగిపోయిన సందర్భం. సరిహద్దు దేశాలు భయపడి, యుద్ధానికి కాలుదువ్వే సందర్భం. ఆంగ్లేయులు తుపాకీ గొట్టంతో, ఫిరంగి గుళ్ళతో అధికారంలో బ్రిటీషు రాణీని సింహాసనం మీద చరిత్రలో నిలిపిన వేళ. మొదటి ప్రపంచ యుద్ధమని పిలిచే దురదృష్టపు కాలం. భూగోళాన్ని అగ్నిగోళంగా మార్చిన, అమాయకులను మాడ్చిన కాలం. అప్పుడు భారతదేశంలో ఇప్పటి సరిహద్దులు లేవు. రంగూన్ కూడా దొరల ఏలికలోనే ఉన్న కాలం. వ్యాపారం చేసే వాళ్ళకు అవకాశాలు దండిగా వున్న కాలం. తెల్లదొరల కనుసన్నల్లో ఉండే కాంట్రాక్టర్లకు కనకవర్షం కురుస్తున్న వేళ. అటువంటి కొందరికి బంగారు కాలంలో రంగూన్ రేవు చుట్టుపక్కల వెంకట్రాయుడు తండ్రి తెల్ల దొరలకు ప్రధాన కాంట్రాక్టరుగా కలప దగ్గర నుంచి కలగూర గంపలన్నీ నౌకల్లో రవాణా చేస్తూ, అటు రంగూన్‌లో, ఇటు దొమ్మేరులో సంపదలో, జోడు గుర్రాల సార్టులో తుల తూగుతుండే వారు. రంగూన్‌లోనూ, దొమ్మేరులోనూ ఏనుగు కాళ్ళ మేడలు కట్టి, రంగూన్‌లో వేల రూపాయల వ్యాపారం, దొమ్మేరులో వేల ఎకరాల వ్యవసాయం చేస్తుండేవారు.

ఒక రాత్రి, రంగూన్‌లో ప్రభుత్వం పరాధీనమైన రాత్రి, రంగూన్‌లో రూపాయలు చెల్లకుండా పోయిన రాత్రి, అంతకాలం కూడబెట్టిన కరెన్సీ చిత్తుకాగితంగా కూడా చెల్లని రాత్రి, ఆ కాళ రాత్రి, గుండెలాగి ఎందరో

చనిపోయారు. తిండి కూడా దొరకదనే భయంతో కట్టుబట్టలతో కట్టిన మేడలు వదిలి, పెట్టిన వ్యాపారాలు వదిలి దొరికిన పడవల్లో రంగూన్ వదిలి చెల్లాచెదురయ్యారు. కాకినాడ మీదుగా దొమ్మేరు చేరి వెంకట్రాయుడు ప్రాణాలు నిలుపుకున్నారు.

✤ ✤ ✤

అవి వెంకట్రాయుడు దొమ్మేరులో, ఏనుగు కాళ్ళ మేడలో కాపురం ఉంటున్న రోజులు. ఎప్పుడూ మేడ చుట్టపక్కాలతో కళకళలాడే రోజులు. చుట్టూ వందల ఎకరాల వ్యవసాయంతో ఆయన కనుసన్నలతో పంటలు పండే రోజులు.

తెల్ల దొరల పాలన కోనసీమలో కొనసాగుతున్న రోజులు. పాలకుల ప్రాపకంలో రెడ్డి, జమీందారులా జమీ నడిపే రోజులు. పని వాళ్లందరికి దొడ్లోనే వండించి వడ్డించే రోజులు. ఎందరికో ఎన్నో రకాల సాయం చేస్తూ 'మారాజు' అని అనిపించుకున్న రోజులు. జోడు గుర్రాల సార్టులో చుట్టుపక్కల పట్టణాలకు, చుట్టపక్కాల ఇళ్లకు రాకపోకలు సాగించే రోజులు.

కాండ్రేగుల వారి ఆడపడుచును వైభవంగా వివాహం చేసుకుని ఆరుగురు బావమరుదులతో ఊరేగింపుగా తెచ్చుకున్న రోజులు. ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు, కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లతో ఏనుగు కాళ్ళ మేడ లోగిలి కళకళలాడే రోజులు.

✤ ✤ ✤

రోజులు దొర్లిపోయాయి. ఎకరాలు పంపకాలతో తరిగిపోతాయి.

కొన్ని వ్యసనాలు మనిషికి అసహనం నేర్పుతాయి.

జోడు గుర్రాల సార్టులు నట్లు, బోల్టులు వదులవుతుంటాయి. గుర్రపు స్వారీతో, జవసత్వాలతో నవనవలాడే శరీరాలు కాలపు గుర్తులు పడి, సత్తువ తగ్గి మెత్త బడిపోతుంటాయి.

వెంకట్రాయుడి పెద్ద మనసు, పెద్ద మనిషి హోదా తగ్గక పోయినా ఉమ్మడి కుటుంబంలో, వచ్చే మార్పులు అంగీకరించలేని అహంకారం అలాగే వుంటుంది. ఏ రోజూ, చుట్టూ పది, పదిహేను మంది లేకుండా చేయి కడిగేవాడు కాదు.

వెండి కంచాలు, విస్తరాకులు పండగ వంటకాలతో నిండుగా ఉండాల్సిందే. ఇంట్లో వెన్నగాచిన నెయ్యితో చేతులు ఘుమఘుమలాడాల్సిందే.

✤ ✤ ✤

ఏనుగు కాళ్ళ మేడ వరండాలో వెంకట్రాయుడు కొలువు తీరితే అటుగా వెళ్లే ఎవరయినా చెప్పులు చేతిలో పట్టుకుని వంగి ఒదిగి వెళ్ళాల్సిందే. ఇది అలవాటు, ఆనవాయితీ ఆ ఊళ్లో. వెంకట్రాయుడు ఆదేశించి చేయించుకునే గౌరవ వందనం కాదు. మంచితనంతో, తరగని ధనంతో, హుందాతనంతో, దానగుణంతో గడించిన గౌరవం. ఎంత మంచి మనిషికైనా అసూయాపరులు ఎక్కడో ఉండనే ఉంటారు. అయితే రాయుడు దొడ్డతనంతో, దొడ్డినిండా గాదుల ధాన్యంతో, మేడ గాడిపొయ్యిల మంటల్లో, కాచి వడపోసిన నేతి ఘుమ ఘుమల్లో, పెట్రోమాక్స్ లైట్ల మిరుమిట్లలో అలాంటి అసూయా దృష్టులు మాడి పోతుండేవి.

ఎంతటి ధనవంతునికైనా, ఎంతటి గుణవంతునికైనా ఆరోగ్యం చెడకుండా, రోగాలు మూగ కుండా వుండవు కదా! అయినా ఇంటి ఆనవాయితీలు మారవు కదా. వెంకట్రాయుడితో ఎంతమంది భోజనానికి కూర్చున్నా ఇల్లాలే వడ్డించాలి. అది పెళ్లయిన మొదటి రోజునుండి అమలవుతున్న శాసనం.

అప్పుడే అరవైయేళ్ళు వచ్చాయో లేక వెనక్కి వెళ్ళాయో. వారానికి ఒకసారి జోడు గుర్రాల సార్టులో, అమలాపురం మందులకోసం, క్లబ్బులో కాలక్షేపం కోసం వెళ్లి వస్తూనే వుంటారు. ఇన్నేళ్ళలో బావమరదులు ఎప్పుడూ ఆయన ముందు కూర్చోనేలేదు. బావ సహాయమూ తీసుకోలేదు. అక్క పెద్దింటి కోడలైనందుకు, పెద్ద సంసారంలో పెద్దరికం వెలగ బెడుతున్నందుకు సంతోషించే వారు. అంత పెద్ద రాయుడు అక్కను ఎప్పుడైనా అవమానిస్తే వాళ్లదాకా వచ్చేది చూచాయగా. సంసారంలో ఇవన్నీ మామూలే అని ఊరుకునే వారు కానీ, బావ ముందు తల ఎత్తి అడిగే సత్తా ఉన్నా అడిగేవారు కాదు.

✤ ✤ ✤

మనిషికి జరామరణాలు తప్పవని తెలిసినా, అంగీకరించలేని సత్యాలని అవగాహన ఉన్నా, వాటినుంచి మానసికంగా దూరంగా వుండాలనే తపన ఉంటుంది. తప్పించు కోలేనివి తరుముకు వస్తుంటే తన నిస్సహాయతను సాటివాళ్ళ

మీద అసహనంగా వ్యక్తం చేస్తుంటుంది. ఇందుకు వెంకట్రాయుడు మినహాయింపు కాదు. మధుమేహం దేహాన్ని దహిస్తుంటే, మరణభయం మనసుని ఆవహిస్తుంది. అయినా దైనందిన కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరిగిపోతుంటాయి. తన ఆరోగ్యంతో పాటు సహనం కూడ తగ్గిపోవటం తెలియక పోదా? అయినా అహం అణిగి ఉండదు కదా!

ఆ రోజు కూడా – అవును ఆ దురదృష్టపు రోజు కూడా పదిమందితో పాటు భోజనానికి కూర్చున్నాడు. ఆ దురదృష్టపు రోజు కూడా ఏనుగుకాళ్ళ మేడలో గాడిపొయ్యిలు యాభై మందికి పైగా వంటకాలు చేశాయి. ఆ దురదృష్టపు రోజు కూడా ఆ పదిమందికి ఆ యిల్లాలే వడ్డన మొదలు పెట్టింది. గారెలు, కూరలు ఆవిర్లు వస్తున్న అన్నంతో పాటు నెయ్యి కూడా వడ్డించింది.

రాయుడికి నేతి వాసనలో ఏదో తేడా ఉందనిపించింది. రోజూ ఉండే ఘుమ ఘుమ లేదే అనిపించింది. 'ఎక్కడిదే యీ నెయ్యి' అని యిల్లాలిని గర్జించాడు.

'వెన్న తక్కువ ఉంటే పైనుంచి తెప్పించాను...' ఇంకా పూర్తి కాలేదు. అంత మనిషీ లేచీ 'బయటి నేతితో భోజనం పెడతావా–?' అని ఆమెను డొక్కలో తన్నాడు, ఆ దురదృష్టపు రోజునే.

ఆ దురదృష్టపు సంఘటన తర్వాత వాళ్ల భోజనం ఎలా అయిందో, ఆమె అవమానం ఎలా దిగమింగిందో, వెంకట్రాయుడు ఎలా చేయి కడిగాడో, ఆయనతో కూర్చున్న పదిమంది ఎలా వెళ్లిపోయారో తెలియదు. భయంకరమైన నిశ్శబ్దం, తరువాత కలకలం. ఆ దురదృష్టపు రోజు మామూలు గానే పొద్దు దిగిపోయింది.

✤ ✤ ✤

అప్పటి నుంచి నెలరోజుల్లోనే ఆ యిల్లాలి తనువు – వెంకట్రాయుడు తన్నిన తనువు చాలించి చితి మీద చేరింది. ఆమె మామూలుగా అనారోగ్యం లేకపోయినా, అంత హఠాత్తుగా పోవటానికి కారణం అవమాన భారమే అని అమ్మలక్కల గుసగుసల్లో నిజం దాగి వుంది.

ఇవన్నీ బావమరుదులకు చేరే ఉంటాయి. అవును అక్కను ఓదార్చలేని అసహాయత. బావకు బుద్ధి చెప్పలేని దుగ్ధ, లోలోపల రగిలిపోతూ రోజులు గడపటంలో ఉండిపోయారు.

భార్య పోయిన ఆరు నెలల్లోనే వెంకట్రాయుడు మంచాన పడి ఇక లేవలేదు. పశ్చాత్తాపమో, ప్రాయశ్చిత్తమో- చివరి రోజుల్లో చీకట్లోనే ఉండిపోయాడు.

చివరికి ఆయన ఊపిరి ఊరి గాలిలో కలిసిపోయింది. ఏనుగు కాళ్ళ మేడ నిశ్శబ్దంగా నిలబడి చూస్తోంది.

కొడుకులు, కోడళ్ళు, చుట్టుపక్కాల శోకాలతో హోరెత్తి పోయింది. గాడి పొయ్యిలు రాజుకుంటున్నాయి. బావమరుదులు తప్ప ఊళ్ళన్నీ కదిలి వచ్చాయి.

ఎంతటి ధనవంతుడైనా చివరకు చితి మీదకు రావలసిందే కదా! కొబ్బరి తోటలో ఎండు కట్టెలతో చితి పేర్చారు. గుర్రపు సార్టులో ఊరేగింపుగా తీసుకువచ్చి, కొడుకులు, ఆయనతో చేయి కడిగిన సావాసగాళ్లు వెంకట్రాయుడి దేహాన్ని చితి మీదకు చేర్చారు. తోటంతా ఊళ్ల జనంతో నిండిపోయింది. అంత్యక్రియల తంతు నడుస్తూనే ఉంది.

తొందరగా అంటుకోవడానికి చితి మీద నెయ్యి పోశారు. వెంకట్రాయుడుకి యిష్టమైన నేతి వాసన కమ్ముకుంది. శవం ఇంద్రియాలు పనిచేస్తాయా?

పెద్ద కొడుకు మూడుసార్లు చితికి ప్రదక్షిణ చేస్తుండగా కలకలం చెలరేగింది. ఆరుగురు బావమరుదుల హాహా కారాలు చేస్తూ గునపాలు, గడ్డపలుగులతో భయంకరంగా వచ్చారు. వారి ఆవేశానికి అంతమంది జనం బెదిరిపోయారు. ఏమి జరుగుతుందో తెలిసే లోపే వెంకటరాయుణ్ణి చితి మీద నుంచి కిందకి లాగి బావమరుదులు గునపాలతో పొడిచారు. గడ్డపలుగులూ దింపారు. భయంకరంగా అరుస్తూ మళ్లీ మళ్లీ హత్య చేశారు.

అక్క అవమాన భారాన్ని, ఇన్నేళ్ల తమ అసహాయతను- వెంకట్రాయుడు దేహానికి చేసిన గునపాల తూట్లతో దింపుకుని వాళ్ళు వెళ్లిపోయారు.

సిగ్గులేని సూరీడు చూస్తూనే ఉన్నాడు.







మరో మజిలీ



'ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలి....'

(ఈ బి.ఎస్.ఎన్.ఎల్ ట్యూన్ కోసం * ఇంకా 9 డయల్ చేయండి)

"చెప్పండి..."

"పలుకే బంగారమాయెనే?"

"అవును బంగారం ధర పెరిగి పోయిందికదా... హాఁ హాఁ"

"మాట్లాడవచ్చా ?"

"అయిదు నిమిషాల్లో ఫోన్ చేస్తా..."

పావు గంట తరువాత సెల్ సంగీతం వినిపించింది –

"ఎందుకని ఫోన్ చేయటం లేదు ? పని వొత్తిడా ?"

"అది కూడా ఒక కారణమే – చుట్టూ రోగులు – డెంగ్యూ దోమలు, బైట వూళ్లకు కారు డ్రైవ్ చేసుకుంటూ– విజిట్స్..."

"ఇవేనా కారణాలు ?"

"కాదులే ఒక విషయం చెప్పాలి, ఒకవేళ తెలియకుండా నిన్ను ప్రలోభపెట్టానేమో? అంతేకాదు,

నీ వుత్తరాలు, కవితలు - నన్ను డిస్టర్బ్ చేస్తున్నాయి - ఒకవేళ నేనే ప్రలోభపడతానేమో?

ఎందుకూ ఈ గందరగోళ పరిస్థితి - అదే పరిస్థితులను ఎదిరించలేని పిరికితనమేమో ?"

"అయితే ఇప్పుడు నేనేమి చెయ్యాలి ?"

" .... "

"ఇన్నేళ్ల స్నేహానికి ఏమీ అర్థం లేదా ? అయినా సముద్రపుగాలికి అర్థం ఏమి వుంటుంది?

అదే హాయిగా వుంటుంది - కాస్త ఉప్పగా కూడా!"

"అదే నీ మాటల్తో నన్ను మాయ చేస్తావు- నీ కవితలతో కన్నీళ్ళు తెప్పిస్తావు.

నీ వుత్తరాలతో వొత్తిడి తెస్తావు... అందుకే ఇదంతా వద్దనుకుంటున్నాను-"

"ఇదంతా కావాలనే చేశానా ? నువ్వు కావాలంటే చేశానా ?"

"కోరికలు విడిగా వుండవు - కనురెప్పల వెనక దాగి వుంటాయి,

మాటల్లో మూగగా వుంటాయి, నవ్వులలో మోగుతుంటాయి...

- ఇవన్నీ మనసులోకి వచ్చి కూర్చుంటాయి..."

"కోరిక లేమిటి ? చల్లని గాలి కోరికా? చక్కని సంగీతం కోరికా ? అందమైన కల కోరికా?

వుత్తరాలలోని అక్షరాలు కోరికలా ? ఎప్పుడైనా ఏమయినా అడిగానా ?"

"ఏమీ అడగవు - కాని ఇవ్వాలనే అన్పిస్తుంది-"

'ఇదికూడా నా దోషమా ? - ఇంత దూరంలో వుండి నీకు హాని చేస్తానా?

నీ దగ్గరకు కూడా రాలేదు కదా? కనీసం ఒక రోగిలాగా కూడా..."

"అదే బాధ - నీవు రావని, ఒకవేళ వస్తావని... ఎదురు చూడక, వేచివుంటూ

- వస్తే బాగుండును, వచ్చిన తర్వాత బాగోదేమోనని- ఇన్ని సందేహాలు -

అందుకే, కలవని, లేని ఈ బంధాన్ని ఎలా తెంపాలో తెలియక బాధపడుతున్నా–

నువ్వే దయ చూపు – నిన్ను నువ్వు చంపుకో – నా జ్ఞాపకాల నుంచి చెరిగిపో... 'చలో ఇక్‌బార్ ఫిర్‌సే : అజ్‌నబీ బన్‌జాయె హమ్‌దోనో'..."

"ఇది ఎంత అన్యాయం – ఒకవేళ ఫోన్ చేయకపోయినా – లేఖ రాయకపోయినా నీవు హాయిగా వుంటావా? పూర్తిగా మర్చిపోతావా ? అలా అని గ్యారంటీ ఇస్తావా ? ఒక పని చెయ్యి –అక్షరాలన్నీ తగలబెట్టు – ఆ మంటలు ఆరిపోయేవరకు చూస్తూవుండు – అక్కడ నల్లబూడిదేమీ మిగలదు– గాలికి ఎగిరిపోతుంది – అంతటితో జ్ఞాపకం చెరిగిపోయిందనుకో...

నన్ను మర్చిపోయాను అని ఒకసారి ఫోన్ చేసి చెప్పు – ఇక అల్విదా అనుకోవచ్చు!"

"ఇదంతా జరిగేది కాదు – వద్దు – ఒకవేళ తెలియక నిన్ను నిజంగా ప్రలోభ పెడితే క్షమించు – ఇది బాధో, భయమో, ఇవన్నీ మరిచిపోవటానికే ఇష్టపడతాను – ప్రత్యేకంగా సెలవు చెప్పనుగాని ఎప్పుడైనా, ఎక్కడైనా కలిస్తే, గుర్తుపడితే, పలకరిస్తాను..."

"అయితే చివరి వుత్తరం రాస్తాను. అది నిన్ను చేరుతుంది. అది నిన్ను చేరిందని, నువ్వు చదివావని చెప్పవు – అలాగే కానీ –

ఇది నా కలవాటే..."

అనామికకో ప్రేమలేఖ :

నీ పేరేమయితే నేమి? అంతకుముందు ఎంతమందో ధరించిన నామవాచకమే–

లేదా అందులో ఏదో ఒకటి! ఈ గుండెను ముక్కలు చెయ్యటానికి...

ముందుగా ఓ ముద్దరాలు గుండుసూదినే గుచ్చింది –

అప్పుడు ఓ నెత్తుటి చుక్క ఎర్రగా కన్నీటి చుక్కతో కలిసి రాలింది...

తర్వాత ఓ నడిమి గునపాలే దింపింది.

నన్ను మైనపు ముద్దను చేసి ముద్దు చేసిందో మొద్దుగా జూసిందో ఆ ఎడోనిస్ కే ఎరుక!

అప్పుడూ ముక్కలయింది.

ఆ తర్వాత ఓ రాణి ఈ మైదానాన్ని చాలాకాలం పాలించి, నన్ను

సంపన్నుని జేసి తాను రాణిగానే రాణించి నిష్క్రమించింది –

అప్పుడూ నెత్తుటితో తడిసి ముద్దయింది ఈ నిరుపేద గుడిసె.

తర్వాత్తర్వాత ఎంతమంది ఈ పూలసెజ్జను తమ తామరపూల పాదాలతో తొక్కుకుంటూ ఆనందించారో –

నాకానందాన్ని అందించారో – ఈ లెక్క తేలేదెలా?

ఈ ప్రయాణంలో ఉత్సాహానికి ఉద్వేగానికి, దుఃఖానికి ద్రోహానికి, ఆనందానికి ఆవేదనకు అంతరం చెరిగిపోయింది.

ఓ విషాదగీతం తాలూకు సంగీతం జీవితమంతా ఆవరించి, ఆవహించి, వెలుగులాంటి చీకటి వెలిగింది.

ఈ చీకటిలో అక్షరాలు వెతుక్కుంటున్నపుడు, ఓ మందిరం ఆరుబయట అరుగుమీద మన కలయిక,

నాకు ఒక కొత్త లోకాన్ని తెరిచింది. నేను పోగొట్టుకున్నదో – వెతుకుతున్నదో తెలియని ఓ స్నేహం ఆ చీకటిలో చేయి అందించినట్లు, చిరునవ్వుతో ఆహ్వానించినట్లు – కాటుక కళ్ల చీకటిలోకి రమ్మని పిలిచినట్లు, భ్రమపడకుండానే సంభ్రమించాను.

ఇది జరిగి ఎన్నాళ్లయింది? నా కవితలన్నీ, నా బాధలన్నీ సుదూర అగోచర మనస్వినికే కదా రాశాను?

నేను చేసిన పొరపాటేమిటి? నేను ఏమి ఆశించాను? కనీసం సానుభూతికూడా కాదే – నా ఆలోచనకు, ఆవేదనకు –
అక్షరానికి ఒక పూలదారి కోసమే కదా–

ఓ అపరాత్రి అమావాస్య వెలుగులో నిన్ను సైకిక్‌గా హైజాక్ చేసి ఫలక్‌నుమా

ప్రాసాదంలో (అప్పుడు జర్మన్ వయోలినిస్ట్‌లు, 'వాతాపిగణపతిం భజే...') పాడుతున్నారు, ఆ అసందర్భపు సందర్భంలో, మంచుగాలిలో ఆత్మశరీరాలు విహరిస్తున్నట్లు నిశ్శబ్దంగా నవ్వులు వినపడుతున్నాయి. అప్పుడు కదా నీ చేయి పట్టుకొని (చల్లగావుంది భయంతోనో, ఆశ్చర్యంతోనో) ఆ ప్రాసాదపు చరిత్ర ప్రవాహాన్ని దాటుకుంటూ శతాబ్దాల గతాన్ని అవలోకించాం.

అక్కడ పాలరాతి మెట్లు పియానో మెట్లలాగా భూత సంగీతాన్ని వినిపిస్తుంటే, తెల్లదొరల ఆడంబరాల బొమ్మలు గోడలమీద దోగాడుతుంటే, బరువైన, చరిత్రధూళితో మరింత బరువెక్కిన రక్తవర్ణపు జరీతెరల పొరల కుచ్చులు జీరాడుతుంటే, నవాబులు వదలిపోయిన సామాన్యుని సామ్రాజ్యపు సంపద తాలూకు అవశేషాలు విశేషంగా, జకూజీ తొట్టిలో, యాభై మంది కూర్చొనే బ్రేక్‌ఫాస్ట్ బల్లమీది కట్లెరీ కటకటల్లో, వందమంది అతిథులు- మొగలాయీ వంటకాల రుచులను, నడుమ కూర్చొన్న ఎత్తుచేతుల కుర్చీలోని నవాబు ఆతిథ్యాన్ని మర్యాద రామన్నల సేవలతో, *రెడ్ బోర్డాక్స్, వైట్ బర్గుండీ, బ్లాంచ్, కాబర్‌నెట్, సావి(గ్)నాన్,* సోమాలతో స్వీకరిస్తుంటే - ఈ చివరి గుసగుసలు ఆ కొసన వినపడుతుంటే, ఆ రాజప్రాసాదపు గతవైభవపు విగత సౌందర్యాన్ని నీ తలకెక్కించాను కదా?

ఈ కాలాంతరయానం నుంచి తిరిగిరావటంలో ఎంతగా అలిసిపోయాం! తరువాత నిన్ను, మినుకు మినుకు తారలు కునుకు తీసే లోపే ఇంటికి చేర్చాను కదా. మన అంతరంగపు కక్ష్యలో ఇదంతా నిక్షిప్తం కాలేదా? అయినా ఇప్పుడు ఈ జ్ఞాపకాలన్నీ చెరిపేయమంటున్నావు. ఇలా మొదటిసారిగా కాగితం మీదకు డౌన్‌లోడ్ చేస్తే మెమరీలో చెరిగిపోతాయా? అక్షరం అక్షయమంటారే. అయినా ప్రేమను భిక్షాపాత్రలో పట్టుకోలేం కదా. అడిగి పొందేది, అడుక్కుని తీసుకునేదీ ప్రేమవ్వదు కదా?!

ఇదేనా నా దోషం? అయినా ఏమి జరిగిందని కొత్తగా? ఇది నా కలవాటేలే.

మళ్ళీ ఈ ముక్కలన్నీ ఏరుకుంటాను- కొత్త గాటులు- అవి కూడా కొత్తగానే, తీపిగానే వుంటాయి.

బాధే సౌఖ్యమని, ఆవేదనే ఆనందమని చిన్నపుడే అనుభవంలోకి వచ్చింది కదా-

ఇప్పుడు ఈ ఏడుపులోని మాధుర్యం కాస్త అనుభవించనివ్వు.

నువ్వు అలాగే వుండు. నేనెవ్వరినీ వదిలిపెట్టలేనే.

కాని అందరూ నన్ను ఒంటరి చేసి తప్పుకుంటా రెందుకో? కారణాలకేముందిలే! చరిత్రలో విషాదాలకేమి కొదవ?



ఎవరు ముందు?



మొన్నీమధ్య నా మిత్రుని ఇంటికి వెళ్ళాను.

ముందుగా చెప్పే వెళ్ళానుగాని ఆయన మద్రాసు వెళ్తున్నాను, మీరు వచ్చేరోజుకు వస్తానని చిన్న అబద్ధం చెప్పాడు... లేకపోతే నేను రానన్న భయంతోనే–

సరే, ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆరు గంటల ప్రయాణం తర్వాత, బస్‌లో రెండు తప్పని సినిమాల చిత్రహింస తర్వాత – చిన్నపాటి ఆటో 'రైడ్' తర్వాత, ఆ ఇల్లు చేరాను – నా మిత్రుడు – ఆయన భార్య – ఇద్దరు డెబ్భయ్యో పడిలో పడి, పడిలేస్తూ కాలం గడుపుతున్నవారే. నేను అనుమానించినట్లే మిత్రుడు ఇంకా తిరిగి రాలేదు. నా సోదరి, మణి 'రా నాయనా' అని ఆహ్వానించి, ఆమెకు ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉన్నా అన్ని మర్యాదలూ చేసింది. సన్నగా వర్షం పడుతున్నా చిరాకుగా ఉంది. చన్నీళ్ళ స్నానం బెజవాడకు సరిపోతుంది – అదీ అయిన తర్వాత, ఇద్దరం భోజనం చేసి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కూర్చున్నాం.

✤ ✤ ✤

ఎప్పుడు కూర్చున్నా మణి ఎన్నో కబుర్లు చెప్తుతుంది. ఆమె చిన్ననాటివి, ఆమె సంతానం మంచీ చెడు – మద్రాసు జీవితం – మరి నలభై ఏండ్లు అరవల మధ్య గడిపిన అనుభవం – అన్నీ చిరునవ్వుతో ఏకరువు పెడుతుంది. ఈ కబుర్లలో ఎంతో సాంఘికచరిత్ర, ఎందరో జీవితాల్లోని సంఘటనలు, వారి వ్యక్తిత్వాలు అలాఅలా నడిచిపోతాయి – వివాహాలు – విషాదాలు కూడా.

సరే, "బావగారు, వచ్చే సంవత్సరం – మీ 'వివాహ షష్టిపూర్తి' పండగ చేయాలని అంటున్నారు" అని అందించాను.

"ఆఁ ఏమి సాధించామని? పడిన కష్టాలన్నీ పడీపడీ – పండగ చేసుకోవాలా?" అని ఆమె కష్టాలన్నీ తలుచుకుంటూ అంది. "ఒక్క విషయం – ఇది మీతోనే అంటున్నా – నేనుండగానే – ఆయన వెళ్ళిపోవాలని కోరుకుంటున్నాను. పిచ్చి మానవుడు – కాఫీ పెట్టుకోవటం కూడా చేతకాదయ్యా" అంటూ కన్నీరు కుక్కుకుంది – ఆ తల్లి మనసు ఎంత తల్లడిల్లిందో – నాకప్పుడే తెలిసింది.

✤ ✤ ✤

ఆ రాత్రి 3.30 గంటలకే నా మిత్రుడు మద్రాసు నుంచి వచ్చాడు. అప్పటికే ఆయన వస్తాడని తెలిసి, నిద్ర లేచే ఉన్నాను.

"రండి – రండి – ఇది మీ ఇల్లే అనుకోండి' అంటూ చతుర్లాడి తలుపు తీశాను.

"అయ్యా, దీని ఓనరు గారు ఆమేనండి" అంటూ నవ్వుతూ లోపలి కొచ్చారు. ఆయన ఎప్పుడూ ఏదో హాస్యమాడుతుంటాడు.

కాస్త ఫ్రెష్ అయిన తర్వాత మా ఇద్దరికీ చెరో గ్లాసు కాఫీ నేనే కలిపాను. పాపం ఈయన 'కాఫీ కూడా పెట్టుకోలేని పిచ్చి మానవుడు' కదా.

ఆయన మద్రాసు నుంచి వచ్చారు కదా – ఒక గంట – ఆ నాస్టాల్జియా దిగదు. అది మెల్లగా నేను ఇంకించుకోవాలి. రాజకీయాల దగ్గర్నుంచి రజనీకాంత్ వరకూ కబుర్లన్నీ అయిన తర్వాత– ఆయన సతీమణి – మణి గారు – నిద్రపోతున్న గదివంక చూసి – నాతో– "ఆమెను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నాను. కాలు నొప్పి – పదేళ్ళ నుంచి బాధపడుతోంది – నాకూ మోకాలు నొప్పి – తగ్గటం లేదు. ఇద్దరం దేవుని పిలుపు కోసం ఎదురుచూస్తున్నాం. కాని – నా కోరిక, ఇలా కోరుకోవచ్చో లేదో, నా కళ్ళముందే ఆమె తరలిపోవాలని... అమాయకురాలు – నా తర్వాత ఆమె రోజుల్ని ఊహించలేను" అంటూ కాస్త విషాదం నిండిన స్వరంతో స్వగతంలా నాతో చెప్తుతుంటే నేను తెల్లవారుతుండగా తెల్లముఖమేసి చూస్తుండిపోయాను.

✤

విపులాచ పృథ్వి......

జూలై ముప్పై – ఇది మంచి రోజో, దుర్దినమో ఎలా తెలుస్తుంది?

ముప్పైఏళ్ళు పైగా సర్కారీ కొలువు వెలగబెడుతున్న ఎస్వో రావుకు ఆరోజు విడుదల! అరె, అప్పుడే జీవితంలో మూడొంతులు పైగా ఖర్చయిపోయిందా? – ఏమి సాధించాడు? ప్రభుత్వ నౌకరీలో ప్రజల సేవకు అవకాశం లేని – ఎవరికీ చెందని ఒక త్రిశంకు స్వర్గంలో 'కంఫర్ట్ జోన్'లో మూడుపదుల కాలం కరిగిపోయింది. కిందవాళ్ళ మీద పెత్తనం – పైవాళ్ళకు చిత్తం. చిత్తం, ఇంతేగదా – ఇంతకంటే అస్తిత్వం ఏముంది – 'జాబ్ సాటిస్‌ఫాక్షన్' ఏమిటి? కిందివాళ్ళకు అసూయ – పైవాళ్ళకు అలుసు.

పని చేయకుండా, అదే, చేయని పనికి జీతం తీసుకుంటూ ఉద్యోగ సంఘాల వత్తిడి, ఆ జీతాలు చాలవని సమ్మెలు, ఉద్యమాలు – పోరాటాలని పడిపట్టు పదాలు – రాజకీయ పార్టీల అండలు – మంత్రుల దండలు – దండగమారి స్లోగన్స్ – కార్మిక కర్షక – దినాలు – మధ్యలో స్త్రీవాద ఉద్యమాలు – అయిదేళ్ళు కొనసాగే ప్రజాపార్టీల ప్రభుత్వాలు – కొత్త మంత్రులు – పాత జీవోలు – ఐ.ఎ.ఎస్.ల అహంకారాలు – దేర్భేద్యమైన సెక్రటేరియట్ గోడలు – బైటకు పోనవసరంలేని ట్రాన్స్‌ఫర్లు – బేఫికర్ పనిగంటలు రాత్రిళ్ళు కాంట్రాక్టు దారుల మర్యాదలు, మందుపార్టీలు – అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట నాటకాలు – మేధావి వర్గంగా ముద్రకోసం తాపత్రయం – గ్రూపులు – ట్రూపులు, పైరవీలు లీవులు అమ్ముకోవటాలు – వారాంతపు పేకాటలు – నిన్నటికీ ఇవాళ్టికీ తేడా లేకుండా రోజులు దొర్లిపోతుంటే ఆహా జీవితం ఎంత హాయిగా

ఉంది అనుకుంటూ 'కాలక్షేపం' చేస్తూ గడిపేస్తూ ముప్పైఏళ్ళు వయసు కరిగిపోయింది. బట్టతల – కాటరాక్టూ – ఇంత షుగరూ – కొంత బి.పి. – అన్ని చుట్టుముట్టి – చిట్టచివరకు ఇదిగో జులై ముప్పై – వీడ్కోలు సభా – (ఒకరకమైన సంతాప సభ) ఏర్పాటు చేసిన ఇంకా సేవలో సర్వీసులో ఉన్న ఇప్పటివరకు తోడు ఉన్నవారు, ఘనంగా సాగనంపారు – ఎక్కడికి? ముందు ఇంటికి? తర్వాత ఈ విశాల ప్రపంచంలోకి కాని ఈ విశాల ప్రపంచంలోకి తనని ఆహ్వానించటానికి ఎవరూ సిద్ధంగా లేరు. కొన్నాళ్ళు జులై 30 కి ముందు 'పదవీ విరమణ' వయసు మరో రెండేళ్ళు పెంచుతారని, ఎన్నికల ముందు వచ్చిన వాగ్దానాలను నమ్మి, ఇంకా రెండేళ్ళుందని జులై 30 ని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, ఎన్నికల మాటలు నీటిమూటలేనని తెలియటానికి జులై 30 దాటిపోయింది. ఇన్నాళ్ళు ఏ వ్యాపకం పెట్టుకోకుండా గడిపి (వ్యసనాలే వ్యాపకాలు) ఇప్పుడు రోజంతా ఏమిచేయాలి? ఎంతసేపని టి.వి. చూస్తాడు? ఎప్పుడూ ఏ పనీ చెప్పని ఇల్లాలు – హెరిటేజ్‌కెళ్ళి కూరగాయలు, వగైరాలు తెచ్చిపెట్టండి – అటుంటే అదోమాదిరిగా ఉంది. ఎప్పుడైనా ఓ తెలిసిన ముఖం తను దినవెచ్చాలు తీసుకు రావటం చూసి, 'ఏమిటి రావూ ఈ టైమ్‌లో, సెలవా?' అని సాగదీస్తుంటే 'లేదు, సాగనంపా'రని చెప్పటానికి ఎన్ని తిప్పలు పడాలి?



ఏనాడూ ఆఫీస్‌కి రావటానికి హైదరాబాద్ రోడ్లు ఎలా ఉన్నాయి, ట్రాఫిక్ కష్టాలేమిటి? ఈ విషయాలేమీ తెలియకుండానే గడిచిపోయింది. ఇప్పుడు ఏ రోడ్‌లో ఎన్ని గుంటలున్నాయో లెక్కపెట్టుకుంటూ తిరుగుతున్నాడు. కొన్నాళ్ళు మార్నింగ్ వాక్‌లూ అయిన తర్వాత, మోకాళ్ళు ఆపరేషన్ చేయించుకొని, హాస్పిటల్ నుంచి ఇంటికి చేరుకుని, నెలరోజుల ఫిజియోతెరపీ తర్వాత అప్పుడే నడక నేర్చుకుంటున్నవాడిలా తప్పటడుగులతో, ఇరుకైన విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాడు ఎన్సో రావు. ఈ విశాల ప్రపంచంలో తనకెవరూ తెలియదు. అంతా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికీ ప్రక్కవాడితో పోటీపడాలి. తెలియని శత్రువుతో పోరాటం చేయాలి. ఇవన్నీ అలవాటుపడని రావుకి విశాల ప్రపంచం చాలాచాలా ఇరుకిరుకుగా దర్శనమిస్తోంది.

✤



హోరు



అంతశ్చేతనలో సంవత్సరాలుగా అణగారి, ఇప్పుడు - ఇక్కడ ఈ సముద్రపు హోరులో ఆకాశం చీకటిలో, కొలంబస్ నలుపులో - చీకటి చిలికించి సుడులు తిరిగి నురగలు పొంగి తన అస్తిత్వాన్ని చల్లగా దహించి - తనను పునీతను చేస్తుందో, స్వతంత్రురాలిగా పునర్జన్మనిస్తుందో ఈ అనిర్వచనీయమైన ఆలోచన - ఆవేదన - అనురాగపు వేదన.....

ఇద్దరు utopian వ్యక్తుల లౌకిక జీవనం :

అణగారిన అంతశ్చేతన - మానసిక వేదన - నరక యాతన అందులోనూ స్త్రీ హృదయ రోదన రూపుకట్టించటం ఎంతటి సాహసం! ఎంచుకోలేని ఆలోచనలు, పంచుకోలేని అనుభూతులు, ఏమిపోయిందో, తిరిగి రాదని తెలిసి సముద్రపుటుప్పులో కలిసిన దుఃఖం! సుభద్ర - తిరుగుబాటు - సుధాకరం మీదా? ఎప్పుడు మొదలయిందో తెలియని నాగరకత చక్రంమీదా? అనేక అవస్థలు పడుతున్న సమకాలీన వ్యవస్థమీదా? కాదు - ఇది మనిషి - ప్రకృతికి ఏర్పడిన అంతులేని అగాథం! తిరిగి వెళ్ళలేని కాలపు రహదారి - వన్ వే!

ఈ ఎగొని మరి ఎక్స్‌టసికి ఎన్ని పదబంధాలు -

ఇష్టంలేని పోరాటం, ఎగరాలని లేని నల్ల సీతాకోకచిలక, సరదాగా తీరానికి వచ్చిన జలచరాలు! జారిపోతున్న చిరునవ్వు, సాయంకాలానికి మబ్బుపట్టింది, మనిషి సహజ వాతావరణం నుంచి వేరుచేస్తే నిజమైన మనిషి బయటకొస్తాడు,

ఇప్పుడు ఇద్దరికీ కవచాల్లేవు! సముద్రం – ఆకాశం కలిసి ఏంచేస్తాయి – అది చూస్తూనే సంవత్సరం గడిపేశాను! సముద్రం – మన ఒంటరితనాన్ని అనంతం చేస్తుంది – ఆకాశం మన అస్తిత్వాన్ని అంతం చేస్తుంది – ఈ అవస్థలో 12 నెలలు, వందల రోజులు, వేల గంటలు, లక్షల నిమిషాలు, కోట్ల క్షణాలు అలవోకగా ఆనందంగా – అలౌకికంగా గడిపాను!

సముద్రం – పర్వతాలు, ఎడారి, అరణ్యం మనిషి అల్పత్వాన్ని గుర్తుచేస్తాయి. 'ప్రేమ పెళ్లి కాదు' (సుభద్రది). ప్రతి పెళ్లి ప్రేమకాదు! సంసారంలో ప్రేమ ఎంత నాటకం! మొదటిసారిగా ఖాళీ అయిపోయింది! ఆగిపోయిన ఇంజను గమనవేగంతో సాగటం! పాపం పాత సుభద్ర పూర్తి పరాధీన. బూరోక్రసీ ఆటోక్రసీ, హిపోక్రసీ, రాక్షసి, డయబాలిక్, మెటాలిక్ రియాలిటీ! స్నానాల గదిలో తెలీకుండా, తనకు తెలియని అనంత జలరాశిలో నల్లటి మచ్చలాంటి ఓ జాలరి క్షేమం, ఆమెకతిముఖ్యంగా తోచింది! అద్భుతం. అలలు తప్ప సముద్రం ఖాళీ! (that the rude seas grew civil at her song... - *Shakespeare*) విశృంఖలమైన సంతోషం, ప్రేమ, విద్యుత్తులాగ ఓజోన్‌లో కలిసి.... నరాల్లో – తుఫానులో సరుగుడు చెట్లులా. And certain stars shot madly from their speres ! గాలిలో కంగారుపడే గడ్డిపోచ! అలాంటి ఆలోచన! తనలో ఏదో భాగం – తన మాట వినటంలేదు! ఎప్పుడూ అంతే! దారి తెలియక పిచ్చి గీతలు గీసినట్టు తిరిగింది! పిచ్చి గీతల దారే బ్రతుకు. చెట్టులోనో – ఆమెలోనో కలిసిపోతే ఎంత బావుండును! మనకా అదృష్టం ఏదీ? 'పచ్చటి రహస్యం'లో దారితప్పిన..... నరాల్లో దాగిన భయం! రహస్యానికి రంగు ఉంటుందా? వెన్నెల్లో తడిసే ఈల తోట! తళతళ మెరిసే సముద్రం – వెన్నెల్లో తీరం చల్లగా వెన్నెల పీలుస్తూ ఈ లోకానికి సంబంధం లేని అందం! అలలు విసిరేసిన జలకన్యలా – అలలతో విసిగి విశ్రాంతికి వచ్చిందేమో! రక్తంతో – నరాల్తో పోరాడే ప్రాచీన (ఆధునిక?) మానవుడి తపన – వేడి టార్నెడో, సన్నని వెన్నెల జల్లులో తెల్లగా దహించుకుపోయి, సముద్రం, కరిగిన వెండిలా! వెండి కరిగితే సుభద్ర! అర్థరహితమైన కలలు – అసలు కలలకు అర్థాలు చెప్పటమేమిటి? అవి కలలు! యౌవనం వదిలేసిన తోలు కవచం! మరి, చెమర్చటానికే కళ్ళు! wild thought! పిల్ల కెరటంలా అయిలమ్మ! (ఆమె అయిలమ్మలో పరకాయ ప్రవేశం చేయగలిగితే ఎంత బాగుండును!) సముద్రానికీ – తీరానికీ పుట్టాడు! అందుకే కొలంబస్ వీపునిండా ఇసక!


జీవితం అంటే మానసిక స్థితా? పడవలో – సముద్రంలోకి కొలంబస్‌తో వెళ్లలేని నిస్సహాయత – సుభద్ర తిరుగుబాటు! సముద్రం ఎప్పుడూ నిండుగానే ఉంటుంది – మనసే మైదానంలా ఖాళీ! ఎదురుగా అనంతమైన సముద్రం! చిన్ని తొట్టిలో నీళ్ళు జీవితం! చీకటి చితికితే వెలుగొస్తుందా? ఉల్లిపొరలు తీస్తే తన అస్తిత్వం ఏది? సీతాకోకచిలుకకు ముసలితనం ఉంటుందా? అతన్ని కాదనకలిగింది! ఎంతటి విజయం! భార్యాభర్తల మధ్య ప్రేమ – అది మిథ్యే! జానెడు దూరంలో ఉన్నా దాటలేని తీరం! సుభద్ర తిరుగుబాటు – సరే చివరి 'కొస'మెరుపు! ఇరవయిఏళ్ళనాడు రాసిన – ఈ రసరేఖ – తెలుగు రచయితలకు ఇప్పటికైనా (ముఖ్యంగా రచయిత్రులకు) కంటబట్టేనా? తిరుగుబాటులో ఔచిత్యం – సాంద్రత, సముద్రపు హోరు వినపడేనా? లేక సుభద్ర బెజవాడలో దిగిందా, దిగితే ఎన్నాళ్ళుంది? అసలు హైదరాబాద్ వెళ్ళిందా? ఎందుకు వెళ్ళివుండదు? ఈ ప్రశ్నలతో సతమతమవుతున్నారా?

కొస : *సుభద్రను ఎన్నిమార్లు స్నానమాడించారు గడుసుగా?*

వాళ్ళు పిల్లల కోసం భోజనానికి పిలిచిన గడ్డపోళ్ళల్లో మీరూ ఉన్నారా?

(తల్లావజ్ఝల ప. శాస్త్రి 'హోరు'లో పడి....)







గూడు వదిలిన పక్షి

నెల రోజుల నుంచీ దిగులుగా ఉంది.

డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల లిస్టు, ప్రాజెక్టు వర్కు.

ఈ విధంగా ముప్పయి కాగితాలపైన తెచ్చుకున్నాడు.

గేటు, గీటు ఇంకా ఎన్నో పరీక్షలు రాశాడు – అన్నీ 90ల పైనే. పది అమెరికా యూనివర్సిటీలకు అప్లికేషన్లు పంపాడు. అందులో రెండింటినే ఎంచుకున్నాడు. ఒక్కదానికే వీసా అప్లికేషన్ ఇచ్చాడు. అదీ అయింది. వారం రోజుల్లో పాస్‌పోర్ట్ వీసా ముద్రతో వచ్చింది. ఇదంతా ఈ నెలరోజుల్లో పదిహేనురోజులు గడిచిపోయాయి. వారం రోజులు షాపింగ్ అని అవసరమున్నవి లేనివి ఏదో హడావుడి. గందరగోళం – మరో వారం గడిచిపోయింది. రోజు గడుస్తున్న కొద్దీగా గుండెలో ఒక్కో అర ఖాళీ అయిపోయినట్లు దిగులు మూసుకొస్తోంది. ఇంట్లో అందరి విసుగూ నేనే మోయాలి – అదో బరువు. ఒక్కడే కావటంతో ఫోకస్ అంతా వాడిమీదే – నాకే కాదు – అందరిదీ – అంటే ఇంట్లో ఉన్నదే వాడుగాక ముగ్గురం – నేనుగాక ఇద్దరు. ఆయన – మామగారు. మామ తామరాకు మీద నీటిబొట్టు – జీవితం నేర్పుతుంది కాబోలు.

చివరికి మిగిలింది – ఈ దిగులంతా కమ్మింది నన్నే – అమ్మను కదా – వాడికి గోరుముద్దలు తినిపించిన దగ్గర్నుంచి అక్షరాలు నేర్పించిన క్షణం నుంచి,

వాడి చదువు గురించే నా శ్రద్ధ అంతా – ఎందుకు అని ఎప్పుడూ నన్ను నేను ప్రశ్నించుకోలేదు – స్కూలు, 12 వరకూ అప్రతిహతంగా నడిచిపోయింది. సహజంగా – తెలివితేటలున్నా – స్కూలు వాతావరణం, స్నేహితుల గ్రూపు, ఒకటో రెండో ట్యూషన్లు అన్నీ అక్కరకు వచ్చాయి.

ఐ.ఐ.టి.లో వచ్చినా పూనా అని పంపలేదు. దూరమని! ఇంటికి పది కిలోమీటర్లలో ఇంజనీరింగ్ కాలేజీ! వాడు కోరిన బ్రాంచిలో చేర్పించాను – మెరిట్ రాంక్ – డొనేషన్ కట్టలేదుకదా – కారు కొనమన్నాడు. నెలరోజులు మల్లగుల్లాలు పడి లైసెన్సు ముందు తీసుకొని కారు కొనిచ్చాడు వాళ్ళ నాన్న. కాని బాధ్యత అంతా నాదే అన్నట్లు తాళాలు నా చేతిలో పెట్టి–

మొదటివారం – వాడి కారు వెనకాలే ఈయన వెళ్ళాడు. నమ్మకం కుదిరిన తర్వాత ఒక్కడినే వదిలేశాడు. నాలుగేళ్ళు ఎగిరిపోయాయి – సునాయాసంగా.

అప్పుడు ఈ అమెరికా గురించి దిగులు లేదు కాని – వాడి టార్గెటు అదే అని తెలుసు.

అన్ని టెన్షన్‌లే. అమెరికా ఎయిర్‌పోర్ట్‌ల నుంచి స్టూడెంట్ వీసావాళ్ళని వెనక్కి పంపించేస్తున్నారని వార్తలు – టెన్షన్ –

వీసా వస్తుందా రాదా – అని టెన్షన్

వచ్చిన తర్వాత ఎక్కడ నుంచి పంపాలి – దగ్గరవాళ్ళకే చెప్పకుండా ఎక్కడ నుంచి విమానం ఎక్కుతున్నాడో తెలియకుండా ఎయిర్‌పోర్ట్‌కు కూడా వెళ్ళకుండా వాడ్ని పంపించివేస్తుంటే ఒకటే దిగులు.

మధ్యలో అమ్మ ఫోన్! చెప్పటానికి కూడా తప్పించుకోవలసి వచ్చింది... ఏడుపు తన్నుకువస్తుంటే...

ఎందుకిదంతా?

ఏమో? అమెరికా పిచ్చికి అర్థం ఉందా?

వెళ్ళిపోతున్నాడంటే అయోమయం అయిపోయింది. అందరినీ విసుక్కోవటం, ఏడుపు – వాడు చూడకుండా!

పాదాలు కందకుండా పెంచాను. అన్నీ గదిలోకే అందించాను – వాడి గది చూడాలి – అదో హైటెక్కు లేబొరేటరి.

హాబీ ఫోటోగ్రఫీ – 50 వేలు పెట్టి నికాన్ కెమెరా కొన్నాడు – ఫోటోషాపు చేసి డబ్బులూ సంపాదించాడు.

మార్కులు 90 దాటితే నాకు 50 వేలు ఖర్చు – ఐఫోన్ – అట్లాగే కొన్నాడు.

ఇప్పుడు వాడు ఎగిరిపోయిన తర్వాత, అక్కడకు చేరాడా? ఎయిర్‌పోర్ట్‌లో వాణ్ణి ఆపలేదుకదా – వాడి కోసం రమ్మన్న రాజు వచ్చాడా? రీసివ్ చేసుకున్నాడా? అన్నీ ప్రశ్నలే.

'అమ్మా' జాగ్రత్తగానే చేరాను అని వాడి కబురుతో ఒక దిగులు తీరింది.

కానీ, అసలు దిగులు ఇప్పుడే మొదలయింది. వాడి గదిలోకి వెళ్ళి చూస్తే దుఃఖం పొంగుకొచ్చింది. ఛ – ఏమిటిది అనుకుంటూనే ఆపుకోలేకపోయాను. గది అంతా వాడున్నప్పుడు ఎలా ఉండేదో – అలాగే సర్దాను – టి.వి. తుడిచాను, రిమోట్లన్నీ కొత్త బాటరీలు వేశాను.

అన్ని ఐ–పాడ్, స్కైప్‌లో వాడికి చూపించాను. 'అమ్మా' వద్దే – నాకు 'హోమ్ సిక్‌నెస్' వస్తుంది అన్నాడు.

అదీ మానేశాను.

వారానికి ఒకసారి స్కైప్‌లో మాట్లాడే ఏర్పాటు చేసుకున్నాం. మిగతా ఆరు రోజులు? అయినా – ఏం తింటున్నాడు – ఎలా చేసుకుంటున్నాడు – ఎవరితో ఉంటున్నాడు – ఎప్పుడూ ఇల్లు దాటిపోలేదు – ఎంత దిగులు – కని, పెంచి, చదువు చెప్పించి అమెరికాపాలు చేయటానికా? అయినా అమెరికాలో చదకవకపోతే ఏమవుతుంది? ఇండియా గొడ్డుపోయిందా? మరెందుకు ఈ పరుగులు? గూడు వదిలిన పక్షి – మళ్ళీ గూటికి చేరేనా? నా దిగులు తీరేనా?

తల్లి మనసు తల్లడిపోతున్నది...

అను'భవ'సారం

అశ్వినీకుమార్ గారిని సాటి కథారచయితల ప్రక్కన విలక్షణంగా నిలబెట్టే ప్రస్ఫుటమైన గుణం – ఆయన కథల్లోని వస్తువైవిధ్యం, అనుభవ విస్తారమూను. ఆయన దేశదేశాలన్నీ తిరిగి అక్కడి ప్రకృతి సౌందర్యానికి పరవశించిపోయారు. అక్కడి నాగరకతా వైభవానికి విస్తుపోయారు. అక్కడి ప్రజల మానసిక, శారీరక రోగ రుజినాలు చూసి చలించిపోయారు. అశ్వినీకుమార్ గారి కథల్లోని మరో ముఖ్యాంశం – ఉత్కంఠభరితమైన రమణీయకత (Romanticism). కథానాయకుడు యువకుడైతే ఈ వాసన ఉబికి వస్తుంది. గౌణ పాత్రగా ఉన్న బాలుడైతే ఈ కోరిక సుతిమెత్తగా బయట పడుతుంది. అయితే ఈ తృష్ణ కొన్ని సందర్భాల్లో విషాదంగాను, నిర్వేదంగాను, ఆవేదనగాను, కరుణార్ద్రంగాను వ్యక్తం కావడం విశేషం.

వీరి కథల్లో బహిరంగ వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించడంతోపాటు, అంతరంగ మథనాన్ని కళాత్మకంగా చిత్రిస్తారు. ఇందుకు *లేమి, దొమ్మేరు, మంచుపెట్టె* ప్రిన్స్ కథల్ని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

అశ్వినీకుమార్ గారి కథల్లో ప్రేమ రకరకాల హొయలు, వగలు పోయినా చివరికి చాలాచోట్ల విరక్తిగా పర్యవసానం కావడమే చిత్రంగా తోస్తుంది. బహుశా రచయిత హృదయాంతరాళంలో అణగి ఉన్న తాత్త్వికతే అందుకు కారణం కావొచ్చు. *మాలి* కథలోని సన్యాల్, హిమాలి పాత్రలు ప్రేమలోని రెండు భిన్న ధృవాలకు ప్రతీకలుగా నిలవడం ఈ తాత్త్విక దృష్టి పరిణామమే.

ఈ కథల్లో పాత్రలు కొన్ని సిరిసంపదల్తో తులతూగుతున్నా, సుఖసంతోషాల్లో మునిగి తేలుతున్నా వాళ్ళ జీవన వీణలు విషాద స్వరాల్నే వినిపిస్తాయి. *లేమి* కథలోని విమలా, శంకర్, రవి – పాత్రల్లో ఒక్కోరకమైన వాత్సల్య ప్రేమరాహిత్యాలే కనపడతాయి.

విశ్వకవి రవీంద్రులు ప్రతి మనిషిలోనూ ఓ విరహిణి దాగుంటుందంటారు. రచయితకు కొంతమంది పంజరంలో బంధింపబడ్డ పాత్రలుగా తోస్తే, మరికొంతమంది విశాలాకాశం క్రింద కనిపించని పంజరంలో విలవిలలాడే పక్షులుగా కనపడతారు.

వీరి కథల్లోని ఓ విశేషం ప్రతీకాత్మకత. *మంచుపెట్టె* కథలో ఈ ప్రతీకను రచయిత వెల్లడించటంతో శిల్పం దెబ్బతిన్నా, మృత్యుస్పృహ పాఠకుల్ని వెన్నాడుతూనే

ఉంటుంది. *ప్రిన్స్* కథ చాలా మంచి కథ. ఇంగువ కట్టిన గుడ్డలాంటి గత వైభవపు జ్ఞాపకాల్లో జీవించే ప్రిన్స్ రాజా రామల్లా దయనీయత పాఠకుల్ని కలవరం పెడుతుంది. ఆత్మాభిమానం ఆశ్చర్యపరుస్తుంది.

అశ్వినీకుమార్ గారి అనుభవ ప్రపంచం పెద్దది. తెలుగువాళ్ళ పల్లె జీవితం మొదలుకొని, నగర జీవితం, విదేశీ జీవితంలోని ఆరాటాలు, ఆవేదనలు, పగలు, ప్రతీకారాలు, చీకూచింతలు పాఠకుల్ని ప్రభావితం చేసేలా చిత్రించగలిగారు ఆయన. అశ్వినీకుమార్ ప్రతిభ *ఒలుకులు, ఎవరు ముందు?* లాంటి చిన్న కథల్లో మరింత గొప్పగా ప్రదర్శితమయిందని చెప్పొచ్చు.

29-8-2016

బెంగుళూరు **ఘట్టమరాజు అశ్వత్థనారాయణ**

వలపు తేనెలన్నీ గుండె గిన్నెలో పోసి - అందిస్తుంటే - (పూల తేనెలను మోసుకొచ్చే తేనెటీగల్లా నా ఆలోచనలన్నీ మనసుని మధురాతి మధురమైన ప్రేమతో నింపివేశాయి).

అందుకోలేని పరిమితుల్లో అభాగ్యుడు -

ఆమె 'పూల సంకెలల ఊయల నుంచి - అతని ఒడిలో పడిపోయి'

ఎప్పుడో నిద్రపోయి... చలువరాతి ఆసనం పూల రథంలా మారిపోయి... ఇంతటి ప్రేమను ఎడారిపాలు చేసి, వెళ్ళిపోయిన దురదృష్టవంతుడు. ఎవరిది విషాదం? ఎంతటి విషాదం?

ఈ కథను ప్రపంచ స్థాయి కథల సరసన కూర్చోపెట్టవచ్చు. గాలివానలాగా అనుకోండి - కాని దురదృష్టం ఏమిటంటే రచయిత ఇంకా సజీవుడై ఉండటం - మనకు తెలిసినవాడై ఉండటం - ఇంకా ముందుకు వెళ్ళి చెప్పాలంటే ఎడమచేతి వాటం వాడు కాకపోవటం - వెరసి మనం పైన చెప్పినట్లు చేశామంటే ఇందులో మనకేదో స్వార్థం ఉందనో లేక మన మిత్రుడేమోననో అనుమానాలు కలుగకపోవు. ఇది కథకంటే విషాదం కదా!

పి.ఎస్.



సంభవాని

ఉత్తమ పురుషలో అందరూ కథలు వ్రాయరు. దానివల్ల ఇబ్బందులూ, సబ్బందులూ ఉంటాయి. అయితే కొందరు ఉత్తమ పురుషలోనే బాగా వ్రాయగలుగుతారు. భావావేశం చిక్కబడి, ఘనీభవించి ఒత్తిడి తీవ్రతకు చిట్లి, పగిలి, పేలి రంగుల శకలాల అనంతాకాశమై విస్తరించుకున్నపుడు వికలమైన శకలాలను ఏరుకుంటూ, రంగుల్ని రసరూపాల్లో గుర్తుపడుతూ, నిరాకారాలకు ఆకారాల్ని ఆపాదించుకుంటూ, వసంతాల కలల రంగుల్ని అద్దుకుంటూ అబద్ధాలు చెప్పలేని అద్దాల అసలు హృదయాల్ని వెతుక్కుంటూ, ఆ ప్రయత్నంలో అప్రయత్నంగా స్ఫురించే కవిత్వాలు, తత్త్వాలు, దారాల్లేకుండా అల్లబడ్డ హారాలై, మారుతాల రుతాల్లో కొట్టుకుపోయి ఏ పదపీఠాన అర్పితమో!

అంతరంగ మథనానికి వ్యథార్తి రూపం ఇవ్వాలంటే కవితా సతి చేలాంచలాల కోసం తడువుకోక తప్పదు. భావం క్లిష్టమైనప్పుడు భాష చిక్కబడి కవితారూపం తీసుకుంటుంది. జీవితం సంచలనాత్మక సంఘటనల సమాహారమైనప్పుడు జీవితంలో అన్నీ తొందరగా జరిగిపోతున్న భావన కలుగుతుంది. ప్రేమైకజీవితానికి మరీను. ప్రేమ ఒక తత్త్వంగా జీవితాన్ని ఆవరించుకున్నప్పుడు ఇంకాను. మొదటి అనాటమీ క్లాసులో తొట్టెలో ఫార్మాల్డిహైడ్ ద్రవంలో తన రహస్యాలను కనుక్కోమని ఆహ్వానిస్తున్నట్టనిపించిన జీవరహిత శరీరం. ఎడిమా ఎఫెక్టుతో, హఠాత్తుగా, అనుకోకుండా బెజవాడ బారేజీమీద, కారు వెనుక సీట్లో, తన ఒళ్లో కళ్ల వెలుగు ఆరిపోయిన తన భర్త స్వరూపం. జాలంలాంటి కాలం తన ఋతు సమాహార హారాలతో జీవన వృక్షానికి మరల వసంత శోభను అద్దినపుడు, రసరంగుల హేల బేల హృదయాన్ని ఉక్కిరిబిక్కిరి చేసినపుడు, సాంత్వనతో హృదయ పీఠాన్ని జాజులతో రోజాలతో అలంకరించి అధినాథుని కోసం అనవరతం నిరీక్షణే జీవితం అయినప్పుడు...

అక్షరాల ఆలాపనల్లో అంతరంగ స్వరూపుణ్ణి గుర్తుపట్టే ప్రయత్నంలో. ఎప్పుడో... ఎక్కడో.. జాడల నీడల్ని పట్టుకుని, హృదయపళ్లెంలో పంచభక్ష్యపరమాన్నాల ప్రేమవిందును అందుకోమని అర్థించినపుడు, అంతనిస్సంకోచంగా, నిర్మలంగా అందించిన అర్పణను అందుకోవాలంటే ఎంత ధైర్యంకావాలీ! అక్షరాల అక్షయ హృదయాన్ని ఆలంబనగా చేసుకుని ఆవలి హృదయాంతఃకరణను అర్థం చేసుకునే ప్రయత్నంలో, అక్షరాలే కాదు – ప్రకృతీ సహకరిస్తుంది.

Nature sympathises with man అన్నాడు కదా ప్రకృతి ఆరాధకుడు వర్డ్సువర్త్! జీవితంలో అన్నీ తొందరగా జరిగిపోయినట్టనిపించినా, అనుభూతుల ఆనందాల బరువును మోయవలసి వచ్చినప్పుడు, ఆనందాల సందోహాల సందేహాల్లో కాలం అడుగులు తడబడినపుడు వేగం ఆగిపోతుంది. ఆదివారం రావడానికి అంత ఆలస్యం! మరి! ప్రేమ ఆవరించిన కనుల్లోంచి ప్రియమైనవాళ్లని చూసినప్పుడు, అవతలివాళ్ల ప్రెజెంటేషన్ అలా ఉంచితే మన పెరసెప్షన్ ఓ రూపాన్నిచ్చుకుంటుంది. 'తన ప్రేమమూర్తిని కలిసిన మర్నాటి ఉదయం, ఎంత ఉల్లాసంగా ఉంది.. ముంగిట ముగ్గుల దగ్గర్నుంచి, తూర్పున బంగారు దుమ్మువరకు, లేమావి చిగుళ్ళు, మామిడి పిందెలు, లేని అతణ్ణి సృజించడానికీ... చుక్కల వెలుతురూ చివరికి దిగంతాన కాషాయ విషాదం – అన్ని ఆమె హృదయ సంక్షోభాన్ని ఆవిష్కరించేవే– రాని అతణ్ణి రప్పించడానికీ' ప్రేమ ప్రవాహపు పరవళ్లు సృజన శక్తులు విత్తనాన్ని ముంచెత్తి, ప్రతిసృష్టికి సంకేతించినపుడు వసంతం వెల్లివిరిస్తుంది! ఈ కథనంలో ఒక రహస్యం ఉంది మనం గమనిస్తే – రచయిత కథన సంకేతాలను ఎంతో మార్మికంగా ఆవిష్కరించారు. కథానాయిక భావుకురాలని మొదట వాక్యంలోనే సూచనలున్నాయి. అతని (శివ) జుత్తు పెరగదో, పెరగనివ్వడో, ఇది అతని 'న్యూరో' బాధకు సంకేతం. ఫార్మాల్డ్ హైడ్ తొట్టెలోని 'కట్టె' కథలోని విషాదానికి సంకేతం. ఆమె ప్రేమస్వరూపుడు 'దాదాపు నా వయస్సే. పల్చబడుతున్న జుట్టు' – ఇదీ అతని హెమటోమాకి సంకేతమే! కథనంలో మారుతున్న రుతువులన్నీ కథానాయిక మానసిక స్థితికి ప్రతిబింబాలే. కానీ, ప్రతి జీవిత కథకూ విధి తనదైన మలుపునూ, ముగింపునూ ఇస్తుంది. Hematoma Burr hole evacuation జీవితాన్ని హరిత లతానికుంజాల నుండి సమాధుల పెనం మీదికి విసిరేసినప్పుడు హృదయ దిగంతాలు కాషాయ దుఃఖంలో ముంచివేయబడతాయి. ప్రాణదీపాన్ని నిలపడంకోసం ప్రేమపాశాలు తెగిపోతాయి! జీవన వలయం మళ్లీ మొదటికొస్తుంది. "ప్రతి జీవితమూ భగవంతుడు స్వయంగా వ్రాసిన చిత్రమైన కథ" అన్నారెవరో! అవుననడానికీ, కాదనడానికీ మనమెవరం??

– బి.వి. రామిరెడ్డి

కరిగించిన భవాని...

స్త్రీ హృదయపు లోతులు – స్త్రీ అంతరంగం (భవాని) నన్ను ఇంకా వెంటాడుతూనే ఉంది. భాషకందని భావాలకు అక్షరరూపం ఇచ్చిన రచయితకు అభినందనలు. ప్రతీ అక్షరంలో నిక్షిప్తమైన విషాదం, అందులోని గాఢత చాలా కదిలిస్తుంది. మళ్ళీమళ్ళీ మొదటి అక్షరం నుండి చదివాను. అందమైన విషాదం అంటే ఇదేనేమో! ఆత్మీయంగా ఆమెని దగ్గరికి తీసుకోవాలనిపించింది. ఆమెలోని శూన్యాన్ని, అంతులేని ప్రేమని, భావుకతని ప్రతి అనుభూతిని నేను కూడా ఫీల్ అయ్యాను. తెలుగులో తియ్యదనాన్ని, భావవ్యక్తీకరణలోని సౌందర్యాన్ని చాలాసార్లు ఆస్వాదించాను. కవిత్వం కథగా రూపుదిద్దుకుంటే ఎలా ఉంటుందో *భవాని* ని చదివితే తెలుస్తుంది.
చలం 'ఓ పూవు పూసింది'. తర్వాత అంత అందమైన కథ ఇదేనేమో అని నాకనిపించింది...."

– స్వప్న, *వరంగల్*

కథలో అంతర్లీనంగా ఒక విషాదం పరచుకొని ఉంది. అయితే, అందులో ఒక సౌందర్యం దాగుంది. సౌందర్యం అంటే ఆనందం కదా – విషాదం, ఆనందంగా ఎలా మారుతుంది? అందుకే ఈ గాథ ఒక తీయని బాధ..."

– అంపశయ్య నవీన్, *హైదరాబాద్*

ఇది మా చెల్లెలి కథలా అనిపించింది..."

– ఎర్రమెల్లి రోహిణీకుమార్, *సాకుఱ్ఱు, అమలాపురం*

భవాని చదువుతుంటే మా అమ్మాయి కథలా తోచింది..."

– దుర్గాప్రసాద్, *తిరుపతి*

మిసిమి లో కథలకు ఏళ్ళపాటు ఎదురు చూడాలి. ఆ ఎదురుచూపు ఇంత పునీతగా ఉంటుందని పాఠకులెవ్వరూ ఊహించరు. తెలుగులో కథలను ఎంతో సహజంగా చెప్పగల రచయితలను మనమెరుగుదుము. వారు మన గుండెలను పిండగలరు. కాని వారెవ్వరూ, అవి కథలనే స్ఫురణ నుండి మనలను మరిపించగలరని నేననుకోను. కథను ఇంత సహజమైన రీతిలో చెప్పడం సాధ్యమా అనిపించేటంత గొప్పగా ఉంది *భవాని* కథ. రచయితకు హృదయపూర్వక అభినందనలు, ***మిసిమి***కి ధన్యవాదాలు..."

– కణుగుల వేంకటరావు, *శ్రీకాకుళం*

కంఠాభరణం

తెలుగు కథలు వార్తా కథనాలుగా, సంఘటన ఆధార డాక్యుమెంటరీ కథలుగా చాలాకాలంగా వస్తున్నాయి. ఇవన్నీ వాగులాటి శబ్దం చేసేవే కానీ నదిలాటి లోతును, ఉరవడిని, ఒరవడిని సాధించే కథలుగా నిలువలేకపోతున్నాయి. ముఖ్యంగా కథలలో మానసిక సంఘర్షణాత్మక కథనాలు కనుమరుగవుతున్న దశలో ఫిబ్రవరి ***మిసిమి***లో వచ్చిన *భవాని* కథ తెలుగు కథకు ఆశను, భరోసాను రేకెత్తించింది. కథను ఇప్పటివరకు నేనైతే ఎనిమిదిసార్లు చదివినా, చదివినప్పుడల్లా కథలో కొత్త రహస్యాలు తెలివిడిలోకి వస్తున్నాయి. వస్తువు, భాష, భావుకత, నడక, పొదుపైన సంభాషణలు, పాత్రల మధ్య సాధించిన సమన్వయం బంగారంలో ధాతు (రాగి)ని కలిపి నగను చేసినట్లు అత్యుత్తమంగా ఉంది. తెలుగు కథామతల్లి మెడలో *భవాని* మరో ఆభరణంగా తప్పక మిగిలిపోనుంది.

ఎందుకంటే, కథ ప్రారంభంలోని మొదటి వాక్యం 'కొందరికి జీవితాల్లో కొన్ని తొందరగా జరిగిపోతుంటాయి'. కథ ముగింపు వరకు అదే వాక్యం సమతూకంతో విరుపు మెరుపులతో పాఠకులను చివరివరకూ వెంటాడే వాక్యంలా పరిణామం చెందడం రచయిత పరిణతికి గొప్ప ఎత్తుగడ. ఇకపోతే, కథ అంతా రచయిత ఊహ, కల్పన, శక్తి గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. కొన్ని వాక్యాలు పచ్చి వచనంలా ఉంటే, అనేక వాక్యాలు కవితాత్మకంగా సూటిగా గుండెను తాకుతాయి. వీటికి బోలెడు ఉదాహరణలు చూపవచ్చు. *భవాని* కథ పరిపక్వత చెందిన పాఠకుల కోసం రాసింది. ప్లాట్‌ఫాం, బస్సు, కాలక్షేపం చదువరుల కోసం మాత్రం కానేరదు. కథ ప్రవాహంలో పాఠకుడు సంలీనమై ఈదులాడుతున్నప్పుడు అన్నంలోని మెరిగెలా రచయిత మధ్యలోకి రావడం ఉచితం కాదేమో. 'ఊ' కొట్టే కథల్లో 'ఊ' ఆగినప్పుడు 'వింటున్నావా'వలె రచయిత అనుకొని కథ మధ్యలోకి చొచ్చుకొని వచ్చాడేమో. దీనికి రచయిత సమాధానం చూడాలి. రచయిత పేరు వేయకపోవడం బహుశా ఈ కథను చదివి ఆలోచనాపరులు ఎలా ప్రతిస్పందిస్తారో, ఎలా స్వీకరిస్తారో చూడాలని కావచ్చుననుకుంటాను.

భవాని కథ చదువగానే నాకైతే చలం, బుచ్చిబాబు, వడ్డెర చండీదాస్‌లు కలె కలసి రాసినట్టుగా స్ఫురణలోకి వచ్చింది. నిశ్శబ్దంగా పాత్రల మనోవిశ్లేషణ రణన్నినాదం వినిపించింది. అద్భుతమైన కథ అందించిన రచయితకు అభినందనలు. మంచి కథను అందించిన ***మిసిమి***కి కృతజ్ఞతాభివందనములు. ***మిసిమి***కి ప్రత్యేకంగా రాసిన కథలను అప్పుడప్పుడు వేయడం ద్వారా పెద్దాయన ఆలపాటి రవీంద్రనాథ్, అన్నపరెడ్డి పాటించిన విలువలకు, ప్రమాణాలకు ఎలాంటి ధోకా కలుగదు. పైపెచ్చు ఆయన వ్యక్తిత్వం నాలుగింతలు అవుతుంది.

– జూకంటి జగన్నాథం

'భవాని'... హృదయ స్పందన

భవానీ చాలా గడుసుది సుమా! తన స్వగతంలో మనకు చెప్పింది చాలా తక్కువ. మన ఆలోచనకే ఎక్కువ వదిలివేసింది. ఆశ నిరాశలో *భవాని*...

కోర్కెను ప్రేమగా, ప్రేమను ఆరాధనగా, ఆరాధనను విషాదంగా, విషాదాన్ని నిరీక్షణగా – ఇది గొప్ప ట్రాన్సిషన్. *భవానీ* ఒక భావం, ఒక నిశ్శబ్ద రావం....

ఈ కథలాంటి కవితలో ఒక ప్రత్యేకతను గమనించాలి – ఈ కథనం ఒక స్త్రీ అంతర్మథనం. ఐతే, అది ఒక 'రచయిత' వినిపించాడు కదా! అక్కడితో ఆగలేదు – 'పాఠకుడు' *భవానీ* తో తాదాత్మ్యం చెందగలగటం ఈ కథనంలోని విలక్షణా విశిష్టత. ఇది ఎలా సాధ్యమని – అది పరిశీలించవలసిన అంశమే. ఈ 'జెండర్ బోర్డర్' ఎలా దాటగలుగుతున్నాం? అదే ఈ కథనంలోని ప్రత్యేకత....

ఒక విమర్శ ఉంది. ఇదేమి సెంటిమెంటు? అదీ ఒక డాక్టరమ్మకు అని.

డాక్టర్లంతా హేతువాదులా? తిరుపతి వెళ్ళనిది ఎవరు? ఇంట్లో వ్రతం చేయనిది ఎవరు? నమ్మకాన్ని ఎవరూ వమ్ము చేయలేరు.

అదీ తనదాకా వచ్చినప్పుడు అన్నిరకాల సెంటిమెంట్లు ముసురుకుంటాయి. అంతమాత్రంచేత *భవాని* ధీరురాలు కాకుండా పోదు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు చూసింది. ధైర్యంగా నిలబడింది. ప్రేమ భావనలో ఎప్పుడూ హృదయం దుర్బలంగానే ఉంటుందనిపిస్తుంది....

ఈ కథ ఈ కథనం ఒక విమానం టేకాఫ్ లాంటిది. ప్రారంభంలో విమానం నేలమీదే ఉంటుంది. తరువాత టాక్సీయింగ్ చేసి, రన్‌వే మీదకు వస్తుంది. ఒక్కసారిగా వేగం పెంచుకుని అంతలో ఎగిరిపోతుంది. ఇక తరువాత గాలిలోనే ప్రయాణం... మబ్బులలోనే విహారం

ల్యాండింగ్ తరువాత ప్రయాణం ముగిసిపోతుంది. ఇప్పుడు *భవాని* కథనం దీనితో పోల్చి చూడండి ఒక అద్భుతం కనిపిస్తుంది...

'కన్నీటి చుక్కలో హరివిల్లు విరిసి'నట్లు భవాని ఒక విరిచాపం.

ఏమిటీ? వెన్నెల కిరణాల నుంచి గంధర్వుడు దిగివస్తాడా? పూల పరిమళాల రూపుదిద్దుకుని మూర్తిమంతమవుతాడా? లతానికుంజాల పార్శ్వం నుంచి నడిచి వస్తాడా? అంతరంగ కీలలలో మరిగి, మరిగి, పోతపోసుకుంటున్న ఈ మూర్తిని ఎలా గుర్తుపట్టేది?

ఎలాంటి భావనా... ఎలాంటి భాషా ఎంత ఉదాత్తంగా మనసుని తాకుతుంది?

పూలతేనియలు మోసుకొచ్చే తేనెటీగల్లా నా ఆలోచనలన్నీ మధురాతిమధురమైన ప్రేమతో మనసుని నింపివేశాయి... ఎంతటి మధురమైన ఊహ...

దిగంతంలో బంగారు దుమ్ము లేచింది. ఒక చిత్రకారుడు స్పందించగల పదచిత్రం.

ప్రకృతి పలకరింపులు భవాని మానసిక స్థితిని అద్దంపడతాయి.

ఆ రాత్రి నిద్రలేదు. నిద్ర లేకపోతే కలలు ఎలా వస్తాయి? కలలు రాకపోతే వెన్నెల వనంలో చలువరాతి పీఠం అలంకరించిన అతగాడు ఎలా కనబడతాడు? ఇదేమి విడ్డూరం?

లేని నిన్ను సృష్టిస్తాను, రాని నిన్ను రప్పిస్తాను. ఎంతటి దృఢసంకల్పం?

కలల పదార్థం ఆవిరైపోతుంటే... ఎవరు మాత్రం భరించగలరు?

మధురోహల ప్రేమవనం సమాధుల పెనంలా... ఎంతటి విషాదం?

ముగించాను. అంటే అతనితో మాట్లాడటం ముగించాను. నా ఇంగితాన్ని ఇంతటితో ముగించాను. అదే కొందరికి జీవితంలో అన్నీ త్వరగా ముగిసిపోతాయి.

ఇలాంటి ముగింపు ముందెన్నడూ చదవలేదు.

ఈ కథ బెజవాడ చుట్టూనే తిరిగింది. మాది బెజవాడ. అందుకనే ఈ కథనం నన్ను అల్లుకుపోయింది.

– ***వి. శ్రీనివాస చౌదరి***, *విజయవాడ*





వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్ పైన....
ఈస్ట్ రివర్‌పై బ్రిడ్జిలు, దూరంగా సెంట్రల్ పార్క్, ఆ వెనుక బ్రాంక్స్

అచ్చయిన మొదటి కథ	:	*అమాహ*
పుట్టిన తేది	:	*27 మే*
భార్య	:	*జయంతి*
అమ్మాయి	:	*కవిత*
అల్లుడు	:	*సతీష్*
మనుమడు	:	*అంకిత్*
అబ్బాయి	:	*కళ్యాణ్*
కోడలు	:	*అర్చన మీనన్*
ఇష్టమైన పనులు	:	*సంగీతం వినడం, స్నేహితులతో సత్సంగం*
ఇష్టం లేని పని	:	*ఇంకొకర్ని నొప్పించటం*

రచనలు : *అమాహ,*
దూరతీరాలలో (ట్రావెలోగ్),
అంతర్వీక్షణం (వ్యాసాలు),
'సిద్ధార్థ' తెలుగు సేత,
'ప్రముఖులతో పదినిమిషాలు',
ఓ ఖైదీ వీరగాథ,
ఎడోనిస్ (ఎలిజీ),
కీట్స్ జీవిత కథ,
చార్లీచాప్లిన్ నా కథ,
ఏరియల్ (షెల్లీ – ప్రేమ విషాదం) ,
బైరన్ జీవిత కథ,
అగాధం (De profinus) ఆస్కార్‌వైల్డ్,
దూరదర్శన్ ఇంటర్వ్యూలు,
ప్రొమితియస్ అన్‌బౌండ్ (షెల్లి డ్రామా)
***మిసిమి** సంపాదకీయాలు*

స్వీయగతం
(స్వగతాలు) : *కవితలు...... నాలో నేను, అనంతరంగం*

పూర్తి కావలసిన కథలు : *రోజ్‌మేరి, నయాగరా*

నవల : *దీవి*

నిరంతరం నన్ను వెన్నాడేవి : *నా బాల్యం, నా యాత్రలు, నా పాత్రలు*





AKPublications



AK Publications